ఈనాడు

హైదరాబాద్ 11-1-2018 గురువారం సిటీ సంపుటి 44 . సంచిక 152

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 18+24 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ఈనాడు

హైదరాబాద్ 11-1-2018 గురువారం సిటీ సంపుటి 44 . సంచిక 152
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00 పేజీలు 18+24 www.eenadu.net
Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

చెక్కు రూపంలోనే రూ.4 వేలు

- గ్రామాలకు వెళ్లి రైతులకు పంపిణీ
- మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం

ఈనాడు - హైదరాబాద్

ఎకరానికి రూ.4 వేల పెట్టుబడి సొమ్మును చెక్కు రూపంలో అందజేసేందుకు మంత్రివర్గ ఉపసంఘం ఆమోదించింది. బుధవారం సచివాలయంలో పోచారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన సంఘం సమావేశమైంది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వచ్చే వానాకాలం నుంచి ఎకరానికి రూ.4 వేల చొప్పున ప్రతి రైతుకీ అందజేస్తామన్నారు. ఎక్కువమంది రైతులు చెక్కు రూపంలోనే సాయం అందజేయాలని కోరారనీ, దీనినే సీఎం కేసీఆర్‌కు నివేదిస్తామన్నారు. ఒక్కో రైతుకు ఎన్ని ఎకరాల వరకూ సాయం ఇవ్వాలన్న దానిపై పరిమితేమీ లేదన్నారు. రాష్ట్రంలో 97.2% మంది రైతులకు పది ఎకరాల్లోపే భూమి ఉందన్నారు. అవకతవకలు జరగకుండా పథకాన్ని సమర్థంగా అమలుచేస్తామన్నారు. బ్యాంకుల్లో నగదు కొరత లేకుండా చూసేందుకు... దిల్లీ వెళ్లి కేంద్ర ఆర్థిక మంత్రి, రిజర్వు బ్యాంకు అధికారులతో మాట్లాడతామన్నారు. రెవెన్యూ పత్రాల ప్రక్షాళన అనంతరం రాష్ట్రంలో 71 లక్షల మంది రైతులకు 1.42 కోట్ల ఎకరాల సాగు భూములున్నట్లు తేలిందన్నారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఈటల రాజేందర్, హరీష్‌రావు, మహేందర్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మంత్రులు పోచారం, తుమ్మల నాగేశ్వరరావు, ఈటల రాజేందర్, హరీశ్‌రావు, మహేందర్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, అధికారులు

'స్వచ్ఛందంగా' వదులుకుంటారా!

- ఎకరానికి రూ.4 వేల పెట్టుబడి అందజేత పథకంపై ప్రతిపాదన
- ప్రభుత్వానికి వ్యవసాయశాఖ ప్రతిపాదనలు

-2లో



భోగి రమ్మంటుంది బోగీ పొమ్మంటోంది

సంక్రాంతి ముంగిట రైళ్లు కిటకిట

సంక్రాంతి పండుగ సమీపిస్తుండటంతో హైదరాబాద్‌లో నివసిస్తున్న తెలుగు రాష్ట్రాల ప్రజలు కాస్త ముందుగానే సొంతూళ్ల బాటపడుతున్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో ప్రస్తుతం రైళ్లు కిటకిటలాడుతున్నాయి. బుధవారం సికింద్రాబాద్ స్టేషన్‌లోని దృశ్యమిది...

- ఈనాడు, హైదరాబాద్

ఆధార్ గోప్యతకు రక్ష

- అసలు సంఖ్యకు బదులు మరో సంఖ్య
- ఎవరికివారే వెబ్‌సైట్లో సృష్టించుకునే వీలు
- పరిమిత వివరాలతోనే పనులు పూర్తి

దిల్లీ: ఆధార్ ద్వారా గోప్యతకు సంబంధించిన ఆందోళనలు తలెత్తుతున్న నేపథ్యంలో 'భారత విశిష్ఠ గుర్తింపు ప్రాధికార సంస్థ' (ఉడాయ్) ఓ విరుగుడు కనిపెట్టింది. మొత్తం 12 అంకెల బయోమెట్రిక్ సంఖ్యను ఎవరికైనా చెప్పే బదులు 'వాస్తవిక గుర్తింపు' (వర్చ్యువల్ ఐ.డి.)ను ఎవరికి వారే ఉడాయ్ వెబ్‌సైట్ ద్వారా సృష్టించుకుని, దానిని చెబితే సరిపోయేలా కొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువస్తోంది. ఈ రెండు సంఖ్యల్ని ఉడాయ్ అనుసంధానం చేసుకుంటుంది. చరవాణి సిమ్‌కార్డు సహా వివిధ అవసరాల కోసం ఈ ఐడీని చెబితే సరిపోతుంది. తద్వారా ఆధార్ సంఖ్య గోప్యంగా ఉంటుంది. పేరు, చిరునామా, ఫోటో వంటి పరిమిత వివరాలే (మిగతా 2లో)

ఆధార్ లేదంటే ఆ మనిషి లేనట్లేనా?

- యూపీ సర్కారును ప్రశ్నించిన సుప్రీంకోర్టు
- చేయడం చేతకాకపోతే ఆ విషయాన్ని చెప్పండన్న ధర్మాసనం

-2లో

కాళేశ్వరం పనుల వేగం అద్భుతం

దేశంలో ఏ ప్రాజెక్టులోనూ ఇంతవేగం లేదు..
అన్ని విభాగాలు సమన్వయంతో పని చేస్తున్నాయి
నిర్ణీత వ్యవధిలో పూర్తవుతుందనే విశ్వాసముంది
కేంద్ర జలసంఘం అధికారుల కితాబు

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పనులు వేగంగా జరుగుతున్నాయని, దేశంలో ఏ ప్రాజెక్టు పనులు కూడా ఇంత వేగంగా జరగడం లేదని కేంద్ర జలసంఘం అధికారులు అభిప్రాయపడ్డారు. అన్ని పనులు సమాంతరంగా జరుగుతున్నాయని, అన్ని విభాగాలు సమన్వయంతో పని చేస్తున్నాయని, ఈ తరహాలో పనులు జరుగుతుండటం చూస్తే గర్వకారణంగా ఉందన్నారు. ప్రాజెక్టును నిర్ణీత వ్యవధిలోగా అంచనా వ్యయం పెరగకుండా పూర్తి చేయడం సవాలుతో కూడుకున్నదనీ, కాళేశ్వరం పనులు జరుగుతున్న తీరు చూస్తే దాన్ని అధిగమిస్తారన్న విశ్వాసం కలుగుతోందని అభిప్రాయపడ్డారు.

ఈ ప్రాజెక్టుకు విషయంలో పెట్టుబడి-ప్రయోజనం, సాగునీటి ప్రణాళికలకు సంబంధించిన అనుమతులు జలసంఘం నుంచి రావాల్సి ఉంది. నీటిపారుదల శాఖ పంపిన నివేదికలపై కొన్ని ప్రశ్నలు లేవనెత్తిన జలసంఘం ఇంజినీర్లు, నేరుగా ప్రాజెక్టును పరిశీలించాలని నిర్ణయించారు. జలసంఘంలోని ప్రాజెక్టు అప్రయిజల్ విభాగం చీఫ్ ఇంజినీర్ సి.కె.ఎల్.దాస్, సంచాలకులు ఎన్.ఎన్.రాయ్, ముఖర్జీ, రాజీవ్‌కుమార్‌లతో కూడిన బృందం సోమ, (మిగతా 2లో)



హైదరాబాద్‌లో జలసౌధలో విలేకరులతో మాట్లాడుతున్న కేంద్ర జలసంఘంలోని ప్రాజెక్టు అప్రయిజల్ విభాగం చీఫ్ ఇంజినీర్ సీకేఎల్ దాస్. చిత్రంలో కేంద్ర జలసంఘం బృంద సభ్యులు, నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి



ఇస్రో ఛైర్మన్‌గా శివన్

దిల్లీ, శ్రీహరికోట-న్యూస్‌టుడే: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) నూతన ఛైర్మన్‌గా ప్రముఖ శాస్త్రవేత్త కె.శివన్ నియమితులయ్యారు. ఎ.ఎస్.కిరణ్ కుమార్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. అంతరిక్ష శాఖ కార్యదర్శిగా, అంతరిక్ష కమిషన్ ఛైర్మన్‌గా శివన్ నియామకాన్ని కేబినెట్ నియామకాల కమిటీ బుధవారం ఆమోదించింది. మూడేళ్లపాటు ఆయన ఈ బాధ్యతలు నిర్వర్తిస్తారు. శివన్ ప్రస్తుతం త్రివేండ్రంలోని విక్రమ్ సారాభాయి అంతరిక్ష కేంద్రం సంచాలకుడిగా ఉన్నారు. ఆయన 1980లో మద్రాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఏరోనాటికల్ (మిగతా 2లో)

కత్తిగట్టిన ప్రేమ

- ప్రేమించాలంటూ వేధింపులు
- నిరాకరించడంతో కక్షపెంచుకున్న యువకుడు
- యువతిపై కత్తితో దాడిచేసి.. గదికి తాళం వేసి పరారీ
- చికిత్స పొందుతూ మహిళ మృతి
- హైదరాబాద్‌లో దారుణం

మూసాపేట - న్యూస్‌టుడే

ప్రేమోన్మాదానికి మరో యువతి బలైంది. తన ప్రేమను నిరాకరించిందన్న కోపంతో ఓ యువకుడు.. ఇంటికెళ్లి మరీ యువతిపై విచక్షణరహితంగా కత్తితో దాడిచేశాడు. రక్తం మడుగులో అచేతనంగా పడి ఉన్న ఆమెను అదే గదిలో వదిలేసి తాళం వేసి తన ఉన్మాదాన్ని చాటాడు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా రాజాం మండలం గుయ్యానవలస గ్రామానికి చెందిన బోను సూరప్ప, జయమ్మల చిన్నకుమార్తె జానకి(24) ఆరేళ్ల క్రితం హైదరాబాద్ వచ్చింది. మూసాపేట హబీబ్‌నగర్‌లో స్నేహితురాలు రూపతో కలిసి అద్దె ఇంట్లో ఉంటోంది. కేపీహెచ్‌బీ కాలనీలోని డీమార్టులో సేల్స్‌గర్ల్‌గా పనిచేస్తోంది. అక్కడే పనిచేస్తున్న ఆనంద్ అలియాస్ అనంతప్ప ప్రేమించాలంటూ కొన్నాళ్లుగా వేధిస్తుండగా.. యువతి తిరస్కరిస్తూ వస్తోంది. 'నా ప్రేమను అంగీకరించకపోతే నిన్ను చంపి..ఆపై నేను ఆత్మహత్య చేసుకుంటానంటూ' 15 రోజుల కిందట తీవ్రస్థాయిలో హెచ్చరించడంతో ఆందోళనకు గురైంది. సహచర ఉద్యోగుల వద్ద కన్నీటిపర్యంతమైంది. వాళ్లు ఆనంద్‌ను హెచ్చరించడంతో పాటు.. మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వాళ్లు అతన్ని మూసాపేట శాఖకు బదిలీ చేశారు. ఈ పరిణామాలతో కక్ష పెంచుకున్న ఆనంద్ మంగళవారం (మిగతా 2లో)



జానకి (పాత చిత్రం)

కీలక రంగాల్లో ఎఫ్‌డీఐలు

- నిబంధనలు మరింత సరళతరం
- విమానయాన రంగంలో 49 శాతం
- నిర్మాణరంగం, సింగిల్ బ్రాండ్ రిటైల్ వ్యాపారంలో 100 శాతం
- కేంద్ర మంత్రివర్గ నిర్ణయాలు

ఈనాడు - దిల్లీ

బడ్జెట్ సమర్పణ సమీపిస్తున్న వేళ కీలకరంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడు(ఎఫ్‌డీఐ)లను ప్రోత్సహించేలా నిబంధనలను మరింత సరళతరం చేస్తూ బుధవారం కేంద్ర మంత్రివర్గం నిర్ణయాలు తీసుకొంది. సింగిల్ బ్రాండ్ రిటైల్ వ్యాపారంలో ఆటోమేటిక్ రూట్‌లో 100% ఎఫ్‌డీఐలకు అనుమతించింది. ఆటోమేటిక్ రూట్ అంటే భద్రతాపరమైన అనుమతులు తీసుకోవాల్సిన అవసరం ఉండదు. పారిశ్రామిక విధానం, ప్రోత్సాహక విభాగం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ అండ్ ప్రమోషన్-డీఐపీపీ) సిఫార్సులు సరిపోతాయి. నిర్మాణ అభివృద్ధి రంగంలోనూ ఇదే తరహా వెసులుబాటు కల్పించింది. అప్పుల్లో కూరుకుపోయిన ఎయిర్ ఇండియాలో 49% పెట్టుబడులు పెట్టడానికి అప్రూవల్ రూట్‌లో విదేశీ సంస్థలకు అనుమతి ఇచ్చింది. అప్రూవల్ రూట్ అంటే వివిధ శాఖల అనుమతులు తీసుకొని పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది. ప్రైమరీ మార్కెట్ ద్వారా కూడా పవర్ ఎక్స్ఛేంజీల్లో పెట్టుబడులు పెట్టడానికి అనుమతి ఇవ్వనుంది. 'వైద్యపరికరాలు (మెడికల్ డివైజెస్)'కు ఉన్న నిర్వచనాన్ని సవరించి, ఆ రంగంలోనూ పెట్టుబడులు పెట్టడానికి అవకాశం కలిగించింది. విదేశీ నిధులు పొందే కంపెనీలతో సంబంధం ఉన్న ఆడిట్ సంస్థల్లోనూ విదేశీ పెట్టుబడులకు అనుమతించింది. ఎన్‌డీఏ ప్రభుత్వం తొలిసారిగా 2016 జూన్‌లో విదేశీ పెట్టుబడుల విధానాన్ని సరళీకరించగా, రెండో విడతగా ప్రస్తుతం మార్పులు చేసింది.

నిర్మాణ రంగంపై వివరణ: నిర్మాణ రంగంలో విదేశీ పెట్టుబడులపై ప్రభుత్వం వివరణ ఇచ్చింది. స్థిరాస్తి వ్యాపారంలో నూరు శాతం ఎఫ్‌డీఐలకు అవకాశం లేదని, కేవలం స్థిరాస్తి బ్రోకరేజీ సంస్థల్లోనే ఈ పెట్టుబడులకు అవకాశం ఉందని స్పష్టంచేసింది.

తుంగభద్ర స్టీల్ మూసివేతకు ఆమోదం: కర్ణాటకలోని తుంగభద్ర స్టీల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ సంస్థను మూసివేయాలని నిర్ణయించింది. ఆ సంస్థ ఆస్తులను కర్ణాటక ప్రభుత్వానికి అప్పగించనుంది. మానసిక వికలాంగుల జాతీయ ట్రస్ట్ పాలక మండలి (మిగతా 2లో)



2020 వరకు ఎంపీ ల్యాడ్స్ కొనసాగింపు

పార్లమెంటు సభ్యుల స్థానిక అభివృద్ధి పథకాన్ని (ఎంపీల్యాడ్స్)ను 14వ ఆర్థిక సంఘం చివరి వరకు (31.3.2020) కొనసాగించడానికి ఆమోదముద్ర వేసింది. ఈ పథకం కింద పార్లమెంటు ఉభయసభల్లోని సభ్యులకు అభివృద్ధి పనుల నిమిత్తం ఒక్కొక్కరికి ఏటా రూ.5 కోట్ల చొప్పున ఏటా రూ.3,950 కోట్లు కేటాయిస్తున్నారు.



దిల్లీలో కేంద్ర మంత్రి సురేష్ ప్రభును కలిసిన మంత్రి కేటీఆర్

ఫార్మా సిటీ అభివృద్ధికి సహకరించండి

- రూ.1500 కోట్లు విడుదల చేయండి
- మెగా లెదర్ పార్కు ఏర్పాటు చేయాలి
- కేంద్ర వాణిజ్యమంత్రి సురేశ్‌ప్రభుకు మంత్రి కేటీఆర్ వినతి
- విదేశీ భవన్ శంకుస్థాపనకు రావాలని సుష్మాస్వరాజ్‌కు ఆహ్వానం

-9లో

అమెరికలే దేశంలోకి..

- వలస విధానంలో అలాంటి మార్పు తేవాలి
- ట్రంప్ స్పష్టీకరణ
- గొలుసుకట్టు వలసలకు అడ్డుకట్ట వేయాలని పిలుపు

వాషింగ్టన్: గొప్ప ప్రతిభా నేపథ్యం ఉన్నవారినే అమెరికాలోకి అనుమతించాలని అధ్యక్షుడు ట్రంప్ బుధవారం స్పష్టం చేశారు. గొలుసుకట్టు వలసల(ఛైన్ మైగ్రేషన్)కు ముగింపు పలకాలని కూడా పిలుపునిచ్చారు. అమెరికా పౌరులుగా లేదా చట్టబద్ధ నివాసిగా ఇప్పటికే ఉన్న వారి ద్వారా కుటుంబసభ్యులు అమెరికాలోకి చట్టబద్ధంగా అడుగుపెట్టవచ్చు. ఈ పద్ధతి చాలా తేలికయిన, వేగవంతమయినది. దీన్నే గొలుసుకట్టు వలసలుగా పిలుస్తున్నారు.

"కెనడా, ఆస్ట్రేలియాలో మాదిరిగా ప్రతిభ ఆధారిత వలస విధానం మనకు ఉండాలి. వలసలకు సంబంధించి ప్రవేశపెట్టే ఏ బిల్లులో అయినా 'ప్రతిభ' అనే పదాన్ని ఉపయోగించాలని అనుకుంటున్నా." అని శ్వేతసౌధంలో తనను కలిసిన రెండు పార్టీల శాసనకర్తల గ్రూప్‌తో ట్రంప్ అన్నారు. అమెరికాలోకి వలసలను తగ్గించడానికి ప్రతిభ ఆధారిత వ్యవస్థ ఉండాలని ట్రంప్ తరచూ అంటున్న సంగతి తెలిసిందే. "ప్రస్తుతం మనం అనుమతిస్తున్నట్లు కాకుండా అమెరికాలో ప్రవేశించేవారికి గొప్ప ప్రతిభా నేపథ్యం ఉండాలి." అని శాసనకర్తలతో అన్నారు. ట్రంప్ వ్యాఖ్యలకు పలువురు శాసనకర్తల నుంచి మద్దతు లభించింది.

గొలుసుకట్టు వలసలను అడ్డుకోవాలంటూ "ఈ పద్ధతితో ఒకరి వెంబడి చాలా మంది అమెరికాలోకి అడుగుపెడుతున్నారు. వారెవరూ మనకు ఉపయోగపడే పని చేయడం లేదు." అని చెప్పారు. ఈ సమావేశంలో పాల్గొన్న వారంతా తమ పార్టీలతో వలసలపై (మిగతా 2లో)



వీసా గొడవ ముగిసినట్లేనా?

- హెచ్4బీపై ఇంకా తొలగని అనుమానాలు
- ఉద్యోగావకాశాన్ని ఎత్తేస్తారన్న ఆందోళన
- హెచ్1బీకి మారితే మంచిది: నిపుణులు
- ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్న కెనడా

-2లో

బాలికలకు వరం

- ఎన్ఐటీల్లోనూ ప్రత్యేక సీట్ల కేటాయింపు
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు
- సూపర్ న్యూమరరీ కింద పెంచే యోచన
- ఇంజినీరింగ్‌లో బాలికలను పెంచే లక్ష్యం

-16లో

పంచాయతీల్లో ప్రజలకూ హక్కులు

- వారి సమస్యలకు విధిగా పరిష్కారం
- కోఆప్షన్ సభ్యులుగా ప్రవాసులు, నిపుణులు
- కొత్త పంచాయతీరాజ్ చట్టంలో ప్రతిపాదనలు

-9లో

GH

సహకార సంఘాలపై నమ్మకం లేదు

- ఒక్కశాతం రైతులే వాటిద్వారా తీసుకుంటామన్నారు
- చెక్కు రూపంలో ఇవ్వాలన్నది 31.58 శాతం
- నగదు ఇవ్వమని అడిగింది 26.59 శాతం
- ఎకరానికి రూ.4 వేలు ఎలా ఇవ్వాలని సర్వే
- వ్యవసాయశాఖ అధ్యయనంలో ఆసక్తికర అంశాలు

ఈనాడు, హైదరాబాద్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(ప్యాక్స్)పై రైతులకు నమ్మకం లేదా!..వారి మనోభావాలను బట్టి చూస్తే అదే విషయం స్పష్టంగా అర్థమవుతోంది. ఎకరానికి రూ.4 వేలు ఎలా అందించాలనే అంశంపై వ్యవసాయ శాఖ నేరుగా రైతులతో సమావేశమై సర్వే చేసింది. వీటి వివరాలను బుధవారం ప్రభుత్వానికి అందజేసింది. మొత్తం 30 జిల్లాల్లో 551 మండలాల్లో 624 గ్రామాల్లో రైతులతో వ్యవసాయాధికారులు నేరుగా గ్రామసభ పెట్టి సమావేశమయ్యారు. ప్రతి గ్రామ సభలో కనీసం వందమందికి తగ్గకుండా రైతులుండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. మొత్తం 62,677 మంది అన్నదాతల అభిప్రాయాన్ని రాతపూర్వకంగా తీసుకున్నారు. ఇందులో పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి.

- రూ.4 వేలు నేరుగా రైతుకి అందించాలంటే ప్రభుత్వం ఎలా పంపిణీ చేయించాలన్నది ఈ సర్వేలో వేసిన ప్రధాన ప్రశ్న. దీనికి అనేక మంది పలు రకాలుగా సమాధానాలిచ్చారు.
- మొత్తం 12 జిల్లాల్లో ఎక్కువ శాతం మంది చెక్కు రూపంలో ఇవ్వాలని అడిగారు. మరో 10 జిల్లాల్లో తమ బ్యాంకు ఖాతాలో వేయమన్నారు. మిగిలిన 8 జిల్లాలవాసుల్లో ఎక్కువ శాతం నగదు నేరుగా ఇవ్వాలని విన్నవించారు. ఈ 8 జిల్లాలు... కుమురం భీం ఆసిఫాబాద్, జోగులాంబ గద్వాల, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబాబాద్.
- మొత్తం రైతుల్లో 1.03 శాతం మంది మాత్రమే ప్యాక్స్ ద్వారా పంపిణీ చేయమని అడిగారు. వాస్తవానికి సహకార సంఘాల ద్వారానే వంద శాతం రైతులకిస్తే బాగుంటుందని తొలుత ప్రభుత్వం యోచించింది. కానీ అందుకు 99 శాతం అంగీకరించకపోవడంతో ఆ ప్రతిపాదనను ఇక పక్కన పెట్టేసింది. గద్వాల, సిరిసిల్ల, మహబూబ్‌నగర్, సిద్దిపేట జిల్లాల్లో ఒక్కశాతం కాదుకదా...కనీసం ఏ ఒక్క రైతూ ప్యాక్స్‌ను ఇష్టపడలేదు.
- బ్యాంకులు ఈ సొమ్మును అప్పు ఖాతాల్లోకి మళ్లించకుండా నేరుగా 'ప్రీలోడెడ్ కార్డు'ను రైతుకు అందించాలనే ప్రతిపాదన చేశారు. కానీ దీనికి 6.44 శాతం మంది మాత్రమే ఆమోదం తెలిపారు. పల్లెల్లో ఈ కార్డులను వినియోగించడం కష్టమవుతుందని, తమకు ఉపయోగపడవని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రీ లోడెడ్ కార్డు అంటే ఏమిటి? దానిని ఎలా వినియోగించాలో తెలియదని పలువురు తిరస్కరించారు.
- పాతనోట్లు రద్దయినప్పుడు సిద్దిపేటను కార్డుల వినియోగంలో రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా మార్చాలని ప్రతిపాదించారు. కానీ ఈ జిల్లా రైతుల్లో 3.5 శాతం మంది మాత్రమే ప్రీలోడెడ్ కార్డు రూపంలో రూ.4వేలు తీసుకోవడానికి ముందుకొచ్చారు. పూర్తిగా గ్రామీణ ప్రాంతమైన వనపర్తి జిల్లా రైతుల్లో రాష్ట్రంలోకెల్లా అత్యధికంగా 16.49 శాతం మంది ఈ కార్డులకు ఆమోదం తెలపడం విశేషం. ఇలాగే గ్రామీణ ప్రాంతాలెక్కువగా ఉన్న నిర్మల్‌లో 15.11, మంచిర్యాలలో 15.66, సిరిసిల్ల రైతుల్లో 10.35 శాతం మంది ప్రీ లోడెడ్ కార్డులడిగారు. ఇవి కాకుండా...రాష్ట్రంలో మరే ఇతర జిల్లాలోనూ 10 శాతానికి మించి రైతులు ఈ కార్డులను అంగీకరించలేదు.
- బ్యాంకు ఖాతాలో సొమ్ము జమ అయితే తిరిగి నగదు ఇవ్వరని రైతుల్లో సగటున 62.45 శాతం మంది నమ్ముతుండటం గమనార్హం. కొన్ని జిల్లాల్లో ఇలా నమ్మేవారి శాతం 80 శాతానికన్నా ఎక్కువుంది. కామారెడ్డి జిల్లాలో దాదాపు 90 శాతం, మహబూబ్‌నగర్‌లో 88.02, వనపర్తిలో 86.85 శాతం మంది తమ బ్యాంకు ఖాతాలో సొమ్ము జమచేయవద్దని చెప్పారు.
- సగటున రాష్ట్రవ్యాప్తంగా 31.58 శాతం మంది చెక్కు ఇవ్వమని అడిగినా దీనిని తిరస్కరించినవారూ కొన్ని జిల్లాల్లో ఎక్కువగానే ఉన్నారు. కుమురం భీం ఆసిఫాబాద్‌లో 89.40, నిర్మల్‌లో 86.11, పెద్దపల్లిలో 81 శాతం మంది చెక్కు రూపంలో వద్దని గట్టిగా చెప్పారు.
- నగదు పంపిణీని తిరస్కరించినవారు సైతం కొన్ని జిల్లాల్లో ఎక్కువగానే ఉండటం అధికారులను ఆశ్చర్యపరిచింది. కరీంనగర్‌లో 93.40, సిరిసిల్లలో 91.67 శాతం మంది రైతులు నగదు ఇవ్వవద్దని చెప్పడం గమనార్హం. ఈ జిల్లాల్లో చెక్కును ఎక్కువగా అడిగారు. రాష్ట్రవ్యాప్తంగా సగటున 26.59 శాతం మంది నగదు రూపేణా అడిగారు.

'స్వచ్ఛందంగా' వదులుకుంటారా!

- వ్యవసాయం చేయని భూ యజమానులకు పిలుపివ్వాలని ప్రతిపాదన

ఈనాడు, హైదరాబాద్: "మీరు ధనికులైతే... గ్యాస్ రాయితీని స్వచ్ఛందంగా వదులుకోండి (గివ్ ఇట్ అప్)" అంటూ కేంద్రం ఇచ్చిన పిలుపు గుర్తుందా? అచ్చం అలాగే ఎకరానికి రూ.4 వేల పెట్టుబడి పంపిణీ పథకానికీ పిలుపునివ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యవసాయశాఖ ప్రతిపాదించింది. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు చాలామంది వ్యసాయానికి దూరంగా ఉంటున్నారు. తమ భూముల్లో నేరుగా సేద్యం చేయట్లేదు. ఇలాంటి యజమానులంతా పెట్టుబడి సొమ్మును వదులుకోవడానికి స్వచ్ఛందంగా ముందుకురావాలని ప్రభుత్వమే పిలుపునివ్వడం ద్వారా మంచి సందేశం ప్రజల్లోకి వెళ్తుందని మంత్రులు అభిప్రాయపడుతున్నారు.

క్షేత్రస్థాయిలో సాగు చేసేవారిని ప్రోత్సహించాలని, పంటల సమయంలో పెట్టుబడికి సొమ్మును సమకూర్చి వారికి సాయపడాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది. అయితే, భూ యజమానులందరికీ డబ్బులిస్తే... ప్రజాధనం వృథా అవుతుందన్న అపప్రథ ప్రజల్లో వ్యాప్తిచెందకుండా...వ్యవసాయానికి దూరంగా ఉన్నవారికి సొమ్మును ఇవ్వకపోవడమే ఉత్తమమన్న ప్రతిపాదన ఉంది. అలాగని ప్రభుత్వమే నేరుగా నిధులను ఆపేయకుండా..."గివ్ ఇట్ అప్" పేరున స్వచ్ఛందంగా డబ్బులు వదులుకునేందుకు వారే ముందుకొచ్చేలా ప్రోత్సహించాలని వ్యవసాయశాఖ ప్రతిపాదించింది.

నిజానికి పల్లెల్లో చాలామంది పేదరైతులకు సొంత భూముల్లేవు. భూ యజమానుల వద్ద కౌలుకు తీసుకుంటున్నారు. ప్రభుత్వమిచ్చే రూ.4 వేలను యజమానులు కౌలురైతులకు ఇవ్వకుండా వారే తీసుకుంటే, సేద్యం చేసేవారిలో అసంతృప్తి పెరిగే అవకాశాలున్నాయి. ఇలాంటి వాటివల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా ఉండాలంటే.. సాధ్యమైనంత వరకూ సేద్యం చేసేవారికే సొమ్ము అందేలా చూడాలని యోచిస్తున్నారు.

రాళ్లు, రప్పలున్న బీడు భూములకు వద్దు: గ్రామాల్లో చాలాచోట్ల వందశాతం భూములు సాగులో లేవు. రెవెన్యూ లెక్కల ప్రకారం... రాష్ట్రంలో కనీసం పది లక్షల ఎకరాల్లో వ్యవసాయం సాగట్లేదు. నీరు అందుబాటులో లేకపోవడం; రాళ్లు, రప్పలు, బండరాళ్లు ఉండటంతో అక్కడ పంటలు వేయట్లేదు. ఇలాంటి వాటికి రూ.4 వేలు ఇవ్వడం అనవసరమని, సాగుచేస్తున్న భూములకే ఇవ్వాలని భావిస్తున్నారు. సీఎం కేసీఆర్‌కు ఈ ప్రతిపాదనలన్నీ నివేదిస్తామని, ఆయన నిర్ణయం మేరకు మార్గదర్శకాలు జారీచేస్తామని వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి 'ఈనాడు'కు చెప్పారు.

వడ్డీ కింద తీసుకుని కొత్త రుణం మంజూరు?

వచ్చే జూన్‌లో రైతు బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం రూ.4 వేలు జమచేశాక.. వాటిని పాత రుణంపై వడ్డీగా జమ చేసుకుని, వెంటనే కొత్త రుణాన్ని ఇచ్చేస్తామని బ్యాంకులు ప్రతిపాదించినట్లు సమాచారం. దీనివల్ల రైతుకు రూ.4 వేలే కాకుండా, భూవిస్తీర్ణాన్ని బట్టి రూ.లక్ష వరకూ సాగు ఆరంభంలోనే రుణమిచ్చే అవకాశం ఉంటుందని 0 సూచిస్తున్నాయి. కానీ, ఇందుకు ప్రభుత్వం సుముఖంగా లేదు. బ్యాంకులు రూ.4 వేలు జమచేసుకుని, వెంటనే కొత్తరుణం ఇవ్వకపోతే... రైతుకు ఇటు సాయం, అటు రుణం అందక మొదటికే మోస మొచ్చే ప్రమాదముందని వ్యవసాయశాఖ వర్గాలు భావిస్తున్నాయి.

వీసా గొడవ ముగిసినట్లేనా?

ఈనాడు, హైదరాబాద్: అమెరికాలో హెచ్1బీ వీసా ఉండి గ్రీన్‌కార్డుకు దరఖాస్తు చేసుకున్న వారికి వీసా పొడిగింపు సమస్య లేదని అక్కడి ప్రభుత్వం స్పష్టంచేసినా గతంలో తెరపైకి వచ్చిన కొన్ని ప్రతిపాదనలు మళ్లీ ఎప్పటికైనా ముందుకొస్తాయని ప్రవాసాంధ్రులు అనుమానిస్తున్నారు. వాటి వల్ల నష్టపోకుండా కొన్ని ముందస్తు చర్యలు తీసుకుంటే చాలా వరకు సమస్యలు దరిచేరకుండా ఉంటాయని నిపుణులు సూచిస్తున్నారు. హెచ్1బీ వీసా ఉన్న వారి జీవిత భాగస్వాములు కూడా విద్యార్హతల ప్రకారం అమెరికాలో ఉద్యోగం చేసుకునేందుకు మూడేళ్ల క్రితం ఒబామా ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. అలాంటి వారు హెచ్4 వీసాతో భారతీయులు ఎంతోమంది ఉద్యోగాలు చేస్తున్నారు. ఏడాది క్రితం ట్రంపు అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం హెచ్4 వీసాలున్న వారు ఉద్యోగం చేయడానికి వీల్లేదని ప్రతిపాదించింది. అది కార్యరూపం దాల్చకున్నా మళ్లీ తెరపైకి వచ్చే అవకాశం ఉందని ప్రవాస భారతీయుల్లో అనుమానాలు ఉన్నాయి. అందుకే ఇప్పుడైనా హెచ్‌బీ వీసాదారులు హెచ్1బీ వీసా పొందేందుకు ప్రయత్నించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఏప్రిల్‌లో హెచ్1బీ వీసాల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుంది. ఇప్పటివరకు ఉన్న లాటరీ విధానానికి బదులు ప్రతిభ ఆధారంగా (విద్యార్హత తదితర వాటికి పాయింట్లు ఇస్తూ) ఇస్తామని ట్రంప్ ప్రభుత్వం స్పష్టం చేసినా ఈసారికి పాత విధానమే అమల్లో ఉండనుంది. అందువల్ల హెచ్4 వీసాదారులు హెచ్1బీ వీసాకు మారితే ఉద్యోగం చేసుకోవడానికి.. తర్వాత గ్రీన్‌కార్డు పొందటానికి సమస్య ఉండదని చెబుతున్నారు.

నిపుణుల సూచనలు

- హెచ్1బీ వీసాలకు దరఖాస్తు చేసుకోవడానికి మరో మూడు నెలలు సమయం ఉన్నందున ఆ ప్రయత్నాల్లో ఉంటే మంచిదని అమెరికాలో ఉంటున్న మహేష్ బిగాల చెప్పారు.
- హెచ్1బీకి మారాలంటే ప్రస్తుతం పనిచేస్తున్న పరిశ్రమ అంగీకరించాలని గ్లోబల్ ట్రీ సంస్థ సంచాలకుడు శుభకర్ తెలిపారు. ఇప్పటికే హెచ్1బీ వీసాలకు దాదాపు 2 లక్షల దరఖాస్తులు వస్తున్నాయన్నది కూడా గుర్తుంచుకోవాలన్నారు.
- హెచ్4 వీసా ఉన్న భారతీయులు అమెరికాలో సుమారు లక్షమందికి తగ్గరని అంచనా.

కెనడా వైపు చూస్తున్నారు..

అమెరికా అధ్యక్షుడిగా ట్రంపు వచ్చిన ఏడాది కాలంగా ఆయన చేస్తున్న ప్రతిపాదనలతో భయాందోళనకు గురవుతున్న ప్రవాస భారతీయులు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతున్నారు. ట్రంపు గెలిచిన రోజు కెనడా ఇమ్మిగ్రేషన్ వెబ్‌సైట్ సర్వర్ పనిచేయలేందంటే ఎంత మంది భారతీయులు ఆ వెబ్‌సైట్‌ను చూశారో స్పష్టమవుతోంది. అక్కడ ఉద్యోగం చేసే వారికి ఏడాదిలోనే పీఆర్ (గ్రీన్‌కార్డు) మంజూరవుతోంది. గత ఏడాది వరకు 2.84 లక్షలమంది విదేశీయులకు ఉద్యోగ వీసాలు ఇచ్చే కెనడా ఈ ఏడాది దాన్ని 3.30 లక్షలకు పెంచింది. 2020లో దాన్ని 3.40 లక్షలకు పెంచుతామని ప్రభుత్వం ప్రకటించింది. 'అమెరికాతో పోల్చుకుంటే కెనడాలో వేతనాలు కొద్దిగా తక్కువ. ఆరు నెలల పాటు విపరీతమైన చలి ఉంటుంది. వీసాలు రావడం మాత్రం సులభం' అని ఓ ఐటీ కంపెనీలో ఆర్కిటెక్ట్‌గా పనిచేస్తున్న హనుమంతురావు గనిపినేని చెప్పారు. ఇక్కడి ఉద్యోగులు వచ్చే కొద్ది సంవత్సరాల్లో పదవీ విరమణ చెందుతున్నారని ముందుస్తు ప్రణాళికలో భాగంగా వీసాల సంఖ్యను పెంచుతోందని ఆయన తెలిపారు. 'కెనడా జనాభా 3 కోట్లు మాత్రమే. అమెరికా తరహాలో లక్షలమందికి ఉద్యోగాలు ఇచ్చే అవకాశం అక్కడ లేదు' అని ఉస్మానియా విశ్వవిద్యాలయం అకడమిక్ ఆడిట్ సెల్ సంచాలకుడు ఆచార్య వేణుగోపాల్‌రావు చెప్పారు.

ఆధార్ లేదంటే ఆ మనిషి లేనట్లేనా?

దిల్లీ: ఏ వ్యక్తికైనా ఆధార్ లేదంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టిలో ఆ మనిషి లేనట్లేనా అని ఉత్తర్‌ప్రదేశ్ సర్కారును సుప్రీంకోర్టు ప్రశ్నించింది. పట్టణాల్లో గూడులేని నిరుపేదలకు ఆశ్రయం కల్పించే విషయాన్ని బుధవారం సర్వోన్నత న్యాయస్థానం విచారించింది. ఒక వ్యక్తికి ఇల్లంటూ లేకపోతే అతడి వివరాలను ఆధార్ కార్డులో ఏమని రాస్తారంటూ యూపీ తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను జస్టిస్ ఎం.బి.లోకుర్, జస్టిస్ దీపక్ గుప్తాల ధర్మాసనంప్రశ్నించింది. ఆధార్ లేకపోయినంత మాత్రాన ఆశ్రయ గృహాల్లో వారికి చోటు కల్పించబోరా అని అడిగింది. ఆధార్ లేకపోయినా ఓటరు గుర్తింపు పత్రాలు వంటివి వారి వద్ద ఉంటాయని మెహతా బదులిచ్చారు. ఓటరుకార్డు కావాలన్నా చిరునామా ధ్రువీకరణ ఉండాలిగా అని ధర్మాసనం మళ్లీ ప్రశ్నించింది. ఇల్లే లేనివారు చిరునామా ఎలా చెప్పగలరని రెట్టించి అడిగింది.

మేమేదైనా చెబితే విమర్శిస్తారు గానీ..

'కార్యనిర్వాహక వ్యవస్థ తమ విధుల్ని సక్రమంగా నెరవేర్చడం లేదని మేం గానీ చెబితే... ప్రభుత్వాన్ని, దేశాన్ని నడిపించడానికి న్యాయ వ్యవస్థ ప్రయత్నిస్తోందని ప్రతి ఒక్కరూ విమర్శిస్తారు. మేమేమీ కార్యనిర్వాహకులం కాదు. పని చేయడం మీకు చేతకాకపోతే ఆ విషయాన్నైనా చెప్పండి' అని యూపీ సర్కారుకు స్పష్టం చేసింది. ఆశ్రయం లేనివారికి నిలువ నీడ కల్పించాల్సిన అవసరం ఉందంది. దీనికోసం రాష్ట్రాలతో కలిసి పనిచేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. రెండు వారాల్లోగా చర్యలు చేపట్టాలని పేర్కొంటూ, విచారణను వచ్చేనెల 8వ తేదీకి వాయిదా వేసింది.

కీలక రంగాల్లో ఎఫ్‌డీఐలు

(మొదటి పేజీ తరువాయి)

పదవీకాలాన్ని మూడేళ్లకు పరిమితం చేస్తూ నిర్ణయం తీసుకొంది.

- కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్‌ఎఫ్)లో గ్రూప్'ఎ' కేడర్‌ను సమీక్షించడానికి మంత్రివర్గం ఆమోదంతెలిపింది. దీనివల్ల వివిధ ర్యాంకుల్లో 25 పోస్టుల సృష్టికి అవకాశం ఏర్పడుతుంది.
- శాస్త్ర, సాంకేతికరంగాల్లో పరస్పరం సహకరించుకోవడానికి కెనడాతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడానికి ఆమోదం తెలిపింది.

ఇతర సంస్థల మాదిరిగానే ఎయిర్ ఇండియా..గజపతి: ఎయిర్ ఇండియాలో 49 శాతం పెట్టుబడులకు అవకాశం కల్పించడంటే దాన్ని దేశంలోని ఇతర విమానయాన సంస్థలతో సమానంగా పరిగణించడమేనని విమానయానశాఖ మంత్రి అశోక్ గజపతిరాజు చెప్పారు. జాతీయ విమానయాన సంస్థగా ఇంతవరకు ఇచ్చిన ప్రత్యేక ఆదరణను రద్దు చేసినట్లని తెలిపారు. ఈ నిర్ణయం వెలువడగానే పెట్టుబడులు పెట్టడానికి సింగపూర్ ఎయిర్‌లైన్స్ సంస్థ ఆసక్తి చూపింది. ఈ సంస్థ టాటాలతో కలిసి దేశంలో విస్తారా ఎయిర్‌లైన్స్ నిర్వహిస్తోంది.

భాజపాది ద్వంద్వ వైఖరి.. కాంగ్రెస్: సింగిల్ బ్రాండ్ రిటైల్ వ్యాపారంలో 100శాతం ఎఫ్‌డీఐకి అనుమతి ఇస్తూ భాజపా ద్వంద్వ వైఖరిని అవలంబించిందని కాంగ్రెస్‌నేత ఆనంద్‌శర్మ విమర్శించారు. ఈ రంగంలో 30 శాతం స్థానిక ఉత్పత్తులకు అవకాశం ఇవ్వాలని తమ ప్రభుత్వంగతంలో నిబంధన విధించగా, దాన్ని ప్రస్తుతం ఎత్తివేశారని తెలిపారు.

అమెరికలే దేశంలోకి

(మొదటి పేజీ తరువాయి)

చర్చించి ఒక అంగీకారానికి రావాలని కోరారు. సమావేశం అనంతరం శ్వేతసౌధం పత్రికా కార్యదర్శి సారా శాండర్స్ మాట్లాడుతూ సమావేశం విజయవంతమయిందన్నారు. సరిహద్దు భద్రత, గొలుసుకట్టు వలసలు, వీసా లాటరీ, అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించిన లేదా అక్రమంగా ఉండిపోయిన మైనర్ పిల్లలపై అనుసరించే విధానం (డీఏసీఏ)పై దృష్టి సారించి, చర్చించాలని సమావేశంలో అంగీకారానికి వచ్చినట్లు తెలిపారు.

హెచ్1బి వీసాదారులతో నవ్యావిష్కరణ పథం: అమెరికా ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి హెచ్1బి వలసదారులు సహాయపడుతున్నారని, నవ్య ఆవిష్కరణ పథానికి వారు ప్రేరకశక్తిగా ఉన్నారని డెమొక్రాట్ పార్టీకి చెందిన శాసనకర్త తుల్సి గబార్డ్ అన్నారు. హెచ్1బి వీసాదారులను బలవంతంగా స్వదేశానికి పంపించేలా నిబంధనలను మార్చే ప్రతిపాదననేమీ పరిశీలించడం లేదని ట్రంప్ యంత్రాంగం స్పష్టీకరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మరో భారతీయ అమెరికన్ శాసనకర్త రాజా కృష్ణమూర్తి కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతించారు. ఏ ప్రక్రియనయినా గరిష్ఠ ఫలితం కోసం నిరంతరం మెరుగుపర్చుకోవచ్చని, ప్రస్తుత హెచ్1బి ప్రక్రియను కూడా మెరుగుపర్చుకోవచ్చని, కానీ మొత్తం ప్రక్రియనే రద్దు చేస్తే చాలా మందిపై ప్రభావం చూపిస్తుందని అలోక్ మాడసాని చెప్పారు. గత ఏడాది కేన్సస్‌లో శ్వేత జాతీయుడొకరు జరిపిన విద్వేష పూరిత కాల్పుల్లో అలోక్ గాయపడి ప్రాణాలతో బయటపడిన సంగతి తెలిసిందే.

ఎయిర్ ఇండియా విమాన అద్దానికి పగుళ్లు

ఆకస్మికంగా దిల్లీ విమానాశ్రయంలో దించివేత

దిల్లీ: కోల్‌కతాకు బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం(ఏఐ 020) అద్దానికి పగుళ్లు రావటంతో ఆ విమానాన్ని ఆకస్మికంగా దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో దించివేశారు. బోయింగ్ 787 విమానం బుధవారం మధ్యాహ్నం 2.25 గంటలకు దిల్లీ నుంచి కోల్‌కతాకు బయలుదేరింది. కొద్దిసమయానికే పైలెట్ అద్దానికి ఏర్పడిన పగుళ్లను గుర్తించటంతో వెంటనే విమానాన్ని వెనక్కిమళ్లించారు. ఆతర్వాత మరో విమానంలో ప్రయాణికులు కోల్‌కతాకు చేరుకున్నారు.

మార్చి ఆఖరులోపు ఉత్పత్తి

- కొత్తగూడెంలో సిద్ధమవుతున్న నూతన విద్యుత్ కేంద్రం
- 800 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం
- తెలంగాణ రాష్ట్రంలో నిర్మిస్తున్న మొదటి కేంద్రం



హరిద్వార్ నుంచి తెచ్చి బిగించిన విద్యుత్ జనరేటర్ స్టేటర్

ఈనాడు, హైదరాబాద్ : కొత్తగూడెంలో నూతనంగా నిర్మిస్తున్న 800 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యమున్న విద్యుత్కేంద్రం పనులు చివరిదశకు వచ్చాయి. ఉత్తరాంచల్ రాష్ట్రంలోని హరిద్వార్ వద్ద గల భెల్ పరిశ్రమలో తయారుచేసిన భారీ జనరేటర్ స్టేటర్‌ను తెచ్చి తాజాగా ఈ కేంద్రంలో బిగించారు. దీంతో కీలకదశ పనులు చివరికొచ్చాయి. 480 టన్నుల బరువున్న ఈ యంత్రాన్ని కొత్తగూడెం తీసుకురావడానికి ప్రత్యేకంగా 288 చక్రాలతో వాహనాన్ని ఏర్పాటుచేశారు. వచ్చే మార్చి 31కల్లా ఈ కేంద్రంలో ప్రయోగాత్మకంగా విద్యుదుత్పత్తి పూర్తిచేయాలని జెన్‌కో కృషి చేస్తోంది. ఇది నెరవేరితే రికార్డుస్థాయిలో కొత్త విద్యుత్కేంద్రం పూర్తిచేసిన ఘనత జెన్‌కోకు దక్కనుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మంజూరు చేసి నిర్మాణం ప్రారంభించిన తొలి విద్యుత్కేంద్రం ఇదే కావడంతో రాష్ట్ర ప్రభుత్వం దీనిని ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. దీని నిర్మాణాన్ని 2015 జనవరి ఒకటిన ప్రారంభించారు. వచ్చే మార్చి చివరికల్లా విద్యుదుత్పత్తి ప్రారంభమైతే 39 నెలల్లో పూర్తిచేసిన ఘనత జెన్‌కోకు దక్కుతుంది. దేశంలో కొత్త విద్యుత్కేంద్రం నిర్మాణం ప్రారంభించిన తర్వాత కనిష్ఠంగా 48 నెలల్లో పూర్తిచేయాలని 'కేంద్రీయ విద్యుత్ మండలి'(సీఈఏ) నిబంధనలున్నాయి. కొత్తగూడెంలో అంతకుముందు ఉన్న పాత విద్యుత్కేంద్రాల పక్కనున్న స్థలంలో కొత్తదాని నిర్మాణం చేపట్టడం వల్ల భూ సేకరణ సమస్యలు ఎదురుకాలేదు. దీనివల్ల శరవేగంగా పనులు చేయడానికి అవకాశం ఏర్పడింది.

పాత కేంద్రాల మూత తప్పదా?: కొత్తగూడెంలో దశాబ్దాలుగా విద్యుదుత్పత్తి చేస్తున్న 5 పాత కేంద్రాలను మూసివేయాలన్న షరతుతో కొత్తగా ఈ 800 మెగావాట్ల కేంద్రం నిర్మాణానికి కేంద్ర విద్యుత్‌శాఖ అనుమతించింది. మార్చి చివరికల్లా విద్యుదుత్పత్తి మొదలైనా వాణిజ్యప్రాతిపదికన ఉత్పత్తి తేదీ (సీఓడీ)ని ప్రకటించడానికి ఆ తర్వాత మరో నాలుగైదు నెలలు పట్టే అవకాశాలున్నాయి. ఒకసారి సీఓడీని ప్రకటించిన తర్వాత ముందుగాపెట్టిన షరతు మేరకు పాత కేంద్రాలను క్రమంగా మూసివేయడానికి జెన్‌కో సిద్ధమవుతోంది. వీటి మూతతో 715 మెగావాట్ల విద్యుదుత్పత్తి నిలిచిపోతుంది. దేశంలోనే అతివేగంగా కొత్త800 మెగావాట్ల విద్యుత్కేంద్రాన్ని పూర్తిచేసి రికార్డు సృష్టిస్తామని జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకరరావు 'ఈనాడు'కు చెప్పారు.

ఆధార్ గోప్యతకు రక్ష

(మొదటి పేజీ తరువాయి)

దీని ద్వారా తెలుస్తాయి. సాధారణంగా ఏ అవసరానికైనా ఇవి సరిపోతాయి.

మార్చి నుంచి చెల్లుబాటు: ఒక్కొక్కరు ఎన్ని గుర్తింపులనైనా సృష్టించుకోవచ్చు. అవి పరిమిత కాలమే చెల్లుబాటవుతాయి. కొత్తది రాగానే పాతది దానంతట అదే రద్దయిపోతుంది. ఈ 16 అంకెల యాదృచ్ఛిక సంఖ్యను ఆమోదించడాన్ని ఈ ఏడాది మార్చి ఒకటో తేదీ నుంచి ఉడాయ్ అనుమతించనుంది. గుర్తింపు వివరాలను కోరే సంస్థలన్నీ జూన్ ఒకటో తేదీ నుంచి ఈ గుర్తింపును ఆమోదించడం తప్పనిసరి. దీనికి తగ్గట్టుగా గడువులోగా తమతమ వ్యవస్థల్లో మార్పులు చేసుకోని సంస్థలు ఆర్థికంగా కొంత పరిహారం చెల్లించాల్సి వస్తుంది. ఆధార్ సంఖ్య మాదిరిగానే ఈ సంఖ్యను వినియోగించుకోవచ్చని ఉడాయ్ ఒక ఉత్తర్వులో పేర్కొంది. వాస్తవిక గుర్తింపుతో పాటు 'పరిమిత కేవైసీ' పద్ధతినీ ఉడాయ్ తీసుకువస్తోంది. 'మీ వినియోగదారుని తెలుసుకో' (కేవైసీ) పేరుతో బ్యాంకులు సహా అనేక సంస్థలు ఈ వివరాలను కోరుతుంటాయి. ఇలాంటి సందర్భాల్లోనూ కేవలం కావాల్సినంత మేరకే వివరాలను అధీకృత సంస్థకు ఇవ్వడానికి పరిమిత కేవైసీ పద్ధతిని రూపొందించింది.

ఆ అధ్యయనంతో మాకు సంబంధం లేదు: ఆర్‌బీఐ

ఆధార్ గోప్యతకు ఎప్పటికైనా ముప్పేనంటూ వెల్లడైన ఓ అధ్యయనంతో తమకెలాంటి సంబంధం లేదని ఆర్‌బీఐ స్పష్టం చేసింది.

భారత్‌కు ప్రయాణమా! జమ్ము-కశ్మీరు వైపు వెళ్లకండి!

పౌరులకు అమెరికా హెచ్చరిక

వాషింగ్టన్: భారత్‌తో సహా పలు దేశాలకు ప్రయాణానికి సంబంధించి అమెరికా బుధవారం తమ పౌరులకు తాజాగా అప్రమత్తత సూచనలు జారీ చేసింది. మెరుగుపరచిన ఈ సూచనలు ప్రపంచ వ్యాప్తంగా అమెరికా పౌరులకు స్పష్టమైన, సమయోచిత, సమాచారాన్ని అందచేస్తాయని విదేశాంగ శాఖ వెల్లడించింది.

ప్రతి దేశానికి సంబంధించి నేరాలు, తీవ్రవాదం కోణం నుంచి విశ్లేషించి భారత దేశాన్ని 2వ స్థాయి దేశంగా ప్రకటించింది. అందుకే..., భారత్ విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాల్సిందిగా అమెరికన్లకు సూచించింది. జమ్ము-కశ్మీరుకు వెళ్లవద్దని గట్టిగా హెచ్చరించింది.

కాళేశ్వరం పనుల వేగం అద్భుతం

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారాల్లో పనులను పరిశీలించింది. బుధవారం హైదరాబాద్‌లో నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీధర్, సంబంధిత చీఫ్ ఇంజినీర్లు హరిరాం, వెంకటేశ్వర్లు తదితరులతో చర్చించింది. అనంతరం దాస్, రాయ్‌లు విలేకరులతో మాట్లాడారు. పనులు జరుగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన బృందం, దేశంలోనే ఇది విభిన్నమైనదని వ్యాఖ్యానించింది. సాగునీటి ప్రాజెక్టుల్లో జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాల రీత్యా అన్ని విధాలా ప్రత్యేకమైందని పేర్కొంది. ఇది బహుళార్థక సాధక ప్రాజెక్టు అని, కొత్త ఆయకట్టుతోపాటు స్థిరీకరణ ఉందని, పలు ప్రాజెక్టులకు ఇది ఆధారం కాబోతుందని సీడబ్ల్యుసి చీఫ్ ఇంజినీర్ దాస్ పేర్కొన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి మొదటి లక్ష్యాన్ని దాటే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ తరహా వేగవంతమైన పనులు ఎక్కడా చూడలేదన్నారు. స్ట్రక్చర్ల నిర్మాణం, పనుల వేగం అన్నీ ప్రణాళిక ప్రకారం జరుగుతున్నాయన్నారు. జూన్‌లో ప్రాజెక్టు ద్వారా తొలి ఫలితాన్ని అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొందని, లక్ష్యం ప్రకారం పనులు జరిగితే అనుకున్న గడువులోపే లక్ష్యం నెరవేరుతుందన్నారు. జూన్ నాటికి మిడ్‌మానేరు వరకు పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకొన్నారని, ఇదే వేగంతో జరిగితే పూర్తవుతాయని అభిప్రాయపడ్డారు. ప్రాజెక్టు వ్యయం పెరగకుండా పనులు పూర్తి కావాలని, అందుకు అన్ని శాఖలు కలిసికట్టుగా పని చేయాలని దాస్ కోరారు ఇదొక మెగా ప్రాజెక్టు అని, అద్భుతమైందని వ్యాఖ్యానించారు. కీలకమైన మేడిగడ్డ ఆనకట్ట నిర్మాణ పనులపై మరింతగా దృష్టి సారించాలని సూచించారు. ప్రాజెక్టుకు రావాల్సిన మిగిలిన అనుమతులు పరిశీలనలో ఉన్నాయని, అన్నీ నిబంధనల ప్రకారం జరుగుతాయన్నారు. పనుల్లో వేగం మరింతగా పెంచాలని ఆయన అభిప్రాయపడ్డారు. మేడిగడ్డ వద్ద నీటి లభ్యతకు ఎలాంటి సమస్య లేదని హైడ్రాలజీ విభాగం సంచాలకులు ఎన్.ఎన్.రాయ్ పేర్కొన్నారు. 284.3 టీఎంసీల నీటి లభ్యత ఉందని, ఎలాంటి ఇబ్బందులు ఉండబోవన్నారు. లక్ష్యానికి అనుగుణంగా పనులు పూర్తి చేసి దేశంలోనే రికార్డు నెలకొల్పుతుందని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కేంద్ర జలసంఘం అధికారులకు వివరించారు. నిర్ణీత గడువులోగా పూర్తి చేయడానికి అవసరమైన అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకొంటుందని నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి తెలిపారు. నిధుల సమీకరణతో సహా ఎలాంటి ఇబ్బందులు ఉండరాదన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని, ఈ ప్రాజెక్టు రికార్డు నెలకొల్పుతుందని ధీమా వ్యక్తం చేశారు.

ఇస్రో ఛైర్మన్‌గా శివన్

(మొదటి పేజీ తరువాయి)

ఇంజినీరింగ్‌లో గ్రాడ్యుయేషన్ పట్టా పొందారు. బెంగళూరులోని ఐఐఎస్‌సీలో 1982లో ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసి, ఆ ఏడాదే ఇస్రోలో చేరారు. పీఎస్ఎల్వీ (పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికిల్) ప్రాజెక్టుకు కీలక సేవలందించారు. ఇస్రోలో వివిధ హోదాల్లో పనిచేశారు. 2014 ఏప్రిల్‌లో చెన్నైలోని సత్యభామ విశ్వవిద్యాలయం నుంచి 'డాక్టర్ ఆఫ్ సైన్స్' అవార్డు స్వీకరించారు. ఆయన తమిళనాడులోని కన్యాకుమారి జిల్లా నాగర్‌కోయిల్ తాలుకా సరకల్‌విళై గ్రామానికి చెందినవారు. గతేడాది ఇస్రో పంపిన 104 ఉపగ్రహాల ప్రయోగంలో కీలక భూమిక పోషించారు. అలాగే అంతకుముందు ఒక రాకెట్‌తో వేర్వేరు కక్ష్యల్లోకి ఉపగ్రహాలను పంపడంలో ఆయన కీలకంగా మారారు.

చాలా సంతోషంగా ఉంది

ఇస్రో అధిపతిగా నియామకం చాలా సంతోషంగా ఉందని శివన్ పేర్కొన్నారు. ఆయన బుధవారం రాత్రి నెల్లూరుజిల్లా సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయానికి వచ్చారు. తన దృష్టి అంతా పీఎస్ఎల్‌వీ-సి40 రాకెట్ ప్రయోగంపై ఉందని చెప్పారు. ప్రయోగం అయిన తర్వాత పదవీ బాధ్యతలపై దృష్టి పెడతానని చెప్పారు.

గ్రహం అనుగ్రహం

11-1-2018 గురువారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
హేమంత రుతువు; పుష్య మాసం; బహుళ పక్షం
దశమి: రా. 9-54 తదుపరి ఏకాదశి
స్వాతి నక్షత్రం: ఉ. 8-22 తదుపరి విశాఖ
అమృత ఘడియలు: రా. 12-32 నుంచి 2-14 వరకు
వర్జ్యం: మ. 2-19 నుంచి 4-01 వరకు
దుర్ముహూర్తం: ఉ. 10-16 నుంచి 11-01 వరకు
తిరిగి మ. 2-42 నుంచి 3-26 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.6-38; సూర్యాస్తమయం: సా.5-39

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	7.6	29.0
రామగుండం	12.8	29.8
మెదక్	12.8	32.1
కరీంనగర్	13.0	29.0
నిజామాబాద్	14.0	30.0
హన్మకొండ	14.5	30.0
హైదరాబాద్	14.8	29.7
మహబూబ్‌నగర్	17.3	32.4
సూర్యాపేట	18.0	33.0
ఖమ్మం	20.0	31.0

కత్తిగట్టిన ప్రేమ

(మొదటి పేజీ తరువాయి)

సాయంత్రం 6 గంటల ప్రాంతంలో యువతి ఇంటికి వెళ్లాడు. ఒంటరిగా ఉన్న ఆమెపై కత్తితో విచక్షణారహితంగా దాడిచేశాడు. ఆపై చున్నీని గొంతుకు బిగించాడు. రక్తపు మడుగులో కొట్టుమిట్టాడి అపస్మారకస్థితికి చేరిన తర్వాత గదికి తాళం వేసి పరారయ్యాడు. ఆలస్యంగా ఇంటికొచ్చిన రూప తలుపు తెరిచిన తర్వాత గానీ జరిగిన ఘోరం తెలియలేదు. ఇరుగుపొరుగు సాయంతో ఆమె స్నేహితురాలిని ఆసుపత్రిలో చేర్పించింది. చికిత్స పొందుతూ జానకి మరణించింది. నిందితుడిది రంగారెడ్డి జిల్లా పెద్దేముల్ మండలం మారేపల్లి గ్రామంగా పోలీసులుగుర్తించారు. అతను ప్రస్తుతం పోలీసుల అదుపులోఉన్నట్లు సమాచారం.

పెళ్లి ప్రయత్నాల్లో ఉండగానే..: కుటుంబ సభ్యులు కుమార్తెకు పెళ్లి చేసే నిమిత్తం ఓ సంబంధాన్ని సిద్ధం చేశారు. 12వ తేదీ ఏలూరులో ఆ కార్యక్రమం జరగాల్సి ఉంది. అందుకు అవసరమైన దుస్తులు, తదితరాలు కూడా కొనుగోలు చేసిన జానకి బుధవారం ఊరెళ్లేందుకు అన్నీ సిద్ధం చేసుకుంది. 'ఆ ఏర్పాట్లలో ఉండగానే.. ఈ ఘోరం జరిగిందని' మృతురాలి మేనమామ జయరాజు ఆవేదన వ్యక్తంచేయగా.. నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ పలు మహిళా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు.



నిందితుడు ఆనంద్

హోండురస్‌లో భూకంపం

వాషింగ్టన్: హోండురస్ దేశ సముద్ర జలాల్లో మంగళవారం రాత్రి భూకంపం సంభవించింది. దీని తీవ్రత రెక్టర్ స్కేలుపై 7.6గా నమోదయింది. దీని ప్రభావంగా ఈ దేశంతో పాటు, సమీపంలోని కరేబియన్ దీవులకు కూడా సునామీ ముప్పు ఉందన్న హెచ్చరికలు వెలువడ్డాయి.

‘నిషేధిత జాబితా’కు మోక్షమెన్నడు?

- ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూములకూ రిజిస్ట్రేషన్లు
- సర్కారు సూచనలు అమలు చేయడం లేదు
- హైకోర్టు ఆదేశాలూ పట్టని యంత్రాంగం
- ఎల్‌ఆర్‌యూపీతో చర్యలకు మార్గం

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ భూముల ఆక్రమణలు అడ్డుకోవడానికి ముందస్తు చర్యలు తీసుకోవడంలో నాన్చుడు ధోరణి కొనసాగుతోంది. రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ శాఖల మధ్య సమాచార లోపంతో అనేక జిల్లాల్లో ప్రభుత్వ ఆస్తులను అక్రమార్కులు దొడ్డిదారిన రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. ఏవి ప్రభుత్వ భూములు, ఏవి ప్రైవేటు భూములు నిర్ధారించే సమాచారం స్పష్టంగా లేకపోవడంతో రిజిస్ట్రేషన్ల శాఖాధికారులు రిజిస్ట్రేషన్ చేసేస్తున్నారు. గతేడాది జూన్‌లో మియాపూర్‌లో భారీ భూకుంభకోణంతో ప్రభుత్వ భూముల అక్రమరిజిస్ట్రేషన్ల వ్యవహారం మరోమారు వెలుగుచూసింది.

ఏమిటీ జాబితా?

రిజిస్ట్రేషన్ల చట్టం- 1908 ప్రకారం రెవెన్యూ శాఖ ప్రభుత్వ భూములను 22 ఏ నుంచి 22 ఇ వరకు విభజించింది. వాటి రిజిస్ట్రేషన్లకు అవకాశం లేకుండా నిషేధిత జాబితాగా రూపొందించి గెజిట్‌లో ప్రచురించాలి. జాబితాను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు పంపాలి. ఆన్‌లైన్‌లోనూ ఉంచాలి. ప్రభుత్వ ఆస్తులను ఎవరూ రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఆన్‌లైన్‌లోనూ పరిశీలించి జాగ్రత్తలు తీసుకునేలా ఈ ఏర్పాట్లు చేశారు.

22-ఎ(1)లో నిషేధిత భూముల జాబితా ఇదీ

ఎ) అసైన్డ్ భూములు, షెడ్యూల్ ప్రాంతాల్లోని భూముల బదలాయింపు నిషిద్ధం.
బి) ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులు బదిలీ చేస్తే ఆ దస్తావేజులను రిజిస్ట్రేషన్ చేయరాదు.
సి) వక్ఫ్, దేవాదాయ శాఖ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులు బదిలీ చేస్తే ఆ రిజిస్ట్రేషన్ చెల్లదు.
డి) సీలింగ్ చట్టాల కింద మిగులు భూములకు సంబంధించిన దస్తావేజుల రిజిస్ట్రేషన్ కూడా నిషిద్ధం.
ఇ) కలెక్టర్ అనుమతి, ప్రకటనతో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జప్తు చేసిన ఆస్తులు, భూముల దస్తావేజులను కూడా రిజిస్ట్రేషన్ చేయరాదు.

హైకోర్టు చెప్పినా..

ప్రభుత్వ ఆస్తులు, భూముల రిజిస్ట్రేషన్లు చేయకుండా రెవెన్యూ శాఖ నుంచి నిషేధిత భూముల జాబితా రిజిస్ట్రేషన్ల శాఖకు వెంటనే పంపాలి. దీనిపై 2015 డిసెంబరులో హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. జిల్లా కలెక్టర్లు నిషేధిత భూములు, ఆస్తుల జాబితా రూపొందించి రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులకు పంపాలని 2017 జులైలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మీనా ఉత్తర్వులిచ్చారు. ఏమీ అమలుకు నోచుకోలేదు. ప్రస్తుతం ప్రభుత్వం భూముల దస్త్రాల ప్రక్షాళన (ఎల్‌ఆర్‌యూపీ) నిర్వహించింది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ భూముల వివరాలు రెవెన్యూ శాఖ వద్ద స్పష్టంగా ఉన్నాయి. ఇప్పటికైనా నిషేధిత జాబితాను అందిస్తారా లేదా అన్న చర్చ జరుగుతోంది.

ఎల్‌ఆర్‌యూపీ ప్రకారం 30 జిల్లాల్లో ప్రభుత్వ భూములు, ఆస్తులు

అటవీ భూములు	41.74 లక్షల ఎకరాలు
దేవాదాయ భూములు	74 వేల ఎకరాలు
వక్ఫ్ భూములు	45 వేల ఎకరాలు
ప్రభుత్వ భూములు	21.04 లక్షల ఎకరాలు
అసైన్డ్ భూములు	22.42 లక్షల ఎకరాలు

‘జన్‌ధన్’తో ఆశించిన లావాదేవీలు జరగలేదు

ఐఐఎమ్ ప్రొఫెసర్ శ్రీరామ్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: జన్‌ధన్ యోజన పథకం కింద ఆశించిన స్థాయిలో లావాదేవీలు జరగడంలేదని బెంగళూరు ఐఐఎమ్ ప్రొఫెసర్ శ్రీరామ్ అభిప్రాయపడ్డారు. బుధవారం హైదరాబాద్‌లో మంథన్ సంస్థ ఆధ్వర్యంలో జన్‌ధన్ పథకంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రఘురామ్ రాజన్ రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా ఉన్న సమయంలో కొత్త బ్యాంకుల ఏర్పాటు విషయంలో సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. ఉత్తరాదితో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల్లోనే బ్యాంకులు గ్రామీణ ప్రాంతాలకు ఎక్కువ స్థాయిలో విస్తరించాయని తెలిపారు. రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ వై.వి.రెడ్డి మాట్లాడుతూ.. తాను ఆర్బీఐ గవర్నర్‌గా ఉన్న సమయంలో సాంకేతికను విస్తృతం చేశామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు రుణపరపతిని పెంచేందుకు కృషిచేశామన్నారు. సదస్సులో మంథన్ సంస్థ నిర్వాహకులు అజయ్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌యూ ప్రాంగణం నుంచి పీహెచ్‌డీ విద్యార్థి అదృశ్యం!

ఢిల్లీ: జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ(జేఎన్‌యు) ప్రాంగణం నుంచి పీహెచ్‌డీ విద్యార్థి ముకుల్‌జైన్(26) కనిపించకుండా పోయారు. ఈనెల 8వ తేదీ(సోమవారం) నుంచి అతడు కనిపించడం లేదని పోలీసులు తెలిపారు. జర్మన్‌లో పీహెచ్‌డీ చేస్తున్న అతడు జేఎన్‌యూలో ఉన్న సలహాదారును కలుసుకునేందుకు వెళ్లారు. ఆ తర్వాత అతడు కనిపించలేదన్నారు.

13వ శతాబ్దపు ఆలయ అవశేషాలు లభ్యం

చెన్నై, న్యూస్‌టుడే: శివాలయానికి చెందిన 13వ శతాబ్దం నాటి అవశేషాలను పురావస్తు శాఖాధికారులు తమిళనాడులోని దిండిగల్లు జిల్లా పాడియూరులో బుధవారం కనుగొన్నారు. పురావస్తు విభాగం అధికారి ఎ.నారాయణస్వామి ఆధ్వర్యంలోని విద్యార్థుల బృందం పరిశోధన జరిపింది.

12 పాయింట్లు దాటితే లైసెన్సు రద్దే

- ఏడాది వరకూ నిషేధం
- ఈలోగా బండి నడిపితే జైలుకే

ఈనాడు, సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి: ఇష్టానుసారంగా వాహనాలు నడిపేవారికి బ్రేకులు పడనున్నాయి. హెల్మెట్ పెట్టుకోకపోవడం, కూడళ్లలో సూచికలను పాటించకపోవడం తదితర నిబంధనల ఉల్లంఘనలకు గత ఆగస్టు నుంచి పోలీసులు ఆయా రకాల సంఖ్యలను (పాయింట్లు) ఇస్తున్నారు. తొలిసారిగా, 12 పాయింట్లు దాటిన ఓ వాహనదారుడికి చోదక లైసెన్సు ఏడాది పాటు రద్దు కానుంది. ఆ గడువులోగా మళ్లీ వాహనం నడిపితే సదరు వ్యక్తి జైలుకు వెళ్లక తప్పదు. హైదరాబాద్‌లో దాదాపు 350 మంది ట్రాఫిక్ పోలీసులు... నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులను రోజూ గుర్తిస్తారు. ఆన్‌లైన్ ద్వారా వారి ఖాతాల్లో పాయింట్లు వేస్తున్నారు. 12వ పాయింటు నమోదుకాగానే లైసెన్సు రద్దయ్యేలా ఏర్పాట్లుచేశారు. బోలారానికి చెందిన రుషేష్ మహేంద్ర మేనియాపై 14 పాయింట్లు నమోదయ్యాయి. పన్నెండు సార్లు హెల్మెట్ లేకుండా తిరిగినందుకు 12 పాయింట్లు, ఒకసారి సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపినందుకు 2పాయింట్లు వేశారు. దీంతో లైసెన్సును రద్దు చేసేందుకు ఆర్టీఏ అధికారులు ఆయనకు నోటీసు ఇచ్చారు. పాయింట్లు నమోదవుతున్నాయని తెలిసినా చాలామంది చోదకులు జాగ్రత్తలు తీసుకోవట్లేదు. ఒకసారి లైసెన్సు రద్దయ్యాక... మళ్లీ వాహనం నడిపితే నెల రోజులకుపైగా జైలుశిక్ష విధించే అవకాశముందని ట్రాఫిక్ డీసీపీ ఏవీ రంగనాథ్ చెప్పారు.

పాయింట్లు	ఉల్లంఘించినవారి సంఖ్య
1	2,55,506
2	40,521
3	8,809
4	2,858
6	152
7	46

దశ మారనున్న ‘మహారాజా’

ఢిల్లీ: అప్పుల ఊబిలో కూరుకుపోయిన ‘మహారాజా’ (ఎయిర్ ఇండియా) ఇక పాక్షికంగా విదేశీ సంస్థల చేతిలోకి వెళ్లనున్నారు. ‘స్వాగతం పలుకుతున్న మహారాజు’ ఎయిర్ ఇండియా సంస్థ లోగోగా ఉండటంతో ఆ సంస్థను మహారాజా అని కూడా వ్యవహరిస్తుంటారు. గత ఏడాది మార్చి 31 నాటికి ఈ సంస్థకు రూ.48,877 కోట్ల రుణాలు ఉన్నాయి. ఇందులో రూ.17,360 కోట్లతో విమానాలు కొనుగోలు చేశారు. రూ.31,517 కోట్లు నిర్వహణ ఖర్చుల కోసం తీసుకున్నది. ఇది కాకుండా 2017-18 సంవత్సరంలో రూ.3,579 కోట్ల నష్టం వచ్చింది. ఈ సంస్థను పునరుద్ధరించడానికి 49 శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో ప్రభుత్వ రంగులోని బ్రిటిష్ ఎయిర్‌వేస్, ఆస్ట్రేలియాకు చెందిన క్వాంటాస్, జర్మనీకి చెందిన లుఫ్తాన్సాలను ఇదే విధంగా ప్రైవేటీకరణ చేయడంతో లాభాల బాట పట్టాయి. ‘ఎయిర్ ఇండియా అందరికీ ప్రియమైన విమాన సంస్థ. కానీ ఆదాయంలో అధ్వానంగా ఉన్నాయ’ని కేంద్ర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతి రాజు వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ప్రైవేటు విమానయాన సంస్థల్లో విదేశీ పెట్టుబడులకు అవకాశం ఉందని, ఆ విధానాన్నే ఎయిర్ ఇండియాకు వర్తింపజేశామని తెలిపారు. విమానయానంతో సహా ఇతర రంగాల్లో విదేశీ పెట్టుబడులకు అవకాశం కల్పించడాన్ని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ స్వాగతించారు.

30 శాతం స్థానిక వస్తువులు కొనాల్సిందే: ఒకే బ్రాండు వస్తువుల అమ్మకాల్లో నూరు శాతం విదేశీ పెట్టుబడులకు అవకాశం కల్పించినా, ఇంతవరకు అమల్లో ఉన్న నిబంధనలను ఇక అమలు చేయాల్సి ఉంటుందని డీఐపీపీ కార్యదర్శి రమేష్ అభిషేక్ తెలిపారు. ఆ 30 శాతం స్థానిక వస్తువులను కొనుగోలు చేయాలన్న నిబంధనలో మార్పు లేదని చెప్పారు.

జనాభా లెక్కలు-2021. పనులు త్వరలో మొదలు

కేంద్ర హోం శాఖ

ఢిల్లీ: జనాభా లెక్కలు-2021కు సంబంధించిన పనులు త్వరలో మొదలుపెడతామని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ విషయంపై కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో ఉన్నతాధికారులు బుధవారం చర్చలు జరిపారు. అనంతరం ఈ ఏడాది నుంచే పనులు మొదలుపెట్టాలని నిర్ణయం తీసుకొన్నారు.

ఈనాడు

కల్తీమాఫియా వెన్ను విరగాలి

ప్రవృత్తివ్యాపకాల్లో, ఆధునిక జీవనశైలిలో వేగం పెరుగుతున్నకొద్దీ- పౌరుల ఆహారపుటలవాట్లలో పెద్దయెత్తున మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పాలు, పళ్లు, మిఠాయిల్లాంటివే కాదు- అల్పాహారం నుంచి విందుభోజనాల వరకు దాదాపు ప్రతిదానికీ వెలుపలి సేవలపై ఆధారపడుతున్న కుటుంబాల సంఖ్య పట్టణ ప్రాంతాల్లోనూ పల్లెల్లోనూ ఇంతలంతలవుతోంది. ఇటువంటప్పుడు వివిధ ఆహార పదార్థాల పంటపొలాల నుంచి భోజన పళ్లెంలోకి వచ్చే క్రమంలో నాణ్యతా ప్రమాణాల పరిరక్షణ అత్యావశ్యకమన్న రాష్ట్రాల ఆరోగ్య శాఖామాత్యుల తాజా తీర్మానసారం వినసొంపుగా ఉంది. రాష్ట్రస్థాయిలో ప్రయోగశాలల్ని పెంచి సమగ్ర ఆహార తనిఖీ వ్యవస్థల్ని కొలువు తీరుస్తామనడం ముదావహమైన ఒక చొరవను ప్రస్ఫుటీకరిస్తోంది. రెండురోజుల ఢిల్లీ మేధోమథనంలో- ఆహార వ్యాపారానికి సంబంధించి అనుమతులు, పర్యవేక్షణ, ఫిర్యాదుల స్వీకరణల్ని ఆన్‌లైన్‌లో చేపట్టడం సహా పలు ప్రతిపాదనలు చర్చకొచ్చాయి. బజ్జీల బండిలాంటి చిరువ్యాపారాలకూ అనుమతులు తప్పనిసరి చేయాలన్నది అందులో ఒకటి. హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార తనిఖీల పనిపోకడలు పరిపుష్టం కావాల్సిందే. ఆ వరసలో కొత్తగా పట్టాలకు ఎక్కిస్తామంటున్న సమగ్ర ఆహార తనిఖీ వ్యవస్థలు- కాలనీల్లో, వీధి చివర చిన్నపాటి అంగళ్లలో చిరుతిళ్ల విక్రయంలో బతికే బక్కజీవుల పొట్టకొట్టేవి కారాదు. బతుకు తెరువుకోసం నిజాయతీగా శ్రమించే చిరు వ్యాపారులు సమీప దుకాణాల్లో లభ్యమయ్యే వస్తుసామగ్రిని వినియోగిస్తారే తప్ప, కల్తీ కార్యకలాపాలకు దిగజారరు. అందువల్ల- కట్టడి చేయాల్సింది, నయవంచక సరఫరాదారుల్ని. పైస్థాయి వ్యాపారులతో కుమ్మక్కై కృత్రిమ రంగులు, రసాయనాలు, నాసి దినుసుల మిళాయింపుతో ఆహార కల్తీకి తెగబడుతున్న మాఫియా తండాల వెన్నువిరిచేలా నయా తనిఖీ యంత్రాంగం పదునుతేలాలి!

ఎటుచూస్తే అటు కల్తీలు ఎలా ఎంతగా పెచ్చరిల్లుతున్నాయో తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు మొన్నీమధ్యే పూసగుచ్చినట్లు అభివర్ణించింది. 'పాలు, పప్పులు, బియ్యం... అన్నీ కల్తీవే. పండ్లను రసాయనాలతో మగ్గబెడుతున్నారు... విధిలేని పరిస్థితుల్లో ప్రజలు విషాహారం తీసుకుంటున్నా'రన్న న్యాయస్థానం- అధికారుల చిత్తశుద్ధిలేమిని, స్వార్థవ్యాపారుల లాభాపేక్షను బోనులో నిలబెట్టింది. ఏవేవి ఎక్కడ ఏ విధంగా కల్తీ అవుతున్నాయో యంత్రాంగానికి తెలిసినా- అది మామూళ్ల మత్తులో జోగుతోంది. అల్లం వెల్లుల్లి మిశ్రమం మొదలు నూనెలు, మసాలా దినుసుల వరకు కల్తీకేదీ అతీతం కాదన్న చేదునిజం పదేపదే రుజువవుతోంది. తూతూమంత్రం తనిఖీలకు అక్రమ వ్యాపారులు ఎందుకు జంకుతారన్న న్యాయస్థానం సూటిప్రశ్న, ప్రభుత్వాల పనితీరుపై అభిశంసన. కల్తీల పీడ విరగడ చేసి ప్రజారోగ్యాన్ని సంరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. 'జనచేతన కార్యక్రమాలు చేపడుతున్నామంటే చాలదు... ఇంకా ఏదో చేయాలి' అన్న హైకోర్టు నిర్దేశానికి కట్టుబాటు చాటుతున్నట్లుగా- ఏడు సంయుక్త తీర్మానాల్ని ఆరోగ్య మంత్రుల సదస్సు ఆమోదించడం స్వాగతించదగ్గ పరిణామం. కేంద్రం గతంలోనే రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సిఫార్సు చేసిన ప్రకారం- ప్రతి వెయ్యి ఆహార వ్యాపార సంస్థలకు ఒక పర్యవేక్షణాధికారి ఉండాలి. ఆ మేరకు నియామకాలు జరగక, ఖాళీలు పేరుకుపోయిన ఉదంతాలకు దేశంలో కొదవ లేదు. కొలువుతీరిన అధికారుల్లోనూ నకిలీ దందాగాళ్ల భరతం పట్టాలన్న కర్తవ్యనిష్ఠకన్నా కాసుల యావ లావై- పర్యవేక్షణ, సోదాలు, చర్యలు కంటితుడుపుగా మారుతున్నాయి. వ్యాపారులు నాణ్యతా ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు చేపడతామంటున్న ప్రతిజ్ఞా పాలనలో పాలక శ్రేణులు ఇప్పుడు ఎలా నెగ్గుకొస్తాయో చూడాలి!

కలియుగాన్ని కల్తీయుగంగా భ్రష్టుపట్టిస్తూ జనారోగ్యానికి తూట్లు పొడిచే ముష్కర కళలో విచ్చిన్న శక్తులు రెచ్చిపోతున్నప్పుడు- నిఘా నిద్రపోతే ప్రజలు దగాపడక తప్పదు. ఆ వివేచనతో మాయగాళ్లకు యావజ్జీవిత ఖైదు విధించేలా శాసన నిబంధనలు కూర్చిన ఉత్తర్ ప్రదేశ్, పశ్చిమ్ బంగ, ఒడిశాల దారిలో తానూ నడుస్తానంటోంది తెలంగాణ ప్రభుత్వం. పాలలో కల్తీ తనిఖీ నిమిత్తం రాష్ట్ర, జిల్లాస్థాయి కమిటీల్ని అవతరింపజేసిన ఆంధ్రప్రదేశ్ సర్కారు- ఇతరత్రా నకిలీల్నీ ఉపేక్షించేది లేదంటోంది. వాస్తవానికి, ఈ కసరత్తు ఏనాడో చురుగ్గా చేపట్టి ఉండాల్సింది. పొరుగున బంగ్లాదేశ్ 'సురక్షిత ఆహార చట్టం'లో భాగంగా కల్తీదారులకు మరణశిక్షను పొందుపరచింది. ఆహార భద్రతా ప్రమాణాల్లో తమ దేశం రికార్డు తిరుగులేనిదని సింగపూర్ సగర్వంగా చాటుతోంది. యూకే, స్పెయిన్, బ్రెజిల్, ఫ్రాన్స్ ప్రభృత దేశాల్లోనూ ఆహార భద్రతా ప్రమాణాలపై నిఘా, పర్యవేక్షణ అంతర్జాతీయంగా ప్రశంసలందుకుంటున్నాయి. దేశీయంగా నెలకొన్న దుస్థితికి విరుగుడుగా ఏడాది క్రితం కేంద్రానికి న్యాయ సంఘం(లా కమిషన్) కొన్ని సిఫార్సులు చేసింది. కల్తీల వల్ల మరణాలు సంభవించిన పక్షంలో బాధ్యులకు యావజ్జీవ శిక్ష విధించాలన్నది వాటిలో ఒకటి. 'జీవించే హక్కును కాలరాస్తున్నా'రని న్యాయస్థానమే తూష్ణీకరించిన అక్రమార్కుల కల్తీ బాగోతాలు రుజువైన వెంటనే కటకటాల వెనక్కినెట్టి గరిష్ఠ శిక్ష అమలుపరచేలా విధివిధానాల్ని పటిష్ఠీకరించాల్సిందే. 2012 తరవాత దేశీయంగా ఆహార ప్రమాణాల నియంత్రణ నీరుకారిందన్న 'కాగ్' తాజా నిర్ధారణ వెలుగులో, కంతల పూడ్చివేతపై మోదీ ప్రభుత్వం తక్షణం దృష్టి కేంద్రీకరించాలి. రాష్ట్రాల స్థాయిలో నిఘా, పర్యవేక్షణల మెరుగుదలకు తోడ్పాటు అందిస్తూ సత్వర సమాచార మార్పిడితో కల్తీమాఫియాపై జాతీయ సమర వ్యూహాన్ని కదం తొక్కించాలి. పాఠశాల స్థాయినుంచే కల్తీలు, నకిలీలపై అవగాహన పెంపొందించి, ఆహారం అన్నిందాలా స్వచ్ఛంగా ఉండే ఆదర్శ వాతావరణ పరికల్పనకు పాదు చేయాలి!

సమతుల ప్రగతికి కట్టాలి పట్టం

మానవుల పుట్టుక చావులు ప్రకృతి సృష్టి. జీవన విధానాలు మాత్రం మానవ నిర్మితం. మనుషులు ఏర్పాటు చేసుకున్న వ్యవస్థలు, సమాజంలో వారి మధ్య, సమూహాల మధ్య, ప్రాంతాల మధ్య, దేశాల మధ్య, సామాజిక, ఆర్థిక, రాజకీయ జీవన సమాన అసమానతల స్థాయుల్ని నిర్ణయిస్తాయి. అందరికీ సమాన సంపద పంచే వ్యవస్థలు సమాన స్థాయుల్ని కల్పిస్తాయి. కనీసం అలాంటి అవకాశాలనైనా అందిస్తాయి. అసమానతలను అదుపులో పెట్టగలుగుతాయి. స్వాతంత్ర్యానంతరం ఆధునిక భారతం ప్రతి ఒక్క పౌరుడికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ అవకాశాల్లో సమానత్వం కల్పించాలని రాజ్యాంగబద్ధంగా సంకల్పించింది. ఇప్పటికీ అది సామాన్యులకు అందని ద్రాక్షే! విద్య, వైద్య, ఆహార భద్రతల్లో సమానత్వం- రాజకీయ ఆర్థిక సమానత్వానికి పునాది. అలాంటి పునాదుల్లోనే లోపాలుంటే వ్యవస్థలు కూలిపోతాయి. ఇది చారిత్రక సత్యం!




అంతరాల్లో అగ్రస్థానం

ఆర్థిక స్థితికి, ఆకలి బాధకు అవినాభావ సంబంధం ఉంది. కాబట్టి, ఆర్థిక అసమానతలు మిగతా వాటన్నింటికన్నా కష్టదాయకమైనవి. నోబెల్ బహుమతి గ్రహీత ప్రొఫెసర్ మహమ్మద్ యూనిస్ పేర్కొన్నట్లు, ప్రస్తుత ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పుట్టగొడుగు ఆకారాన్ని పోలి ఉంది. వ్యవస్థలో దిగువస్థాయిలో అత్యధిక ప్రజలు సృష్టిస్తున్న సంపద ఎగువ స్థాయిలో అత్యల్ప వ్యక్తుల వద్ద కేంద్రీకృతమవుతోంది. మొన్నటికి మొన్న విడుదలైన ప్రపంచ అసమానతల నివేదిక (2018) గణాంకాలే దీనికి నిదర్శనం. ఈ నివేదిక ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో మూడున్నర దశాబ్దాలుగా విపరీతంగా పెరిగిపోతున్న ఆర్థిక అసమానతలను బట్టబయలు చేసింది. 1980-2014 మధ్యకాలంలో ప్రపంచ జనాభాలో ఎగువ ఒక్క శాతం ప్రజల ఆదాయ వాటా, మొత్తం ప్రపంచ ఆదాయంలో 16 శాతం నుంచి 22 శాతానికి పెరిగింది. దిగువ 50 శాతం ప్రజల ఆదాయ వాటా కేవలం ఆరు శాతం నుంచి తొమ్మిది శాతానికి మాత్రమే పరిమితమైంది. ఇదే కాలంలో ఎగువ ఒక్క శాతం ప్రజలు, దిగువ 50 శాతం ప్రజల మొత్తం ఆదాయం కన్నా రెండు రెట్ల కంటే అధిక ఆదాయం గడించారు. ఈ గణాంకాల ప్రకారం, ఆర్థిక అసమానతల పోకడల్లో భారత్, ప్రపంచ దేశాలన్నింటికన్నా ముందువరసలో ఉంది. 2014లో దేశ జనాభాలో పైస్థాయిలోని 10 శాతం ప్రజలు, 55 శాతం సంపదను అనుభవిస్తున్నారు. మిగిలిన 90 శాతం ప్రజలు 45 శాతం ఆదాయాన్ని మాత్రమే పొందుతున్నారు. ఎగువ 10 శాతం ప్రజల ఆదాయ వాటా చైనాలో 41 శాతం. ఆఫ్రికాలో 54 శాతం. అమెరికా, కెనడాల్లో 47 శాతం, ఐరోపా దేశాల్లో 37 శాతంగా ఉంది. 1980ల నుంచి ఆర్థిక అసమానతల అంతరం మన దేశంలోనే అధికం. 1951-2014 మధ్యకాలంలో, జనాభాలో ఎగువ ఒక్క శాతం ప్రజల ఆదాయ వాటా మొత్తం ఆదాయంలో 12 శాతం నుంచి 22 శాతానికి పెరిగింది. దిగువ 50శాతం ప్రజల వాటా 22 శాతం నుంచి 15 శాతానికి తగ్గింది. ఇది ప్రపంచ పోకడకు వ్యతిరేకం. అక్కడ దిగువ స్థాయి ప్రజల ఆదాయాలూ స్వల్పంగా పెరిగాయి.

మన దేశంలో ఆర్థిక అసమానతల పెరుగుదల 1980ల్లో మొదలైన సంస్కరణల నుంచి ప్రారంభమైంది. 1980-2014 మధ్య కాలంలో మొత్తం జాతీయ ఆదాయంలో, జనాభాలో ఎగువ 10 శాతం ప్రజల ఆదాయ వాటా అత్యధికంగా పెరగ్గా, మధ్య శ్రేణిలో 40 శాతం, దిగువన 50 శాతం ప్రజల వాటాలు తగ్గాయి. ఇదే మూడున్నర దశాబ్దాల కాలంలో పైవర్గం నికర ఆదాయం సుమారు నాలుగింతలు పెరగ్గా, కింది రెండు వర్గాల ఆదాయం రెట్టింపైనా కాలేదు. దీన్నిబట్టి మూడున్నర దశాబ్దాల కాలంలో దేశంలో నమోదైన ఆర్థికవృద్ధి పేదలకన్నా, ధనికులకే ఎక్కువ లాభించింది. బలవంతులకే మరింత బలం చేకూర్చింది. అసమానంగా నిర్మితమై, అస్తవ్యస్తంగా కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, వైద్య వ్యవస్థలే అసమానతలు పెచ్చరిల్లడానికి కారణమవుతున్నాయి. కుల వ్యవస్థ సమాజంలో మనుషులను నిలువుగా చీలుస్తోంది. భూమి ఇతర సంపదలపై కొన్ని కులాల అధిపత్యం నెలకొని ఉంది. దీనివల్ల బడుగు బలహీన వర్గాలకు చెందినవారు అధికంగా పేదలుగానే మిగిలిపోతున్నారు. ప్రస్తుత సమాజ పోకడల దృష్ట్యా, కులపరమైన అసమానతలతోపాటు మతపరమైన అసమానతలూ అధికమవుతున్నాయి. రాజ్యాంగం సాక్షిగా దేశంలో రాజకీయ సమానత్వం కల్పించినప్పటికీ, వాస్తవంలో అది నేతి బీరలో నెయ్యి చందం. నేటికీ దేశంలో

అసమానతలు తొలగే మార్గం

రాజకీయ సమానత్వం అనేది వారసత్వం, కుల, ధన బలాల గోడలు దాటి సామాన్యుడికి చేరువ కావడంలేదు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా భవిష్యత్తులోనైనా పరిస్థితి మారగలదన్న ఆశా సన్నగిల్లుతోంది. ఈ విధమైన తెరచాటు రాజకీయ అసమానత్వం ఇతర అసమానతలకు ముఖ్యంగా ఆర్థిక అసమానతలకు దారి తీస్తోంది. అధిక ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయ రంగం అసమానతలతో కునారిల్లుతోంది. భూమి, సాగునీరు, వ్యవస్థాగత పరపతి, పంట బీమా, విత్తన సదుపాయం, విస్తరణ సేవలు వంటి కీలక అంశాల్లో విపరీతమైన అసమానతలున్నాయి. భూసంస్కరణలు జరిగిప్పటికీ అధిక శాతం సాగుభూమి కొద్దిమంది చేతుల్లోనే ఉంది. మొత్తం రైతుల్లో 85 శాతం సన్న, చిన్నకారు రైతులు (అయిదు ఎకరాల లోపు) కేవలం 45 శాతం భూమి కలిగి ఉన్నారు. 15 శాతం పెద్దరైతులు 55 శాతం భూమిని అనుభవిస్తున్నారు. ఇప్పటికీ దేశంలో 60 శాతం సాగుభూమికి నీటి సౌకర్యం లేదు. అనేక ప్రాంతాలు వ్యవసాయాభివృద్ధిలో పాలుపంచుకోలేక పోతున్నాయి. ఫలితంగా వ్యవసాయ ఉత్పత్తిలో అధిక సాగునీటి సదుపాయం కలిగిన పంజాబ్, హరియాణా వంటి ప్రాంతాలే ముందంజలో ఉన్నాయి. అధిక భాగం వ్యవస్థాగత పరపతి, పంట బీమా, నాణ్యమైన విత్తనాల అందుబాటు, విస్తరణ సేవల వంటి ప్రభుత్వ సదుపాయాలు సన్న చిన్న కౌలు రైతులకు చేరువలో లేవు. ఫలితంగా సేద్యం పేద రైతులపాలిట శాపంగా మారింది. దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన పారిశ్రామిక రంగంలో సైతం అనేక రకాల అసమానతలు రాజ్యమేలుతున్నాయి. దేశ పారిశ్రామిక ఉత్పత్తిలో మూడు రాష్ట్రాలు మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడులే 50 శాతం వాటా కలిగి ఉన్నాయి. ప్రైవేటు పారిశ్రామిక రంగం అతి కొద్ది మంది చేతుల్లోనే ఉంది. ఆర్థిక సంస్కరణల కాలంలో పారిశ్రామిక రంగం అత్యధిక వృద్ధి సాధించినప్పటికీ, అది అధిక యాంత్రీకరణతో కూడిన ఉద్యోగ రహిత వృద్ధి కావడం వల్ల, సృష్టించిన సంపద కొద్దిమంది బడా పారిశ్రామికవేత్తల చేతుల్లో పోగుపడుతోంది. అతిపెద్ద కార్పొరేట్ సంస్థల పోటీకి తట్టుకోలేక అధిక ఉద్యోగ సాంద్రత గల చిన్న మధ్య తరహా పరిశ్రమల రంగం రోజురోజుకూ క్షీణించిపోతోంది. సరళీకరణ విధానంలో భాగంగా ఈ రంగానికి ప్రభుత్వాల ఆదరణా కరవవుతోంది. వీటన్నింటివల్ల పారిశ్రామికరంగ వృద్ధి సమానతలను పెంచే బదులు తీవ్ర అసమానతలకు మూలకారణమవుతోంది. విద్యలోనూ ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి అదే పోకడ ప్రతిబింబిస్తోంది. అందరికీ ఒకే రకమైన నాణ్యమైన విద్య కలగానే ఉంటోంది. సంపన్నులకు కార్పొరేట్ విద్య, పేదలకు ప్రభుత్వ చదువులు అన్నట్లు పరిస్థితులు ఉన్నాయి. వైద్య ఆరోగ్య సేవల్లో, సంపన్నులు అత్యున్నత సౌకర్యాలు, నాణ్యత గల ఖరీదైన ప్రైవేటు కార్పొరేట్ వైద్యం పొందుతున్నారు. మధ్యతరగతివారు ప్రైవేటు ఆసుపత్రుల ఖరీదైన వైద్యంతో నలిగిపోతున్నారు, పేదలు ప్రభుత్వ ఆస్పత్రుల అరకొర వైద్యంతో, కొన్నిసార్లు అదీ అందక, చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు.



జాతీయ ఆదాయ పంపిణీ (శాతాల్లో)

శ్రేణి	జనాభాలో వాటా	ఆదాయంలో వాటా	
		1980లో	2014లో
ఎగువ తరగతి	10	30	54
మధ్య తరగతి	40	46	31
దిగువ తరగతి	50	24	15
మొత్తం		100	100

ఆధారం: ప్రపంచ అసమానతల నివేదిక 2018

త్రిముఖ వ్యూహంతో ముందుకు...

సామాజిక, రాజకీయ, ఆర్థిక సమానత్వాలు ఒకదానితో ఇంకొకటి బలంగా ముడివడి ఉంటాయి. వీటిలో ఏ ఒక్కదాన్ని నిర్లక్ష్యం చేసినా కథ మళ్ళీ మొదటికొస్తుంది. అందువల్ల మూడింటి అభివృద్ధికి సమానంగా, ఏకధాటిగా కృషి జరగాలి. అందుకు సరైన వ్యవస్థలు నిర్మించి, సరైన పంథాలో నడిపించగలగాలి. ప్రభుత్వాలు పెద్దన్న బాధ్యతలు నిర్వహించాలి. ఆర్థిక వ్యవస్థ నిర్మాణమన్నది వికాసంలో అందరినీ భాగస్వామ్యులను చేసేదిగా ఉండాలి. అందరూ కనీస జీవన వ్యయాన్నికై సరిపడా ఆదాయాన్ని సంపాదించుకొనే వీలుండాలి. ఇందుకోసం అన్ని కీలక రంగాల్లో ప్రభుత్వ ప్రైవేటు సంస్థలు పోటాపోటీగా పనిచేసే మిశ్రమ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠపరచాలి. వ్యవసాయ రంగంలో సన్న చిన్నకారు రైతులకు, పారిశ్రామిక రంగంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు చేయూతను ప్రభుత్వం అధికం చెయ్యాలి. సంపద పన్నును పురోగామి పద్ధతిలో, పైస్థాయిలో అధికంగా పెంచాలి. వారసత్వ ఆస్తి సంక్రమణపై పన్ను విధించాలి. వీటన్నింటితోపాటు, అతి ముఖ్యంగా విద్య, వైద్య, ఆరోగ్య వ్యవస్థను పునర్నిర్మించాలి. రేపటి పౌరులకు ఈ వ్యవస్థల నుంచే సమానత్వం కల్పించాలి. ఈ విధానాలే ఐరోపా దేశాల్లో తక్కువ స్థాయి అసమానతల సమాజానికి కారణం. దీనికోసం పాఠశాల స్థాయిలో దేశంలోని పిల్లలందరికీ ఒకే రకమైన నాణ్యమైన విద్యను ఉచితంగా అందించగలగాలి. పాఠశాల విద్య పూర్తయ్యేనాటికి, ప్రతి విద్యార్థికీ బతుకుతెరువు కల్పించగలిగే ఏదో ఒక వృత్తి నైపుణ్యాన్ని తప్పక నేర్పించాలి. అందరికీ ఉచిత ప్రాథమిక వైద్య, ఆరోగ్య సేవలను మాటలకు పరిమితం చేయకుండా చిత్తశుద్ధితో కార్యాచరణలోకి తీసుకురావాలి. అప్పుడే దేశ యువత సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అవకాశాలను సమానంగా అందిపుచ్చుకోవడానికి పునాదులు ఏర్పడతాయి. పెచ్చరిల్లుతున్న అసమానతలకు అడ్డుకట్ట పడుతుంది. సమసమాజ నిర్మాణ స్వప్నం సాకారమవుతుంది!


– డాక్టర్ చీరాల శంకర్‌రావు
(రచయిత– సహాయ ఆచార్యులు,
సామాజిక అభివృద్ధి సంస్థ (సీఎస్‌డీ) హైదరాబాద్)

మహిళల కోసం మేలిమి చట్టం

తక్షణ తలాక్ బిల్లుపై పార్లమెంటులో చర్చలు, ప్రసార మాధ్యమాలలో జరిగిన వాదోపవాదాలు దేశాన్ని కుదిపివేశాయి. చర్చలు బిల్లులోని మంచి చెడులపై కన్నా రాజకీయ కోణంలోనే ఎక్కువ జరగడం దురదృష్టకరం. ఈ బిల్లుపై విపక్షాలు వ్యక్తం చేసిన కొన్ని అభ్యంతరాలు మరీ విడ్డూరంగా, సభ్యసమాజం తలదించుకునే విధంగా ఉన్నాయి. కాంగ్రెసు, వామపక్షాలు లేవనెత్తిన అంశాలు బిల్లుని ఏ విధంగానైనా నిరోధించడానికి లేవనెత్తిన సాకులు మాత్రమేనని అర్థమవుతుంది. మరోవంక బిల్లు ఆమోదం కోసం పాలక పక్షం తగిన స్థాయిలో పని చేయలేదన్న వాదన సైతం వినిపిస్తోంది. మొత్తమ్మీద మహిళా హక్కులను పక్కనపెట్టి ఎవరి రాజకీయాలు వారు చేసేస్తున్నారన్నమాట!

ఈ బిల్లుపై అభ్యంతరాలను ఓసారి పరిశీలిద్దాం. కుటుంబ వ్యవహారమైన పెళ్ళి, విడాకులను నేరస్మృతి పరిధిలోకి తీసుకురావటం తప్పు అని వాదిస్తున్నారు. ఈ మాట వినడానికి బాగానే ఉంది. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. తక్షణ తలాక్ రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు స్పష్టం చేసిన తరవాత కూడా వందలమంది ముస్లిం మహిళలు వీధినపడ్డ విషయం విదితమే. చట్టపరమైన మద్దతు కొరవడిన పరిస్థితుల్లో పోలీసులు జోక్యం చేసుకోలేని స్థితి ఉంది. ఈ తరహా ఘటనలు ఇక జరగకుండా చూస్తామని 'సుప్రీం'కి హామీ ఇచ్చిన ముస్లిం పర్సనల్ లా బోర్డు సైతం పట్టీపట్టనట్లుగా వ్యవహరించింది. రాజ్యాంగ వ్యతిరేకమైన ఈ చర్యను నేరంగా పరిగణించకపోతే సమస్య పరిష్కారమెలా అవుతుంది? దీన్ని తీవ్రమైన నేరంగా పరిగణించకుండా తేలికపాటి నిబంధనలతో చట్టం చేయాలని విపక్షాలు అంటున్నాయి. దానివల్ల మహిళలకు అన్యాయం జరగదా?

మహిళలపై అన్యాయాలకు అడ్డుకట్ట వేస్తూ, వాటిని నేరాలుగా పరిగణిస్తూ మన దేశంలో కుటుంబ చట్టాలు అమల్లో ఉన్నాయి. ఉదాహరణకు 1955 హిందూ వివాహ చట్టం ప్రకారం భార్య ఉండగా భర్త రెండో పెళ్ళి చేసుకుంటే దాన్ని తీవ్ర నేరంగా పరిగణించి కారాగార శిక్ష విధించే నిబంధనలు ఉన్నాయి. వరకట్నాన్ని నేరంగా పరిగణిస్తూ జైలు శిక్షలు విధించే చట్టం ఉంది. గృహహింస చట్టం కింద కఠిన శిక్షలున్నాయి. కాబట్టి తాజాగా తక్షణ తలాక్ బిల్లుపై వ్యాఖ్యానిస్తూ దాన్ని ముస్లిం సమాజాన్ని ఇబ్బంది పెట్టేందుకు తీసుకువచ్చిన నేరస్మృతిగా విపక్షాలు వ్యాఖ్యానిస్తుండటం సత్యదూరం. భర్త జైలుకు వెళితే భార్యాపిల్లలు ఎలా బతుకుతారన్నది వ్యక్తమవుతున్న మరో అభ్యంతరం. ఈ మాట అన్ని చట్టాలకూ వర్తిస్తుంది కదా, మిగతా చట్టాలు చేసే సమయంలో ఈ వాదన ఎందుకు తీసుకురాలేదు? వరకట్న దురాచారాన్ని రూపుమాపడానికి ఇంతకన్నా కఠిన చట్టాలు తీసుకురావాలని వామపక్షాలు అడిగిన మాట వాస్తవం కాదా? కాబట్టి ప్రస్తుతం విపక్షాలు ప్రదర్శిస్తోంది ద్వంద్వ వైఖరి. కఠిన చట్టాలు లేకపోతే నేరాలను కట్టడి చేసేదెలా? అవి ఎలా ఆగుతాయి? తీవ్ర నేరాలు చేసిన వారికీ కుటుంబాలున్నాయన్న విషయాన్ని



తలాక్‌పై ఇక వద్దు రాజకీయాలు

మరచిపోవద్దు. ఈ బిల్లు అసలు ఉద్దేశం భర్తను జైలుకి పంపించాలని కాదు. కఠిన చట్టాలతో దురాచారాన్ని అడ్డుకోవాలని! కఠిన శిక్షాస్మృతి అమల్లో ఉంటే తప్పు చేయాలనుకున్నవారు భయంతో వెనకడుగు వేస్తారని. మహిళలు ఆత్మస్థైర్యంతో ఉంటారని!

భార్యకు, మైనర్ పిల్లలకు మనోవర్తి ఎవరిస్తారని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. షాబానో కేసులో మనోవర్తి కోసం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును తుంగలో తొక్కి 1986లో పార్లమెంటులో చట్టం చేసిన పార్టీయే ఇవాళ మొసలి కన్నీళ్లు కారుస్తుండటం గమనార్హం! భారతీయ నేరస్మృతిలో సెక్షన్ 125ని తొలగించినవాళ్లే నేడు ముస్లిం మహిళలపై ఎనలేని ఆపేక్ష కనబరుస్తుండటం విడ్డూరం. ఇంతకుమించిన ద్వంద్వ ప్రవృత్తి లేదు. ప్రతిపాదిత తక్షణ తలాక్ బిల్లులో ఈ విషయమై న్యాయస్థానాలకు అధికారమిచ్చారు. అయితే తలాక్ పొందిన ముస్లిం మహిళకు ప్రభుత్వమే మనోవర్తి ఇవ్వాలని విపక్షం కోరుతోంది. ఇది ఆచరణ సాధ్యం కాదన్న విషయం ప్రతిపక్షాలకూ తెలుసు. ఏ మతానికి చెందినవారికైనా భర్త ఆదాయాన్ని బట్టి మనోవర్తి నిర్ణయిస్తున్నారు. అంతేగానీ ప్రభుత్వం ఆ డబ్బు ఇవ్వడం లేదు. ఇలాంటి వాదనకు అంగీకరిస్తే మున్ముందు విపరీత పరిణామాలు చోటుచేసుకుంటాయి. తీవ్ర నేరాలు చేసినవారిని శిక్షిస్తే వారి కుటుంబ పోషణ భారం ఇక ప్రభుత్వమే భరించాల్సి ఉంటుంది! ఇదెక్కడి న్యాయమో అర్థం కావడంలేదు. కుటుంబ చట్టాల్లో నేరస్థులకు శిక్ష విధించటం, భార్యలకు, మైనర్ పిల్లలకు భర్త ఆదాయంలో కొంత భాగం మనోవర్తి కింద ఇవ్వటం జరుగుతోంది. తలాక్ బిల్లు సైతం ఆ పద్ధతిలోనే తయారు చేశారు. ఆ మాత్రం విపక్షాలకు తెలియదని అనుకోలేం. ఏదో విధంగా బిల్లుని నిరోధించాలనే ఏకసూత్ర అజెండాతోనే అవి సాకులు లేవనెత్తుతున్నాయి. మతపెద్దల ఒత్తిడికి తలొగ్గడమే ఇందుకు కారణం!

రాజ్యసభలో ప్రభుత్వం ఒంటరిగా మారిందన్నది వాస్తవం. బిల్లు చర్చకు పెట్టి ఓటింగు జరిగితే అది ఓడిపోయి ఉండేదన్న విషయం అందరికీ తెలిసిందే. కానీ, కాంగ్రెసు బిల్లును ఆమోదించకుండా అలాగని దాన్ని ఓడించకుండా చాణక్యం ప్రదర్శించింది. 1986నాటి షాబానో ఘటనతో ఆ పార్టీ బోలెడంత అప్రతిష్ఠ మూటగట్టుకొంది. ఈ నేపథ్యంలో బిల్లును ఓడించకుండా పరిశీలన పేరిట కాలగర్భంలోకి నెట్టాలని ప్రయత్నించింది. బిల్లు ఆమోదం పొందకుండా చేయటంలో సఫలమైనట్లు విపక్షాలు సంబరపడవచ్చు గాక! పార్టీల వైఖరిని ప్రజలు సునిశితంగా గమనిస్తున్నారన్నది ఇక్కడ గమనార్హం.

నిజానికి ఈ మొత్తం వ్యవహారంలో రాజకీయం గెలిచింది, మహిళలు ఓడిపోయారు. 1946-47 రాజ్యాంగసభ చర్చలనుంచి దేశంలో మహిళాలోకానికి ఇదే పరిస్థితి ఎదురవుతోంది. 1986 షాబానో కేసునుంచి 2017 సైరాబాను కేసు వరకూ పురుషాధిపత్యం మహిళా హక్కులను అణచివేస్తూనే వస్తోంది. ముమ్మార్లు తలాఖ్‌ను చట్టబద్ధంగా కట్టడి చేసే రోజుకోసం జాతి మహిళ ఆశగా ఎదురు చూస్తోందన్న విషయాన్ని రాజకీయ పార్టీలన్నీ గుర్తించాల్సిన తరుణమిది.

– కె.రామకోటేశ్వరరావు

ఈనాడు లేఖలు

బస్సుల తీరుతో తంటా

పండుగ రోజులు కావడంతో, తెలంగాణలోని అనేక ప్రాంతాల బస్సులు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. వివిధ డిపోల నుంచి అన్ని రూట్లకూ సర్వీసులు నడుపుతున్నామని, రాకపోకలకు అనువుగా అదనపు బస్సులు వేస్తున్నామని రాష్ట్ర రోడ్డురవాణా సంస్థ ఉన్నతాధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఆయా ప్రకటనల్లో ఉన్నంత 'సౌకర్యాల కల్పన' ఆచరణలో కనిపించడం లేదు. జనం రద్దీ కారణంగా అదనపు ఛార్జీల విధింపు తప్పడం లేదని ఈ సంవత్సరం కూడా చెబుతున్న సంస్థ, బస్సుల్లో వసతులకు సంబంధించి ఎటువంటి చర్యలూ చేపట్టడం లేదు. కొన్ని ప్రయాణ మార్గాల్లో ఎందుకూ కొరగాని బస్సుల్ని నడుపుతున్నారు. మరికొన్ని బండ్లు మార్గమధ్యంలో మొరాయిస్తున్నా పట్టించుకొనే నాథుడు లేడు. సక్రమంగా లేని సీట్లు, నాసిరకం ఏర్పాట్లు ఆర్టీసీ ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. ఏటా ఎదురవుతున్న ఇటువంటి పరిస్థితుల్ని ఇకనైనా చక్కదిద్దేందుకు ఉన్నతాధికార యంత్రాంగం ఉపక్రమించాలి. సమగ్ర ప్రణాళికను అమలుచేయడం ద్వారా, బస్సుల స్థితిగతుల్ని మెరుగుపరచాలి.

- కె.సతీష్‌రెడ్డి, పరకాల, వరంగల్ జిల్లా

వృద్ధులకు అయిదేళ్లకు ఓ శ్లాబు

వృద్ధులకు ఆదాయ పన్ను రాయితీలు ప్రకటించే విషయంలో కేంద్రప్రభుత్వం 80 ఏళ్ల పైబడినవారినే పరిగణనలోకి తీసుకుంటోంది. దీనివల్ల 65 ఏళ్లు దాటినవారు ఉసూరుమనాల్సి వస్తోంది. ప్రపంచ ఆరోగ్య సూచీలో భారత్ అత్యంత దిగువస్థానంలో ఉంది. దేశంలో పురుషుల సగటు ఆయుర్దాయం 66.9 సంవత్సరాలు. మహిళలకు 69.9 ఏళ్లు. కాబట్టి వృద్ధులకు ఆదాయ పన్ను రాయితీల ప్రకటనలో ప్రభుత్వం 65 ఏళ్లను ప్రాతిపదికగా తీసుకోవాలి. 60 ఏళ్ల తరవాత ప్రతి అయిదేళ్లకు ఒక శ్లాబ్‌ను నిర్ణయించి రాయితీలు అందజేయాలి.

- చామర్తి వెంకట రామకృష్ణ, హైదరాబాద్

బిరుదుల వల


లోకంలో పలువురు బిరుదులకు వల వేస్తారు, సాధిస్తారు, ధరిస్తారు! కొందరినే బిరుదులు స్వయంగా వరిస్తాయి, తరిస్తాయి. వారందరిలో- మొదటివారు సామాన్యులు, రెండోవారు- మాన్యులు. బిరుదులు ఎంత బరువైనవైనా, వాటిని అవలీలగా స్వీకరిస్తారు మాన్యులు. భరించే స్థితి నుంచి ధరించగల స్థితికి ఎదగాలంటే, సామాన్యులు ముందుగా మాన్యులు కావాలి.

'మరణించిన తరవాతా మనిషి అందరికీ గుర్తుండాలంటే- సదా గుర్తుంచుకోదగిన పుస్తకాలనైనా రాసిపెట్టి వెళ్లాలి. లేదంటే, పుస్తకాలుగా రాయదగిన పనులనైనా అతడు చక్కబెట్టి ఉండాలి' అన్నారొక ఆంగ్ల రచయిత. లోక స్వభావం బహు కఠినంగా ఉంటుంది. మనిషి నుంచి ఎంతో పొందితే తప్ప- అతణ్ని అది గుర్తించదు, గుర్తుంచుకోదు. లోకానికి తీపి గుర్తుగా మిగిలిపోవాలని కోరుకునే ప్రతి మనిషీ- తనను తాను ఒక మాన్యుడిగా మలచుకోవాలి. అతడు లోకుల మనసుల్ని గెలుచుకోవాలి. అప్పుడే లోకం ఆ మనిషిని వలచి, వరమాల మెడలో వేస్తుంది. చిరకాలం అతణ్ని తలచుకుంటుంది.

'మర్యాదా పురుషోత్తముడు' అనేది శ్రీరామచంద్రుడికి, 'అజాత శత్రువు' అనే బిరుదు ధర్మరాజుకు- లోకం ఇచ్చినవి.

రాముడి జీవితంలో ఎదురైన ప్రతి సన్నివేశాన్ని, ఆయా సందర్భాల్లో ఆయన వ్యవహరించిన తీరును అధ్యయనం చేస్తే- సామాన్యుడు మాన్యుడిగా ఎదిగేది ఎలాగో సులువుగా బోధపడుతుంది. 'రామాయణం' అనే మాటకు 'రాముడు నడిచిన దారి' అని ఒక అర్థముంది. అలా అదే దారిలో ముందుకు సాగేందుకు ఎవరు ప్రయత్నించినా, అతడికీ మర్యాదా పురుషోత్తముడన్న ఖ్యాతి లభించి తీరుతుంది.

ప్రత్యర్థులు సైతం ప్రశంసించే ప్రవర్తనకు ప్రత్యక్ష ఉదాహరణ- ధర్మజుడు! అందువల్ల ఆయనకు అజాతశత్రువన్న గొప్ప బిరుదు దఖలుపడింది. 'శత్రువులనేవారు ఇంకా పుట్టనే లేదు' అని ఆ మాటకు అర్థం! అంటే, ఉన్నవారెవరూ ఆయనకు శత్రువులు కారు. 'ఎవ్వాని వాకిట ఇభమద పంకంబు...' అంటూ తిక్కన కవి



అంతర్యామి

పలికిన మాటలు వింటే- ధర్మరాజు యోగ్యతలు, అర్హతలు ఎంతటివో, ఎటువంటివో పూర్తిగా స్పష్టమవుతాయి. 'ఆయన కేవలం ఒక సామాన్యుడు (మర్త్యుడు) అని మీరు అనుకుంటున్నారా? కాదు, ఆయన లోకమాన్యుడు' అని పాత్రోచితంగా చెప్పినదానికి రుజువులు మహాభారతంలో ఎక్కడ చూసినా లభిస్తాయి. 'భారతం నిజంగా జరిగిందే అయితే అద్భుతం... కల్పన అయితే నిజంగా పరమాద్భుతం!' అని జార్జి బెర్నార్డ్ షా కొనియాడటానికి ప్రధాన కారణం ధర్మజుడి 'పాత్ర'త!

ఆ పాత్రలు అంత మన్నికైనవి కాబట్టి- రాముడి కథను, ధర్మజుడి గాథను గ్రంథస్తం చేయాల్సిన అవసరం వాల్మీకి, వ్యాసమహర్షి... ఇరువురికీ ఏర్పడింది. ఆ గ్రంథాల్ని కళ్లతో కాకుండా మనసుతో చదువుకోగలిగితే- మానవుడు సామాన్యుడిలా మిగిలిపోకుండా, మాన్యుడిగా ఎదిగేందుకు చక్కని దారి కనిపిస్తుంది.

మనిషి అటువంటి ఉన్నత స్థితికి ఎదిగిననాడు, వయసు పడమరకు వాలుతున్నా కొంగల్లా బిరుదుల కోసం మెడలు చాచి ఉంచే ఆలోచనల నుంచి బయటపడతాడు. 'ఆ మనిషికి ఫలానా బిరుదు లభించిందట' అనగానే, ఆశ్చర్యపడే దుస్థితి లోకానికి తప్పుతుంది. వెక్కిరించే అవస్థ ఆత్మకూ తప్పుతుంది!

– ఎర్రాప్రగడ రామకృష్ణ

మకరందం

మా చిరునామా: **మకరందం**
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512
makarandam@eenadu.in

సంక్రాంతి అనే మాటకు సంక్రమించడం అని అర్థముంది. ఖగోళశాస్త్రం ప్రకారం ఒక్కో నెల ఒక్కో రాశిలోకి సూర్యుడు సంక్రమిస్తాడు. ఇలా ప్రతి నెలా మనకు సంక్రాంతి వస్తూనే ఉంటుంది. ఇలా ఏడాదిలో వచ్చే పన్నెండింటిలోనూ ముఖ్యమైంది మకర రాశిలో సూర్యుడు సంక్రమించే సమయం. అదే మకర సంక్రాంతి. లిప్త పాటు కాలంలో మకర రాశిలోకి ప్రవేశించే సూర్యభగవానుడు ఉత్తరాయణ మహా పుణ్య కాలానికి నాంది పలుకుతాడు. మన పంటలు ఇంటికి వచ్చే వేళ... ముంగిళ్లలో పాడి పొంగి పొరలే వేళ... గంగిరెద్దులు, జానపదులు ఆడిపాడే వేళ... పండగ తియ్యతియ్యగా చేసుకునేందుకు ప్రజలు సిద్ధమవుతారు. ముఖ్యంగా మన పల్లెల్లో నెలకొనే పండగ వాతావరణం కమనీయం. ఈ వేడుకలకంతటికీ మూలకారణం సూర్యభగవానుడే. కాబట్టి ఇది సూర్యదేవుడి పరంగా జరిగే పెద్ద పండగగా భావిస్తారు.



భోగభాగ్యాల సంక్రమణం

ఒక సూర్యుడు సమస్త జీవులకు దానొక్కడై తోచు... అన్నాడు పోతన. సమస్త ప్రపంచానికి ఒక్కడే సూర్యుడు. భిన్న జాతులకు, మతాలకు, విభిన్నమైన దేవుళ్లు ఉండవచ్చు. కానీ అందరికీ ప్రత్యక్ష దైవం సూర్యుడు. సూర్య గమనాన్ని ఆధారంగా చేసుకుని అనుసరించే కాలగణన పద్ధతే 'సౌరమానం'. సూర్యగమనం మూడు విధాలు. అవి మంద, శీఘ్ర, సమ గతులు. ఉత్తరాయణంలో సూర్యుడు ఆరోహణ క్రమంలో ఉంటాడు కాబట్టి గతి మాంద్యం పొందుతాడు. అంటే నిదానంగా కదులుతాడన్న మాట. వృషభం మొదలుకుని కన్యా రాశి వరకు గల ఐదు రాశులలో సంచరిస్తున్నప్పుడు పగటి సమయం ఎక్కువగా, రాత్రి సమయం తక్కువగా ఉంటుంది. దక్షిణాయనంలో సూర్యుడు అవరోహణ క్రమంలో ఉంటాడు కాబట్టి గమనం వేగంగా సాగుతుంది. దీనివల్ల వృశ్చికం నుంచి మీనం వరకు గల 5 రాశుల్లో సూర్యుడు సంచరిస్తున్నప్పుడు పగటి పూటల నిడివి తగ్గుతుంది. రాత్రుళ్లు దీర్ఘంగా ఉంటాయి. విషవత్‌లలో మాత్రం సూర్యుడు సమగతిలో ఉంటాడు. విషవత్‌లంటే రాత్రింబవళ్లు సమానంగా ఉండే రోజులు. ఇవి సాధారణంగా మార్చి 21, సెప్టెంబర్ 23 నాడు వస్తాయి. ఇలా కదిలే క్రమంలో సూర్యుడు ఒక రాశి నుంచి మరో రాశిలోకి ప్రవేశించడాన్ని సంక్రమణం అంటారు. ఇది చాలా సూక్ష్మంగా ఉంటుంది. మనిషి కనురెప్ప కదిలించడానికి పట్టే కాలంలో 30వ భాగానికి 'తత్పర' అని పేరు. తత్పరలో వందో వంతును 'తృటి' అంటారు. ఆ తృటిలో వందో వంతు కాలంలో సూర్యుడొక రాశి నుంచి మరో రాశిలోకి ప్రవేశిస్తాడు. ఆ సమయాన్ని పుణ్యకాలంగా పరిగణిస్తారు. అత్యంత సూక్ష్మంగా ఉంటే ఈ కాలాన్ని కనిపెట్టడం దాదాపు అసాధ్యం. అందువల్లే సంక్రమణానికి ముందు పదహారు, తరువాత పదహారు ఘడియలు పుణ్యకాలంగా పరిగణిస్తారు. ఈ ఘడియల్లోనే సంక్రాంతి సంబరాలను చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

సూర్య గమనం భూమధ్య రేఖకు ఉత్తరంగా ఆరు నెలలు, దక్షిణంగా ఆరు నెలలు అక్షాంశాలను బట్టి మారుతూ ఉంటుంది. కర్కాటక రేఖ మన దేశంలోని వింధ్య పర్వతాల మీదుగా వెళుతుంది. కర్కాటక సంక్రమణంతో దక్షిణాయనం ప్రారంభమవుతుంది. ఈ కాలం పితృ దేవతలకు ప్రీతికరమైంది. సూర్యుడు భూమధ్య రేఖకు ఉత్తర అక్షాంశంలో సంచరించే ఆరు నెలలు ఉత్తరాయణం. ఇది దేవతలకు అత్యంత ఇష్టమైన కాలమని చెబుతారు. ఆధ్యాత్మికంగా, జ్యోతిష శాస్త్ర రీత్యా ఇది అద్భుతమైన రోజు. అందుకే స్వచ్ఛంద మరణాన్ని వరంగా పొందిన భీష్ముడు మహాభారత యుద్ధంలో క్షతగాత్రుడై ఉత్తరాయణ పుణ్యకాలం కోసం అంపశయ్యపై ఎదురు చూస్తూ మాఘ శుద్ధ అష్టమి రోజు తనువు చాలించాడు.

'ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్' సూర్యుడు ఆరోగ్య ప్రదాత. సూర్యుడు ప్రాతఃకాలానికి చైతన్యం కలిగిస్తున్నాడు. మానవ జాతికి, పశుపక్ష్యాదులకు, చెట్లకు అమృతత్వాన్నిచ్చే జీవన దాత. కిరణ జన్య సంయోగ క్రియ ద్వారా వృక్షాల పెరుగుదలకు, జీవకణాల వృద్ధికి కారణమవుతున్న ఆయనను సృష్టి కార్యక్రమ నిర్మాత అనవచ్చు. దేవతలకు మకర సంక్రమణంతో రోజు ప్రారంభమవుతుందని చెబుతారు. అందుకే మకర సంక్రాంతినాడు చేసే దాన, జప, తర్పణాల వల్ల మంచి ఫలితాలుంటాయని భావిస్తారు. ఉపనయనం వంటి శుభకార్యాలను ఈ ఉత్తరాయణ పుణ్యకాలంలోనే చేస్తారు.

తరుణభావుకకవితావరణము వోలె
మంచు పొత్తిళ్లలో చలిమంట వోలె
సిరికి సిరినవ్వు నేర్పిన వరిని తెచ్చె
ఆంధ్రకేదార పర్వాన ఆదిలక్ష్మి

ప్రత్యక్ష నారాయణుడికి...

సంక్రాంతి పండగ నెల రోజులూ తెలుగు పల్లె సీమల్లో సందడే సందడి. ధనుర్మాసం ప్రవేశించగానే సంక్రాంతి కోలాహలం మొదలవుతుంది. ముగ్గులు, గొబ్బెమ్మలు, పూల అలంకరణలతో పల్లెల్లో ప్రకృతికి నిత్యారాధన చేస్తారు. మకర సంక్రమణం సమయంలో రథం ముగ్గులతో తీర్చిదిద్దడం పెద్దలకు పుణ్యలోకాల మార్గాలను సుగమం చేయడమేనని అంటారు. మన పండగల్లో ఎప్పుడూ ఒక పరమార్థం ఉంటుంది. దేవీదేవతలను ఆరాధించి కృతజ్ఞతలు చెప్పుకోవడం, పితృదేవతలను స్మరించుకోవడం అటు భౌతికంగా, ఇటు ఆధ్యాత్మికంగా ఉన్నత భావాలకు నిదర్శనాలు. సంక్రాంతినాటికి అన్ని రకాల పంటలు పొలాల నుంచి ఇంటికి చేరతాయి. ఆ సమయంలో దానధర్మాలకు వెసులుబాటు ఉంటుంది. ఆ సమయంలో హరిదాసులు, గంగిరెద్దుల వారు, జంగమ దేవరలు... ఇలా ఎందరో జానపద కళాకారులు ఇంటి ముందుకే వస్తారు. మనమిచ్చే కానుకలు అందుకుంటారు. ఒకప్పుడు వస్తుమార్పిడికి సంక్రాంతి సమయం ఆలవాలంగా ఉండేది. కొత్త అల్లుళ్లు, బంధువుల రాక, పిండి వంటల తయారీ, పిల్లలకు భోగిపళ్ల అభిషేకాలు, పిడకలు దండకట్టడాలతో ప్రతి ఇంటా ఎంతో సందడి. నిజంగా ప్రతి గ్రామం ఈ పండగ రోజుల్లో ఓ సౌభాగ్య సీమగా మారుతుందనడంలో సందేహం లేదు. సూర్యుడు సకల దేవతల తేజస్సును, ఓజస్సును, శక్తిని, సామర్థ్యాన్ని, అంశను, అనుగ్రహాన్ని తనలో నిక్షిప్తం చేసుకున్నాడు. సర్వజీవులనూ అనుగ్రహించే ఆ దివ్యమూర్తి ఆరాధన అనాదిగా వస్తున్న సంప్రదాయం. అందుకే సంక్రాంతి ఓ పండగ కాదు, అదో సదాచారం. ప్రత్యక్ష నారాయణుడికి జోతలర్పించడం తెలుగువారి సంస్కృతికి నిలువుటద్దం.

■ దామెర వెంకట సూర్యారావు

ఇస్లాం సందేశం

అలాంటి వివాహాలే ఆదర్శప్రాయం

ఏటా మనదేశంలో పెళ్లిళ్లకు అవుతున్న వ్యయం సుమారు మూడు లక్షల ముప్ఫయ్ వేల కోట్లు! ఆశ్చర్యం కలిగించినా.. ఇది నిజం. ఇందులో వృథా ఖర్చే ఎక్కువ. ఇలాంటి ధోరణులకు స్వస్తి పలకాలనీ, వివాహ ఖర్చుల నియంత్రణకు ఒక చట్టం తీసుకురావాలని ఇటీవల లోక్‌సభలో ఒక ప్రతిపాదన చేశారు. సుమారు పదిహేను వందల సంవత్సరాల కిందట ఇదే అంశాన్ని లేవనెత్తారు ముహమ్మద్ ప్రవక్త (స). "అత్యంత తక్కువ ఖర్చుతో చేసిన నిఖా శుభప్రదమైనది, అత్యంత పుణ్యప్రదమైనద"ని బోధించారు ఆయన. ఆ మాటలను ఆచరిస్తే వివాహ వ్యయం గురించి ఏ తల్లిదండ్రులూ చింతించాల్సిన అవసరం ఉండదు.



ఈ కాలంలో పెళ్లిళ్లకు చేస్తున్న ఖర్చు గురించి వింటే ఆశ్చర్యపోవాల్సి వస్తోంది. సంపన్నులు కోట్లలో ఖర్చు చేస్తున్నారు. మధ్యతరగతి తల్లిదండ్రులూ తాహతుకు మించి పెళ్లిళ్లు ఘనంగా నిర్వహిస్తున్నారు. వివాహ విషయంలో ఖుర్ఆన్ స్ఫూర్తిని, ప్రవక్త ముహమ్మద్ ఆదర్శాలను పక్కనపెట్టి సాఫీగా సాగాల్సిన కల్యాణాన్ని సంక్లిష్టంగా మార్చేస్తున్నాం. ఖరీదైన పెళ్లిళ్లు చేయలేక ఎందరో తల్లిదండ్రులు మనోవేదనకు గురవుతున్నారు. ప్రవక్త (స) కాలంలో పెళ్లిళ్లు నిరాడంబరంగా జరిగేవి. ఆయన దగ్గరి శిష్యులలో ఒకరైన అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) మదీనా నగరంలోని ధనవంతులలో ఒకరు. ఔఫ్ (రజి) తన వివాహ వేడుకకు ప్రవక్త(స)ను సైతం ఆహ్వానించలేదంటే.. ఆ పెళ్లి ఎంత నిరాడంబరంగా జరిగిందో ఊహించుకోవచ్చు. ఆ తరువాత ఔఫ్ (రజి) పెళ్లి గురించి తెలుసుకున్న ప్రవక్త (స).. "ఔఫ్! దేవుడు నీకు శుభం చేకూర్చుగాక" అని ఆశీర్వదించారు. ప్రవక్త (స) నేతృత్వంలో జరిగే పెళ్లిళ్లన్నీ ఇలాగే సాదాసీదాగా జరిగేవి. ప్రవక్త మాటలను ఆదర్శంగా తీసుకొని.. పెళ్లిళ్లలో జరిగే వృథా ఖర్చును తగ్గిద్దాం. పరిమిత ఖర్చుతో పెళ్లిళ్లు నిర్వహించి ఆదర్శంగా నిలుద్దాం.

- ఖైరున్నీసాబేగం




స్వామీ శరణం

పదునెట్టాంబడి

మండల కాలం పాటు కఠిన దీక్షను పూర్తి చేసుకుని శబరిగిరికి చేరుకున్న భక్తులు స్వామిని చేరుకునేందుకు 18 మెట్ల మార్గం ద్వారా వెళ్లాల్సి ఉంటుంది. పవిత్రమైన సన్నిధానానికి చేరుకోవాలంటే.. భక్తులు 18 మాయలను పరిత్యజించాలని, దీనికి సంకేతమే పద్దెనిమిది మెట్లని చెబుతారు. అణిమ, లఘిమ, మహిమ, ఈశత్వ, వశత్వ, ప్రాకామ్య, బుద్ధి, ఇచ్ఛ, ప్రాప్తి, సర్వకామ, సర్వ సంపత్కర, సర్వప్రియకర, సర్వ మంగళకర, సర్వ విఘ్న నివారణ, సర్వాంగ సుందర, సర్వ సౌభాగ్యదాయక అనేవి ఈ మెట్లకున్న పేర్లు. కరుప్ప స్వామి, కడుత్త స్వామి ఈ పదునెట్టాండికి ద్వారపాలకులుగా ఉంటారు. తలపై ఇరుముడితో మాత్రమే ఈ మెట్లను ఎక్కేందుకు అర్హత ఉంటుంది. అరిషడ్వర్గాలను, పంచేంద్రియాలను, సత్త్వరజస్తమో గుణాలను, దర్పం, అహంకారాలను జయించినవారే తత్త్వమసి అనే ఆ పరమపదానికి చేరుకోగలరని... ఈ మెట్లు దానికి నిదర్శనమని చెబుతారు.

కన్నవారిని ప్రేమిద్దాం

క్రీస్తువాణి



అమ్మ జన్మనిస్తే.. నాన్న జీవితాన్నిస్తాడు. అమ్మానాన్నలు వేరు కాదు. తమ పిల్లలకు ప్రేమ పంచే విషయంలో ఇద్దరూ శ్రీమంతులే! తమ పిల్లలను సంస్కారవంతులను చేసి సమాజంలో మంచి పౌరులుగా ఎదిగేందుకు వారు చేసే కృషి అపూర్వం. అయితే నేటి సమాజంలో తల్లిదండ్రులకు సంతానం ద్వారా మిగులుతున్నదేమిటి? రెక్కలు ముక్కలు చేసుకొని జీవితాన్ని ధారపోస్తే.. చివరికి నిరాదరణకు గురవుతున్నారు. బాల్యంలో తప్పటడుగులను సరిచేసిన తండ్రి వృద్ధాప్యంలో అడుగు వేయలేకపోతుంటే బిడ్డలు పట్టించుకోవడం లేదు. తల్లిదండ్రులను భారమని తోచిన కొందరు బిడ్డలు కన్నవారిని కడతేరుస్తున్న వార్తలూ వింటున్నాం. నేటి సమాజానికి క్రీస్తు ప్రభువు చెప్పిన ఉపదేశం ఎంతైనా అవసరం. "నీవు దీర్ఘాయుష్మంతుడగునంత కాలం తల్లిదండ్రులను సన్మానించాలి. వారిని ఘనపరచాలి. అమ్మానాన్నలను దూషించేవారికి దేవుని రాజ్యంలో ప్రవేశం లేదు. ఇది ధర్మశాస్త్రంలో పేర్కొన్న దేవుని ఆజ్ఞ" అని ఉపదేశించాడు క్రీస్తు.

ఈ విషయాన్ని ఆయన మాటల ద్వారానే కాదు చేతల ద్వారా కూడా నిరూపించారు. ఆయన సిలువపై మరణయాతన పడుతున్న సమయంలో జరిగిందీ సంఘటన. సిలువపై ఉన్న తన దగ్గరికి వచ్చిన శిష్యుడైన యోహానుతో.. తన తల్లి మరియను చూపుతూ.. "ఇదిగో నా తల్లి! అమ్మా ఇదిగో నీ కుమారుడు" అని తన మాతృమూర్తిని... శిష్యునికి అప్పగించడం ఒక చారిత్రక సన్నివేశం. తాను వెళ్లిపోతూ తన తల్లి బాధ్యతను మరొకరికి అప్పగించడం ఆయనలోని హృదయ విశాలతను, ప్రేమశీలతను, తల్లిపై ఆయనకున్న అవ్యాజమైన అనురాగాన్ని చెబుతుంది. ఆయన తల్లిపై చూపిన ఆదరణ, అన్ని కాలాలకు అనుసరణీయం. ఆదర్శనీయం. మనమూ అమ్మానాన్నలను గౌరవిద్దాం. ప్రేమిద్దాం.

-ఎం. సుగుణరావు

ధర్మసందేహం

ఎందుకీ రథం ముగ్గు?

సంక్రాంతి సందర్భంగా చాలా ప్రాంతాల్లో ఊరంతా రథం ముగులు వేసే సంప్రదాయం ఉంది. దీని వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటి?

స్వప్న కుమారి, టెక్కలి



మకర సంక్రాంతి ఆరోగ్య ప్రదాత, శుభాన్నిచ్చే సూర్యుడిని కొలుస్తారు. ఇళ్ల ముందు వేసే రథం ముగ్గులు.. ఆ సూర్యనారాయణుడి రథానికి ప్రతిరూపంగా భావిస్తారు. అంతేకాదు, ఒక ఇంటి ముందు వేసిన రథం ముగ్గును.. మరో ఇంటి ముందున్న రథం ముగ్గుతో కలుపుతుంటారు కూడా. సూర్యభగవానుడి రథం ఊరూరా, వీధి వీధినా తిరగాలనీ, ప్రత్యక్ష నారాయణుడి వెలుగు రేఖలు ప్రతి ఇంటిపై ప్రసరించాలని ఇలా రథాలను ముగ్గుతో కలుపుతారు. అంతేకాదు మకర సంక్రాంతి నాటి సూర్యశక్తికి సంక్రాంతి పురుషుడు అని పేరు

- మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి

నాగోబా..సంబరం చూడబ్బా!

జనవరి 16 నుంచి నాగోబా జాతర



కేస్లాపూర్.. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలో ఉన్న చిన్న ఊరు. ఏటా పుష్య అమావాస్య వచ్చిందంటే చాలు.. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో ఉంటున్న లక్షల మంది ఆదివాసీలు ఇక్కడికి తరలివస్తారు. తమ ఆరాధ్య దైవం నాగోబాకు ప్రత్యేక పూజలు చేస్తారు. నాగేంద్రుడు నాగోబాగా వెలిశాడని ఆదివాసీలు విశ్వసిస్తారు. ఏటా పుష్య అమావాస్య నుంచి వారం రోజుల పాటు నాగోబా జాతర జరుగుతుంది.



నాగోబా జాతర నిర్వహించే మెస్రం వంశంలోని బోయగోట్టే విభాగానికి చెందిన వాళ్లు మాత్రం నెల రోజులు ముందుగానే కేస్లాపూర్ చేరుకుంటారు. పుష్య మాస పౌర్ణమి నాడు ప్రత్యేక పూజలు చేసి.. గంగాజలం కోసం కాలినడకన బయల్దేరుతారు. దాదాపు 125 కిలోమీటర్లు పాదయాత్ర చేసి.. జన్నారం మండలం కలమడుగు సమీపంలోని హస్తినమడుగులోని జలాన్ని తీసుకొని తిరుగు ప్రయాణం అవుతారు. వస్తూ వస్తూ.. ఇంద్రవెల్లిలోని ఇంద్రాయి ఆలయంలో మొక్కులు చెల్లిస్తారు. అదే రోజు రాత్రి కేస్లాపూర్ శివారులోని మర్రిచెట్టు దగ్గర బస చేస్తారు. ఆ ఏడాది కాలం చేసిన తమ వంశీయుల పేరిట 'తూం' పూజలు చేస్తారు. మరుసటి రోజు ఆదివాసీల సంప్రదాయ వాయిద్యాలైన డోలు, సన్నాయి వాయిస్తూ నాగోబా ఆలయానికి చేరుకుంటారు. వారం రోజుల పాటు జాతర నిర్వహిస్తారు. **బి.లక్ష్మీనరసయ్య,** న్యూస్‌టుడే, ఇంద్రవెల్లి

ఎవరీ నాగోబా?

పూర్వం మెస్రం వంశానికి చెందిన ఏడుగురు అన్నదమ్ములు ఊరు విడిచి 12 ఏళ్ల పాటు పశువుల పాకలో ఉన్నారట. డబ్బు సంపాదించాక కేస్లాపూర్ వెళ్లాలనుకున్నారట. దారిలో మేనమామ ఇంటికి వెళ్లారట. కష్టాల్లో ఉన్నప్పుడు సాయం చేయని తన తండ్రిని చంపడానికే ఆ అన్నదమ్ములు వచ్చారని మేనమామ కుమార్తె ఇంద్రాదేవి భావించిందట. పెద్దపులిగా మారి ఆరుగురు అన్నదమ్ములను చంపేసిందట. చివరి వ్యక్తి మాత్రం నాగేంద్రుడిని వేడుకోవడంతో ఆయన ప్రాణాలతో బయటపడి కేస్లాపూర్ చేరుకున్నాడట. తనను కాపాడిన నాగమయ్యను గ్రామంలో కొలువుదీరాలని వేడుకున్నాడట. అలా 550 ఏళ్ల కిందట నాగోబా వెలిశాడని కథ.

ఈనాడు సినిమా

ఈ ఇద్దరిలో ఎవరు?


రామ్ చరణ్


అను ఇమ్మాన్యుయేల్


కైరా అడ్వాణి

రామ్ చరణ్ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. డి.వి.వి.దానయ్య నిర్మాత. స్క్రిప్టు పనులు దాదాపుగా పూర్తయ్యాయి. వచ్చే నెల 19 నుంచి చిత్రీకరణ మొదలవుతుంది. హైదరాబాద్‌లో పది రోజుల పాటు కీలకమైన సన్నివేశాల్ని తెరకెక్కిస్తారు. ఈ చిత్రంలో కథానాయిక ఎవరన్నది ఇంకా ఖరారు కాలేదు. కైరా అడ్వాణి, అను ఇమ్మానియేల్‌లలో ఒకరిని ఎంచుకునే అవకాశాలున్నాయి. చిత్రబృందం ఇద్దరితోనూ చర్చలు జరుపుతోంది. కాల్షీట్ల సర్దుబాటుని బట్టి కథానాయిక ఎవరన్నది తెలుతుంది. వరుస విజయాలతో బోయపాటి ఫామ్‌లో ఉన్నారు. 'ధృవ'తో చరణ్ కూడా ఓ హిట్టు కొట్టారు. వీరిద్దరి కాంబినేషన్ అనగానే అంచనాలు పెరుగుతున్నాయి. చరణ్‌ని బోయపాటి ఓ సరికొత్త కోణంలో చూపించబోతున్నారని సమాచారం. ప్రస్తుతం మిగిలిన నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక జరుగుతోంది. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడవుతాయి.

శర్వానంద్ 40+


శర్వానంద్

కొత్త తరహా కథల్ని ఎంచుకుంటూ కమర్షియల్‌గానూ విజయాలు అందుకుంటున్న కథానాయకుడు శర్వానంద్. గతేడాది 'శతమానంభవతి', 'మహానుభావుడు' చిత్రాలతో విజయాల్ని అందుకున్నాడు. ఇప్పుడు సుధీర్ వర్మ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రంలో నటిస్తున్నాడు. ఈ చిత్రంలోనూ శర్వా పాత్ర కొత్త కోణంలో సాగుతుందట. ఆయన రెండు పార్శ్వాలున్న పాత్రలో కనిపించబోతున్నారని సమాచారం. కొన్ని సన్నివేశాల్లో 40 ఏళ్లుపైబడిన వాడిలా కనిపించబోతున్నాడని తెలుస్తోంది. ఇందుకోసం ఓ ఫొటో షూట్ కూడా నిర్వహించారు. మరో గెటప్పులో పాతికేళ్ల కుర్రాడిగా కనిపించబోతున్నాడు. మొత్తానికి ఆయన పాత్రలో రెండు ఛాయలు ఉంటాయన్న మాట. ఫిబ్రవరి మొదటివారంలో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లబోతోంది.

గుర్తుపెట్టుకొంటూనే ఒక్కో మెట్టూ ఎక్కా!


సమంత

సమంత... స్టార్ హీరోలతో నటించింది. భారీ బడ్జెట్ చిత్రాల్లోనూ సత్తా చాటింది. బాక్సాఫీసుని ఊపేసిన చిత్రాలు తన ఖాతాలో వేసుకొంది. ఊహించని ఫ్లాప్‌లు ఆమెకు ఎదురొచ్చాయి. వీటిలో వేటికీ ప్రాధాన్యం ఇవ్వలేదు. తన పని తాను చేసుకొని పోయింది. 'నేను పాత్రకు న్యాయం చేస్తాను అనుకున్నారు కాబట్టే భారీ చిత్రాలు నా ముందుకొచ్చాయి. ఇక గెలుపు ఓటములు అంటారా...వాటి గురించి పెద్దగా పట్టించుకోనక్కర్లేదు. వీటన్నింటితో నాకు దక్కిన అనుభవాలు మాత్రం నాకు చాలా కీలకం' అంటోంది సమంత. "ఓ హిట్ వస్తే చుట్టూ వాతావరణం ఎంత సందడిగా ఉంటుందో, ఫ్లాప్ వస్తే అంతే నిరుత్సాహంగా ఉంటుంది. జయాపజయాలు కలిగినప్పుడు చుట్టూ ఉండే వాళ్లు ఎలా ప్రవర్తిస్తుంటారో నాకు కొన్ని చిత్రాల తర్వాత అర్థమైంది. అది నాకో గొప్ప అనుభవం. అప్పటి నుంచి ఎలా మసులుకోవాలో తెలుసుకున్నాను. ఇలా ఒక్కో సంఘటన ఒక్కో అనుభవం. వాటినని గుర్తుపెట్టుకొంటూనే ఒక్కో మెట్టూ ఎక్కాను. భవిష్యత్తులోనూ అంతే" అని చెప్పింది సమంత. ఈ భామ తెలుగులో రంగస్థలం, మహానటి చిత్రాలతో పాటు మరో రెండు తమిళ చిత్రాల్లో నటిస్తోంది.

నచ్చింది..మనసుకి!


సందీప్‌కిషన్, అమైరా దస్తూర్

కథానాయకుడు మహేష్‌బాబు సోదరి మంజుల ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'మనసుకి నచ్చింది'. నటిగా, నిర్మాతగానే తెలిసిన మంజుల తొలిసారి దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. సందీప్‌కిషన్ కథానాయకుడు. అమైరా దస్తూర్, త్రిధా చౌదరి కథానాయికలు. సంజయ్ స్వరూప్, పి.కిరణ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ని మహేష్‌బాబు సామాజిక అనుసంధాన వేదికల ద్వారా విడుదల చేశారు. ఈనెల 26న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. దర్శకనిర్మాతలు మాట్లాడుతూ "మహేష్ విడుదల చేసిన ట్రైలర్‌కి మంచి స్పందన లభిస్తోంది. ఒక రొమాంటిక్ డ్రామా కథతో తెరకెక్కించిన ఈ చిత్రం అందరికీ నచ్చేలా ఉంటుంది. రాధన్ సంగీతం అలరిస్తుంది. త్వరలోనే విడుదలకి ముందస్తు వేడుకని నిర్వహించబోతున్నాం" అన్నారు. ప్రియదర్శి, పునర్నవి భూపాలం, నాజర్, అరుణ్ అదిత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: రవి యాదవ్, మాటలు: సాయిమాధవ్ బుర్రా, కళ: హరివర్మ.

'కేసరి'కి జోడీగా పరిణీతి



అక్షయ్ కుమార్‌కు జోడీగా ఎవరు బాగుంటారు? కత్రినా కైఫా లేక పరిణీతి చోప్రానా? అంటూ కొద్ది రోజులుగా కరణ్ జోహార్ మల్లగుల్లాలు పడుతున్నాడు. అక్షయ్ కథానాయకుడిగా 'కేసరి' అనే చిత్రాన్ని నిర్మిస్తున్నాడు కరణ్. 1897లో జరిగిన సారాగ్రాహి యుద్ధం నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌లో తల పాగా, పొడవు గడ్డంతో ఉన్న అక్షయ్ గెటప్‌కు మంచి స్పందన వస్తోంది. అనురాగ్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అక్షయ్‌కు జోడీగా నటించే కథానాయిక కోసం కొద్దికాలంగా అన్వేషణ జరుగుతోంది. ప్రధానంగా కత్రినా కైఫ్, పరిణీతి చోప్రాల పేర్లు వినిపించాయి. ఇప్పటికే అక్షయ్‌తో కలసి హిట్ చిత్రాల్లో నటించింది కత్రినా. వారిద్దరి మధ్య కెమిస్ట్రీ బాగుంటుందని కూడా పేరొచ్చింది. అందుకే కత్రినా పేరే ఖరారవుతుందనుకున్నారు. కానీ అనూహ్యంగా పరిణీతిని ఎంపిక చేసింది చిత్రబృందం. ఈ విషయాన్ని కరణ్ ధ్రువీకరించారు. మరి తొలిసారి కలసి నటించబోతున్న అక్షయ్, పరిణీతి జోడీ ఎలా ఉంటుందో చూడాలి. ఇదిలా ఉంటే అక్షయ్ నటిస్తున్న 'ప్యాడ్‌మ్యాన్' ఈనెల 25న విడుదలవుతోంది.

అంతరిక్షంలో... టిక్ టిక్


జయం రవి, నివేదా

జయం రవి, నివేదా పేతురాజ్ జంటగా నటించిన చిత్రం 'టిక్ టిక్ టిక్'. శక్తి సౌందర్ రాజన్ దర్శకత్వం వహించారు. శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలింస్ పతాకంపై చదలవాడ పద్మావతి నిర్మిస్తున్నారు. లక్ష్మణ్ విడుదల చేస్తున్నారు. అంతరిక్షం నేపథ్యంలో తెరకెక్కిన తొలి భారతీయ చిత్రమిది. త్వరలోనే తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేస్తున్నారు. ఇటీవల టీజర్‌ని యువ కథానాయకుడు అడవి శేష్ విడుదల చేశారు. 'ఐక్యరాజ్యసమితి ప్రపంచశాంతి కోసం...ఏ దేశం కూడా 20 కిలో టన్నులకి మించి న్యూక్లియర్ వెపన్‌ని తయారు చేయకూడదని ఒప్పందం కుదుర్చుకుంది. కానీ ప్రపంచంలోని ఏ మూలనున్నా ఏ దేశం మీదనైనా దాడి చేయగలిగే చోట 200 కిలో టన్ మిస్సైల్ ఉంది...' అంటూ సాగే టీజర్, అందులోని సన్నివేశాలు ఆకట్టుకొనేలా ఉన్నాయి. అడవి శేష్ మాట్లాడుతూ "నాకు ఇష్టమైన కథానాయకుడు జయం రవి నటించిన చిత్రమిది. టీజర్ హాలీవుడ్ చిత్రం 'గ్రావిటీ'ని గుర్తుకు తెస్తోంది. భారతీయ పరిశ్రమలో ఇలాంటి ఓ సినిమా రూపొందడం గొప్ప విషయం" అన్నారు. లక్ష్మణ్ మాట్లాడుతూ "మా సంస్థ నుంచి 'బిచ్చగాడు', '16' చిత్రాల తర్వాత ప్రేక్షకుల ముందుకొస్తున్న మరో విభిన్నమైన చిత్రమిది. ఇటీవలే విడుదలైన మోషన్ పోస్టర్‌కీ, టీజర్‌కి మంచి స్పందన లభిస్తోంది. సాంకేతికంగానే కాకుండా, భావోద్వేగాల పరంగా కూడా ఆకట్టుకుంటుంది. అంతరిక్ష నేపథ్యంతో కూడిన తొలి భారతీయ సినిమాని తెలుగులో అందిస్తున్నందుకు ఆనందంగా ఉంది. తెలుగు ప్రేక్షకులకు పరిచయమున్న జయం రవి, నివేదా నటించిన ఈ చిత్రం ఓ కొత్త అనుభూతిని పంచుతుంది" అన్నారు.

మహిళా దర్శకుల్ని నమ్మితే విజయాలొస్తాయి


బి.జయ

"చిత్రసీమలోకి మరింతమంది మహిళా దర్శకులు రావాలి. వాళ్లొస్తే మరిన్ని మంచి కథలొస్తాయి. కానీ నిర్మాతలు, కథానాయకులు మహిళలపై నమ్మకం ఉంచాలి. అప్పుడే మంచి విజయాలొస్తాయి" అన్నారు బి.జయ. 'చంటిగాడు', 'లవ్‌లీ', 'వైశాఖం'... ఇలా ఇంటిల్లిపాదీ చూసే కథల్ని తెరకెక్కిస్తున్నారామె. గురువారం ఆమె జన్మదినం. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో పాత్రికేయులతో మాట్లాడారు జయ.

- "లక్కీ ఫెలో అనే ఓ కథ సిద్ధం చేస్తున్నాను. జూన్‌లో చిత్రీకరణ మొదలెడతాం. ఓ యువ కథానాయకుడు నటిస్తారు. కథానాయిక పాత్రకీ ప్రాధాన్యం ఉంటుంది. కొంతమందిని వద్దన్నా అదృష్టం తరుముతుంటుంది. అలాంటి ఓ అదృష్టవంతుడి కథ ఇది. వాటి చుట్టూ సాగే పరిణామాలు వినోదాన్ని పంచుతాయి. మూడు నెలల్లో చిత్రీకరణ పూర్తి చేస్తాం"
- "నాకు స్వతహాగా వినోదాత్మక చిత్రాలంటే ఇష్టం. నా కథలూ అలానే ఉండాలనుకుంటాను. సందేశాన్ని బలవంతంగా రుద్దినట్టు ఉండకూడదు. మహిళా సమస్యలపై, వాళ్ల జీవితాలపై సినిమాలు తీయాలని ఉంటుంది. అయితే దానికి సరిపడా నటీనటులు కావాలి. ఓ ప్రయోజనాత్మక చిత్రం ఆర్థికంగానూ నిలబడాలి. స్టార్లు ఉంటేనే అది సాధ్యం అవుతుంది. 'వైశాఖం'లో అపార్ట్‌మెంట్ సంస్కృతి గురించి చెప్పాం. ఆ అంశం అందరికీ నచ్చింది. ఎక్కడకు వెళ్లినా ఆ కథని, అందులోని సన్నివేశాల్ని గుర్తుకు తెస్తున్నారు. ఓ దర్శకురాలిగా అదెంతో సంతృప్తినిస్తోంది"
- "దర్శకురాలిగా నాదంటూ ఓ శైలి సృష్టించుకోవాలి. ఆత్మ సంతృప్తినిచ్చేలా ఓ మంచి సినిమా తెరకెక్కించాలి. అదే నా ఆశయం. సమాజసేవపైనా దృష్టి మళ్లుతోంది. అంటే రాజకీయాల్లోకి వస్తానని కాదు. అటువైపుకు వెళ్లకుండానే సమాజానికి మనవంతు సాయం చేయొచ్చు. నేనేం చేయగలనో నాకు తెలుసు. త్వరలోనే నేను ఎంచుకున్న మార్గంలో నావంతు సహాయం చేస్తా"

అనుష్కది కల్పిత పాత్రే!

సంజయ్‌దత్ జీవిత కథను సాధ్యమైనంత వాస్తవానికి దగ్గరగా తెరకెక్కించే ప్రయత్నాల్లో ఉన్నారు దర్శకుడు రాజ్‌కుమార్ హిరాణీ. సంజయ్ జీవితంలో చాలా వివాదాలు ఉన్నాయి. వాటి చుట్టూ ఎంతోమంది వ్యక్తులు ఉన్నారు. ఆ పాత్రలన్నింటినీ తెరపై చూపించేలాగే హిరాణీ స్క్రిప్టు ఉంది. ఇందులో సంజయ్‌గా రణ్‌బీర్ కపూర్ నటిస్తున్నాడు. ఇందులో 'పీకే' భామ అనుష్కశర్మ కూడా నటిస్తుంది. సంజయ్ జీవితంలోని ఏ వ్యక్తి పాత్రలో అనుష్క కనిపించబోతుందో అంటూ ఊహాగానాలు మొదలయ్యాయి. కానీ ఇందులో అనుష్కది నిజ జీవిత పాత్ర కాదట. కేవలం కల్పితమైన పాత్రే అని సమాచారం. "తోటి కథానాయికలందరూ అతిథి పాత్రల్లో మెరిసినా అనుష్క మాత్రం ఇప్పటివరకు గెస్ట్‌రోల్స్ చేయలేదు. హిరాణీతో ఉన్న అనుబంధం కారణంగా ఆయన అడిగిన వెంటనే ఇందులో నటించడానికి ఒప్పుకొంది. పాత్రలో అనుష్క ఎలా లీనమైపోతుందో హిరాణీసార్‌కు కూడా తెలుసు కాబట్టే ఈ బయెపిక్‌లో ఆమెకు కీలక పాత్ర ఇచ్చారు. ఆ పాత్ర మాత్రం కల్పితమే. భోపాల్, న్యూయార్క్‌ల్లో అనుష్కకు సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరించారట. అందుకోసం తన వ్యక్తిగత పనుల్ని కూడా ఆమె వాయిదా వేసుకొన్నారు. తన చిత్రంలో అనుష్క నటించడంతో రాజు హిరాణీ చాలా సంతోషంగా ఉన్నారు" అని హిరాణీ సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రంలో దియా మీర్జా, మనీషా కొయిరాలా, సోనమ్ కపూర్ తదితరులు కూడా కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



'పరి'లో అనుష్కశర్మ



భయపెట్టేస్తోంది!

పెళ్లి తర్వాత అనుష్కశర్మ వెండితెరపై కనిపించబోతున్న చిత్రం 'పరి'. ఇప్పటివరకూ చూడని పాత్రలో కొత్తగా కనిపించబోతుంది అనుష్క. ఈ సినిమాకు సంబంధించి గత ఏడాది విడుదలైన ఫస్ట్‌లుక్ చూసి అనుష్కేనా ఇలా ఉంది? అనుకున్నారు. తాజాగా విడుదలైన మోషన్ పోస్టర్‌లో అనుష్కను చూస్తుంటే భయపెట్టేలానే ఉంది. మొదట్లో ఇది సైకలాజికల్ థ్రిల్లర్ అన్నారు. కానీ మోషన్ పోస్టర్ చూస్తుంటే ఇదొక హారర్ చిత్రంలానే కనిపిస్తుంది. ప్రోసిత్ రాయ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని హోలీ కానుకగా మార్చి 2న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

గీతోపదేశం

మరుప్రాణి ప్రాణం తీసి
బ్రతికేది మృగమేరా
మరుప్రాణి ప్రాణం తీసి
నవ్వేది అసురుడురా
కీడే చేయని వాడే మనిషి
మేలునే కోరువాడు మహర్షి
గీతం: జీవితమంటే పోరాటం...

చిత్రం: నరసింహ
రచన: శివగణేష్
- పంపినవారు: నస్కంటి నాగభూషణం, మహబూబ్‌నగర్

మీకు నచ్చిన సినిమా పంచ్ డైలాగ్‌లు, పాటల్లోని సందేశాలను మాకు రాసి పంపించండి. వాటిని మీ పేరుతో ప్రచురిస్తాం!
చిరునామా: సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ 501512
మెయిల్ ఐడీ: cinema@eenadu.net

17 ఏళ్ల తర్వాత మళ్లీ జంటగా...


అనిల్ కపూర్ - మాధురీ దీక్షిత్ 90వ దశకంలో బాలీవుడ్‌ను ఓ ఊపు ఊపేసిన జంట. చివరిసారిగా వారు 2000లో వచ్చిన 'పుకార్'లో కలసి నటించారు. 17 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ ఇప్పుడు వారు తెరను పంచుకోనున్నారు. వారికి అజయ్ దేవగణ్, రితేష్ దేశ్‌ముఖ్ కూడా తోడయ్యారు. అంతా కలసి తెరపై 'ధమాల్' చేసి వినోదాలు పంచబోతున్నారు. గతంలో విజయవంతమైన హాస్య చిత్రాలు 'ధమాల్', 'డబుల్ ధమాల్' సిరీస్‌లో మూడో చిత్రంగా 'టోటల్ ధమాల్' తెరకెక్కనుంది. గత రెండు చిత్రాల దర్శకుడైన ఇంద్రకుమార్ దీన్ని తెరకెక్కిస్తున్నారు. అజయ్ దేవగణ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ఆమీర్ ఖాన్ చేతుల మీదుగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఆమీర్‌ఖాన్ క్లాప్‌నిచ్చారు. బొమన్ ఇరానీ, అర్షద్ వార్సీ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని డిసెంబరు 7న విడుదల చేస్తారు.


క్లాప్‌నిస్తోన్న ఆమీర్‌ఖాన్. చిత్రంలో అనిల్ కపూర్, అజయ్‌దేవ్‌గణ్, మాధురీ దీక్షిత్ తదితరులు

రంగవల్లిక

మూడువైపులా ముగ్గు వేసి ఒకవైపు మాత్రం వదిలేయడం మర్చిపోవద్దు.

12 చుక్కలు
12 వరుసలు






శాంతి
హైదరాబాద్

ఇంటి ముంగిట రంగవల్లికలను తీర్చిదిద్దే మీకిదే మా ఆహ్వానం. పెన్నూ, పెన్సిల్‌తో చక్కగా వేసిన ముగ్గులను పంపండి. ముగ్గు, చుక్కల వివరాలతో పాటూ మీ ఫొటో, చిరునామా జతచేయాలి. ముగ్గుల్లో రంగులు నింపాల్సిన పని లేదు.

18 చుక్కలు
8 వరుసలు
8 వచ్చేవరకూ





టి. కవిత
మహబూబ్‌నగర్

మా చిరునామా:
వసుంధర,
ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలిం సిటీ,
హైదరాబాద్. - 501 512.
email: vasundhara@eenadu.net

నజరానా



కడుపు ఉబ్బరంగా ఉండి, పుల్లటి తేన్పులు వస్తుంటే... కప్పు నీళ్లలో చెంచా నిమ్మరసం, అరచెంచా వంటసోడాను కలిపి తాగండి. తక్షణం ఉపశమనం కలుగుతుంది.

దేవి బుర్రనిండా ఐడియాలే





అవేవీ మామూలు ఐడియాలు కాదు.. రాష్ట్రపతి నుంచి అవార్డులు అందుకున్నవి! ముఖ్యమంత్రీ, కలెక్టరూ ప్రశంసించినవి. మనం ఎదుర్కొనే రోజువారి ఇబ్బందులకి సంబంధించినవి. ఐఐటీలూ, ఐఐఎం పరిశోధకులకు దీటుగా ప్రభుత్వ బడిలో చదువుకుంటున్న పదోతరగతి అమ్మాయి కనిపెట్టినవి. అన్నింటికన్నా.. ఇవన్నీ బడుగు జీవుల కష్టాల నుంచి పుట్టినవి! తూర్పుగోదావరి జిల్లాకు చెందిన మైదారి దేవికి ఇన్ని ఐడియాలు ఎలా వచ్చాయో చూద్దామా?

ఏడాదిన్నర కిందటి మాట. రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండుకు దగ్గరలో ఉన్న ప్రభుత్వ బాలికల పాఠశాల. ఓ రోజు అక్కడికో బృందం వచ్చింది. ముందువాళ్లు అక్కడి ఉపాధ్యాయులతో మాట్లాడారు. తర్వాత ఆ పిల్లల తరగతి గదికొచ్చారు. 'హాయ్..! మీకో చిన్న పరీక్ష పెట్టబోతున్నాం. అరగంట సమయమిస్తాం. మీ చుట్టూ రోజూ ఎన్నో సమస్యలు చూస్తుంటారు కదా..! మీరే ఓ సైంటిస్టు అయితే ఎలాంటి పరిష్కారాలు కనిపెడతారో రాయండి!' అని చెప్పారు. తెల్లకాగితాలు ఇచ్చారు. అలా ఓ కాగితం దేవికి కూడా వచ్చింది. దాన్ని తీసుకున్న దేవి మెదడులో ఎన్నో సమస్యలు మెదిలాయి. గ్రామంలో పగలంతా విద్యుత్తు కోతా, పేరుకుపోతున్న చెత్తా, మొన్న ఇళ్లపనికి వెళ్లిన అమ్మ ఇంటికి కోపంగా రావడం..! ఆc అమ్మ ఎందుకు కోపంగా వస్తోంది? 'ఛీ.. వీళ్లకెంత గొడ్డుచాకిరీ చేసినా ఏదో ఒకటి అంటూనే ఉంటారు..!' అని ఎందుకు రుసరుసలాడుతోంది? ఓ రోజు తానే అమ్మని అడిగింది.. 'ఏమైందేమిటే?' అని. 'ఆళ్లింట్లో నేను అంట్లు ఎంతబాగా తోమినా శుభ్రంగా లేవంటున్నారే! కంటికి కనిపించని పురుగులుంటాయట..! కంటికి కనిపించకపోతే నేనెలా శుభ్రం చేసేదే!' అంది. అమ్మ మాటలు ఆ రోజు అలా గుర్తుకురాగానే.. తాను పరిష్కారం ఆలోచించాల్సిన సమస్యేమిటో అర్థమైంది దేవికి. మరో ఐదు నిమిషాల్లో ఆ పరిష్కారం కూడా వచ్చేసింది. దాన్ని రాయడం మొదలుపెట్టింది...

ఇంతకీ ఏమా బృందం?

దేవి ఏం పరిష్కారం రాసిందో తెలుసుకోవడానికి ముందు.. అసలు ఆ రోజు వాళ్ల బడికి వచ్చిన బృందం గురించి చూద్దాం. అందులోని సభ్యులంతా 'పల్లె సృజన' అనే సంస్థకి చెందినవారు.

కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్‌కి అనుబంధంగా తెలుగు రాష్ట్రాల్లో ఇది పనిచేస్తుంది. మన సమాజంలోని ఎన్నో సమస్యలపై ఐఐటీ, ఐఐఎంలలో తలపండిన ప్రొఫెసర్‌లూ, విద్యార్థులు పరిష్కారాల కోసం వెతుకుతుంటారని మనం వినే ఉంటాం! 'పరిష్కారాలు వాళ్ల దగ్గరే కాదు. సామాన్యుల బుర్రల్లోనూ ఉంటాయి!' అనే ఆలోచనతో పనిచేస్తుందీ 'పల్లె సృజన'. అలాంటి ఆలోచనల్ని వెతికేందుకోసం పల్లెపల్లెకూ వెళుతుంది. అక్కడి సామాన్యులు కనిపెట్టిన ఆవిష్కరణలని పసిగట్టి ప్రోత్సహిస్తుంది. కేంద్రప్రభుత్వం నుంచి అవార్డులు అందిస్తుంది. పేటెంట్ కూడా ఇప్పిస్తుంది! ఇందులో భాగంగానే అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా బడిపిల్లల కోసం 'కొత్త ఆలోచనలు' పేరుతో పోటీపెట్టింది. అందుకోసమే వాళ్ల పాఠశాలకి వచ్చి.. దేవి చేతికి తెల్లకాగితం ఇచ్చింది.

దేవి రాసిన పరిష్కారం..

'అంట్లు తోమాక అది పూర్తిగా శుభ్రపడిందా? లేదా? అందులో కంటికి తెలియని సూక్ష్మక్రిములున్నాయా లేవా..? ఈ విషయాన్ని చెప్పే యంత్రం ఒకటి కనిపెట్టాలి. కడిగిన పళ్లాల్ని దానిపై ఉంచగానే అందులో సూక్ష్మక్రిములు వంటివేవీ లేకపోతే పచ్చ లైటు వెలుగుతుంది. బ్యాక్టీరియా, ఫంగస్ వంటివి ఉంటే ఎర్రలైటు వెలుగుతుంది. అప్పుడు దాన్ని మళ్లీ కడగొచ్చు. ఇది ఎంతోమంది స్త్రీలకి ఉపయోగపడుతుంది. ముఖ్యంగా అంట్లుతోముతూ సంసారం ఈదుతున్న మా అమ్మలాంటివాళ్లకి..!' - దేవి ఆరోజు తనకిచ్చిన తెల్లకాగితంపై ఇంచుమించు ఇదే రాసింది. తొమ్మిదో తరగతే(ఏడాదికిందట) చదువుతున్న ఆ అమ్మాయిలోని ఈ కొత్త ఆలోచన పల్లెసృజన బృందాన్ని అబ్బురపరిచింది. వాళ్లే కాదు.. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సభ్యులు కూడా ఆ అమ్మాయి సృజనకి మెచ్చి అబ్దుల్ కలాం పేరుతో నెలకొల్పిన 'ఇగ్నైట్' అవార్డుకి ఎంపికచేశారు. అంతేకాదు.. దేవి ఆలోచనకి పేటెంట్ కోసం కూడా దరఖాస్తు చేశారు. 2016 నవంబర్‌లో నాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా కన్నీటితో ఆ అవార్డు అందుకుంది దేవి. ఎందుకా కన్నీరు?

మూడునెలల ముందే..

దేవీవాళ్లది తూర్పుగోదావరి జిల్లా దండేపల్లి మండలంలోని గోపాలపురం గ్రామం. తల్లిదండ్రులిద్దరూ వ్యవసాయ కూలీలే. అయితేనేం? దేవిని బాగా చదివించాలనుకున్నారు. దేవిని రాజమహేంద్రిలోని బాలికల వసతి గృహంలో ఉంచారు. ఆమెకు కావల్సిన ఖర్చుల కోసం తండ్రి ఇతరత్రా వృత్తులూ చేసేవారు. ఆమె తల్లి అదనంగా అంట్లు కూడా తోమేది. అక్కడ ఆమెకి ఎదురైన సమస్యకే దేవి ఈ పరిష్కారం కనిపెట్టింది. కాకపోతే, ఆమె రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకోవడానికి మూడునెలలకి ముందే తండ్రి చనిపోయాడు. ఏం చేయదులే అనుకున్న అనారోగ్యమే ఆయన ప్రాణం తీసింది. ఆ కన్నీటిని దాచుకున్న దేవి, ఆరోజు రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకుంది. అంతేకాదు.. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ నిర్వాహకులు అప్పటికప్పుడు నిర్వహించిన ఓ వినూత్న పోటీకీ దీటుగా స్పందించింది. ఏమిటా పోటీ అంటారా? దేవినీ, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులనీ దేశ రాజధానిలో ఉన్న మురికివాడలకి తీసుకెళ్లారు. ఈసారి అక్కడున్న సమస్యలకి అప్పటికప్పుడు పరిష్కారం చెప్పమన్నారు. ఈసారి పావుగంట సమయం మాత్రమే ఇచ్చారు.

ముఖ్యమంత్రీ ప్రశంసించారు..

మురికివాడల్లోని ప్రధాన సమస్య.. సిబ్బంది చెత్తని సరిగ్గా వేరు చేయకపోవడం. వేరుచేయని ఆ చెత్త డ్రైనేజీ కాలువల్లో పడిపోతాయి. దాంతో మురుగు పేరుకుపోయి సమస్యని మరింత అధ్వాన్నంగా మారుస్తుంది. అలాంటి చోట చెత్త తీయడం మరింత ఇబ్బంది. దీనికి పరిష్కారంగానే తడిచెత్తని పొడిచెత్తని తనంతట తానే వేరుచేసే ఓ చక్రాలబండి లాంటి దాన్ని ఉపయోగించవచ్చనే కొత్త ఆలోచన చెప్పింది దేవి. ఆ బండి అడుగున ఓ వైపు మాగ్నెట్ ఏర్పాటుచేస్తే.. ఇనుప వస్తువులన్నీ ఓ చోట ఉండిపోతాయని చెప్పింది. ఒడిశాకి చెందిన శుభ్రా సుచిమితా పటేల్ అనే అమ్మాయి.. ఇలాంటి ఆలోచననే చెప్పింది. కాకపోతే ఇతర ప్లాస్టిక్ వస్తువులని వేరుచేయడమెలాగో వివరించింది. 'ఇన్నోవేషన్' ఫౌండేషన్‌వాళ్లు ఈ ఇద్దరి ఆలోచనల్ని ఒకటి చేసి చూస్తే.. ఇంకేముంది? పొడిచెత్తని పూర్తిగా వేరుచేసే వాహనాన్ని రెడీ చేయొచ్చని తేలిపోయింది. కాబట్టి 2017కి గాను ఇగ్నైట్ అవార్డుని దేవికీ, శుభ్రాకీ కలిపే అందించారు. గత డిసెంబర్ 22న గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో అవార్డు ప్రదానం చేశారు. అంతేకాదండోయ్.. ఈసారి అహ్మదాబాద్ నగరంలోని కొన్ని మురికివాడలకి తీసుకెళ్లి మళ్లీ వేరే పరిష్కారాలు చెప్పమన్నారట. దేవి ఏ మాత్రం ఆలస్యం చేయకుండా చకచకా చెప్పే వచ్చింది. దాని ఫలితమేంటో తొందరలోనే తెలుస్తుంది.

ఇగ్నైట్ అవార్డు అందుకున్నందుగ్గాను చంద్రబాబునాయుడు నామవరంలో జరిగిన కార్యక్రమంలో ఈ అమ్మాయిని ప్రత్యేకంగా అభినందించారు.

- **వై. సూర్యకుమారి,** న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం

ఆ దుస్తులే కారణం కాదు!



ఓ చోట బస్సులో 24 ఏళ్ల యువతి అత్యాచారానికి గురైంది. కొందరు 'ఆమె వస్త్రధారణే దీనికి కారణం' అన్నారు. మరోచోట 30 ఏళ్ల మహిళపై నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు అత్యాచారం చేశారు. దీనికీ 'ఆమె వస్త్రధారణే కారణం' అన్నారు. ఇంకోచోట బడికి వెళ్తున్న తొమ్మిదేళ్ల విద్యార్థిపై... మరి దీన్ని ఏమంటారు. ఇదే సమాధానం చెప్తారా? ప్రతిరోజూ దేశంలో ఏదోక చోట ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉంటున్నాయి.. దీనిపై తరచూ ఇలాంటి విమర్శలు వినిపించడం సర్వసాధారణమైపోయింది. నిజానికిక్కడ పొట్టి దుస్తులూ, షార్ట్‌స్కర్ట్స్, బురఖా, స్కూల్ యూనీఫాంలు ఏం ధరిస్తున్నారన్నది సమస్య కాదు. అసలు అత్యాచారానికీ, లైంగిక వేధింపులకు గురికావడానికీ వారు ధరించిన దుస్తులకు ఎలాంటి సంబంధంలేదన్నది వాస్తవం. ఇలా కొద్దిమంది మాత్రమే ఆలోచిస్తారు. ప్రస్తుతం ఈ నిజాన్ని అందరికీ తెలియజేయడానికి బెంగళూరుకు చెందిన సామాజిక కార్యకర్త జాస్మిన్ పతేజా నడుంబిగించింది. అత్యాచార, లైంగిక వేధింపుకలకు గురైన బాధితుల నుంచి దుస్తులు సేకరించి వాటితో తన ఇంట్లో ప్రత్యేకంగా చిన్నపాటి మ్యూజియంనే ఏర్పాటు చేసి అవగాహనా కార్యక్రమాలు చేపడుతోంది.

'నేనెప్పుడూ అడగలేదు...'

కోల్‌కతా నుంచి చదువు కోసం బెంగళూరుకు వచ్చిన జాస్మిన్ పతేజా.. గత పదిహేనేళ్ల నుంచి మహిళలపై జరుగుతున్న అత్యాచారాలూ, లైంగికదాడులకు వ్యతిరేకంగా పోరాడుతోంది. ఈ నేపథ్యంలోనే 'ఐ నెవర్ ఆస్క్ ఫర్ ఇట్' పేరుతో తన ఇంట్లోనే చిన్న మ్యూజియంని ఏర్పాటు చేసింది. ఆ గదిలోకి వెళ్లగానే వందల్లో దుస్తులు కనిపిస్తాయి. అందులో పొడవాటి కుర్తాలూ, సూట్‌లూ, షర్టులు, యూనిఫాంలూ.. ఇలా చాలానే ఉంటాయి. అవేమీ ఫ్యాషన్ దుస్తులూ, పొట్టివస్త్రాలు కావు. కానీ అవన్నీ అత్యాచారానికీ, లైంగిక వేధింపులకు గురైన రోజు బాధితులు వేసుకున్నవి.



దీని ద్వారా జాస్మిన్ అందరికీ అత్యాచారానికి వస్త్రధారణ కారణం కాదని స్పష్టం చేస్తోంది. అంతేకాదు ఆరోజు ఏం జరిగిందీ? ఎక్కడ జరిగింది? ఏ సమయంలో? అప్పుడు వారు ధరించిన వస్త్రాలేమిటీ? వంటి వివరాలను సేకరించి ఆ దుస్తుల అడుగున రాస్తుంది. తన ప్రాజెక్టు ద్వారా సమాజంలో అవమాన భారంతో గడిపే బాధిత మహిళలను వెలుగులోకి తెచ్చి.. వారికి జరిగిన అన్యాయంపై ధైర్యంగా మాట్లాడించే ప్రయత్నం కూడా చేస్తోంది.

బంగారం-వెండి



10న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	30,570	30,550	30,460	30,460
ఆర్నమెంట్	28,550	28,500	28,300	28,300
వెండి (కిలో)	39,790	39,800	40,200	40,200
	ప్రొద్దుటూరు		**రాజమండ్రి**	
బంగారం(24క్యా)	30,350	30,350	30,220	-------
ఆర్నమెంట్	28,130	28,160	28,260	-------
వెండి (కిలో)	39,600	40,000	39,200	-------
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	30,260	30,380	-------	-------
ఆర్నమెంట్	28,140	28,250	2,826 గ్రా	2,821 గ్రా
వెండి (కిలో)	39,900	39,900	41.80 గ్రా	41.80 గ్రా

కొబ్బరినూనె ఉందిగా

మనింట్లో ఎప్పుడూ అందుబాటులో ఉండే వస్తువుల్లో కొబ్బరినూనె కూడా ఒకటి. దాంట్లో ఉండే ఆయుర్వేద గుణాలు జుట్టూ, చర్మ సౌందర్యానికి మేలు చేస్తాయి. సౌందర్య ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా దీన్ని వాడి చూడండి.

- బాడీలోషన్ అయిపోతే స్నానం అయ్యాక కొబ్బరినూనె రాసుకొని చూడండి. అది మాయిశ్చరైజర్‌లా పనిచేస్తుంది. కాస్త జిడ్డుగా అనిపించినా తర్వాత అది చర్మంలోకి ఇంకిపోయి ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఇది రాసుకోవడం వల్ల చర్మం తాజాగా ఉంటుంది.
- కొన్ని సార్లు కళ్లకు రాసుకున్న కాటుకా, ఐలైనర్ ఒక పట్టాన వదలవు అలాంటప్పుడు దూది ఉండను కొబ్బరినూనెలో ముంచి కళ్లపై అద్ది చూడండి. ఆ తర్వాత చల్లని నీటితో ముఖం కడుక్కుంటే సరిపోతుంది.
- ఇది పెదాలకు కావల్సిన తేమను అందిస్తుంది. లిప్‌బామ్‌కు బదులు కాస్త కొబ్బరి నూనె రాసుకుంటే పెదాలు పొడిబారడం తగ్గుతుంది.
- కొబ్బరినూనె, తేనెను సమపాళ్లలో తీసుకుని ముఖానికి పూతలా వేసుకోవాలి. పది నిమిషాలయ్యాక గోరువెచ్చని నీటితో కడిగేయండి. దీని వల్ల ముఖంలో కొత్త మెరుపు వస్తుంది. కొబ్బరి నూనెలో ఉండే విటమిన్-ఇ వల్ల చర్మం మృదువుగా కూడా మారుతుంది.



ఇంటిగాలి... ఇలా తాజాగా!

మనం ప్రతిరోజూ బయట వాతావరణంలో పీల్చే ప్రమాదకరమైన గాలితో పోలిస్తే ఇంట్లోనే ఎక్కువ వాయు కాలుష్యం ఉందంటున్నాయి కొన్ని పరిశోధనలు. ఇవే కాదు... మనం రోజూ వాడే షాంపూలూ, షేవింగ్ క్రీమ్‌లూ, సిగరెట్‌లూ, దోమల నివారణకు వాడే స్ప్రేలూ, కాయిల్స్, గ్యాస్ స్టవ్ మొదలైన వాటి ద్వారా కూడా ఇంటిగాలి కలుషితమవుతుందట. ఈ సమస్యను కింది మార్గాల ద్వారా తగ్గించుకోవచ్చు.


- ఇంట్లో వాయుకాలుష్యం పెరగడానికి ఇంటి వెంటిలేషన్ ప్రధాన కారణం. గాలీ, వెలుతురూ వచ్చే విధంగా ఇళ్లలో వెంటిలేషన్ ఉండేలా చూసుకోవాలి. దీంతోపాటు వంటగదీ, పూజగదుల్లోని వాయువులను బయటకు పంపేందుకు వీలుగా ఎగ్జాస్ట్ ఫ్యాన్లను ఏర్పాటు చేసుకోవాలి. అలాగే ఎప్పటిప్పుడు కిటికీలు తెరవాలి.
- ఇంట్లో కాలుష్యాన్ని పెంచే పారాఫిన్ కొవ్వొత్తులను వెలిగించకపోవడమే మంచిది. బదులుగా ప్రకృతి సిద్ధంగా తయారుచేసిన బీస్‌వ్యాక్స్ కొవ్వొత్తులను ఉపయోగించి చూడండి. వీటిని తేనెతుట్టెల నుంచి సేకరించిన మైనంతో తయారుచేయడం వల్ల కాలుష్యం తక్కువ.



- సాల్ట్ క్రిస్టల్‌తో తయారైన సాల్ట్ ల్యాంప్‌లు సైతం పరిశుభ్రమైన గాలిని అందిస్తాయి. ఇవి ఇంట్లో గాలిలో ఉన్న తేమ శాతాన్ని తగ్గించి వాయుకాలుష్యాన్నీ నివారిస్తాయి.
- బొగ్గుకు గాలిని శుభ్రపరిచే గుణం ఉంది. దీన్ని ఇంటి పరిసర ప్రాంతాల్లో ఉంచుకోవడం ద్వారా ఆ కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చు.
- గాలిశుద్ధి కోసం ఇంట్లో చిన్నచిన్న మొక్కలను పెంచవచ్చు. మితమైన సూర్యకాంతిని తీసుకునే లేడీ పామ్, బ్రాడ్లిఫ్ లేడీ పామ్, పీస్ లిల్లీ, కలబంద వంటి వివిధ రకాల మొక్కలు ఇందుకు అనుకూలంగా ఉంటాయి.


పూసలు పెట్టేయండి





జుట్టు అలంకరణ కోసం కొత్త పద్ధతి వెతుకుతున్నారా? అయితే ఈ హెయిర్ బీడ్స్ వాడి చూడండి. వీటిని ఉపయోగించి చాలా సులువుగా విభిన్న రకాలుగా కేశాలంకరణ చేసుకోవచ్చు. అవి చూడటానికి ప్రత్యేకంగానూ కనిపిస్తాయి. ఇవి రెండు రకాలుగా అందుబాటులో ఉన్నాయి. కొన్నేమో మామూలుగా జుట్టుకు తొడిగేలా ఉంటాయి. మరికొన్నింటికి చిన్న చీలిక లాగా ఉంటుంది. వాటిని జుట్టు పట్టి ఉంచేలా అవసరమైనంత వరకూ నొక్కేస్తే సరిపోతుంది.







నేషనల్ పూల్‌లో తెలుగు రాష్ట్రాలు కలవడం వల్ల 'నీట్' ద్వారా తేలిగ్గా మెడికల్ సీట్లు వచ్చేస్తాయనీ, సన్నద్ధతకు అంతగా కష్టపడాల్సిన అవసరం లేదనీ.. ఇలాంటి అపోహలు వ్యాపిస్తున్నాయి. వీటిని విశ్వసించి, అశ్రద్ధ చూపితే విద్యార్థులకు నష్టదాయకమవుతుంది. జాతీయస్థాయి పోటీని తక్కువ అంచనా వేయకూడదు. ప్రతిభాస్థాయిని పెంచుకోవాల్సిందే. మారిన పరిస్థితుల్లో మెడికల్ సీటు సాధించటానికి ఏ దిశలో 'నీట్'కు తయారవ్వాలో తెలిపే విశ్లేషణ ఇది!



స్థాయి పెంచుకుంటేనే నీట్ సీటు!



పి.వి.ఆర్.కె. మూర్తి
చైర్మన్, శ్రీ గాయత్రి విద్యాసంస్థలు

మెడికల్ లేదా డెంటల్ కళాశాలల్లో సీటు సాధించాలనుకునే విద్యార్థులకు ఇప్పుడు మూడే పరీక్షలు మిగిలాయి. అవి నీట్-యూజీ, ఎయిమ్స్, జిప్‌మర్. వీటిలో అధిక సంఖ్యలో లేదా 98 శాతం వరకు విద్యార్థులు నీట్ రాయాలని కోరుకునేవారే ఉంటున్నారు. గత సంవత్సరం నీట్ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియ జరిగినప్పటికీ 371 9(డి) ఆర్టికల్ ఉండటం వల్ల రెండు తెలుగు రాష్ట్రాల్లో మూడు యూనివర్సిటీల (ఉస్మానియా, ఆంధ్ర, శ్రీవేంకటేశ్వర) ప్రాతిపదికనే అడ్మిషన్లు జరిగాయి. అయితే ఈ సంవత్సరం 371 డి నుంచి మినహాయింపు కోరడం వల్ల విద్యార్థుల్లో లాభమని కొందరూ, నష్టమని కొందరూ విశ్లేషణలు చేస్తున్నారు. దీనికంటే విద్యార్థులు తయారీ విధానం పటిష్ఠం చేసుకోవటం లాభదాయకం.

మనం నేషనల్ పూల్‌లో కొన్ని సీట్లు ఇవ్వడం వల్ల తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థుల సీట్లు కొన్ని తగ్గవచ్చు. గవర్నమెంట్ కళాశాలల్లోని సీట్లలో మాత్రమే 15% ఇస్తే 450 సీట్లు (1900 + 1100), కేటగిరి- ఎ సీట్లు కూడా ఇవ్వాల్సి వస్తే దాదాపు 750 నుంచి 800 వరకు సీట్లు నేషనల్ పూల్‌కి ఇవ్వాలి.

దేశంలో మొత్తం 458 మెడికల్ కళాశాలలు ఉంటే వాటిలో 201 మాత్రమే ప్రభుత్వ మెడికల్ కళాశాలలు. వాటిలో సీట్లు 27880. వాటిలో 15 శాతం సీట్లు అంటే 4182 సీట్లు నేషనల్ పూల్‌లో ఉంటాయి. 2017లో తెలుగు విద్యార్థులు మొదట లక్ష ర్యాంకుల్లో 10 శాతం లోపు మాత్రమే ఉన్నారు. అది కూడా మొదటి 50,000 ర్యాంకులలో కొద్దిగా ఎక్కువ శాతం, లక్షలోపు ర్యాంకుల్లో తక్కువ శాతం ఉన్నారు. దానివల్ల నేషనల్ పూల్‌లో మనం సాధించుకోగల్గిన సీట్ల శాతం 8కి మించదు. 4182 సీట్లలో 8 శాతం అంటే సుమారుగా 335. వీటిలో జమ్ము-కశ్మీర్, అసోం, సిక్కిం లాంటి ఈశాన్య రాష్ట్రాల్లో చేరేవారు ఉండకపోవచ్చు. ఆ సంఖ్య తీసివేస్తే 250 నుంచి 300 లోపు సీట్లు వచ్చినా కచ్చితంగా అధికసంఖ్యలో సీట్లు తగ్గిపోతాయి.

అయితే ఇది తొలి సంవత్సరం కాబట్టి విద్యార్థుల అవగాహన తక్కువ ఉండటం వల్ల సక్సెస్ రేటు తగ్గిందని చెప్పవచ్చు. రాబోయే కాలంలో జాతీయ స్థాయిలోని లక్షలోపు ర్యాంకుల్లో 15,000 పైన తెలుగు విద్యార్థులు సాధించుకోగల్గితే సీట్ల సంఖ్య పరంగా లాభనష్టాలు ఉండవు. అయితే ఈ విధానం వల్ల విద్యార్థులు వివిధ రాష్ట్రాలలోని ఉత్తమ కళాశాలల్లో ప్రవేశానికి అర్హత సాధించిన వారవుతారు. అదేవిధంగా 50,000 లోపు జాతీయ స్థాయి ర్యాంకు సాధించిన విద్యార్థులు వెలుపలి రాష్ట్రాల్లో మంచి కళాశాలల్లో సీటు సాధించుకునే అవకాశం పెరుగుతుంది.

మార్కులెన్ని? ర్యాంకు ఎంత?

గత సంవత్సరం ర్యాంకు, మార్కుల కటాఫ్ తెలంగాణ రాష్ట్రంలో కింది విధంగా ఉంది.

ఏ విద్యార్థులు?	ఎంబీబీఎస్ ర్యాంకు	మార్కులు	బీడీఎస్ ర్యాంకు	మార్కులు
ఓసీ బాలురు	21338	514	45292	456
ఓసీ బాలికలు	24191	513	45835	455
బీసీ-ఏ బాలురు	78621	401	100206	373
బీసీ-ఏ బాలికలు	78557	401	101848	371
బీసీ-బీ బాలురు	37826	472	59031	431
బీసీ-బీ బాలికలు	38147	471	59434	431
బీసీ-సీ బాలురు	67783	417	84876	393
బీసీ-సీ బాలికలు	70716	413	74505	407
బీసీ-డీ బాలురు	38082	471	52582	442
బీసీ-డీ బాలికలు	38188	471	53693	440
బీసీ-ఈ బాలురు	50803	446	65869	420
బీసీ-ఈ బాలికలు	50200	447	67008	419
ఎస్సీ బాలురు	90924	382	115735	355
ఎస్సీ బాలికలు	90872	385	115741	355
ఎస్టీ బాలురు	69779	414	144073	350
ఎస్టీ బాలికలు	70741	413	168782	304

ఇది ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల్లో కేటగిరీ-ఎ సీట్ల కటాఫ్ కాబట్టి విద్యార్థి ఈ మార్కుకి కనీసం 20 మార్కులు పెంచుకోవడం అంటే ఇప్పుడు ఓసీ విద్యార్థులకు 720 మార్కులకు జరిగే ఈ పరీక్షలో కనీసం 540 మార్కులపైన సాధించుకోవాలి. ఇప్పటినుంచి సూక్ష్మరీతిలో ప్రణాళిక వేసుకొని, ఆచరించే విద్యార్థికి మాత్రమే విజయం చేకూరే అవకాశం ఉంది.

పోటీ బాగా పెరుగుతుంది

సీట్ల సంఖ్య తగ్గే అవకాశం ఉంది కాబట్టి పోటీ ఇంకా బాగా పెరుగుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థి గత సంవత్సరపు కటాఫ్ మార్కు కంటే ప్రతి కేటగిరీలోనూ 20 మార్కుల వరకు పెంచుకోవడానికి ప్రణాళిక తయారుచేసుకోవాలి.

నీట్ పీజీ ప్రవేశాలకు ఇతర రాష్ట్రాల్లోని సీట్ల సంఖ్య ఎక్కువ. ఇంకా నేషనల్ పూల్‌కి 50 శాతం సీట్లు కేటాయింపు ఇవ్వాలి కాబట్టి తెలుగు రాష్ట్రాల విద్యార్థులు బాగా లాభపడతారు.

బయాలజీలో అదనం

బయాలజీలో ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకంలోని వాక్యాలకు మాత్రమే పరిమితమైతే 90 ప్రశ్నల్లో 75 ప్రశ్నల వరకు సమాధానాలు గుర్తించవచ్చు. మిగిలిన 15 ప్రశ్నలు కూడా బాగా రాయాలంటే అదనంగా కొంత చదవడం, పరీక్షల రూపంలో కొత్త ప్రశ్నలకు జవాబు గుర్తించడం అభ్యాసం చేసుకోవాలి.

బయాలజీలో 12 వ తరగతిలోని జెనెటిక్స్ అండ్ ఎవల్యూషన్, ఎకాలజీ; 11వ తరగతిలోని ప్లాంట్ ఫిజియాలజీ, హ్యూమన్ ఫిజియాలజీలకు ప్రాధాన్యం ఇచ్చి పునశ్చరణ చేసుకోవాలి. వీటికి అధిక ప్రాధాన్యం ఇచ్చి చదివిన విద్యార్థి అదనంగా 20 మార్కులు సాధించుకునే అవకాశం ఏర్పడుతుంది.

ఫిజిక్స్‌లో నూరుశాతం

ఈ సబ్జెక్టులో ద్వితీయ సంవత్సరపు పుస్తకం నుంచే అధిక ప్రశ్నలుంటాయి. ప్రాధాన్యతా క్రమం కూడా అలాగే ఉండాలి. ద్వితీయ సంవత్సరపు సిలబస్‌లోని ఎలక్ట్రిసిటీ, ఆధునిక భౌతికశాస్త్రం (మోడర్న్ ఫిజిక్స్) బాగా చేయగల్గితే దాదాపు 50 శాతం ప్రశ్నలకు జవాబులు రాయవచ్చు. మోడర్న్ ఫిజిక్స్ చదవటం వల్ల అది కెమిస్ట్రీకి కూడా బాగా ఉపయోగం. దానిలోని ఆటమ్, న్యూక్లియై పాఠ్యాంశాలు ఫిజిక్స్, కెమిస్ట్రీ.. దేనికైనా సరిపోతాయి. తక్కువ సమయంలో ఎక్కువ మార్కులు సాధించుకునే అవకాశమూ ఏర్పడుతుంది.

భౌతిక శాస్త్రంలో విద్యార్థి కొంత ఇబ్బంది అని చెప్పేది ప్రథమ సంవత్సర సిలబస్‌లోని యాంత్రిక శాస్త్రం (మెకానిక్స్). అయితే వాటిలో ఫార్ములాలు కంఠస్థం చేయడం కాకుండా, విశ్లేషణతో విషయాన్ని అర్థం చేసుకోగల్గితే మిగిలిన వాటికంటే మెకానిక్స్‌లోనే ఎక్కువ మార్కులు సాధించుకునే అవకాశం ఏర్పడుతుంది. ఫిజిక్స్‌లో ఇచ్చే 45 ప్రశ్నల్లో సాధారణ విద్యార్థి కూడా 35 ప్రశ్నలకు పైగా జవాబులు గుర్తించే విధంగానే ప్రశ్నపత్రాలు ఉంటున్నాయి. కనీసం 180 మార్కులకు జరిగే ఫిజిక్స్ తుది పరీక్షలో కనీసం 120 - 140 మార్కుల వరకు సాధించుకునే దిశలోనే విద్యార్థి అభ్యాసం చేయాలి. అవగాహనతో, విశ్లేషణతో తయారయ్యే ఏ విద్యార్థి అయినా భౌతిక శాస్త్రంలో నూరు శాతం మార్కులు అంటే 180కి 180 మార్కులు సాధించుకునే అవకాశం ఉంటుంది.

కెమిస్ట్రీలో గరిష్ఠంగా..

రసాయన శాస్త్రంలో కూడా ద్వితీయ సంవత్సర సిలబస్‌కే ప్రాధాన్యం బాగా ఎక్కువ. దీనిలో విద్యార్థులు లెక్కలు ఎక్కువగా ఉంటున్నాయనే అపోహతో ఉంటున్నారు. మొత్తం 45 ప్రశ్నల్లో 35 నుంచి 40 ప్రశ్నల వరకు సిద్ధాంతపరమైన ప్రశ్నలు మాత్రమే ఉంటున్నాయి. కర్బన, అకర్బన, భౌతిక రసాయన శాస్త్రాల్లో కూడా ప్రశ్నలు దాదాపు సమ విభజనతో అంటే ఒక్కో విభాగం నుంచి 15 ప్రశ్నల వరకు వస్తున్నాయి.

అకర్బన రసాయన శాస్త్రంలో గుర్తుంచుకునే ప్రశ్నలే అధికం. వాటిలో పీ, డీ, ఎఫ్ బ్లాక్ మూలకాల్లో వస్తున్నాయి. కో ఆర్డినేషన్ కాంపౌండ్స్‌లోని ప్రశ్నలను కూడా కొంత విశ్లేషించి అర్థం చేసుకోవడం మేలు. కర్బన రసాయన శాస్త్రంలో నేమ్‌డ్ రియాక్షన్స్‌కు ప్రాధాన్యం ఇచ్చి వాటిని ఒకే దగ్గర విద్యార్థి నోట్ తయారుచేసుకోగల్గితే తుది పరీక్షల్లో బాగా ఉపయోగపడతాయి.

మెకానిజంలో రియాక్షన్స్, ప్రొడక్ట్స్ గురించే కాకుండా కెటలిస్ట్ రోల్, ఇంటర్మీడియట్ కాంపౌండ్స్ ఏమి తయారవుతాయి అనేదానిపై విశ్లేషణ అవసరం. భౌతిక రసాయన శాస్త్రంలో ఇచ్చే ప్రాబ్లమ్స్‌లో కూడా సింపుల్ అప్లికేషన్స్ మాత్రమే ఉంటున్నాయి. దీనిలో సాలిడ్ స్టేట్, సొల్యూషన్స్‌పై కొంత ఎక్కువ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. రసాయనశాస్త్రం విశ్లేషణతో తయారైన విద్యార్థి సులభంగా 180 మార్కులకు 160 మార్కుల వరకూ సాధించుకునే అవకాశం ఉంటుంది.

పోటీ పరీక్షల పరంగా ఇంటర్మీడియట్ మార్కులకు ఎలాంటి ప్రాధాన్యం లేదు. ఈ జనవరి, ఫిబ్రవరి నెలలు విద్యార్థి ద్వితీయ ఇంటర్‌తోపాటు ఆ సిలబస్‌లోనే పోటీ పరీక్షలకు కూడా తయారు కాగలిగితే మంచిది. మార్చి 14వ తేదీకి ఇంటర్ పరీక్షలు పూర్తవుతాయి కాబట్టి తర్వాత ప్రథమ సంవత్సర సిలబస్ పునశ్చరణ చేసుకొని నమూనా పరీక్షలు రాయవచ్చు. అవి కనీసం 10 నుంచి 12 వరకు రాయగల్గితే నీట్‌లో మెరుగైన ర్యాంకు దిశలో ముందుకు సాగుతున్నట్టే అవుతుంది!



సారాంశం ముఖ్యం

తెలుగు విద్యార్థులు ఇంతవరకు ఎంసెట్ టీచింగ్ విధానంలోనే కొనసాగుతున్నారు కాబట్టి పాఠ్యపుస్తకంలోని ప్రతి వాక్యాన్నీ వీలైనన్ని ఎక్కువసార్లు చదవాలనే అపోహతోనే ఉంటున్నారు. కానీ విద్యార్థులు వాక్యంలోని పదాలు అలాగే నేర్చుకోవాలనే విధానాన్ని వదిలిపెట్టి ఆ పేజీలోని సారాంశం ఏంటి అనేది సంపూర్ణంగా గ్రహించాలి. దాన్ని ప్రశ్నల రూపంలో తయారుచేసుకొని అభ్యాసం చేసినప్పుడే కావాల్సిన మార్కులు సాధించుకోవచ్చు.

తయారీ విధానంలో ఇప్పటివరకు భౌతిక శాస్త్రానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి విద్యార్థులు చదువుతున్నారు. దాంతోపాటు బయాలజీ, కెమిస్ట్రీలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. సీటు సాధించాలంటే 720 మార్కులకు 540 మార్కుల వరకు సాధించాలి. అది జరగాలంటే ముందుగా విద్యార్థి 360 మార్కులకు జరిగే బయాలజీలో 340 మార్కుల వరకు సాధించగల్గాలి.

eager beaver... ఎవరు?

విరామం లేకుండా అదేపనిగా టీవీ చూస్తుంటారు కొందరు. వీరి అలవాటును చెప్పటానికి ఇంగ్లిష్‌లో ఒక కొత్త వ్యక్తీకరణ వచ్చింది. దాని గురించి ఉదాహరణతో తెలుసుకుందామా?

ENGLISH LANGUAGE SKILLS



ఎం. సురేశన్

Ganesh: The minute Govind returns from college he sits in front of the TV and doesn't think of any other activity (కాలేజీ నుంచి వచ్చీ రాగానే గోవింద్ టీవీ ముందు కూర్చుంటాడు. ఇంకే పనీ చేయడు).

Shanmukh: Yea, that is a well-known fact. He often indulges in binge watch. He has become a TV addict (అవును. అది అందరికీ తెలిసిన విషయమే. అదేపనిగా టీవీ చూస్తుండటం అతని వ్యాపకం. అతను టీవీ వ్యసనపరుడయ్యాడు).

Ganesh: Krishna is the exact opposite of Govind. He works very hard (కృష్ణ గోవింద్‌కు పూర్తి వ్యతిరేకం. అతను చాలా కష్టపడి చదువుతాడు).

Shanmukh: That is true. Krishna is an eager beaver. He is highly motivated and after engineering, he intends to go to the US (అది నిజమే. కృష్ణ చాలా ఉన్నత లక్ష్యాల కోసం శ్రమిస్తాడు. ఇంజినీరింగ్ తర్వాత అమెరికాకు వెళ్లాలని అతని ఉద్దేశం).

Ganesh: But I think it is going to be difficult for him. And I am afraid, Trump is in the way (అయితే అది అతనికి కష్టమవుతుందనుకుంటా. ట్రంప్ అడ్డుగా ఉన్నాడు కదా).

Shanmukh: But Krishna is highly skilled, and getting a job will not be very difficult for him (అయితే కృష్ణకు మంచి నైపుణ్యం ఉంది కదా. అతనికి ఉద్యోగం తెచ్చుకోవడం పెద్ద కష్టమేం కాదు).

Ganesh: But I am afraid it is going to be a wild goose chase for him, anyway (కానీ నా అనుమానం.. ఏదేమైనా అతనికిది ఫలితం లేని శ్రమే అవుతుందని).

Shanmukh: Let us wish him good luck anyway. He is quite hard working and he will be rewarded (అతన్ని అదృష్టమే వరిస్తుందని ఆశిద్దాం. అతను చాలా కష్టపడతాడు, దానికి తగిన ఫలితం తప్పక ఉంటుంది).

Ganesh: Anyway, let us wish him the best of luck (అతన్ని అదృష్టమే వరించాలని కోరుకుందాం).

Now let us look at the expressions above



1. Binge watch = Watching the TV without rest or break. This is a new expression (విరామం లేకుండా టీవీ చూస్తుండటం).

Prabhakar: We rarely see Bhaskar coming out and mixing with us these days (భాస్కర్ బయటికొచ్చి మనతో కలవడం చాలా అరుదైంది).

Peter: Ever since he bought the TV, he has been indulging in binge watch. He has put on a lot of weight too (అతను టీవీ కొన్నప్పటి నుంచి అదేపనిగా టీవీ చూస్తూ కూచుంటాడు. అతను చాలా లావెక్కాడు కూడా).

2. An eager beaver = A highly motivated person, working very hard (గొప్ప ఉద్దేశాల కోసం శ్రమించేవాళ్లు).

Madhav: Our friend Chalam is very hardworking. Right from his childhood he has been so. He is good at games too (మన స్నేహితుడు చలం చాలా కష్టపడి పనిచేస్తాడు. చిన్నప్పటి నుంచీ అతనంతే. ఆటల్లోనూ గొప్పవాడే).

Ramamurthy: Yea, I agree with you. He doesn't waste even a single minute. He is what they call an eager beaver (అవును, నీతో నేనంగీకరిస్తా. ఒక్క క్షణం కూడా వృథా చేయడు. చాలామంది అంటారు చూడు గొప్ప ఉద్దేశాలు కలవాడని, అతను అలాంటివాడు).

3. A wild goose chase = An attempt without any result (ఫలితం లేని విపరీత ప్రయత్నం).

Raghav: He is trying his best to save enough money to build a house. He has been doing it for the past three years (ఇల్లు కట్టుకోవడానికి అతను డబ్బు కూడబెట్టడానికి గొప్ప ప్రయత్నమే చేస్తున్నాడు. మూడేళ్లుగా ఆ పని మీదే ఉన్నాడు).

Ajay: I am sure he will succeed in that. It is not going to be a wild goose chase for him. He is quite careful in matters of money (అతను దాంట్లో విజయం పొందుతాడని నా నమ్మకం. అది ఫలితం లేని ప్రయత్నం కాబోదు అతని విషయంలో. డబ్బు విషయంలో అతను చాలా జాగ్రత్తపడతాడు).

నేరుగా ఆర్కిటెక్చర్‌లోకి.. నాటా

నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్ (నాటా) ప్రవేశ ప్రకటన వెలువడింది. ఆర్కిటెక్చర్‌ను కెరియర్‌గా ఆశించినవాళ్లు ఈ పరీక్ష ద్వారా ఉన్నత సంస్థల్లో ప్రవేశం పొందవచ్చు. భారతీయ ఆర్కిటెక్చర్ కౌన్సిల్ (సీఓఏ) ఈ పరీక్షను నిర్వహిస్తుంది. దేశవ్యాప్తంగా దాదాపు 450 సంస్థలు నాటా స్కోర్‌తో ప్రవేశాలకు అనుమతిస్తున్నాయి. ఎన్ఐటీలు, ఐఐటీలు మినహాయిస్తే దేశంలోని మిగతా అన్ని ఆర్కిటెక్చర్ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో నిర్వహించే నాటాలో పొందిన స్కోర్ ప్రామాణికంగా నిలుస్తోంది. తెలుగు రాష్ట్రాల్లోనూ పలు ఇంజినీరింగ్ కళాశాలలు ఈ స్కోర్‌తో బీఆర్క్ కోర్సులో ప్రవేశం కల్పిస్తున్నాయి. పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మ్యాథ్స్‌లో పరిజ్ఞానం, వివిధ రకాల చిత్రాలు, ఆకృతులు గీయడంలో నైపుణ్యం ఉన్నవాళ్లు ఈ పరీక్షలో రాణించగలరు.



విద్యార్హత: మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా ఇంటర్ లేదా మూడేళ్ల డిప్లొమా కోర్సు 50 శాతం మార్కులతో పూర్తిచేసి ఉండాలి. ఈ కోర్సుల్లో ఆఖరు సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష ఇలా...

మొత్తం 200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో 2 భాగాలు ఉంటాయి. పార్ట్-ఎకు 120 మార్కులు కేటాయించారు. ఈ విభాగాన్ని 90 నిమిషాల్లో పూర్తిచేయాలి. ఇందులో మ్యాథ్స్ నుంచి 20, జనరల్ ఆప్టిట్యూడ్ నుంచి 40 ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి. ప్రతి ప్రశ్నకు 2 మార్కులు. రుణాత్మక మార్కులు లేవు. పార్ట్-బి కూడా 90 నిమిషాల వ్యవధిలోనే ఉంటుంది. అయితే దీనికి మార్కులు 80. ఎ-4 పరిమాణమున్న పేపర్‌పై రెండు ఊహాత్మక చిత్రాలు / ఆకృతులు గీయాలి. ఒక్కో చిత్రానికి 40 చొప్పున మార్కులు ఉంటాయి.

ముఖ్యమైన తేదీలు

దరఖాస్తుల ప్రారంభ తేదీ: జనవరి 16

దరఖాస్తు ఫీజు: రూ.1800. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500.

దరఖాస్తులకు చివరి తేదీ: మార్చి 2

హాల్ టికెట్లు: ఏప్రిల్ 2 నుంచి అందుబాటులో ఉంటాయి.

పరీక్ష తేదీ: ఏప్రిల్ 29 (ఆదివారం) ఉదయం 10:30 గం. నుంచి మధ్యాహ్నం 1:30 గం. వరకు

ఫలితాలు: జూన్ 1న ప్రకటిస్తారు.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం,

అర్హత సాధించాలంటే...

పార్ట్-ఎలో కనీసం 25 శాతం అంటే 120కి 30 మార్కులు పొందాలి. అలాగే పార్ట్-బిలోనూ 25 శాతం మార్కులు (80కి 20) పొందడం తప్పనిసరి ఇలా అర్హత మార్కులు సాధించిన అభ్యర్థుల జాబితా నుంచి మెరిట్, రిజర్వేషన్ల ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారు.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

రామగుండం ఫర్టిలైజర్స్ & కెమికల్స్ లిమిటెడ్

✦ మేనేజ్‌మెంట్ ట్రైనీ: 61 పోస్టులు (కెమికల్-35, మెకానికల్-10, ఎలక్ట్రికల్-08, ఇన్‌స్ట్రుమెంటేషన్-06)

అర్హత: బీఈ/బీటెక్. గేట్-2016 ఉత్తీర్ణత. **దరఖాస్తు:** ఆన్‌లైన్. **ఎంపిక:** గేట్ స్కోరు, ఇంటర్వ్యూ. **చివరితేది:** 09.02.2018. **వెబ్‌సైట్:** www.nationalfertilizers.com

సీడాక్, నోయిడా

✦ ఖాళీల సంఖ్య: 53

1) ప్రాజెక్ట్ మేనేజర్: 03
2) ప్రాజెక్ట్ ఇంజినీర్: 39
3) ప్రాజెక్ట్ సపోర్ట్ స్టాఫ్: 11 **అర్హత:** పీహెచ్‌డీ (సైన్స్/ ఇంజినీరింగ్/ టెక్నాలజీ) (లేదా) బీఈ/ బీటెక్/ ఎంఈ/ ఎంటెక్/ ఎంసీఏ, డిగ్రీ. **దరఖాస్తు:** ఆన్‌లైన్. **ఎంపిక:** ఇంటర్వ్యూ. **చివరితేది:** 31.01.2018. **వెబ్‌సైట్:** https://cdac.in

వైజాగ్ స్టీల్ ప్లాంట్

✦ మేనేజ్‌మెంట్ ట్రైనీలు

విభాగాలు: హెచ్‌ఆర్, మార్కెటింగ్, టెక్నికల్ (ఎలక్ట్రికల్/ మెకానికల్/ మెటలర్జీ).

అర్హత: బ్యాచిలర్స్ డిగ్రీతో ఎంబీఏ/ పీజీ డిప్లొమా ఉండాలి, ఇంజినీరింగ్ డిగ్రీ. **దరఖాస్తు:** ఆన్‌లైన్.

దరఖాస్తు ప్రక్రియ: 15.01.2018 - 14.02.2018.

వెబ్‌సైట్: www.vizagsteel.com

వాక్ఇన్

నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్

✦ సీనియర్, జూనియర్ రెసిడెంట్: 23 పోస్టులు

అర్హత: ఎంబీబీఎస్. సీనియర్ రెసిడెంట్ పోస్టులకు ఎంబీబీఎస్‌తోపాటు పీజీ డిగ్రీ/డిప్లొమా **వాక్ఇన్ తేది:** 17.01.2018 **సమయం:** ఉ.9.00 గం.

వెబ్‌సైట్: www.nlcindia.com

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

కొత్త తరహా ఉద్యోగాలొస్తాయి

- కొత్త సాంకేతిక నైపుణ్యాలపై దృష్టి పెట్టాలి
- దరఖాస్తుల పరిశీలనలోనూ కృత్రిమ మేధ వాడుతున్నారు..
- ఉద్యోగార్థుల సామాజిక మాధ్యమ ఖాతాల్లో చెత్త ఉండకూడదు
- 'టాస్క్' కార్పొరేట్ సంబంధాల సంచాలకుడు జి.భాస్కర్ వెల్లడి



జి.భాస్కర్

ఈనాడు, హైదరాబాద్: నూతన సాంకేతిక పరిజ్ఞానంలో కొత్త తరహా హోదాలతో ఉద్యోగాలు వచ్చేందుకు అవకాశాలున్నాయని 'తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్స్ (టాస్క్)' కార్పొరేట్ సంబంధాల సంచాలకుడు జి.భాస్కర్ తెలిపారు. కృత్రిమ మేధ, యాంత్రికీకరణ రంగాలు ఈ ఏడాదిలో ప్రారంభ ఉద్యోగాలను తగ్గించినప్పటికీ.. 2020 నాటికి ఈ రంగాలే అంతర్జాతీయంగా కొత్తగా 2.3 కోట్ల కొత్త ఉద్యోగాలను సృష్టిస్తాయని పేర్కొన్నారు. మారుతున్న మార్కెట్ పరిస్థితుల ఆధారంగా తెలుగు విద్యార్థులు, ఐటీ నిపుణులు కొత్త పరిజ్ఞానాల్ని అందిపుచ్చుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించారు. కొత్తగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాల్లో నైపుణ్యం సాధించిన ప్రారంభ ఉద్యోగ నిపుణులకు ఏడాదికి రూ.3-4 లక్షల వరకు జీతభత్యాలు లభిస్తున్నాయన్నారు. 2017లో కొత్త పరిజ్ఞానాలు, నూతన వ్యాపార పద్ధతుల కారణంగా ఐటీ ఉద్యోగాల సంఖ్య తగ్గిన మాట వాస్తవమేనని తెలిపారు. ఇంజినీరింగ్ చివరి ఏడాది చదువుతున్న, కోర్సులు పూర్తి చేసిన, ప్రస్తుతం ఉద్యోగాలు కోల్పోయి నిరుద్యోగులుగా ఉన్న వారి నైపుణ్యాభివృద్ధి కోసం 'టాస్క్' ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కోసం 'ఫినిషింగ్ స్కూల్' నిర్వహిస్తున్నామని వివరించారు. ఒరాకిల్ సంస్థలో సీనియర్ సంచాలకులుగా 19 ఏళ్లు పని చేసి, 31 ఏళ్లుగా ఐటీ రంగంలో శిక్షణ అనుభవమున్న జి.భాస్కర్ 'ఈనాడు'తో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

2018లో నిపుణులకు డిమాండ్ పెరుగుతుంది

2018లో కొత్తగా ఆవిర్భవిస్తున్న పరిజ్ఞానాల్లో నిపుణులకు అవకాశాలు పెరుగుతాయి. యాజమాన్యాలు నైపుణ్యాన్ని పరిగణలోకి తీసుకుని వేతనాలు నిర్ణయిస్తాయి. రానున్న నాలుగేళ్లలో ఇప్పటి వరకు చూడని రోబోటిక్స్ అధికారి తదితర కొత్త తరహా సాంకేతిక పరిజ్ఞాన ఉద్యోగాల్లో దాదాపు 9 శాతం మంది వరకు పని చేసేందుకు అవకాశాలున్నాయి. పరిశ్రమలు, సాఫ్ట్‌వేర్ తదితర కంపెనీలు కొత్త పరిజ్ఞానాల్ని అనుసరించడం వల్ల అక్కడా నిపుణుల నియామకాలు పెరుగుతాయి. డేటా అనలిటిక్స్ ఉద్యోగాలు రెండింతలయ్యే అవకాశాలున్నాయి.

భవిష్యత్తుకు కొత్త కోర్సులు.. నైపుణ్యాలు..

విద్యార్థులు, నిపుణులు కీలకమైన కొత్త పరిజ్ఞానాలపై దృష్టి పెట్టాలి. క్లౌడ్, డిస్ట్రిబ్యూటెడ్ కంప్యూటింగ్ స్కిల్స్, యూజర్ ఇంటర్‌ఫేస్ డిజైన్, మిడిల్‌వేర్, ఇంటిగ్రేషన్ సాఫ్ట్‌వేర్ స్కిల్స్, నెట్‌వర్కింగ్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, డేటా అనాలిసిస్, ప్రజెంటేషన్, వెబ్ ఆర్కిటెక్చర్, డెవలప్‌మెంట్ ఫ్రేమ్‌వర్క్, నెగోషియేషన్, పర్సుయేషన్, మొబైల్ డెవలప్‌మెంట్, ఎస్ఈవో/ఎస్ఈఎం మార్కెటింగ్, జావా కోర్సులు కీలకం. ఈ ఏడాదిలో కృత్రిమ మేధ, యాంత్రికీకరణ, బిగ్‌డేటా, డేటా సైన్స్, డిజిటల్ మార్కెటింగ్, డిజిటల్ కామర్స్, సైబర్ భద్రత, వర్చువల్ రియాలిటీ, ఆగ్మెంటెడ్ రియాలిటీ, బ్లాక్‌చైన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఎంటర్‌ప్రైజెస్ అప్లికేషన్స్‌కు డిమాండ్ పెరుగుతుంది. వచ్చే ఐదేళ్లలో ఐటీ, ఫైనాన్షియల్ టెక్నాలజీస్, పారిశ్రామిక యాంత్రికీకరణ, ఈ-వాణిజ్య రంగాల్లోనూ కృత్రిమ మేధ నిపుణులకు అవకాశాలు పెరుగుతాయి.

నైపుణ్యానికే ప్రోత్సాహకాలు

ఐటీలో పరిస్థితులు మారాయి. సంస్థలు ఖర్చులు తగ్గించుకుంటున్నాయి. నైపుణ్యం కలిగిన వారికే ప్రాధాన్యమిస్తున్నాయి. అనుభవం కన్నా...వారి నుంచి వచ్చే ఉత్పాదకత, ఆవిర్భావ పరిజ్ఞానాల్లో సాధిస్తున్న పట్టు ఆధారంగా ప్రోత్సాహకాలు ఇస్తున్నాయి. వ్యక్తిగతంగా సాధించిన వృద్ధి, విజయాలపైనే ఆధార పడుతున్నాయి. ఇటీవల కొన్ని సంస్థలు పనితీరు బాగా లేదంటూ కొందరిని తొలగించాయి. ఆయా నిపుణులు తాము పనిచేసిన పరిజ్ఞానాల్లోనే కొత్త నైపుణ్యాలు పెంపొందించుకోవాలి లేదా అనుబంధ పరిజ్ఞానాల్ని నేర్చుకోవాలి.

నియామకాల వడపోతలోనూ సాంకేతికతే

సాఫ్ట్‌వేర్ నియామకాలకు వచ్చే దరఖాస్తుల వడపోతలోనూ కృత్రిమ మేధ కీలక పాత్ర పోషిస్తోంది. దరఖాస్తు స్పష్టంగా ఉండాలి. సామాజిక మాధ్యమాల్లో అభ్యర్థుల సమాచారం, పోస్టులు తదితర విషయాలను పరిశీలిస్తున్నారు. అభ్యంతర పోస్టులు, ఫొటోలవంటి చెత్తను తొలగించకుంటే ఉద్యోగాన్వేషణలో ఇబ్బందులు తప్పవు.



ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు పుష్పగుచ్ఛం అందచేసి స్వాగతం పలుకుతున్న తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, తిరుమల జేఈవో శ్రీనివాసరాజు

తిరుమలకు చేరుకున్న ఉపరాష్ట్రపతి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర స్వామివారి దర్శనార్థం ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు బుధవారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నారు. శ్రీవారిని గురువారం ఉదయం కుటుంబ సమేతంగా దర్శించుకోనున్నారు. ఉపరాష్ట్రపతికి రాష్ట్ర ప్రభుత్వం, తితిదే నుంచి ఘనస్వాగతం లభించింది. దిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న వెంకయ్యనాయుడుకు మంత్రి అమరనాథరెడ్డి, చిత్తూరు జిల్లా కలెక్టరు ప్రద్యుమ్న స్వాగతం పలికారు. అనంతరం రహదారి మార్గంలో తిరుమలకు చేరుకోగా ఇక్కడ తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో శ్రీనివాసరాజు పుష్పగుచ్ఛాలు అందచేసి స్వాగతం పలికారు.

కేంద్ర హోంశాఖ ద్వారా అభ్యర్థిస్తేనే సమాచారమిస్తాం

సీఎం కేసీఆర్‌పై ఫేస్‌బుక్‌లో అభ్యంతర వ్యాఖ్యల కేసులపై సంస్థ ప్రతినిధుల వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఫేస్‌బుక్‌లో అభ్యంతరకర వ్యాఖ్యలను పోస్టుచేసిన వారి అన్వేషణలో సైబర్ క్రైమ్ పోలీసులు విధానపరమైన అడ్డంకులు ఎదుర్కొంటున్నారు. వారి వివరాలు నేరుగా ఇవ్వబోమని.. కేంద్ర హోంశాఖ ద్వారా అభ్యర్థిస్తే ఇస్తామని ఫేస్‌బుక్ ప్రతినిధులు సైబర్‌క్రైమ్ అధికారులకు తెలియజేశారు. సీఎం కేసీఆర్‌పై గుర్తు తెలియని వ్యక్తులు ఫేస్‌బుక్‌లో ఇష్టారాజ్యంగా వ్యాఖ్యలు చేశారంటూ తెరాస నాయకుడు ఒకరు రెండు నెలల క్రితం సైబర్ క్రైమ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడి వివరాలు తెలపాల్సిందిగా భారత్‌లో ఫేస్‌బుక్ సంస్థ ప్రతినిధులకు లేఖ పంపించారు. అనంతరం చాంద్రాయణగుట్ట ఠాణాకూ ఇదే తరహా ఫిర్యాదు వచ్చింది. అక్కడి పోలీసులు కేసును సైబర్‌క్రైమ్‌కు బదిలీ చేశారు. ఈ కేసు వివరాలనూ ఫేస్‌బుక్ ప్రతినిధులకు పంపగా... కేంద్ర హోంశాఖ ద్వారా వస్తే సమాచారం ఇస్తామంటూ వివరించారు. దీంతో పరస్పర న్యాయ సహకార ఒప్పందం(ఎమ్.ఎల్.ఎ.టి) విభాగం ద్వారా కేంద్ర హోంశాఖకు లేఖను పంపించారు. కేంద్ర హోంశాఖకు ఫేస్‌బుక్ నుంచి సమాచారం వచ్చాక నిందితులను అరెస్టు చేయనున్నామని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు.

ఫార్మా సిటీ అభివృద్ధికి సహకరించండి

ఈనాడు, దిల్లీ: ఫార్మా రంగంలో దూసుకెళ్తున్న తెలంగాణలో ఫార్మాసిటీ అభివృద్ధికి సహకరించాలని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి సురేశ్‌ప్రభును రాష్ట్ర ఎన్ఆర్ఐ వ్యవహారాలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ కోరారు. బుధవారమిక్కడ తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ అశోక్‌కుమార్‌తో కలిసి సురేశ్‌ప్రభుతో కేటీఆర్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో పారిశ్రామికీకరణపై చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పథకాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. టీఎస్ఐపాస్, సులభతర వాణిజ్యంలో తెలంగాణ అగ్రగామిగా ఉందన్నారు. హైదరాబాద్ ఫార్మాసిటీ ఏర్పాటుకు అవసరమైన నిమ్జ్ హోదా ఇవ్వాలనీ, అభివృద్ధికి రూ.1500 కోట్లు కేటాయించాలని కేంద్రమంత్రిని కోరానన్నారు. నిజామాబాద్‌లో స్పైసెస్ పార్కు ఏర్పాటుకు ఇప్పటికే మంత్రిత్వశాఖ అంగీకరించిందనీ, దీనికి రూ.20 కోట్లు విడుదల చేయాలని విన్నవించానన్నారు. హైదరాబాద్-వరంగల్, హైదరాబాద్-రామగుండం, హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక నడవాల నిమిత్తం నిధులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కేటాయించిన మెగాలెదర్ పార్కు ఏపీకి వెళ్లిపోయిందని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లి, తెలంగాణకూ ఒకటి కేటాయించాలని కోరానన్నారు. ఫిబ్రవరి 22, 23 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే బయో ఆసియా సదస్సుకి రావాలని కేంద్రమంత్రిని ఆహ్వానించినట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు.

అంతకుముందు విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మాస్వరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి కేటీఆర్ హాజరయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో పాస్‌పోర్టుల తనిఖీ, ఇమ్మిగ్రేషన్‌లో తెలంగాణ ప్రభుత్వం ముందు వరసలో ఉందంటూ సమావేశంలో సుష్మాస్వరాజ్ అభినందించారని తెలిపారు. పశ్చిమాసియా దేశాల్లో చాలామంది తెలుగువారున్నారనీ, అక్కడి రాయబార కార్యాలయాల్లో తెలుగు వచ్చిన వారిని నియమించాలని కోరానన్నారు. యెమెన్, లిబియా, గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న భారతీయులను వెనక్కి తీసుకొచ్చినా, వేతనాల కోసమని బాధితులు మళ్లీ పర్యాటక ఇతరత్రా వీసాలతో అక్కడికి వెళ్తున్న విషయాన్ని కేంద్రమంత్రి ఆ సమావేశంలో ప్రస్తావించారనీ, తగిన వీసా లేకుండా బాధితులు మరోసారి వెళ్లారని గుర్తిస్తే ఐదేళ్లపాటు పాస్‌పోర్టు రద్దు చేయాలన్న కేంద్రం నిర్ణయం పట్ల సమావేశంలో హర్షం వ్యక్తం చేశామని తెలిపారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న విదేశీ భవన్ శంకుస్థాపనకు రావాల్సిందిగా కేంద్రమంత్రి సుష్మాస్వరాజ్‌ను ఆహ్వానించగా, సానుకూలంగా స్పందించారని కేటీఆర్ వెల్లడించారు.

సికింద్రాబాద్-కాకినాడ మధ్య జనసాధారణ్ రైలు

విజయవాడ, న్యూస్‌టుడే: సంక్రాంతి రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్ - కాకినాడటౌన్‌ల మధ్య గుంటూరు మీదుగా ఈ నెల 11, 12 తేదీల్లో జన సాధారణ్ ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలులో అన్నీ జనరల్ బోగీలే ఉంటాయని తక్కువ టికెట్ ధరతోనే ప్రయాణించవచ్చన్నారు.

★ రైలు నెంబరు 07050 ప్రత్యేక రైలు ఈ నెల 11, 12 తేదీల్లో సికింద్రాబాద్‌లో రాత్రి 11.10కి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 11 గంటలకు కాకినాడకు చేరుకుంటుంది. ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగనుంది.

దరఖాస్తు గడువు 31 వరకూ పెంపు: ఇంటర్ బోర్డు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ఇంటర్ బోర్డు గుర్తింపు పొందేందుకు, అదనపు కోర్సులు నిర్వహించుకునేందుకు ఈ నెల 31 వరకూ కళాశాలలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు గడువును పొడిగించినట్లు ఇంటర్ బోర్డు బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. మార్చి 14 వరకూ నిర్దేశిత అపరాధ రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకొనే వెసులుబాటు ఉంది. మరోవైపు అన్ని జూనియర్, డిగ్రీ కళాశాలలకు ఈ నెల 13 నుంచి 15 వరకూ మూడు రోజుల పాటు సంక్రాంతి సెలవులు నిర్ణయించినట్లు బోర్డు ఉన్నతాధికారులు తెలిపారు.



హైదరాబాద్‌లోని స్టేట్‌బ్యాంక్‌లో వంద కిలోల బంగారు బిస్కట్లను బంగారు బాండ్ల పథకం కింద డిపాజిట్ చేస్తున్న శ్రీకాళహస్తీశ్వరాలయం ఈవో భ్రమరాంబ. అంతరచిత్రంలో వంద కిలోల బంగారు బిస్కట్లు

వెండి ఆదాయం బంగారంగా భద్రం

ఎస్‌బీఐలో శ్రీకాళహస్తీశ్వరుడి పుత్తడి వంద కిలోలు డిపాజిట్

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఏళ్ల తరబడి మూలుగుతున్న వెండి నిల్వలను వేలంలో విక్రయించడం ద్వారా వచ్చిన ఆదాయాన్ని అధికారులు బంగారం రూపంలో బ్యాంక్‌లో భద్రపరిచారు. ఏళ్ల తరబడి ఆలయ స్ట్రాంగ్‌రూమ్‌లోగల వెండి నిల్వలను ఇటీవల కరిగించారు. 15 వేల కిలోల వెండి నిల్వల్లో కొంత ఎంఎంటీసీ ద్వారా విక్రయించారు. ఆ ఆదాయాన్ని నగదు రూపంలో కాకుండా బంగారు బాండ్ల పథకం ద్వారా భద్రపరచాలని దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. ఆ ప్రకారం బుధవారం హైదరాబాద్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 100 కిలోల బరువు కలిగిన బంగారాన్ని బిస్కట్ల రూపంలో బంగారు బాండ్ల పథకం ద్వారా భద్రపరిచినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి (ఈవో) భ్రమరాంబ తెలిపారు. వీటి విలువ 3శాతం జీఎస్టీతో కలిపి రూ.31,93,19,553గా నిర్ణయించినట్లు ఈవో వివరించారు.

ఆదర్శ పాఠశాల్లో ప్రవేశాలకు 23 నుంచి దరఖాస్తులు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని ఆదర్శ(మోడల్) పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశానికి, 7-10 తరగతుల్లో ఖాళీ సీట్లకు ఈ నెల 23 నుంచి ఫిబ్రవరి 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ మేరకు కాలపట్టికను విద్యాశాఖ ప్రకటించింది. ఏప్రిల్ 15(ఆదివారం) ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. 6వ తరగతికి ఉదయం 10-12 గంటలకు, 7-10 తరగతులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. ఎంపికైన వారి జాబితాను మే 16-19 వరకు ప్రకటిస్తారు. మరిన్ని వివరాలను telanganams.cgg.gov.in ద్వారా తెలుసుకోవచ్చు.

మార్చి 5 నుంచి సీబీఎస్ఈ పరీక్షలు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలల్లో పది, పన్నెండు తరగతులకు నిర్వహించే పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. పదో తరగతి పరీక్షలు మార్చి 5 నుంచి ఏప్రిల్ 4 వరకు, పన్నెండో తరగతికి మార్చి 5 నుంచి ఏప్రిల్ 12 వరకూ పరీక్షలు జరగనున్నట్లు సీబీఎస్ఈ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది.

సివిల్స్ ముఖాముఖికి 100 మంది తెలుగు అభ్యర్థులు!

మెయిన్ ఫలితాల విడుదల

ఈనాడు, హైదరాబాద్: అత్యున్నత కేంద్ర సర్వీసులుగా పేర్కొనే సివిల్స్ ప్రధాన (మెయిన్స్) పరీక్షా ఫలితాలను యూపీఎస్సీ బుధవారం విడుదల చేసింది. గతేడాది అక్టోబరు 28, నవంబరు మూడు తేదీల్లో ఈ పరీక్షలను నిర్వహించిన విషయం గమనార్హం. ఈ పరీక్షల్లో అర్హత సాధించినఅభ్యర్థుల రోల్‌నంబర్లను www.upsc.gov.in లో చూసుకోవచ్చు. ఈ పరీక్షలో తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 100 మంది వరకు ఉత్తీర్ణులయినట్లు అంచనా. వీరు మార్చి నుంచి జరిగే ముఖాముఖిలకు హాజరుకానున్నారు. సుమారు వెయ్యి ఉద్యోగాలకు 2,565 మంది ముఖాముఖి(వ్యక్తిత్వ పరీక్షగా పిలుస్తారు)కి ఎంపికయ్యారు. ప్రాథమిక పరీక్షకు దేశవ్యాప్తంగా 10 లక్షల మంది దరఖాస్తు చేసినప్పటికీ వారిలో సుమారు 6 లక్షల మంది పరీక్ష రాశారు. వారిలో 13,366 మంది మెయిన్స్ పరీక్షకు ఎంపికయ్యారు. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే... హైదరాబాద్, విజయవాడ నగరాల్లో జరిగిన ఈ పరీక్షకు ఏపీ, తెలంగాణల నుంచి దాదాపు 900 మంది పరీక్ష రాశారు. అర్హతసాధించిన వారికి ఫిబ్రవరి 19 నుంచి ఇంటర్వ్యూలు జరుగుతాయి. అర్హత సాధించిన వారు ఈనెల 18వ తేదీ నుంచి వెబ్‌సైట్ ద్వారా ముఖాముఖి లేఖను పొందవచ్చని యూపీఎస్సీ తెలిపింది. దక్షిణాది రాష్ట్రాల విషయానికి వస్తే...ఈసారి మెయిన్స్ రాసినవారిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారే ఎక్కువనీ...ఆ ప్రభావం తుది ఫలితాల్లోనూ కనిపిస్తుందని బ్రెయిన్ ట్రీ శిక్షణ సంస్థ సంచాలకుడు గోపాల కృష్ణ అభిప్రాయపడ్డారు.

పంచాయతీల్లో ప్రజలకూ హక్కులు

- వారి సమస్యలకు విధిగా పరిష్కారం
- కోఆప్షన్ సభ్యులుగా ప్రవాసులు, నిపుణులు
- పరిశ్రమలకు పంచాయతీల అనుమతి అక్కర్లేదు
- కొత్త పంచాయతీరాజ్ చట్టంలో ప్రతిపాదనలు
- మంత్రివర్గ ఉపసంఘం మూడో రోజు సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు. చిత్రంలో మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఈటల రాజేందర్, జగదీశ్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: కొత్త పంచాయతీరాజ్ చట్టంలో ప్రజలకూ హక్కులు కల్పించాలని మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదించింది. వారి సమస్యల పరిష్కారం, సౌకర్యాలు, వసతులను పొందడం వంటివి ఇందులో ఉంటాయి. పంచాయతీ పాలకమండళ్లు వీటన్నింటిని తప్పనిసరిగా నెరవేర్చాలి. లేకపోతే జరిమానాలతో పాటు క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఉపసంఘం సూచించింది. పంచాయతీల్లో కోఆప్షన్ సభ్యులుగా ప్రవాస తెలంగాణవాసులను, నిపుణులను నియమించడం, అనుమతి లేని లేఅవుట్లలోని స్థలాల క్రమబద్ధీకరణను నిషేధించడం వంటి పలు కీలక ప్రతిపాదనలనూ ఉపసంఘం సూచించింది. కొత్త చట్టం రూపకల్పనకు బుధవారం మూడో రోజు ఉపసంఘం పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన సమావేశమయింది. ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఈటల రాజేందర్, జగదీశ్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గురువారం కూడా సమావేశం అవుతామని జూపల్లి తెలిపారు.

- కొత్త చట్టంలో ప్రజలకు సైతం ప్రయోజనం కలిగే చర్యలు అవసరమని ఉపసంఘం భావించింది. పంచాయతీల్లో ప్రజలకు హక్కులను కల్పిస్తూ దీనిపై జాబితా రూపొందించి అమలు చేయించాలని అభిప్రాయపడింది. దీనివల్ల పాలకవర్గాల్లో జవాబుదారీతనం పెరుగుతుందని సభ్యులు పేర్కొన్నారు. పారిశుద్ధ్యం, డంప్‌యార్డులు, శ్మశానవాటికల వంటి వాటిని సైతం హక్కుల జాబితాలో చేర్చనున్నారు.
- పల్లె ప్రగతిలో ప్రవాసులను భాగస్వాములను చేసేందుకు వారికి కోఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించాలనే ప్రతిపాదనను అంతా ఆమోదించారు.
- పంచాయతీల్లో జనాభా ప్రాతిపదికన కో ఆప్షన్ సభ్యులుగా ఇద్దరు లేదా ముగ్గురిని నియమించుకునే వెసులుబాటు ఉండాలి. దీనికి నిపుణులను ఎంపిక చేసుకోవాలి. గ్రామ మహిళా సమాఖ్య అధ్యక్షురాలికి అవకాశం ఇవ్వాలి.
- 200 చదరపు గజాల్లోపు విస్తీర్ణంలో జీ ప్లస్2 ఎత్తులో నిర్మించే భవనాలకు గ్రామ పంచాయతీల్లో అనుమతులు ఇస్తున్నారు. అంతకన్నా ఎక్కువ విస్తీర్ణంలో ఉన్నవాటికి అనుమతివ్వడానికి ఎంపీడీవో, తహసీల్దార్, ఈవోఆర్‌డీ, పంచాయతీరాజ్ ఏఈల నేతృత్వంలో కమిటీని నియమించాలి. భవన నిర్మాణాలకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) అనుమతిచ్చిన వారం రోజుల్లోనే పంచాయతీలు దానికి ఆమోదం తెలపాలి. లేకుంటే ఆమోదం నేరుగా లభించినట్లు (డీమ్డ్)గా భావిస్తారు.
- పరిశ్రమల ఏర్పాటుకు ఇప్పటి వరకు పంచాయతీల అనుమతి తప్పనిసరి. దీనిని కొత్త చట్టంలో తొలగించాలని ఉపసంఘం నిర్ణయించింది.

ప్రాథమిక పాఠశాలల్లో కనీస విద్యా సామర్థ్యాలేవీ?

- '3ఆర్'పై దృష్టి పెట్టని ఉపాధ్యాయులు
- పాఠశాల విద్యా శాఖ తనిఖీల్లో వెల్లడి
- నిర్లక్ష్యంగా ఉన్నవారిపై చర్యలు తీసుకోవాలని నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: సర్కారు బడుల్లో చదివే విద్యార్థుల్లో కనీస విద్యా సామర్థ్యాలు పెంచాలన్న లక్ష్యంతో తెలుగు, ఆంగ్లం, గణితంపై 3ఆర్ (రీడింగ్-రైటింగ్-అర్థమెటిక్) కార్యక్రమాన్ని చేపట్టినా.. ప్రాథమిక పాఠశాలల్లో అది సక్రమంగా అమలు కాలేదని తేలింది. అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలల్లో 3ఆర్ కార్యక్రమం ఎలా అమలైంది, పుస్తకాల బరువు ఎలా ఉంది తదితర అంశాలను 10 బృందాలు ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు తనిఖీ చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 500 బడులను తనిఖీ చేశారు. తనిఖీల్లో పాల్గొన్న వారితో విద్యాశాఖ కమిషనర్ కిషన్ బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలల్లో ఎక్కువ మంది ఉపాధ్యాయులు 3ఆర్‌పై దృష్టి పెట్టలేదన్న అభిప్రాయం ఈ సమావేశంలో వ్యక్తమైంది. ఈ క్రమంలో ఆయా ఉపాధ్యాయులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని కమిషనర్ వెల్లడించినట్లు సమాచారం. సీసీఈ విధానంలో ప్రాజెక్టులు, పుస్తక సమీక్షలను తగ్గించాలని పలువురు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కోరినట్లు ప్రస్తావనకు వచ్చింది. పుస్తకాల బరువు తగ్గలేదని, గతంలో 10వ తరగతికి గైడ్లు ఉండగా.. ఇప్పుడు 6వ తరగతి నుంచే గైడ్లకు అలవాటుపడుతున్నారని తనిఖీల్లో గుర్తించారు. మరోవైపు ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు పెరిగాయని తనిఖీల్లో పాల్గొన్న వారు కమిషనర్‌కు వివరించారు. మళ్లీ 19, 20 తేదీల్లో ఈ అంశంపై సమీక్షించాలని నిర్ణయించారు.



బ్యారేజీ నిర్మాణ పనులను వీక్షిస్తున్న అటవీ అధికారుల బృందం సభ్యులు

కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన అటవీ అధికారుల బృందం

కాళేశ్వరం, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల 3.200 హెక్టార్ల అటవీ భూములకు అనుమతులు ఇస్తూ అప్పగించినట్లు అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్‌కన్జర్వేటర్ పవన్‌కుమార్ ఝా తెలిపారు. కాళేశ్వరం బ్యారేజీ గొప్ప ప్రాజెక్టు అని పేర్కొన్నారు. ఆయన నేతృత్వంలో బుధవారం 45 మంది ఐఎఫ్ఎస్ అధికారులు, 15 మంది డీఎఫ్‌వోలు కాళేశ్వరం బ్యారేజీని సందర్శించారు. కన్నెపల్లి పంపుహౌజ్ నుంచి అన్నారం బ్యారేజీ వరకు అటవీమార్గంలో చెట్ల నరికివేతను పరిశీలించారు. అనంతరం కన్నెపల్లి పంపుహౌజ్‌కు చేరుకొని నిర్మాణాలను పరిశీలించగా బ్యారేజీ డీఈఈ ప్రకాశ్ ప్రాజెక్టు వివరాలను పటం ద్వారా వారికి వివరించారు. వరంగల్ రేంజి సీసీఎఫ్ ఎంజే అక్బర్, ఏసీసీఎఫ్‌లు రఘువీర్, మునీంద్ర, శోభ, పృథ్వీరాజ్, డీఎఫ్‌వో రవికిరణ్, ఎఫ్‌డీవో వజ్రారెడ్డి, రేంజర్ రమేశ్, ఆప్కాన్, మెగా సంస్థ ప్రతినిధులు శేఖర్‌దాస్, వేణుమాధవ్ పాల్గొన్నారు.

ఏపీకి 60..తెలంగాణకు 50 టీఎంసీలు

- ఉమ్మడి రిజర్వాయర్లలో నీటి వినియోగంపై కృష్ణా బోర్డు నిర్ణయం
- లెక్కలు తేలాక మిగతా నీటిపై నిర్ణయం
- కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం

ఈనాడు, హైదరాబాద్: ఉమ్మడి రిజర్వాయర్లలో ఉన్న నీటిలో ఆంధ్రప్రదేశ్ 60 టీఎంసీలు, తెలంగాణ 50 టీఎంసీలు వినియోగించుకొనేలా నిర్ణయం జరిగింది. నీటి వినియోగ లెక్కలు తేలిన తర్వాత మిగిలిన నీటిపై బోర్డు నిర్ణయం తీసుకోనుంది. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం, తెలంగాణ, ఏపీ ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు మురళీధర్, వెంకటేశ్వరరావు ఇందులో సభ్యులు. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో 133.75 టీఎంసీలు ఉన్నాయని, ఇందులో ఏపీకి 70.43 టీఎంసీలు, తెలంగాణకు 60.33 టీఎంసీలు వస్తాయని బోర్డు లెక్కగట్టింది. బోర్డు లెక్కలతో ఏపీ ఏకీభవించలేదని తెలిసింది. పోతిరెడ్డిపాడు వద్ద ఎక్కువగా వినియోగించుకొన్నామనడంలో వాస్తవం లేదని, జూరాల వద్ద ఒకటిన్నర నుంచి రెండు టీఎంసీలు తెలంగాణ రాష్ట్రం ఎక్కువగా వినియోగించుకొందని పేర్కొనగా, దీనికి తెలంగాణ అంగీకరించలేదు. దీనిపై చర్చ జరిగిన తర్వాత ఏపీ 60 టీఎంసీలు, తెలంగాణ 50 టీఎంసీలు వినియోగించుకోవాలని, ఈ మేరకు ఎప్పటికప్పుడు నీటి విడుదల ఆదేశాలు జారీ చేయాలనే నిర్ణయం జరిగింది. నీటి వినియోగంపై కచ్చితమైన నిర్ణయానికి వచ్చిన తర్వాత మిగిలిన నీటిపై చర్చించి నిర్ణయం తీసుకొంటారు. జనవరి నెలకు ఏపీ 38 టీఎంసీలు, తెలంగాణ 17.1 టీఎంసీలు వాడుకొంటాయి. ఏపీ పోతిరెడ్డిపాడు నుంచి ఏడు, హంద్రీనీవా-ముచ్చుమర్రి నుంచి 5.5, నాగార్జునసాగర్ కుడి కాలువకు 16.5, ఎడమ కాలువకు నాలుగు, కృష్ణా డెల్టాకు ఐదు టీఎంసీలు, తెలంగాణ సాగర్ ఎడమ కాలువకు పది, ఎ.ఎం.ఆర్.పి కింద సాగు, తాగునీటికి 4.6, కల్వకుర్తికి రెండున్నర టీఎంసీలు జనవరిలో వినియోగించుకొంటాయి. ఇందుకోసం సాగర్ నీటిమట్టాన్ని 515 నుంచి 520 అడుగుల మధ్య నిర్వహించాలని, దీనికి తగ్గట్లుగా శ్రీశైలం నుంచి నీటి విడుదల జరగాలని కూడా నిర్ణయం జరిగింది. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు విడుదల చేసిన నీటిపైన, సాగర్ ఎడమ కాలువలో ఆవిరైన నీటిపైన బోర్డు ఏర్పాటు చేసిన కమిటీలు త్వరగా నివేదిక ఇవ్వాలని, ఈ నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని రెండు రాష్ట్రాల ఇ.ఎన్.సిలను బోర్డు కోరింది. సమావేశంలో తెలంగాణ నుంచి చీఫ్ ఇంజినీర్ సునీల్, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ నరహరిబాబు, ఏపీ నుంచి కర్నూలు చీఫ్ ఇంజినీర్ నారాయణరెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీరు శ్రీనివాసులురెడ్డి, బోర్డు ఎస్.ఇ. శ్రవణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పక్షవాత బాధితుల్లో చలనం తెచ్చే ఆట!

- ఐఐటీ సహకారంతో పరికరానికి రూపకల్పన
- స్మార్ట్‌ఫోన్ ద్వారా పర్యవేక్షించే వీలు

ఈనాడు – సంగారెడ్డి

పక్షవాతానికి గురైనా... ప్రమాదవశాత్తూ ఎముకలు విరిగినా... బాధితుల చేతులు మళ్లీ పూర్వస్థితికి రావడానికి చాలా సమయం పడుతుంది. వ్యాయామచికిత్స (ఫిజియోథెరపీ) పొందినా, పూర్తిస్థాయిలో నయమవుతుందని చెప్పలేం. చాలామంది అసలు ఈ కసరత్తులు చేయలేరు. వీటన్నింటికీ పరిష్కారం చూపుతూ, బాధితులకు ప్రయోజనం చేకూర్చే ఉపకరణానికి రూపునిచ్చారు... హబీబ్ అలీ! ఐఐటీ హైదరాబాద్ ప్రాంగణంలోని ఆరోగ్య పరిరక్షణ వాణిజ్య కేంద్రం (సీఎఫ్‌హెచ్‌ఈ) ఇందుకు సహకరిస్తోంది. ఈ పరికరాన్ని అందుబాటులో తెచ్చేందుకు వీలుగా 'బీ ఏబుల్' పేరున అంకురసంస్థను ఏర్పాటుచేసుకునే అవకాశాన్ని ఆయనకు కల్పించింది. 'ఆర్మ్ ఏబుల్'గా పిలుస్తున్న ఈ పరికరం ఏడాదిలో మార్కెట్‌లోకి రానుంది.



రూపకర్త హబీబ్ అలీ ★ 'ఆర్మ్ ఏబుల్' పరికరం సాయంతో వ్యాయామం చేస్తున్న పక్షవాత బాధితుడు

కర్ణాటకలోని మణిపాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి బయో మెడికల్ ఇంజినీరింగ్‌లో ఎంటెక్ పూర్తిచేసిన హబీబ్... 2016-17లో 'సీఎఫ్‌హెచ్‌ఈ'లో ప్రవేశం పొందారు. ఏడాదిపాటు ఐఐటీహెచ్ నుంచి ఆయనకు ఫెలోషిప్‌తో పాటు ఈ ఉపకరణాన్ని సిద్ధం చేసేందుకు అన్ని విధాలుగా సాయం లభించింది.

పక్షవాతం బారినపడిన ప్రతి ముగ్గురిలో ఇద్దరికి వైకల్యం వస్తుంది. క్రమంగా ఏదోక చేయి చచ్చుబడిపోతుంది. దెబ్బతిన్న చేయి పూర్వస్థితికి రావాలంటే.. పూర్తిస్థాయి వ్యాయామం అవసరం. ఈ కసరత్తుల్లో రోజూ 400-600 కదలికలు అవసరంకాగా... అత్యధికమంది బాధితుల్లో ఈ సంఖ్య 20-30 మధ్యే ఉంటోంది. ఫలితంగా స్వస్థత చేకూరడం ఆలస్యమవుతోంది. ఈలోగా చేయి పూర్తిగా చచ్చుబడిపోయే ముప్పుంది. అయితే, తాము రూపొందించిన పరికరంతో 30 నిమిషాల వ్యవధిలో 450 వరకు కదలికలు సాధ్యమవుతాయని హబీబ్ అలీ చెబుతున్నారు.

ఆడుతూ పాడుతూ వ్యాయామం..

బాధితులు.. సెన్సర్లతో కూడిన ఈ పరికరం ద్వారా ఐదు రకాల ఆటలాడుతూ వ్యాయామాన్ని పూర్తిచేయవచ్చు. "తొలుత నాణేలను సేకరించే ఆటను ప్రయోగాత్మకంగా పరీక్షించాం. మంచి ఫలితాలొచ్చాయి. స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్, ట్యాబ్‌లలో ఆటలు చూస్తూ ఈ పరికరం సాయంతో వ్యాయామం చేసేలా తీర్చిదిద్దాం. ఈ ఆవిష్కరణను విపణిలో తెచ్చేందుకు బయోటెక్నాలజీ ఇగ్నిషన్ గ్రాంట్ లభించింది. నిరుడు ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన ఇన్నోవేషన్ ఫెయిర్‌లో బంగారు పతకం దక్కింది. సెరిబ్రల్ పాల్సీ, మల్టిపుల్ స్క్లిరోసిస్ బాధితులకు ఈ పరికరంతో ఎంతో ప్రయోజనం ఉంటుంది" అన్నారు హబీబ్. రోగులు, ఆసుపత్రుల అవసరాలకు తగ్గట్టు 'ఆర్మ్ ఏబుల్'ను వేర్వేరుగా అభివృద్ధి చేస్తున్నారు.

ప్రజా రవాణా వ్యవస్థ ప్రక్షాళనకు సమగ్ర విధానం అవసరం: గడ్కరీ

దిల్లీ: దేశంలోని ప్రజా రవాణా వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సి ఉందని, ఇందుకు సమగ్ర విధానం అవసరమని కేంద్ర రహదారులు, నౌకాయాన శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. బుధవారం ప్రజారవాణా వ్యవస్థపై ట్రాన్స్‌పోర్ట్ ఫర్ లండన్ (టీఎఫ్ఎల్) సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. వాతావరణ కాలుష్యం పెరుగుతున్న దృష్ట్యా విద్యుత్తు, ఇథనాల్, మిథనాల్‌లతో నడిచే వాహనాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉందని చెప్పారు. టీఎఫ్ఎల్ సంస్థ ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్య విధానంలో 17 రవాణా యాజమాన్యాలతో కలిసి ఒకే బ్రాండు కింద ప్రజారవాణా వ్యవస్థను నిర్వహిస్తోందని చెప్పారు.

రైలు మార్గాల పనుల్లో వేగం పెంచాలి

- ఒప్పంద ప్రాజెక్టుల్లో నష్టాన్ని ఎవరు భరించాలి?
- కాజీపేట వ్యాగన్ వర్క్‌షాప్‌ను రైల్వేనే సొంతంగా చేపట్టాలి
- ఛైర్మన్, బోర్డు సభ్యులు హాజరైతేనే సమావేశాలతో ఉపయోగం
- దక్షిణ మధ్య రైల్వే జీఎంతో భేటీలో తెలంగాణ ఎంపీలు

ఈనాడు, హైదరాబాద్: ఏళ్లు గడిచిపోతున్నా తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులు పూర్తికావడం లేదని.. ప్రత్యేక దృష్టి సారించి పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర ఎంపీలు కోరారు. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలోనే అతి తక్కువ కిలోమీటర్ల రైలుమార్గం ఉందన్నారు. నిర్మాణంలో ఉన్నవాటిని సకాలంలో పూర్తిచేయడంతోపాటు సర్వేలు పూర్తయిన ప్రాజెక్టుల్ని మంజూరు చేయాలని కోరారు. కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో బుధవారమిక్కడ రైలు నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ తెలంగాణ ఎంపీలతో సమావేశమయ్యారు. మూడున్నర గంటలపాటు సాగిన ఈ భేటీలో ఎంపీలు జీఎంకు పలు ప్రతిపాదనలు అందించారు. సికింద్రాబాద్ స్టేషన్‌పై ఒత్తిడి తగ్గించేందుకు చర్లపల్లి, నాగులపల్లిలలో టెర్మినళ్లు నిర్మించాలని, ఎంఎంటీఎస్ రెండోదశలో ఆలస్యాన్ని నివారించాలని ఎంపీలు కోరారు. కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. "కొత్త ప్రాజెక్టుల్ని రైల్వే సొంతంగా చేపట్టడం లేదు. సంయుక్త భాగస్వామ్య ఒప్పందానికి తెలంగాణ ప్రభుత్వం ముందుకు రావడం లేదని అంటోన్న రైల్వే శాఖ.. ఈ విధానంలో చేపట్టే రైలు మార్గాల్లో నష్టం వస్తే ఎవరు భరించాలో చెప్పాలి. భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలపై రైల్వే బోర్డు స్పష్టతివ్వాలి" అని పేర్కొన్నారు. పెద్దపల్లి-జగిత్యాల మార్గాన్ని విద్యుద్దీకరించి, లోకల్ రైళ్లు నడపాలని వినోద్ కోరగా.. టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే పనులు మొదలవుతాయని జీఎం చెప్పారు. కాజీపేట వద్ద పీఓహెచ్ వ్యాగన్ వర్క్‌షాప్‌ను పీపీపీలో కాకుండా రైల్వేనే సొంతంగా నిర్మించాలని ఎంపీ డిమాండ్ చేశారు. మెదక్-మనోహరాబాద్ మధ్య కొత్త లైన్ చేపడితే ఉపయోగకరంగా ఉంటుందన్నారు.


రాష్ట్ర ఎంపీలతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న దక్షిణమధ్య రైల్వే జీఎం వినోద్ కుమార్ యాదవ్

రాయగిరి నుంచి కాజీపేట వరకు మూడోలైను

రాయగిరి నుంచి కాజీపేట వరకు మూడోలైను కావాలని.. సికింద్రాబాద్ నుంచి వరంగల్‌కు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ నడపాలని భువనగిరి ఎంపీ బూర నర్సయ్యగౌడ్ కోరారు. సూర్యాపేట-పాలకుర్తి-ఘన్‌పూర్ కొత్త మార్గం సర్వే పూర్తయి రెండేళ్లయినా పురోగతి లేకపోవడాన్ని ఎంపీలు నర్సయ్యగౌడ్, ఆనంద భాస్కర్‌లు ప్రశ్నించారు. నల్గొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. జీఎంతో సమావేశాల ద్వారా చిన్న చిన్న సమస్యలూ పరిష్కారం కావడం లేదని.. ఛైర్మన్, రైల్వే బోర్డు సభ్యులు హాజరుకావాలని డిమాండ్ చేశారు. కొత్త రైలు మార్గాల పనులు నెమ్మదిగా సాగుతున్నాయని.. క్షేత్రస్థాయి పర్యటనలకు వస్తే వేగంగా జరుగుతాయని జీఎంను పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్ కోరారు. పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల స్టేషన్లలో ముఖ్యమైన రైళ్లను ఆపాలని విజ్ఞప్తి చేశారు. మహబూబ్‌నగర్ ఎంపీ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సికింద్రాబాద్-మహబూబ్‌నగర్ డబ్లింగ్ పనులు చురుగ్గానే సాగుతున్నాయని, జీఎంతో సమావేశం సంతృప్తికరంగా సాగిందన్నారు.

నిర్లక్ష్యం.. చిన్న చూపు..

ఎంఎంటీఎస్ రెండో దశ పనుల ఆలస్యానికి తెలంగాణ ప్రభుత్వ నిర్లక్ష్యంతోపాటు రైల్వే శాఖ చిన్నచూపే కారణమని, రూ.816 కోట్లు ఇవ్వాల్సిన రాష్ట్ర ప్రభుత్వం రూ.160 కోట్లే మంజూరు చేసిందని కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ దత్తాత్రేయ విమర్శించారు. కార్మికులకు కనీస వేతనాల పెంపు రైల్వేలోనే అమలు జరక్కపోతే ప్రైవేటు సంస్థలు ఎలా చేస్తాయని జీఎంను ప్రశ్నించారు. ఎంపీలు సీతారాంనాయక్, పసునూరి దయాకర్, నంది ఎల్లయ్య, బీబీ పాటిల్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డిలు మాట్లాడుతూ ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపర్చాలని, రైలు మార్గం లేనిచోట్ల కొత్త ప్రాజెక్టులు మంజూరుచేయాలని కోరారు. గుంతకల్, నాందేడ్ డివిజన్ల పరిధిలోని కర్ణాటక, మహారాష్ట్ర ఎంపీలు కూడా ఈ భేటీకి హాజరయ్యారు.

నాలుగేళ్లలో చర్లపల్లి టెర్మినల్ పూర్తిచేస్తాం

సమావేశం అనంతరం జీఎం వినోద్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. చర్లపల్లిలో కొత్త టెర్మినల్ నిర్మాణం చేపట్టి నాలుగేళ్లలో పూర్తిచేస్తామని చెప్పారు. నాగులపల్లి టెర్మినల్‌కు రాష్ట్ర ప్రభుత్వాన్ని భూమి అడిగామని.. ఎంఎంటీఎస్ 2వ దశను 2018 డిసెంబరు నాటికి పూర్తిచేస్తామన్నారు. భద్రతకు ప్రాధాన్యమిస్తున్నామని 100 చోట్ల ఆర్వోబీలు నిర్మిస్తామని, 50 శాతం నిధులతో ముందుకురావాలని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశామని చెప్పారు. కాజీపేట నుంచి కరీంనగర్ వయా హుజూరాబాద్ కొత్త మార్గానికి సర్వే పూర్తయిందని.. బోర్డుకు నివేదిక పంపినట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

బ్రిటన్‌లో ముస్లింలను రెచ్చగొట్టి జిహాదీలుగా మార్చడానికి లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు, ముంబయి ఉగ్రదాడుల సూత్రధారి హఫీజ్ సయీద్ 1990లో బ్రిటన్‌లో పర్యటించాడని బీబీసీ పరిశోధక కథనం వెల్లడించింది. ప్రస్తుతం జమాత్ ఉద్ దవా సంస్థకు అధిపతిగా ఉన్న సయీద్ 1995లో బ్రిటన్ మసీదుల్లో పర్యటించాడని, ఆ పర్యటన గురించి లష్కరే మ్యాగజీన్‌లోనూ ప్రచురించారని కథనం పేర్కొంది.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జాతీయ రికార్డు

- మంత్రి హరీశ్‌రావు వెల్లడి

గజ్వేల్, న్యూస్‌టుడే: కాళేశ్వరం ప్రాజెక్టును కేవలం రెండేళ్లలో నిర్మించి తెలంగాణ ప్రభుత్వం జాతీయ రికార్డు సృష్టించబోతోందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో బుధవారం నిర్వహించిన తెరాస కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో తెలంగాణ సాధించుకున్నామని, ఇప్పుడు అవన్నీ సాధిస్తున్నామన్నారు. రేయింబవళ్లు వేగంగా సాగుతోన్న ప్రాజెక్టు పనులు చూసి దిల్లీ ఇంజినీర్ల బృందం విస్తుపోయిందని చెప్పారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధితో అన్ని రాష్ట్రాలు ఇటువైపే చూస్తున్నాయన్నారు. గొర్రెల పంపిణీ పథకాన్ని కర్ణాటక కాంగ్రెస్ మంత్రి రేవణ్ణ అభినందిస్తే, హరితహారానికి దిల్లీ మంత్రి కితాబు ఇచ్చారన్నారు. గజ్వేల్ మండలం కోమటిబండలోని మిషన్‌భగీరథ పథకాన్ని చూసిన బిహార్ ఉపముఖ్యమంత్రి సుశీల్‌కుమార్ మోదీ ఇక్కడి అభివృద్ధిని ఎంతగానో మెచ్చుకున్నారన్నారు. దీంతో రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలకు దడ మొదలైందన్నారు. 24 గంటల విద్యుత్తు ఇస్తామంటే అదో విచిత్రమేనని అసెంబ్లీలో జానారెడ్డి ఎద్దేవా చేశారని, ఇచ్చి చూపిస్తే తెరాస కార్యకర్తగా నడుస్తానని ప్రకటించారన్నారు. ప్రభుత్వం ఇప్పుడు నిరంతర విద్యుత్తు అమలు చేస్తోందని, జానారెడ్డి ప్రకటనను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ల ఛైర్మన్లు నర్సారెడ్డి, భూంరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి పాల్గొన్నారు.


గజ్వేల్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

పిటిషనర్ వినతిని పిల్‌గా పరిగణించండి!

- కొన్ని డీఈడీ, బీఈడీ ప్రవేశాలపై రిజిస్ట్రీని ఆదేశించిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: కొన్ని బీఈడీ, డీఈడీ కళాశాలల యాజమాన్యం ప్రవేశాల కోసం సమర్పించిన బోగస్ విద్యార్థుల జాబితాను ఆమోదించకుండా అధికారులను ఆదేశించాలని దాఖలైన వినతులను పరిశీలించి.. ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించాలని రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీ భట్ ఇటీవల ఆదేశాలు జారీచేశారు. గుంటూరు జిల్లా వినుకొండలోని ఎస్సార్డీఈడీ, జీఎస్సార్ డీఈడీ కాలేజ్(బాలికలు), సలమ్ డీఈడీ, అమరావతి డీఈడీ కళాశాలలు, ప్రకాశం జిల్లా కందుకూరు మండలం ఓగూరు గ్రామంలోని ఎస్ఆర్ డీఈడీ, యర్రగొండపాలెం గ్రామంలోని షారోన్ డీఈడీ కళాశాల, పశ్చిమగోదావరి జిల్లా ఆత్రేయపురంలోని మహాత్మాగాంధీ డీఈడీ కళాశాలల్లో 2016-17, 17-18 విద్యా సంవత్సరానికి మొత్తం 1000 సీట్ల కౌన్సిలింగ్‌లో కేవలం 163 మంది విద్యార్థులు మాత్రమే చేరారని జర్నలిస్ట్ నవులూరి మాధవరావు హైకోర్టును ఆశ్రయించారు. కానీ మొత్తం సీట్లు భర్తీ అయినట్లు ప్రభుత్వం నుంచి ఆయా కళాశాలలు ఆమోదం పొందేందుకు యత్నిస్తున్నాయని పేర్కొన్నారు. మరోవైపు వినుకొండలోని వివేకానంద బీఈడీ కళాశాల, అలీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, ప్రకాశం జిల్లా ఓగూరులోని అజాద్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, ప్రకాశం జిల్లా కందుకూరులోని నవ చైతన్య కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ 2017-18, 2018-19 సంవత్సరాల విద్యార్థుల ప్రవేశాల జాబితాను ఆమోదించకుండా అధికారుల్ని ఆదేశించాలని మరో వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యవహారాలన్ని ప్రజాహితంతో ముడిపడి ఉన్నాయని పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది సత్యప్రసాద్ వాదనలు వినిపించారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. గతంలో జారీ చేసిన ఉత్తర్వుల్ని వెనక్కి తీసుకుంటూ.. ఈ వ్యాజ్యాల్ని ప్రజాహిత వ్యాజ్యాలుగా పరిగణించే వ్యవహారాన్ని పరిశీలించాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించారు.

రేపు నింగిలోకి పీఎస్ఎల్‌వీ

- నేడు ఉదయం 5.28 గంటలకు కౌంట్‌డౌన్

శ్రీహరికోట, న్యూస్‌టుడే: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సతీశ్ ధవన్ అంతరిక్ష పరిశోధన కేంద్రం షార్ నుంచి శుక్రవారం ఉదయం 9.28 గంటలకు పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్-సి40 నింగిలోకి దూసుకెళ్లనుంది. ఈ రాకెట్ 31 ఉపగ్రహాలను నింగిలోకి మోసుకెళ్లి నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెడుతుంది. కౌంట్‌డౌన్ కార్యక్రమం గురువారం ఉదయం 5.28 గంటలకు ప్రారంభంకానుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు షార్‌లో చురుగ్గా జరుగుతున్నాయి. షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో బుధవారం మధ్యాహ్నం నుంచి రాకెట్ సన్నద్ధత సమావేశం(ఎంఆర్ఆర్) జరిగింది. ఇందులో రాకెట్‌కు సంబంధించిన పలు విషయాలను చర్చించారు. ఇందులో అధికారికంగా ప్రయోగ తేదీని ఖరారు చేశారు. రాత్రి లాంచ్ ఆథరైజేషన్ సమావేశం (ల్యాబ్) జరిగింది. ఇందులో ప్రయోగానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పీఎస్ఎల్‌వీ మనదేశానికి చెందిన కార్టోశాట్-2ఇ ఉపగ్రహంతోపాటు ఒక నానో, మైక్రో శాటిలైట్లను కక్ష్యలో ప్రవేశపెడుతుంది. అలాగే విదేశాలకు చెందిన 28 ఉపగ్రహాలనూ నింగిలోకి పంపనున్నారు. ఇందులో 25 నానో, మూడు మైక్రో ఉపగ్రహాలు ఉన్నాయి. కెనడా, ఫిన్‌లండ్, ఫ్రాన్సు, కొరియా, యూకే, యూఎస్ఏకు చెందిన ఉపగ్రహాలు ఉన్నాయి. 2016 ఆగస్టు తర్వాత తాజాగా పీఎస్ఎల్‌వీ ప్రయోగం చేసేందుకు ఇస్రో సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఇస్రో ఛైర్మన్ ఏఎస్ కిరణ్‌కుమార్ గురువారం షార్‌కు రానున్నారు.

రాజకీయ పార్టీలు బీసీ విధానం ప్రకటించాలి: జాజుల

కవాడిగూడ(హైదరాబాద్), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు బీసీ విధానం ప్రకటించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ కోటా కింద సీట్లు పొంది ప్రజాప్రతినిధులుగా ఎన్నికైనవారు బీసీల సంక్షేమం కోసం పెదవి విప్పడం లేదని ఆయన విచారం వ్యక్తం చేశారు. బీసీ ప్రజలను రాజకీయంగా చైతన్యవంతులను చేసేందుకు బీసీ చైతన్య సమ్మేళనాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 12న వరంగల్, నల్గొండ జిల్లాలకు సంబంధించి దేవరకొండలో, 20న యాదాద్రి భువనగిరి జిల్లాకు సంబంధించి చౌటుప్పల్‌లో, 28న హైదరాబాద్‌లో, 30న నిజామాబాద్‌కు సంబంధించి బోధన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.


సంక్రాంతి పండగ నిర్ణయంలో మార్పు లేదని ధ్రువీకరిస్తూ రమణాచారికి పత్రాన్ని అందజేస్తున్న తెలంగాణ విద్వత్సభ ప్రతినిధులు

15నే మకర సంక్రాంతి
తెలంగాణ విద్వత్సభ స్పష్టీకరణ

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: మకర సంక్రాంతి ఈ నెల 15నే జరుపుకోవాలని తెలంగాణ విద్వత్సభ స్పష్టం చేసింది. 14వ తేదీనే పండగంటూ సామాజిక మాధ్యమాలు, టీవీ చర్చల ద్వారా కొందరు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని తెలిపింది. జనవరి 14న భోగి, 15న మకర సంక్రాంతి, 16 కనుమ పండగలను జరుపుకోవాలని ఇటీవల జరిగిన జ్యోతిష సమ్మేళనంలో రాష్ట్ర సిద్ధాంతులందరూ ముక్తకంఠంతో నిర్ణయించినట్లు తెలంగాణ విద్వత్సభ అధ్యక్షుడు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి వెల్లడించారు. పంచాంగాల్లో ఇవే తేదీలను ప్రచురించామని, ఆ ప్రకారమే ప్రభుత్వం కూడా సెలవులను ప్రకటించినట్లు పేర్కొన్నారు. కొందరు కావాలని ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారన్నారు. బుధవారం తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, బ్రహ్మణ పరిషత్ అధ్యక్షుడు కె.వి రమణాచారిని బుధవారమిక్కడ కలిసి సంక్రాంతి నిర్ణయంలో మార్పులేదని ధ్రువీకరిస్తూ విద్వత్సభ ప్రతినిధి బృందం పత్రాన్ని అందజేసింది. బృందంలో గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి, దర్శనం శర్మ తదితరులు ఉన్నారు.

బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
మంత్రి జోగు రామన్న

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: బీసీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగురామన్న తెలిపారు. బీసీ కుల సహకార సమాఖ్యల్లో సభ్యులుగా చేరేందుకు బీసీలకు చెందిన ఆయా వర్గాల వారికి అవకాశమిస్తున్నట్లు, సమాఖ్యల పరిధిలోని సంఘాల్లో సభ్యుల సంఖ్యను పది నుంచి ఐదుకి తగ్గించాలని యోచిస్తున్నట్లు చెప్పారు. ఈ నెలాఖరు నుంచి రాష్ట్రవ్యాప్తంగా బీసీ మేళాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. బుధవారం సచివాలయంలో బీసీ సంక్షేమశాఖ వెబ్‌సైట్ http://tsbcwd.cgg.gov.in తో పాటు సహకార సమాఖ్యల్లో సభ్యులుగా చేరేందుకు రూపొందించిన దరఖాస్తు, అటవీశాఖ కాలమానినిలను ఆయన ఆవిష్కరించారు. సమాఖ్యల్లోని కుల సహకార సంఘాల్లో సభ్యత్వం స్థానికంగానే పొందేందుకు వీలుగా వైబ్‌సైట్, నిబంధనలు రూపొందించామని మంత్రి వివరించారు. కార్యక్రమంలో బీసీశాఖ కార్యదర్శి బుర్రావెంకటేశం, అదనపు సంచాలకులు అలోక్‌కుమార్, ఎంబీసీ కార్పొరేషన్ ఛైర్మన్ తాడూరి శ్రీనివాస్, అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపకారవేతనాల దరఖాస్తుకు మరో అవకాశం

ఈనాడు, హైదరాబాద్: బోధనారుసుంలు, ఉపకారవేతనాల కోసం 2017-18 విద్యాసంవత్సరానికి ఇప్పటి వరకు దరఖాస్తు చేయని విద్యార్థులు, ఈ-పాస్‌లో నమోదు కాని కళాశాలలకు ఈ నెల 11నుంచి ఫిబ్రవరి 10వరకు అవకాశమిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమశాఖ కార్యదర్శి డాక్టర్ బుద్ధప్రకాష్‌జ్యోతి, కమిషనర్ కరుణాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఈ విద్యాసంవత్సరానికి ఇదే చివరి అవకాశామని స్పష్టం చేశారు. కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసిన విద్యార్థుల దరఖాస్తుల్లో అదనపు వివరాల నమోదుకు 'ఎడిట్' ఐచ్ఛికాన్ని కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. 2016-17 విద్యాసంవత్సరానికి రూ.1700 కోట్లను విద్యార్థులు, కళాశాలల ఖాతాలకు పంపించామని వెల్లడించారు. 2017-18 విద్యాసంవత్సరానికి సంబంధించి చివరి ఏడాది విద్యార్థులకు ఉపకారవేతనాలు, బోధనారుసుంల చెల్లింపు ప్రక్రియను ప్రారంభించామన్నారు.

పంచాయతీలకు 'ప్రత్యక్ష' ఎన్నికలే నిర్వహించాలి
తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ డిమాండ్

సోమాజిగూడ(హైదరాబాద్), న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీలకు ప్రత్యక్ష పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ డిమాండ్ చేసింది. ప్రభుత్వం తెస్తున్న కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని తాము స్వాగతిస్తున్నామని పేర్కొంది. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఛాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి బాదేపల్లి సిద్ధార్థ తదితరులు మాట్లాడారు. పరోక్ష పద్ధతి ద్వారా ఎన్నికలు నిర్వహిస్తే సర్పంచి.. తన పదవీ కాలమంతా వార్డు కమిటీ సభ్యులను కాపాడుకునేందుకే సరిపోతుందని, సేవలు ఎలా అందించగలరని ప్రశ్నించారు. 73వ రాజ్యాంగ సవరణలు అమలు చేయాలని, 29 అధికారాలను పంచాయతీలకు బదలాయించాలన్నారు. పంచాయతీకి రెండు పర్యాయాలు అదే రిజర్వేషన్ ఉండాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమన్నారు. ప్రత్యక్ష విధానంలో ఎన్నికలు నిర్వహించకుంటే ప్రజా ఉద్యమాన్ని చేపడతామని, అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న పంచాయతీలకు సరిపడా గ్రామ కార్యదర్శుల నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు.

బడుల్లో దారుణపోకడల నిరోధానికి చర్యలు చేపట్టాలి

దిల్లీ: పాఠశాలల్లో లైంగికపరమైన అఘాయిత్యాలు...భౌతిక దాడులు, మానసిక వేధింపుల వంటి పోకడలను సమర్థంగా నిరోధించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాల్సిందిగా రాష్ట్రాలను కేంద్రం కోరింది. కేంద్రమానవ వనరుల అభివృద్ధిశాఖ ఈ విషయాన్ని లిఖితపూర్వకంగా తెలియచేసింది. పాఠశాలల్లో ఇలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనపుడు ఎలా స్పందించాలి....రక్షణ కోసం ఏం చేయాలి అనే విషయంపై విద్యార్థులకు సునిశిత శిక్షణనివ్వాలని తన లేఖలో కోరింది. ఇలాంటి పరిస్థితులు ఎదురైనపుడు ఏ విద్యార్థి అయినా ఎలా స్పందిచాలనే అంశంపై 'లెర్నింగ్ వితౌట్ ఫియర్' పేరుతో 'యునెస్కో' రూపొందించిన కొన్ని గోడపత్రికలను కూడా రాష్ట్రాలకు పంపింది. పాఠశాలల్లో ఇలాంటి పోకడల వల్ల ప్రపంచవ్యాప్తంగా లక్షలాది చిన్నారులు దుష్ప్రభావాలకు గురౌతున్నారు. కుటుంబాలు దెబ్బతింటున్నాయని మానవ వనరుల అభివృద్ధిశాఖ తెలిపింది. శిక్షణకు సంబంధించి అవసరమైన సమాచారం, గోడపత్రికలు ఇతర సామగ్రిని అందచేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది.

పార్కింగ్ నుంచి గద్దెల వరకు ఉచిత ప్రయాణం
'మేడారం గైడ్' యాప్ ఆవిష్కరణ

ఈనాడు, వరంగల్: మేడారం జాతరకు వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని, ప్రైవేటు పార్కింగ్ నార్లాపూర్ నుంచి గద్దెల వరకు భక్తులు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే వీలు కల్పిస్తున్నామని ఆర్టీసీ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ తెలిపారు. జాతర నేపథ్యంలో బుధవారమిక్కడ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న 10 వేల బస్సుల్లో 4200 బస్సులను జాతర కోసమే వినియోగిస్తున్నామని చెప్పారు. ప్రతి బస్‌కు ఒక కోడ్ ఉంటుందని, మేడారంలో ఆర్టీసీ తరపున ప్రత్యేకంగా 50 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. గత జాతరలో ఆర్టీసీ 15 లక్షలకుపైగా భక్తులను చేరవేసిందని, ఈ సారి అంతకన్నా ఎక్కువ మంది ప్రయాణించే అవకాశం ఉన్నందున 12000 మంది ఆర్టీసీ అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారని వివరించారు. అనంతరం 'మేడారం గైడ్' యాప్‌ను ఛైర్మన్ సత్యనారాయణ, ఎండీ ఎం.వి.రమణారావులు ఆవిష్కరించారు.


మేడారం గైడ్' యాప్‌ను విడుదల చేస్తున్న ఆర్టీసీ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ, ఎండీ రమణారావు తదితరులు

ప్రమాదంలో మా'నవ' వనరులు

- ప్రపంచవ్యాప్తంగా 12.50 లక్షలమంది మృతి
- వ్యక్తిగతంగానే కాదు.. వ్యవస్థకూ నష్టమే



రోడ్డు ప్రమాదాల్లో ఏటా ప్రపంచవ్యాప్తంగా 12.50 లక్షలమంది చనిపోతున్నారు. దానివల్ల జరిగే ఆర్థిక నష్టం అంతాఇంతా కాదు. ఎంతో విలువైన మానవ వనరులను నష్టపోవలసి వస్తోంది. ఈ నేపథ్యంలో రహదారి భద్రతపై పెట్టే పెట్టుబడులకు ఎన్నో రెట్లు అధిక ప్రతిఫలం ఉంటుందని గమనించాలి. దీన్ని గుర్తించి ఎంతో విలువైన ప్రాణాలను కాపాడటానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటాయని ఆశిస్తున్నా

- మైఖేల్ బ్లూమ్‌బర్గ్, మూడుసార్లు న్యూయార్క్ నగర మేయర్, పారిశ్రామికవేత్త

స్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధనకు మానవ సంపదే కీలకం. ఒక దేశ సంపదలో మూడింట రెండు వంతులు మానవ సంపదే. ఇది సహజ వనరుల కంటే, ఉత్పాదక మూలధనం కంటే ఎంతో ఎక్కువ.

- టోక్యోలో గత నెలలో జరిగిన యూనివర్సల్ హెల్త్‌కేర్ (యూహెచ్‌సీ) ఫోరం ప్రారంభ ఉపన్యాసంలో ప్రపంచ బ్యాంకు ఛైర్మన్ జిమ్ యాంగ్ కిమ్

ఎవరైనా ఒక వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణిస్తే, ఆ వ్యక్తి కుటుంబంపై పిడుగు పడినట్లే. దానివల్ల కలిగే మానసిక కష్టం అంతాఇంతా కాదు. ఆ కుటుంబం కకావికలమైపోతుంది. బంధుమిత్రులు అంతులేని శోకంలో మునిగిపోతారు. దీంతో పాటు ఆ కుటుంబానికి, దేశానికి ఆర్థికంగా జరిగే నష్టం అపారమని ప్రపంచ బ్యాంకు- బ్లూమ్‌బర్గ్ ఫిలాంత్రఫీస్' నివేదిక స్పష్టం చేసింది. రోడ్డు ప్రమాదాల వల్ల అభివృద్ధి చెందిన దేశాల కంటే తక్కువ, మధ్య ఆదాయాలు గల దేశాలైన చైనా, భారత్, ఫిలిప్పీన్స్, టాంజానియా, థాయ్‌లాండ్ ఎక్కువగా నష్టపోతున్నాయని పేర్కొంది.

నష్టం అపారం...

- ఏటా రోడ్డు ప్రమాదాల్లో ప్రపంచవ్యాప్తంగా 12.50 లక్షల మంది చనిపోతుంటే, మరో 2 కోట్ల నుంచి 5 కోట్ల మంది గాయపడుతున్నారు.



- ఇలా చనిపోతున్న వారిలో ఎక్కువమంది యువతే ఉంటున్నారు. 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయసు కలవారు అధికంగా ఉంటున్నారు. ఉత్పత్తి ప్రక్రియలో క్రియాశీలకంగా ఉండే యువత చనిపోవటం సమాజానికి తీవ్ర నష్టదాయకం.
- ప్రమాదాలను సగానికి తగ్గించుకోగలిగితే ప్రపంచవ్యాప్తంగా వచ్చే 24 ఏళ్ల పాటు తలసరి స్థూల జాతీయ ఆదాయం 15 శాతం నుంచి 22 శాతం పెరుగుతుంది.
- రోడ్డు ప్రమాదాలను తగ్గించగలిగితే లభించే అదనపు ఆదాయం (ఆయా దేశాల జీడీపీలో వాటా..) టాంజానియాలో 7.1 శాతం, ఫిలిప్పీన్స్‌లో 7.2 శాతం, భారత్‌లో 14 శాతం, చైనాలో 15 శాతం, థాయ్‌ల్యాండ్‌లో 22.2 శాతం మేరకు ఉండవచ్చు.

బ్రసీలియా ప్రకటన

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) సహకారంతో బ్రెజిల్ రాజధాని బ్రసీలియాలో 2015 నవంబరు 18- 19 తేదీల్లో రహదారి భద్రతపై అంతర్జాతీయ సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న దేశాలు అంగీకరించిన ఒప్పందమే బ్రసీలియా ప్రకటనగా ప్రాచుర్యంలోకి వచ్చింది. 2020 నాటికి రోడ్డు ప్రమాదాలను సగానికి సగం తగ్గించాలని ఈ సమావేశంలో పాల్గొన్న దేశాలు నిర్ణయించాయి. ఇందులో భారతదేశం కూడా భాగస్వామి అయింది. దానికి అనుగుణంగా రోడ్డు ప్రమాదాల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకోవాలి. కానీ మనదేశం ఆ లక్ష్యానికి సుదూరంలోనే కనిపిస్తోంది. ఇటీవల కాలంలో ప్రమాదాలు కొంత తగ్గాయి కానీ, లక్ష్యం మేరకు తగ్గుదల కనిపించటం లేదు.

ఆస్ట్రేలియా అనుభవం

రోడ్డు ప్రమాదాలను అదుపు చేయటంలో ఆస్ట్రేలియా సాధించిన విజయాలను ఈ నివేదిక ప్రస్తావించింది. ఆస్ట్రేలియాలో 1970 ప్రాంతంలో ఒక లక్షమంది జనాభాకు 30 మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోయేవారు. 2010 నాటికి ఇది లక్షమంది జనాభాకు 5కు తగ్గింది. రహదారులపై వేగాన్ని నిరోధించటంతో పాటు ఇంకెన్నో జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రమాదాలను తగ్గించగలిగింది. వాహనాల్లో భద్రతా ప్రమాణాలను పెంచింది. మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిపై ఉక్కుపాదం మోపింది. రహదారి భద్రతపై పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టింది.

ఓఈసీడీ దేశాల్లో...

రోడ్డు ప్రమాదాలను అదుపుచేయటానికి ప్రభుత్వాలు తీసుకున్న చర్యలు ఓఈసీడీ (ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో-ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్) దేశాల్లోనూ సత్ఫలితాలు ఇచ్చాయి. ఓఈసీడీలో 35 దేశాలకు సభ్యత్వం ఉంది. ఇందులో అత్యధికంగా ఐరోపా దేశాలు ఉన్నాయి. ఈ దేశాల్లో 1990 నుంచి 2015 మధ్యకాలంలో లక్ష జనాభాకు రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య 22 నుంచి 8 మందికి తగ్గిపోయింది.

ప్రభుత్వాల పాత్ర కీలకం

- రోడ్డు ప్రమాదాలను తగ్గించటంలో ప్రభుత్వాలదే కీలక పాత్ర. జాతీయ రహదారి భద్రతా ప్రణాళికను రూపొందించాలి. జాతీయ రహదారి భద్రతా సంస్థను నెలకొల్పి దాన్ని సారథ్యంలో భద్రతా చర్యలను అమలు చేయాలి.
- ప్రమాదాలకు కారణాలను గుర్తించి నివారించాలి. ఉదాహరణకు రోడ్ల మధ్యలో డివైడర్లు నెలకొల్పి, వాహనాలు ఎదురెదురు రాకుండా చూడటం, అవసరమైనచోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయటం, రోడ్డు దాటే వారి కోసం ప్రత్యేకమైన హెచ్చరికలు, సిగ్నళ్ల ఏర్పాటు, వాహనాలు నిర్దేశిత భద్రతా ప్రమాణాలతో తయారయ్యేలా చూడటం తప్పనిసరి అవసరాలు.
- ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రుల ప్రాణాలు కాపాడేందుకు తక్షణ వైద్య సదుపాయం సిద్ధంగా ఉంచాలి.
- వాహన చోదకుల్లో, ప్రయాణికుల్లో రహదారి భద్రతపై అవగాహన పెంపొందించాలి.

ఎంత సంపదో...

రోడ్డు ప్రమాదాలను సగం మేరకు తగ్గించుకోగలిగితే మనదేశానికి ఎంతో మేలు జరుగుతుంది. ప్రమాదాలను సగానికి తగ్గించుకోవటమే కాకుండా, 2038 వరకూ ప్రమాదాల సంఖ్య పెరగకుండా జాగ్రత్త వహించగలిగితే మనదేశంలో జాతీయ సంపద రూ.17.64 లక్షల కోట్ల మేరకు పెరుగుతుంది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

భారత దేశాభివృద్ధితో అనుసంధానమవ్వండి

- **భారత సంతతి విదేశీ**

పార్లమెంటేరియన్లకు రాష్ట్రపతి పిలుపు

దిల్లీ: తమ తమ దేశాల ప్రాధాన్యతలను భారత దేశ అభివృద్ధితో అనుసంధానించాలని భారత మూలాలున్న విదేశీ పార్లమెంటేరియన్లకు రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ సూచించారు. దీనివల్ల అద్భుతమైన ఫలితాలు సమకూరుతాయని, పరస్పర లబ్ధికలుగుతుందని తెలిపారు. దిల్లీలో బుధవారం భారత సంతతి(పీఐఓ) విదేశీ పార్లమెంటేరియన్ల అంతర్జాతీయ సదస్సు ప్రారంభ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 23 దేశాలకు చెందిన ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు. తమ పూర్వీకుల దేశానికి, ప్రస్తుతం వారు నివసిస్తున్న దేశానికి మధ్య భారత సంతతి పార్లమెంటేరియన్లు సజీవ వారధుల్లాంటి వారిని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, బహుళత్వవాదం, భిన్నత్వం భారతీయులను గర్వపడేలా చేసే అంశాలని, అవే మన బలమని తెలిపారు. ఉదారమైన ఈ విలువలను భారత సంతతి ప్రజలు విదేశాలకు తమ వెంట తీసుకెళ్లి, ఆచరించటం వల్ల అక్కడి ప్రజల ఆదరాభిమానాలను గెల్చుకోగలిగారని వివరించారు. భారీ పెట్టుబడులకు, వ్యాపారాలకు భారత్ విస్తృతమైన అవకాశాలను కల్పిస్తోందని, 130 కోట్ల మంది భారతీయుల అభివృద్ధి యావత్తు ప్రపంచ శాంతికి, సుస్థిరతకు, పురోగతికి ఉపయోగపడుతుందని తెలిపారు. సదస్సును అంతర్రాష్ట్రీయ సహయోగ్ పరిషత్‌తో పాటు భారత సంతతి పార్లమెంటేరియన్ల వాణిజ్య,పరిశ్రమల మండలి, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహించాయి.

జాతి నిర్మాణంలో రైల్వేలది కీలకపాత్ర

దిల్లీ: ప్రజలకు సేవలందించటంలో, జాతి నిర్మాణంలో భారతీయ రైల్వేలు కీలకపాత్ర పోషిస్తున్నాయని రాష్ట్రపతి కోవింద్ తెలిపారు. దేశ రైల్వే సర్వీసెస్‌కు చెందిన ప్రొబెషనరీ అధికారులను ఉద్దేశించి బుధవారం ఆయన ప్రసంగించారు. ఒక్క 2015-16సంవత్సరంలోనే 800కోట్ల మంది ప్రయాణికులను రైల్వేలు వారి గమ్యస్థానాలకు చేర్చాయని చెప్పారు. కోట్ల మంది ప్రజలకు సేవచేసే అవకాశాన్ని పొందిన ప్రొబెషనరీ అధికారులు ఆశావాదం, సానుకూల దృక్పథంతో పనిచేయాలని కోవింద్ సూచించినట్లు రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటనలో తెలిపింది.

సిక్కుల ఊచకోతపై కొత్త సిట్ ఏర్పాటుకు సుప్రీం నిర్ణయం

దిల్లీ: నాటి సిక్కుల ఊచకోతకు సంబంధించి 186 కేసులను తిరిగి విచారించేందుకు కొత్తగా త్రిసభ్య ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేయనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. ఈ మేరకు పేర్లను సూచించాల్సిందిగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌మిశ్ర నేతృత్వంలోని జస్టిస్ ఏ.ఎం.ఖన్విల్కర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం కేంద్రాన్ని అడిగింది. హైకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో..పదవీ విరమణ చేసిన (డీఐజీకి తక్కువ కాని హోదా), ప్రస్తుతం పనిచేస్తున్న ఇద్దరు పోలీసు అధికారులు ఇందులో ఉంటారని ధర్మాసనం తెలిపింది. 1984లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ హత్యానంతరం సిక్కులపై జరిగిన దాడుల్లో ఒక్క దిల్లీలోనే 2,733 మంది ప్రాణాలు కోల్పోయారు. నాటి హింసాత్మక ఘటనలకు సంబంధించి మొత్తం 250 కేసులు నమోదుకాగా.. 9 కేసుల దర్యాప్తు కొనసాగుతోందని, మిగతావి మూసివేసినట్లు గతంలో కేంద్రం తెలిపింది. ఈమేరకు 241 కేసులను మూసివేస్తూ నాటి సిట్ తీసుకున్న నిర్ణయాన్ని పరిశీలించేందుకు గత ఏడాది ఆగస్టు 16న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు జస్టిస్ జె.ఎం.పంచాల్, జస్టిస్ కె.ఎస్.పి.రాధాకృష్ణన్‌లతో కూడిన పర్యవేక్షక సంఘాన్ని సర్వోన్నత న్యాయస్థానం నియమించింది. ఈమేరకు 186 కేసులను విచారణ లేకుండానే మూసివేసినట్లు గుర్తించిన సంఘం సమగ్ర నివేదికను సమర్పించింది.

'ఎయిర్‌సెల్-మ్యాక్సిస్' కేసు విచారణ నుంచి వైదొలగిన జస్టిస్ దీపక్ మిశ్ర

దిల్లీ: ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ లావాదేవీల కేసుకు సంబంధించి ఒక విచారణ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర బుధవారం వైదొలగారు. తమ ఆస్తులు జప్తు చేసుకోవాలన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కేంద్ర మాజీ మంత్రి చిదంబరం కుమారుడు కార్తి చిదంబరం, మరో రెండు సంస్థలు దాఖలు చేసిన విజ్ఞప్తులపై విచారణ నుంచి ఆయన వైదొలగారు. ఈ ధర్మాసనంలో ఆయనతో పాటు న్యాయమూర్తులు జస్టిస్ ఎ.ఎం.ఖాన్‌విల్కర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్ కూడా ఉన్నారు. 2జీ స్పెక్ట్రమ్ కేటాయింపులకు సంబంధించిన కేసు విచారణలో దిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా తాను వాదనలు విన్నానని, అందువల్ల ఈ పిటిషన్లు వినదల్చుకోలేదని జస్టిస్ దీపక్ మిశ్ర చెప్పారు. జస్టిస్ అరుణ్‌మిశ్ర నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్లను విచారిస్తుందని ధర్మాసనం చెప్పింది.

బడ్జెట్‌పై నిపుణులతో ప్రధాని మేధోమథనం

- మూడున్నర గంటలపాటు సుదీర్ఘ సమాలోచనలు
- రైతుల ఆదాయం రెట్టింపు చేయడంపై ప్రత్యేక దృష్టిసారించిన నరేంద్ర మోదీ

ఈనాడు - దిల్లీ

దేశ ఆర్థికాభివృద్ధిని పెంపొందించటంపై ప్రత్యేక దృష్టి సారించిన కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా తీసుకోవాల్సిన చర్యలపై ఆర్థిక నిపుణులతో చర్చించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోది బుధవారం నీతి ఆయోగ్ కార్యాలయంలో వివిధ రంగాలకు చెందిన 40 మంది ఆర్థికవేత్తలు, నిపుణులతో సమావేశమై సుదీర్ఘ సమాలోచనలు జరిపారు. 'ఆర్థిక విధానం- ముందున్న మార్గం' అనే అంశంపై జరిగిన ఈ భేటీలో విద్య, వైద్యం, వ్యవసాయం, విద్యుత్తు, రవాణాతో పాటు పలు రంగాలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. కేంద్ర ఆర్థిక, రైల్వే, విద్యుత్తు, రవాణా, వైద్య, వ్యవసాయ మంత్రులు, ఆయా శాఖలకు చెందిన కార్యదర్శులు పాల్గొన్నారు. సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ప్రధాన మంత్రి నిపుణులతో మేధోమథనం చేశారు. అంతకుముందు ఉదయం 11 గంటల నుంచి 40 మంది నిపుణులు, కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులు ఆరు బృందాలుగా విడిపోయి చర్చలు జరిపారు. ప్రభుత్వ కార్యదర్శులు తమ శాఖ అజెండా గురించి వివరించగా, నిపుణులు రాబోయే బడ్జెట్‌లో ప్రకటించాల్సిన అంశాలు, దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా తీసుకోవాల్సిన చర్యల గురించి సూచనలు చేశారు. స్థూల ఆర్థిక సమతౌల్యం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఉద్యోగాల కల్పన, విద్య, వైద్యం, తయారీరంగం, ఎగుమతులు, మౌలిక వసతులు, పట్టణ అనుసంధానంపై చర్చ సాగింది. అందులో వ్యక్తమైన ఆలోచనలన్నింటినీ క్రోడీకరించి సాయంత్రం ప్రధాని ముందు ఉంచారు. సమావేశం చాలా ప్రయోజనకరంగా జరిగిందని నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్‌కుమార్ వెల్లడించారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, రంగాలు, ప్రాంతాలకు చెందిన ప్రతినిధులకు ఇందులో అవకాశం లభించినట్లు చెప్పారు. సమావేశంలో ప్రధానమంత్రి ముఖ్యంగా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడంపై చర్చించారు. పెట్టుబడి ఖర్చుల తగ్గింపు, ఉత్పాదకత పెంపు, పండిన పంటకు మంచి ధర లభించేలా మార్కెట్ సౌకర్యం కల్పించడంపై చర్చ జరిగింది. కొన్ని వ్యవసాయ ఉత్పత్తుల కోసం ప్రత్యేకంగా జిల్లాల్లో క్లస్టర్స్ ఏర్పాటు చేయాలని కొందరు నిపుణులు సూచించారు. జాతీయ వైద్య కమిషన్ బిల్లుకు ముక్తకంఠంతో మద్దతు లభించింది. బిల్లుకు పార్లమెంటు ఆమోదం పొందడంలో ఇబ్బందులున్నప్పటికీ దాన్ని ముందుకు తీసుకెళ్లడం అభినందనీయమని ప్రధానికి తెలిపారు.

ఉద్యోగాలపై త్వరలో కొత్త గణాంకాలు: దేశంలో ఉద్యోగాల కల్పనకు సంబంధించి త్వరలో కొత్త గణాంకాలను విడుదల చేయబోతున్నట్లు నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్‌కుమార్ తెలిపారు. నిరుద్యోగంపై ప్రస్తుతం అందుబాటులో ఉన్న గణాంకాలు చాలా పాతకాలం నాటివని, తాజా లెక్కలను తేల్చడానికి నీతి ఆయోగ్ ఒక కార్యదళాన్ని (టాస్క్‌ఫోర్స్) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొన్ని రంగాల నిపుణులు, ఐఐఎంలకు చెందిన ప్రొఫెసర్లతో కూడిన ఈ కార్యదళం తాజాగా ఉద్యోగాలకు సంబంధించిన డేటాను ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐసీ లాంటి జాతీయ సంస్థల నుంచి సేకరించి విశ్లేషిస్తున్నట్లు తెలిపారు. త్వరలో తుది నివేదికను వెల్లడిస్తామన్నారు.


పార్టీ కీలక నేతలతో మోదీ భేటీ నేడు

దిల్లీ: భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్ షా సహా పార్టీకి చెందిన పలువురు కీలక నేతలతో ప్రధాని నరేంద్ర మోదీ గురువారం భేటీ కానున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శులంతా ఈ సమావేశంలో పాల్గొననున్నారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులపై వారు చర్చించే అవకాశముంది. కర్ణాటక, మేఘాలయ, త్రిపుర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తాజా సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఫేస్‌బుక్‌లో టాప్ లేపారు

2017లో భారత ప్రభుత్వ, రాజకీయ రంగాలకు సంబంధించి అత్యున్నత ర్యాంకింగ్ సాధించిన ఫేస్‌బుక్ పేజీలు..

రాజ్యసభ సభ్యుల్లో..



సచిన్ తెందుల్కర్ | ఆర్.కె.సిన్హా | అమిత్ షా

లోక్‌సభ సభ్యుల్లో...



నరేంద్ర మోదీ | అసదుద్దీన్ ఒవైసీ | భగవంత్ మాన్

కేంద్ర మంత్రుల్లో...



నరేంద్ర మోదీ | పియూష్ గోయల్ | కిరెణ్ రిజిజు

ముఖ్యమంత్రుల్లో...



యోగి ఆదిత్యనాథ్ | వసుంధరా రాజె | విజయ్ రూపానీ



అత్యున్నత విభాగాల్లో..
- ప్రధాని కార్యాలయం
- రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్
- నీతి ఆయోగ్

మంత్రిత్వశాఖల్లో..
- విదేశీ వ్యవహారాల శాఖ
- సమాచార, ప్రసారాల శాఖ
- రైల్వే

ప్రభుత్వ కార్యక్రమాల్లో..
- మైగవ్ ఇండియా
- డిజిటల్ భారత్
- భారత్‌లో తయారీ

రాజకీయ పార్టీల్లో..
- భాజపా
- ఆమ్ ఆద్మీ పార్టీ
- కాంగ్రెస్

ప్రజల నుంచి వచ్చిన స్పందనలు, షేరింగ్‌లు, కామెంట్ల సంఖ్య ప్రాతిపదికన ర్యాంకింగ్ ఇచ్చారు

2017 జనవరి 1 నుంచి 2017 డిసెంబరు 31 మధ్య

పారిశ్రామిక పార్కుల పనులు వేగవంతం: టీఎస్ఐఐసీ ఛైర్మన్

ఈనాడు, హైదరాబాద్: కొత్త సంవత్సరంలో అన్ని పారిశ్రామిక పార్కుల పనులను వేగవంతం చేస్తామని టీఎస్ఐఐసీ ఛైర్మన్ గ్యాదరి బాలమల్లు తెలిపారు. భూసేకరణ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేస్తామన్నారు. బుధవారం కేంద్ర కార్యాలయంలో సంస్థ ఉద్యోగుల సంఘం సమావేశంలో ఆయనతోపాటు సంస్థ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలమల్లు మాట్లాడుతూ.. ఔషధనగరి, జహీరాబాద్ నిమ్జ్, కాకతీయ మెగా జౌళిపార్కు, ఆహారశుద్ధి ప్రాజెక్టుల పనులు ఈ సంవత్సరమే ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడానికి ఉద్యోగులు, అధికారులు సహకరించాలని కోరారు.

ఆభరణ దుకాణాల్లో ఐటీ సోదాలు

దేశవ్యాప్తంగా రెండు సంస్థలకు చెందిన 130 షోరూముల్లో అధికారుల తనిఖీలు

దిల్లీ/అమరావతి, హైదరాబాద్-ఈనాడు: చేస్తున్న వ్యాపారానికి చెల్లిస్తున్న పన్నుకి మధ్య పొంతన లేదన్న అనుమానంతో ఆదాయపన్నుశాఖ అధికారులు రెండు ప్రముఖ ఆభరణాల సంస్థలకు చెందిన దుకాణాల్లో బుధవారం సోదాలు నిర్వహించారు. జోయలుకాస్, మంజలి జ్యువెలర్స్‌కు చెందిన 130కుపైగా షోరూముల్లో తనిఖీలు కొనసాగాయి. కేరళ, తమిళనాడు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్ర, దిల్లీ, పశ్చిమ బెంగాల్‌లోని ఈ సంస్థలకు దుకాణాల్లో ఐటీ అధికారులు దాదాపు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. చెన్నై ఐటీ అధికారుల సమన్వయంతో చేపట్టిన సోదాలు ఇంకా కొనసాగుతున్నట్లు సమాచారం. హైదరాబాద్‌లో మొత్తం ఏడు బృందాలు సోదాలు నిర్వహించి పలు కీలక పత్రాలు, కంప్యూటర్ హార్డ్‌డిస్కులు స్వాధీనం చేసుకున్నాయి. గుంటూరు, విజయవాడ, తిరుపతి, ఒంగోలు, కర్నూలు ప్రాంతాల్లోని జోయలుకాస్ షోరూంలపైనా దాడులు నిర్వహించారు. పండగ సీజన్‌లో జరిగిన ఐటీ దాడులు వ్యాపార వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. జోయలుకాస్, మంజలి జ్యువెలర్స్ సంస్థల మధ్య ఉన్న వ్యాపార బంధం ఏమిటో తేల్చటం కూడా దాడుల లక్ష్యాల్లో ఒకటని ఉన్నతాధికారులు వెల్లడించారు.

యూకే సర్కారులో ఇన్ఫోసిస్ నారాయణమూర్తి అల్లుడు

మరో ఇద్దరు భారత సంతతి ఎంపీలకూ చోటు

లండన్: ఇన్ఫోసిస్ అధినేత నారాయణమూర్తి అల్లుడు రుషి సునాక్ యూకే ప్రభుత్వంలో చోటు దక్కించుకున్నారు. ఆయనతో సహా ముగ్గురు భారత సంతతి ఎంపీలకు నూతన మంత్రివర్గంలో కొత్తగా చోటు కల్పించాలని ప్రధాని థెరిసా మే నిర్ణయించారు. దీంతో కేబినెట్‌లో భారత సంతతి వారి సంఖ్య నాలుగుకి చేరుతుంది. అలోక్‌శర్మ ఇప్పటికే మంత్రివర్గంలో ఉన్నారు. రిచ్‌మండ్ (యార్క్‌షైర్) నుంచి కన్సర్వేటివ్ పార్టీ తరఫున సునాక్ (37) ఎంపీగా ఎన్నికయ్యారు. గృహనిర్మాణ, సమాజాల, స్థానిక ప్రభుత్వాల శాఖకు సహాయ మంత్రి హోదాలో ఆయన నియమితులయ్యారు. సునాక్ తల్లి ఫార్మసిస్ట్ కాగా తండ్రి వైద్యుడు. గోవాకు చెందిన సుయెల్లా ఫెర్నాండెజ్ (బ్రెగ్జిట్ శాఖ సహాయ మంత్రి), శైలేష్ వర (ఉత్తర ఐర్లాండ్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి) కూడా కేబినెట్‌లో చోటు దక్కించుకున్నారు.

25న భారత్-ఏషియాన్ సదస్సు

- **హాజరు కానున్న పది దేశాల నేతలు**
- **ఉగ్రవాద వ్యతిరేక పోరు, భద్రత, వాణిజ్యంపై ప్రధానంగా చర్చ**

దిల్లీ: ఉగ్రవాద వ్యతిరేక పోరు, భద్రత, వాణిజ్యం అంశాల్లో సంబంధాలను బలోపేతం చేసుకోవడం భారత-ఏషియాన్ సదస్సులో ప్రధాన అజెండాగా ఉంటుంది. ఈ నెల 25న జరిగే దిల్లీలో జరిగే ఈ సదస్సులో పది ఏషియాన్ దేశాల నేతలు పాల్గొంటున్నారు. భారత్-ఏషియాన్ సంబంధాలకు 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ సదస్సుకు ఎంతో ప్రాధాన్యం ఏర్పడింది. ఆ మర్నాడు జరిగే భారత గణతంత్ర దినోత్సవానికి ఈ పది దేశాల అధినేతలు ప్రధాన అతిథులుగా హాజరుకానుండడం విశేషం. ఇది మునుపెన్నడూ లేని సంప్రదాయమని, చరిత్రాత్మక సంఘటన అని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖలో తూర్పు వ్యవహారాల కార్యదర్శి ప్రీతి శరణ్ విలేకర్లతో చెప్పారు. థాయ్‌లాండ్, వియత్నాం, ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, మయన్మార్, కంబోడియా, లావోస్, బ్రూనై దేశాల నేతలు సదస్సులో పాల్గొంటారు. ఈ నేతల జీవిత భాగస్వాముల్లో కొందరు వస్తున్నారని, వారికోసం ప్రత్యేక కార్యక్రమం రూపొందిస్తున్నామని ఏషియాన్ సంయుక్త కార్యదర్శి అనురాగ్ భూషణ్ చెప్పారు.

కాంట్రాక్టు సిబ్బంది సేవలను అందించే సంస్థలకు దేశ వ్యాప్త అనుమతి

ఈనాడు, దిల్లీ: వివిధ సంస్థలకు కాంట్రాక్టు కార్మికులు, సిబ్బందిని సరఫరా చేసే సంస్థలకు దేశ వ్యాప్త అనుమతిని ఇవ్వాలని మోదీ ప్రభుత్వం యోచిస్తోంది. కాంట్రాక్టు కార్మికుల సరఫరా సంస్థలు వివిధ ప్రాంతాల నుంచి సేవలు అందిస్తున్నాయి. వారు ఏ ప్రాంతంలో సేవలను అందిస్తే అక్కడి నుంచి ప్రభుత్వ అనుమతులను తీసుకోవాల్సి వస్తోంది. దేశ వ్యాప్త అనుమతి ఇవ్వడం ద్వారా ఈ సేవలను సరళీకరించడానికి వీలవుతుంది. దేశ వ్యాప్త అనుమతి కావాలనుకునే సంస్థలు నిర్ణీత రుసుములు చెల్లించాల్సి ఉంటుందని, బ్యాంకు పూచీకత్తును సమర్పించాల్సి ఉంటుందని ఒక అధికారి వెల్లడించారు. ఈ ప్రతిపాదనపై కేంద్ర మంత్రివర్గం ఆమోదం పొందిన తర్వాత కార్మిక మంత్రిత్వశాఖ.. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో కాంట్రాక్ట్ కార్మిక నియంత్రణ సవరణ బిల్లును ప్రవేశపెడుతుంది. దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఉద్యోగాల్లో 55శాతం మంది, ప్రైవేటు రంగంలోని ఉద్యోగాల్లో 45శాతం మంది కాంట్రాక్టు సిబ్బందే.

కర్ణాటకలోనూ కాంగ్రెస్‌కు నామరూపాలుండవు

భాజపా అధ్యక్షుడు అమిత్ షా

చిత్రదుర్గం (కర్ణాటక), న్యూస్‌టుడే: ఉత్తరభారతంలోని ఉత్తరప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్‌లలో మాదిరి కర్ణాటక రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ త్వరలో తన అస్తిత్వాన్ని పోగొట్టుకుని నామరూపాలు లేకుండా పోతుందని భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్ షా అన్నారు. చిత్రదుర్గం జిల్లా హొళల్కెరెలో బుధవారం భాజపా పరివర్తన యాత్ర బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కర్ణాటక ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు చిరునామాగా మారిందన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అవినీతిని పెంచిపోషిస్తున్నారని దుయ్యబట్టారు. వచ్చే విధానసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గట్టి గుణపాఠం చెప్పాలన్నారు. భాజపా ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

హార్వర్డ్‌లో ఇండియా కాన్ఫరెన్స్‌కు యార్లగడ్డకు ఆహ్వానం

ఈనాడు, దిల్లీ: అమెరికాలోని ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ఏటా నిర్వహించే 'ఇండియా కాన్ఫరెన్స్'లో ప్రసంగించేందుకు కేంద్రీయ హిందీ సమితి సభ్యుడు, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ను నిర్వాహకులు ఆహ్వానించారు. 'భారతదేశం-నూతన పంథా ఆవిష్కరణలు' అంశాన్ని ఈ ఏడాది సదస్సు థీమ్‌గా ఎంపిక చేశారు. బోస్టన్‌లో ఫిబ్రవరి 10, 11 తేదీల్లో ఈ సదస్సు జరగనుంది.

దావోస్ సదస్సుకు డొనాల్డ్ ట్రంప్

ప్రధాని మోదీతో భేటీ అయ్యే అవకాశం

వాషింగ్టన్: స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ఈ నెల చివరి వారంలో జరగనున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాల్గొననున్నారు. ఈ సదస్సుకు అమెరికా అధ్యక్షుడు హాజరుకావడం 18 ఏళ్ల తరువాత ఇదే ప్రథమం. ఈ సందర్భంగా ఆయన భారత ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. మోదీ ఈ నెల 22, 23 తేదీల్లో స్విట్జర్లాండ్‌లో పర్యటించనున్నారు. 1997 తరువాత భారత ప్రధాని దావోస్‌కు వెళ్లనుండడం ఇదే తొలిసారి. ట్రంప్ పర్యటన అజెండా ఖరారుపై కసరత్తు చేస్తున్నామని శ్వేత సౌధం ప్రెస్ కార్యదర్శి సారా శాండర్స్ తెలిపారు. విభజిత ప్రపంచంలో ఉమ్మడి భవిష్యత్తు రూపకల్పన అనే అంశంపై ఈ సదస్సులో చర్చలు జరగనున్నాయి. ఈ సమావేశంలో 'అమెరికా ప్రథమం' అనే అంశంపై ట్రంప్ తన అభిప్రాయాలను వెల్లడిస్తారని శాండర్స్ తెలిపారు.

ఏడాదిలో 138 మంది పాక్ సైనికుల హతం

దిల్లీ: భారత సైన్యం గత ఏడాది చేపట్టిన కట్టుదిట్టమైన చర్యలతో మొత్తం 138 మంది పాకిస్థాన్ సైనికులను మట్టుపెట్టినట్లు ప్రభుత్వ నిఘావర్గాలు తెలిపాయి. ఈమేరకు 2017లో భారతసైన్యం వ్యూహాత్మకంగా వ్యవహరించడంతో పాటు.. నియంత్రణరేఖ వెంబడి పాక్ ఉల్లంఘనలను సమర్థంగా తిప్పికొట్టింది. అదే సమయంలో నియంత్రణరేఖ వెంబడి భారతసైన్యం 28మందిని కోల్పోయింది. ఈ ఘటనల్లో 155మంది పాక్ సైనికులు కూడా గాయపడ్డారు. అయితే పాక్‌సైన్యం తమ సైనికులు మృతిచెందిన సందర్భాల్లో వాటిని గుర్తించకుండా.. సాధారణపౌరుల మరణాలుగా చూపించే ప్రయత్నంచేస్తుంటుంది.

సైనిక విభాగాల తరలింపు పేరిట దోపిడీ

రక్షణ విభాగం అధికారిపై సీబీఐ కేసు

దిల్లీ: సైనిక విభాగాల తరలింపుల పేరిట దొంగ బిల్లులు సృష్టించి రూ.53.63లక్షలు దోచుకున్నారని రక్షణశాఖ అధికారిపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) బుధవారం కేసు నమోదుచేసింది. సీబీఐ వర్గాల సమాచారం ప్రకారం.. జమ్ము నుంచి గువాహటికి కొత్త సైనిక విభాగం 604ఎస్‌ఐయూను తరలించామని 2016 మార్చిలో రక్షణ విభాగం అధికారి అశ్వనీ కుమార్ మూడు బిల్లులు పెట్టారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో బిల్లుల రద్దీ ఎక్కువగా ఉండటంతో అధికారులు వీటిని ఆమోదించేశారు. దీంతో 2017లోనూ మరో ప్రైవేటు వ్యక్తి సతీశ్ కుమార్‌తో కలిసి రూ.కోటి విలువైన బిల్లులను అశ్వనీ కుమార్ పెట్టారు. ఇవి నకిలీవని అధికారులు గుర్తించారు. అనంతరం పాత బిల్లులనూ పరిశీలించారు. దీంతో రెండేళ్లుగా అశ్వనీ కుమార్ చేస్తున్న మోసం బయటపడింది.

చికిత్స వేళ జయను వీరు చూశారు

పేర్లు ప్రకటించిన విచారణ కమిషన్

చెన్నై, న్యూస్‌టుడే: అపోలో ఆస్పత్రిలో జయలలితకు వైద్యం అందిస్తున్న సమయంలో ఎవరెవరు చూశారనే వివరాలను ఆమె మృతిపై విచారణ చేస్తున్న కమిషన్ ప్రకటించింది. జయలలిత చికిత్స పొందుతున్నప్పుడు ఆమెను చూసేందుకు ఎవరికీ అనుమతి లభించలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జయలలితను ఆమె అన్న కుమారుడు దీపక్, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి రామమోహనరావు, ప్రభుత్వ మాజీ ప్రత్యేక సలహాదారు షీలాబాలకృష్ణన్, డాక్టర్ బాలాజీ తదితరులు కలిసినట్లు కమిషన్ ప్రకటించింది. తాము జయలలితను కలిసినట్టు వారు వాంగ్మూలం ఇచ్చారని తెలిపింది. జయలలితకు అందించిన చికిత్స నివేదికలను సమర్పించాలని కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఆరుముగస్వామి తాజాగా అపోలో ఆస్పత్రి యంత్రాంగాన్ని ఆదేశించినట్టు సమాచారం. ఈ నెల 12లోపు ఆ వివరాలు సమర్పించకుంటే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసినట్లు తెలిసింది.

సెన్సెక్స్ ▼ 10
34433

నిఫ్టీ ▼ 05
10632

రూపాయి 63.60 ▲ (ఒక అమెరికా డాలరుకు) 11 పైసలు

బంగారం 29,810 ▲ (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 130

వెండి 38,885 ▲ ముంబయిలో కిలో రూ.లలో 340

ముడి చమురు 68.89 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)



ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	25,378	-08
నాస్‌డాక్	7,142	-21
నిక్కీ 225 (జపాన్)	23,788	-62
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,520	-04
షాంఘై(చైనా)	3,422	+08
ఎఫ్‌టీఎస్‌ఈ (బ్రిటన్)	7,749	+17
డాక్స్ (జర్మనీ)	13,281	-104

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	57.94	67.18
పౌండ్ స్టెర్లింగ్	78.43	90.95
యూరో	69.20	80.26
జపనీస్ యెన్/100	51.59	59.83
ఆస్ట్రేలియా డాలరు	45.35	52.46
సింగపూర్ డాలరు	43.37	51.40
థాయ్ బాత్/100	179.83	215.07
బహ్రెయిన్ దీనార్	156.40	179.23
కువైట్ దీనార్	174.62	217.45
సౌదీ రియాల్	15.40	18.26
యూఏఈ దిర్హమ్	15.77	18.43
మలేషియా రింగిట్	14.15	17.40
చైనీస్ యువాన్	6.91	11.21

బుధవారం నిఫ్టీ కదలికలు



ఐటీకి ఆ మాటలే కీలకం

- ఫలితాల కంటే భవిష్యత్ అంచనాలే ముఖ్యం
- ఇన్ఫోసిస్ కొత్త సారథి ప్రణాళికలూ..
- కంపెనీల సగటు నికర లాభంలో క్షీణత
- ఆదాయాల్లో మాత్రం రాణింపు

ఐటీ అనగానే గుర్తుకు వచ్చేది టీసీఎస్, ఇన్ఫోసిస్ కంపెనీలే. ఈ కంపెనీల ఫలితాలు ఈ వారమే వెలువడనున్నాయి. ఆ కంపెనీలతో పాటు ఇతర కంపెనీలు సైతం ఫలితాలను వెల్లడించనున్నాయి. ఇన్ఫోసిస్, టీసీఎస్ ఫలితాల సరళిని బట్టే మిగతా ఫలితాలు, షేర్ల కదలికలు ఆధారపడనున్నాయి. ఈ నేపథ్యంలో ఐటీ రంగ ఫలితాలు అసలు ఎలా ఉండనున్నాయో విశ్లేషకులు ఏమనుకుంటున్నారో చూద్దాం.

ఈ సారి ఐటీ కంపెనీల ఫలితాల కంటే భవిష్యత్ అంచనాలపైనే మదుపర్లు దృష్టి సారించే అవకాశం ఉంది. ముఖ్యంగా క్లయింట్ల బడ్జెట్లు, వీసా నిబంధనల్లో మార్పు విషయంలో కంపెనీల ధోరణి తదితరాలు గమనించాల్సిన అంశాలు. అన్నిటి కంటే మించి ఇన్ఫోసిస్‌ను 2020 కల్లా 20 బిలియన్ డాలర్ల లక్ష్యాన్ని చేరడానికి కొత్త ఎండీ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈఓ) సలీల్ పరేఖ్ ఎటువంటి ప్రణాళికలు రచిస్తారన్నది కీలకం కానుంది.

ఈ అంశాలు కీలకం..

- ✦ బ్రెగ్జిట్ చర్చలను గమనించొచ్చు. ఎందుకంటే ఇవి బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగంపై భారీ ప్రభావాన్ని చూపనున్నాయి. మన టెక్నాలజీ కంపెనీలకు ఎక్కువ భాగం విక్రయాలు ఈ రంగాల నుంచే వస్తున్నాయి.
- ✦ ఈ రంగంలో అత్యధిక మార్కెట్ విలువ గల రెండు కంపెనీలు ఇన్ఫోసిస్, టీసీఎస్ సైతం బ్యాంకింగ్, ఆర్థిక రంగాల నుంచి గరిష్ఠ ఆదాయాలను పొందుతున్నాయి.
- ✦ టెక్ మహీంద్రా వంటి కంపెనీలకు కమ్యూనికేషన్స్ నుంచి సగం ఆదాయాలు లభిస్తున్నాయి.
- ✦ ఈ నేపథ్యంలో బ్యాంకింగ్, ఆర్థిక రంగాల నుంచి వచ్చే గిరాకీపై విశ్లేషకులు ఓ కన్నేయవచ్చు.
- ✦ ఇక టీసీఎస్ తప్ప మిగతా చాలా వరకు ఐటీ కంపెనీలకు రిటైల్ విభాగం ఇబ్బందులను కొనసాగించే అవకాశం ఉంది. టీసీఎస్ విషయంలో మాత్రం ఈ రంగం నుంచి గిరాకీ పుంజుకునే అవకాశం ఉంది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలపై అంచనాలు

కంపెనీ	విక్రయాలు	వృద్ధి/(క్షీణత)	నికర లాభం	వృద్ధి/(క్షీణత)	ఫలితాల తేదీ
టీసీఎస్	30941.50	4	6393.60	(6)	నేడు
ఇన్ఫోసిస్	17811.70	3	3568.40	(4)	రేపు
హెచ్‌సీఎల్ టెక్	2791.40	8	2145.90	4	---
టెక్ మహీంద్రా	7763.80	3	784.70	(7)	---
విప్రో	13601.20	(1)	2124.80	1	జనవరి 19
హెక్సావేర్ టెక్	988.20	5	124.40	2	---
ఇన్ఫో ఎడ్జ్ ఇండియా	211.80	14	66.90	42	ఫిబ్రవరి 02
మైండ్‌ట్రీ	1368.60	6	108.70	5	జనవరి 17
ఎంఫసిస్	1620.00	5	200.30	0	జనవరి 24
మొత్తం	87098.30	4	15517.70	(3)	

ఇవీ అంచనాలు

ఐటీ కంపెనీలకు అక్టోబరు-డిసెంబరు సాధారణంగానే బలహీన త్రైమాసికం. అమెరికాలో సెలవుల కారణంగా ఆర్థిక, రిటైల్ రంగంలో వ్యయాల మందగమనం ఇందుకు నేపథ్యం. తొమ్మిది ప్రధాన ఐటీ కంపెనీల సగటు నికర లాభం అంతక్రితం ఏడాది అక్టోబరు-డిసెంబరుతో పోలిస్తే 3 శాతం క్షీణించొచ్చని అంచనా(పట్టిక చూడండి). ఇక విక్రయాలు మాత్రం 4 శాతం మేర రాణించొచ్చని విశ్లేషకుల సగటు అంచనాగా ఉంది.



టీసీఎస్‌కు ఆ విక్రయాలే ముఖ్యం

నేడు ప్రకటించే టీసీఎస్ ఫలితాలు మొత్తం ఐటీ కంపెనీలపై ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. అయితే ఈ కంపెనీకి కీలక వ్యాపార విభాగమైన బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా(బీఎఫ్ఎస్ఐ) విభాగంలో ఎంత మేర బలహీనతలు కనిపిస్తాయన్నదానిని మదుపర్లు సునిశితంగా గమనించనున్నారు. ఆర్థిక సేవల విభాగంలో నిర్ణయాలను తీసుకోవడంలో ఆలస్యం కావడంతో బీఎఫ్ఎస్ఐ, రిటైల్ విభాగాల్లో స్తబ్దత చోటు చేసుకోవచ్చని డిసెంబరులో టీసీఎస్ విశ్లేషకులతో పేర్కొన్న సంగతి ఇక్కడ గమనించదగ్గ విషయం. టీసీఎస్ విక్రయాల్లో బీఎఫ్ఎస్ఐ విభాగానికి 33 శాతం వాటా ఉండగా.. రిటైల్ విభాగానికి 11.9 శాతం వాటా ఉంది. రిటైల్ విభాగంలోనూ కంపెనీకి ప్రతికూల పవనాలు వీచే అవకాశం ఉందని అంచనా. ఇక అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో కీలక మార్కెట్ అయిన అమెరికాలో సెలవులు కావడం వల్ల కూడా విక్రయాలపై ఒత్తిడి కనిపించొచ్చు. ఈ నేపథ్యంలో అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో కంపెనీ ఏకీకృత నికర విక్రయాలు రూ.30,941 కోట్లుగా నమోదు కావొచ్చని 10 మంది విశ్లేషకుల సగటు అంచనాగా ఉంది. ఇక జులై-సెప్టెంబరుతో పోలిస్తే ఏకీకృత నికర లాభం రూ.6,393 కోట్లుగా నమోదు కావొచ్చని అంచనా కట్టారు. ఫలితాల కంటే క్లయింట్ల బడ్జెట్‌పై కంపెనీ చేసే వ్యాఖ్యల కోసం మదుపర్లు ఆసక్తిగా ఎదురుచూడవచ్చని విశ్లేషకులు అంటున్నారు.

ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలపై
బుక్ మై షో దృష్టి

ఈనాడు, హైదరాబాద్: ఆన్‌లైన్‌లో సినిమా టిక్కెట్లను విక్రయించే బుక్ మై షో ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో సేవలందించేందుకు సిద్ధమవుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో 65 పట్టణాల్లోని 650 థియేటర్లలో తమ సేవలందుతున్నాయనీ, ఇందులో హైదరాబాద్‌లోనే అత్యధికంగా 250 ఉన్నాయని బుక్ మై షో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సినిమా) ఆశిష్ సక్సేనా తెలిపారు. ఏడాదిలోపు రెండు రాష్ట్రాల్లో మరో 240 హాళ్లతో ఒప్పందం కుదుర్చుకుంటామన్నారు. దేశ వ్యాప్తంగా 650 పట్టణాల్లో 5 వేల స్క్రీన్లు ఉన్నాయనీ, వీటిని ఏడాదికి వెయ్యి చొప్పున పెంచుకుంటున్నామని చెప్పారు. ప్రస్తుతం మొత్తం సినిమా టిక్కెట్ల విక్రయాల్లో ఆన్‌లైన్ వాటా 30శాతం వరకూ ఉందనీ, ఇది ఎప్పటికప్పుడు పెరుగుతోందన్నారు. ఈ మార్కెట్లో తమ వాటా దాదాపు 75 శాతం ఉందన్నారు. సినిమాని థియేటర్‌కు వెళ్లి చూడాలన్న కోరిక ఏమాత్రం తగ్గడం లేదనీ, సినిమా థియేటర్ల సంఖ్య పెరగడం, టిక్కెట్ల అమ్మకాల్లో వృద్ధి రేటే ఇందుకు నిదర్శనమన్నారు. పైరసీకి సినిమా వ్యాపారాన్ని దెబ్బతీసేంత శక్తి లేదన్నారు. ఇటీవల కాలంలో పలు కొత్త సేవలను ప్రవేశ పెట్టినట్లు, సినిమా టిక్కెట్లతోపాటు, ఆహార పదార్థాలు, పానీయాలను కూడా బుక్ చేసుకునేందుకు కూడా వీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. బుక్ చేసుకున్న టిక్కెట్లను రద్దు చేసుకునే వెసులుబాటు ఎంపిక చేసిన సినిమాలకు ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

యాపిల్, ఒపోలకు మేలు

ఏక బ్రాండ్ రిటైల్‌లో 100% ఎఫ్‌డీఐపై విశ్లేషకుల అంచనాలు

దిల్లీ: ఏక బ్రాండ్ రిటైల్‌లో 100 శాతం విదేశీ పెట్టుబడులకు ప్రభుత్వం అనుమతినించడంతో సాంకేతిక దిగ్గజం యాపిల్‌తో పాటు చైనా మొబైల్ తయారీ కంపెనీలు షియోమీ, ఒపోలు అతిపెద్ద ప్రయోజనం పొందనున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సొంత స్టోర్లు పెట్టుకోవడం ద్వారా ఆయా బ్రాండ్లు వినియోగదార్లకు మరింత దగ్గరవుతాయని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ అసోసియేట్ డైరెక్టర్ తరుణ్ పథక్ అంటున్నారు. అంతర్జాతీయ బ్రాండ్లు ఇక తమ కార్యకలాపాలను ప్రారంభించడానికి పెట్టుబడులను వేగవంతం చేస్తాయని అభిప్రాయపడ్డారు. 'చాలా వరకు చైనా కంపెనీలు చైనాలో సొంత స్టోర్లను తెరవడం ద్వారా విక్రయాలను పెంచుకున్నాయి. తాజా పరిణామంతో భారత్‌లోనూ అదే చర్యతో అదే ఫలితాలను పొందడానికి ప్రయత్నించవచ్చు'ని ఆయన అన్నారు.

వాణిజ్య స్థలాలకు గిరాకీ: విదేశీ బ్రాండ్లు భారత్‌లో స్టోర్ల ఏర్పాటు కోసం సంసిద్ధమవుతాయి కాబట్టి వాణిజ్య ప్రాంతాలు, వాణిజ్య భవనాలకు గిరాకీ పెరగనుందని స్థిరాస్తి కంపెనీలు, కన్సల్టెంట్లు అంచనా వేస్తున్నారు. గత కొన్నేళ్లుగా వాణిజ్య ఆస్తులకు గిరాకీ ఉందని.. తాజా పరిణామంతో అది మరింత పెరుగుతుందని అంటున్నారు. రిటైల్ రంగంలో వృద్ధి కాస్తా సమీప భవిష్యత్‌లో స్థిరాస్తి సరఫరాకు ఊతమిస్తుందని జేఎల్ఎల్ ఇండియా ఎండీ పంకజ్ పేర్కొన్నారు. పరిశ్రమ అంచనాల ప్రకారం.. భారత రిటైల్ రంగం 2020 కల్లా 15 శాతం సమ్మిళిత వృద్ధితో రూ.లక్ష కోట్ల విక్రయాలను సాధిస్తుంది.

ప్రయోజనం సున్నా: సుబ్రమణ్య స్వామి

సాంకేతిక పరిజ్ఞాన బదిలీ లేకుండా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ) వల్ల ప్రయోజనం ఉండదని భాజపా సీనియర్ నేత సుబ్రమణ్య స్వామి వ్యాఖ్యానించారు. భారత పెట్టుబడుల్లో ఎఫ్‌డీఐల వాటా కేవలం 2 శాతమేనని.. వీటికి సాంకేతిక మార్పులు లేకపోతే దాని వల్ల ఆర్థిక వ్యవస్థకు పెద్దగా ఉపయోగం ఉండదని అన్నారు. వచ్చే నెలలో బడ్జెట్ ప్రకటనకు ముందు ప్రభుత్వం భారీ ఎఫ్‌డీఐ సంస్కరణలను ప్రకటించింది. ఏక బ్రాండ్ రిటైల్, నిర్మాణ, విద్యుత్ ఎక్స్ఛేంజీల్లో పెట్టుబడుల నిబంధనలను సరళీకరించింది. అదే సమయంలో విదేశీ విమానయాన సంస్థలకు ఎయిరిండియాలో 49 శాతం వరకు పెట్టుబడులు పెట్టడానికి అనుమతులు ఇచ్చింది. వచ్చే 10 ఏళ్లలో భారత్ 10 శాతం రేటుతో వృద్ధి చెందాల్సిన అవసరం ఉందని స్వామి పేర్కొన్నారు.

'ఇండియన్‌మనీ'కి రూ.20 కోట్ల నిధులు

ఈనాడు, హైదరాబాద్: పెట్టుబడులపై నిపుణుల సలహాలను ఉచితంగా అందిస్తున్న ఫైనాన్షియల్ సేవల మార్కెట్‌ప్లేస్ కంపెనీ ఇండియన్‌మనీ డాట్‌కామ్ (IndianMoney.com) 30 లక్షల డాలర్ల (దాదాపు రూ.20 కోట్లు) నిధులను సమీకరించింది. అమెరికాకు చెందిన వెంచర్ కేపిటల్ ఫండ్ శ్రీ కేపిటల్, ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన హైదరాబాద్ ఏంజిల్స్, ఇతరులు ఈ నిధులు అందించాయి. హైదరాబాద్‌కు చెందిన శశి రెడ్డి శ్రీ కేపిటల్‌కు మేనేజింగ్ పార్టనర్ అని ఇండియన్ మనీ డాట్ కామ్ వ్యవస్థాపకుడు, సీఈఓ సి.ఎస్. సుధీర్ తెలిపారు. పెట్టుబడులపై సరైన సలహాలు లభించక ఇబ్బందులు పడే అనేక వేల మంది మధ్యతరగతి వర్గానికి ఈ వెబ్‌సైట్ సేవలు అందిస్తోంది. కొత్త నిధుల ద్వారా రోజుకు దాదాపు లక్ష మందికి పెట్టుబడులపై అవగాహన కల్పించే సామర్థ్యాన్ని వెబ్‌సైట్ పొందుతుంది. ఇప్పటికే బెంగళూరుకు చెందిన వెర్టెక్స్‌పర్ట్స్, హైదరాబాద్ ఏంజిల్స్, మైక్రోసాఫ్ట్ సెంటర్ మాజీ ఎండీ శ్రీని కొప్పోలు, మాగ్నా ఇన్ఫోటెక్ సహ వ్యవస్థాపకుడు ప్రదీప్ మిత్తల్ వంటి వారు పెట్టుబడులు పెట్టారు.

బయోసిమిలర్లపై అధిక దృష్టి

- డాక్టర్ రెడ్డీస్ దీర్ఘకాల లక్ష్యం

ఈనాడు, హైదరాబాద్: దీర్ఘకాలంలో వృద్ధి రేటును కొనసాగించడానికి బహుముఖ వ్యాపార విధానాన్ని (మోడల్)ను అవలంబించాలని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ యోచిస్తోంది. అమెరికా, యూరప్ మార్కెట్లలో బయోసిమిలర్ల విక్రయానికి దరఖాస్తులు ఎక్కువగా దాఖలు చేయాలని, అన్ బ్రాండెడ్ మార్కెట్లలో తక్కువ ధరల ప్రత్యామ్నాయ జనరిక్ ఔషధాలను ప్రవేశపెట్టాలని భావిస్తున్నట్లు డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అమెరికా విపణిలో 12 ఔషధాలను విడుదల చేశామని, 20-25 ఔషధాలను విడుదల చేయడానికి ఈ ఏడాది దరఖాస్తులు చేయనున్నామని తెలిపింది. యూరప్, వర్ధమాన మార్కెట్లలో కేన్సర్ ఉత్పత్తులను విడుదల చేసిన డాక్టర్ రెడ్డీస్ భవిష్యత్తులో మరిన్ని మార్కెట్లలో విస్తరణకు బయోసిమిలర్లు, కేన్సర్ విభాగంలో అభివృద్ధి దశలో ఉన్న కొన్ని ఉత్పత్తులు దోహదం చేయగలవని కంపెనీ భావిస్తోంది. లాటిన్ అమెరికా,




ఆఫ్రికా, ఆసియా మార్కెట్లలో ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో బయోసిమిలర్ ఉత్పత్తులను విడుదల చేయనుంది. బయోసిమిలర్ల ద్వారా 2024-25 నాటికి వర్ధమాన మార్కెట్ల ఆదాయం 30-40 కోట్ల డాలర్లు ఉండగలదని అంచనా వేస్తోంది. యాజమాన్య ఉత్పత్తుల విభాగంలో 2021-22 నాటికి 40 కోట్ల డాలర్ల వ్యాపారాన్ని చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు జె.పి.మోర్గాన్ హెల్త్‌కేర్ సదస్సులో ఇచ్చిన చిత్రపట వివరణలో పేర్కొంది.

మూడేళ్లలో..

అమెరికా జనరిక్స్ మార్కెట్‌లో పరిమిత పోటీ ఉండే ఉత్పత్తుల ద్వారా వృద్ధి సాధించాలన్న కంపెనీ వ్యూహం. ప్రస్తుతం అమెరికా జనరిక్ మార్కెట్ నుంచి 80 శాతం ఆదాయం ఓరల్ సాలిడ్ డోసేజీల (నోటి ద్వారా తీసుకునే ఔషధాలు) ద్వారా లభిస్తోంది. ఇంజెక్టబుల్స్ వాటా 20 శాతం ఉంది. 2021 నాటికి ఇంజెక్టబుల్స్, కాంప్లెక్స్ డోసేజీ ఔషధాల ద్వారా 80 శాతం ఆదాయాన్ని ఆర్జించాలని డాక్టర్ రెడ్డీస్ లక్ష్యంగా పెట్టుకుంది. భారత్‌లో విక్రయిస్తున్న ఔషధాల పోర్టుఫోలియోను పెంచుకోవడంతో పాటు క్రానిక్, సూపర్ స్పెషాలిటీ చికిత్సలను ప్రారంభించాలని, వ్యూహాత్మక వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని కంపెనీ యోచిస్తోంది. కార్పొరేట్ ఆసుపత్రులు, ఓటీసీపై దృష్టి పెట్టనుంది. అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో కాంప్లెక్స్ జనరిక్స్, బయోసిమిలర్ల ఉత్పత్తులను పెంచుకోనుంది.

10వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు

హైదరాబాద్	402	వరంగల్	404
చిల్లరగా(ఒక గుడ్డు)	4.60	విశాఖపట్నం	404
బెంగళూరు	405	చెన్నై	405
11న		చిత్తూరు	398
విజయవాడ/గోదావరి	404	నమక్కల్	395

నేటి మార్కెట్

నేడు సూచీలు గరిష్ఠ స్థాయిలను పరీక్షించొచ్చు. ఐటీ దిగ్గజం టీసీఎస్ మూడో త్రైమాసిక ఫలితాలను మదుపర్లు సంకేతాలు అందిపుచ్చుకోవచ్చు. ఈ నేపథ్యంలో నిఫ్టీ 100- 200 పాయింట్ల శ్రేణిలో చలించొచ్చని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లు సైతం దిశానిర్దేశం చేయొచ్చు. అమెరికాలో బాండ్లపై ప్రతిఫలాలు పెరగడంతో.. వర్ధమాన మార్కెట్లలోకి విదేశీ పెట్టుబడులు తగ్గితే మదుపర్లు ఆందోళన చెందొచ్చని విశ్లేషకులు అంటున్నారు. నేడు నిఫ్టీ 10585- 10700 పాయింట్ల శ్రేణిలో కదలాడొచ్చని ఎక్కువ శాతం మంది నిపుణులు అంచనా వేస్తున్నారు. నేడు విడుదల కానున్న ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఫలితాలపై సైతం మదుపర్లు దృష్టి పెట్టొచ్చు. శుక్రవారం వెలువడనున్న ఇన్ఫోసిస్, గెయిల్ ఫలితాలు స్వల్పకాలంలో మార్కెట్లపై ప్రభావం చూపొచ్చని, దీంతో మదుపర్లు ఆచితూచి వ్యవహరించే అవకాశం ఉందని చెబుతున్నారు. స్టాక్ మార్కెట్లు గరిష్ఠ స్థాయిల వద్ద ఉండటంతో బడ్జెట్ వరకు అప్రమత్తత పాటించాలని బ్రోకరేజీ సంస్థలు సూచిస్తున్నాయి.

ఫలితాల ముందు అప్రమత్తత

- వరుస లాభాలకు విరామం
- గరిష్ఠాల నుంచి సూచీలు వెనక్కి

సమీక్ష

సూచీలు రికార్డు గరిష్ఠాల నుంచి వెనక్కి వచ్చాయి. ఫలితాల సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటించారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల సంస్కరణలు సైతం మదుపర్లను మెప్పించలేకపోయాయి. హెచ్-1బీ వీసాదారులను దేశం నుంచి పంపించే ప్రతిపాదనేమీ లేదని అమెరికా స్పష్టం చేయడంతో ఐటీ షేర్లు రాణించాయి. అయితే ముడి చమురు ధరలు దూసుకెళ్లడం ప్రతికూల ప్రభావం చూపింది. ఆసియా షేర్లు డీలాపడగా.. ఐరోపా మార్కెట్లూ అదే ధోరణిలో ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 34,538.78 పాయింట్ల వద్ద సానుకూలంగానే ప్రారంభమైంది. అదే జోరు కొనసాగిస్తూ 34,565.63 పాయింట్ల వద్ద జీవన కాల గరిష్ఠాన్ని తాకింది. అయితే మదుపర్ల లాభాల స్వీకరణ డీలాపడిన సెన్సెక్స్.. ఇంట్రాడేలో 34,311.63 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివర్లో స్వల్పంగా కోలుకుని 10.12 పాయింట్ల నష్టంతో 34,433.07 వద్ద ముగిసింది. గత నాలుగు సెషన్లలో సూచీ 649.81 పాయింట్లు పెరిగిన విషయం తెలిసిందే. ఇక నిఫ్టీ సైతం 4.80 పాయింట్లు తగ్గి 10,632.20 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,592.70- 10,655.50 పాయింట్ల మధ్య కదలాడింది.

టీసీఎస్ దూకుడు: నేడు మూడో త్రైమాసిక ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో టీసీఎస్ షేర్లు దుమ్మురేపాయి. ఒకానొ కదశలో 3.97 శాతం పెరిగిన షేరు.. రూ.2,816 వద్ద 52 వారాల గరిష్ఠాన్ని తాకింది. చివరకు 3.64 శాతం లాభంతో రూ.2,807.10 దగ్గర స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.18,884.67 కోట్లు పెరిగి రూ.5,37,359.67 కోట్లకు చేరింది.

- ✦ కంపెనీ బద్ది తయారీ కేంద్రానికి అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ యూఎస్ఎఫ్‌డీఏ నుంచి ఈఐఆర్ లభించడంతో ఆల్కెమ్ షేర్లు రాణించాయి. ఇంట్రాడే 11.15 శాతం లాభపడిన షేరు.. రూ.2,468 వద్ద 52 వారాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 5.74 శాతం లాభంతో రూ.2,347.70 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1,523.28 కోట్లు అధికమై రూ.28,070.28 కోట్లకు పెరిగింది.
- ✦ ఏక బ్రాండ్ రిటైల్‌లో ఎఫ్‌డీఐ నిబంధనలను సడలించడంతో రిటైల్ షేర్లు వెలుగులోకి వచ్చాయి. ఇండియన్ టెరాయిన్ 6.66%, ఫ్యూచర్ ఎంటర్‌ప్రైజస్ 5.11%, ప్రోవోగ్ 4.93%, మాంటే కార్లో ఫ్యాషన్స్ 3.99%, వి-మార్ట్ రిటైల్ 3.98% మేర లాభాలు నమోదు చేశాయి.

సెన్సెక్స్ 30 షేర్లలో 21 నష్టాలను చవిచూశాయి. డాక్టర్ రెడ్డీస్ 1.45%, ఎన్‌టీపీసీ 1.25%, ఏషియన్ పెయింట్స్ 1.22%, బజాజ్ ఆటో 1.10%, ఎస్‌బీఐ 1.05%, టాటా మోటార్స్ 0.93%, భారతీ ఎయిర్‌టెల్ 0.72%, ఎల్ అండ్ టీ 0.67%, పవర్‌గ్రిడ్ 0.62% చొప్పున డీలాపడిన వాటిలో ఉన్నాయి. విప్రో 2.66%, కోల్ ఇండియా 1.33%, అదానీ పోర్ట్స్ 1.05%, ఇన్ఫోసిస్ 0.99%లు మాత్రం రాణించాయి. రంగాల వారీ సూచీల్లో వాహన 0.68% నీరసపడింది. మన్నికైన వినిమయ వస్తువులు, యంత్ర పరికరాలు, పీఎస్‌యూ, బ్యాంకింగ్, విద్యుత్, ఎఫ్ఎమ్‌సీజీ, ఆరోగ్య సంరక్షణ షేర్లు సైతం అదే బాటలో నడిచాయి.

ఎన్‌ఎస్‌ఈ

బుధవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 423.45 (421.10) 4253925
AMBUJA CEMEN 276.10 (277.15) 1860881
ASIAN PAINTS 1177.40 (1193.05) 1102382
AUROBIND PHA 672.70 (673.15) 1014264
AXIS BANK LT 562.80 (565.30) 2411625
BAJAJ AUTO L 3207.40 (3243.50) 296961
BAJAJ FINANC 1802.20 (1819.50) 406791
BHARTI AIRTE 506.40 (509.80) 6008949
BHARTI INFRA 370.80 (368.40) 4204087
BOSCH LTD 19811.15 (19830.10) 18250
BPCL 494.30 (496.10) 3121408
CIPLA 619.75 (615.60) 1207313
COAL INDIA L 308.30 (304.05) 15300218
DR. REDDYS 2425.80 (2457.80) 344328
EICHER MOTOR 28097.50 (28596.95) 84202
GAIL 496.10 (500.95) 2860327
HCL TECH 915.85 (893.85) 1700286
HDFC 1726.45 (1735.05) 1465727
HDFC BANK 1864.20 (1863.70) 1153972
HERO MOTOCOR 3736.90 (3749.45) 250123
HINDALCO IND 268.80 (271.50) 7472579
HINDUSTAN UN 1365.80 (1361.30) 939525
HPCL 424.55 (417.25) 3580630
ICICI BANK 312.00 (312.60) 6736971
INDIABULLS H 1204.20 (1216.80) 1424677
INDIAN OIL 389.55 (392.40) 4019016
INDUSINDBANK 1734.10 (1725.05) 1223879
INFOSYS LTD 1052.25 (1041.35) 4734317
ITC 269.40 (270.55) 16441299
KOTAK MAHIND 1002.25 (1009.75) 676881
LARSEN & TOU 1323.75 (1332.75) 1098019
LUPIN 925.80 (923.25) 1583387
M&M 759.85 (762.45) 1275821
MARUTI SUZIK 9375.85 (9383.55) 394826
NTPC LTD 173.95 (176.70) 8197173
ONGC 197.90 (197.00) 7673209
POWER GRID C 199.85 (201.00) 4899593
RELIANCE IND 942.35 (940.95) 5361502
SBI 301.10 (304.30) 13064599
SUN PHARMA 585.10 (586.50) 2929462
TATA CONSULT 2806.60 (2709.00) 1682925
TATA MOTORS 433.30 (437.55) 4702579
TATA STEEL L 772.85 (772.30) 2990882
TECH MAHINDR 542.10 (533.85) 2748547
ULTRATECH 4403.20 (4426.85) 108721
UPL LIMITED 778.85 (790.60) 1023925
VEDANTA LIMI 334.80 (337.70) 7713328
WIPRO 326.70 (317.20) 3811138
YES BANK LTD 339.80 (341.35) 10385044
ZEE ENTERTAI 580.50 (580.05) 3939541

ఘనం (+)

నిఫ్టీ	10న	మార్పు %
TCS	2806.60	3.60
WIPRO	326.70	2.99
HCL TECH	915.85	2.46
HPCL	424.55	1.75
TECH MAHINDRA	542.10	1.55
COAL INDIA	308.30	1.40
INFOSYS	1052.25	1.05

గ్రహణం (-)

నిఫ్టీ	10న	మార్పు %
EICHER MOTORS	28097.50	-1.75
NTPC	173.95	-1.56
UPL	778.85	-1.49
ASIAN PAINTS	1177.40	-1.31
DR. REDDYS LAB	2425.80	-1.30
BAJAJ AUTO	3207.40	-1.11
SBI	301.10	-1.05

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1415.40 (1419.30) 67304
ACC 1816.55 (1812.05) 175749
ASHOK LEYLAN 127.95 (130.50) 8194879
AVENUE SUPER 1249.30 (1234.10) 849877
BAJAJ FINSER 5199.55 (5156.40) 260021
BANK OFBAROD 162.50 (164.50) 10993630
BEL 179.95 (182.55) 3956767
BHEL 103.80 (101.10) 15393638
BRITANNIA 4674.75 (4641.95) 194379
CADILA HEALT 443.70 (444.25) 919324
COLGATE PALM 1118.25 (1120.60) 159804
CONTAINER 1476.30 (1375.55) 1622051
CUMMINS INDI 925.40 (934.30) 363308
DABUR INDIA 357.80 (359.35) 894740
DLF LIMITED 269.35 (269.85) 10967347
EMAMI LIMITE 1336.40 (1321.55) 141587
GLAXOSMI CON 6521.20 (6300.65) 10831
GLAXOSMI PHA 2470.05 (2487.55) 17843
GLENMARK PHA 617.25 (600.65) 4259613
GODREJ CONSU 978.45 (988.25) 276141
HAVELLS INDI 549.70 (552.25) 1264788
HINDUSTAN ZI 319.50 (316.90) 1246861
ICICI PRU LI 410.00 (412.50) 1304588
IDEA CELLULR 107.35 (108.60) 23093181
INTERGLOBE A 1239.15 (1227.10) 1272608
JSW STEEL LT 282.80 (284.00) 2748652
LIC HOUS.FIN 575.20 (578.05) 1381286
MARICO LIMIT 321.65 (323.85) 694363
MCDOWELL 3830.40 (3844.55) 456527
MOTHERSON 378.65 (383.20) 1814680
MRF 72481.50 (73025.05) 9006
NHPC LTD 32.45 (32.80) 7974940
NMDC LTD 155.30 (154.70) 13009032
OIL INDIA 383.85 (377.75) 1062235
ORACLE FIN S 4097.30 (4051.05) 52460
P&G HYG&HEAL 9297.75 (9295.05) 8988
PETRONET LNG 251.00 (253.20) 2441793
PIDILITE IND 911.75 (914.85) 449965
PIRAMAL ENTE 2857.35 (2892.95) 101747
PNB 170.65 (174.65) 9021131
POWER FIN CO 124.80 (126.50) 2433431
RURAL ELEC C 162.35 (163.40) 3341991
SAIL 98.45 (97.95) 9336838
SHREE CEMENT 19501.80 (19430.10) 12838
SHRIRAM TRAN 1521.10 (1515.80) 823163
SIEMENS 1299.75 (1301.70) 159917
SUN TV LTD 1022.15 (1032.75) 829545
TATA POWER 98.25 (98.60) 5961340
TITAN IND 917.60 (932.95) 1605433
TORRENT PHAR 1401.25 (1410.00) 115831

ALPHAGEO 1007.80 (964.65) 44649
AMAR RAJA BA 853.75 (858.30) 20876
ANDHRA BANK 57.45 (57.95) 94321
ANDHRA CEMEN 14.99 (15.52) 136230
ANDHRA PAPER 384.45 (383.35) 99333
ANDHRA PETRO 65.20 (66.70) 147916
ANDHRA SUGAR 594.45 (588.25) 6189
ANJANI PORTL 256.30 (253.75) 2353
ASTRA MICROW 118.20 (120.45) 47551
AUROBINDO PH 672.60 (673.20) 104659
AVANTEL SOFT 530.60 (537.30) 7338
AVANTI FEEDS 2578.30 (2663.15) 8090
AVON ORG 19.30 (18.39) 19330
BARTRONICS 15.37 (15.85) 39202
BHAGIRA CHEM 348.80 (358.75) 943
BHAGYA NAG 49.85 (49.95) 16874
BN RATHI SEC 50.85 (50.65) 9218
BRILLIANT SE 15.57 (14.83) 10639238
CONT COFFEE 304.80 (306) 26374
COROMAN FERT 570.65 (575.60) 15565
CYBERMATE 3.86 (3.68) 266176
CYIENT LIMIT 580.35 (584.10) 2528
DIVI'S LAB 1080.60 (1089.80) 24677
DIVYA GRANIT 122.60 (121.10) 5999
DR REDDY 2422.80 (2458.40) 30704
GATI CORPN 137.10 (138.20) 119201
GAYATRI PROJ 217.70 (214.75) 42109
GMR INFRASTR 22.25 (21.25) 4431291
GOLDST INFRA 227.70 (230.80) 37114
GRANULES (I) 140.60 (139.10) 163446

బీఎస్‌ఈలో రాష్ట్ర కంపెనీలు

GVK POWER 23.25 (22.15) 2728190
HBL NIFE POW 72.45 (73.75) 276770
HERITAGE FOO 836.10 (837.65) 1305
HYD INDUS 1699.50 (1642.70) 72319
IDL INDUSTRS 657.80 (685.75) 8327
INNAREDY COM 5.69 (5.47) 244834
IVRCL INFRAS 5.86 (6.16) 393952
KAKATIYA CEM 408.05 (408.50) 9058
KAVERI SEED 526.85 (532.40) 37625
KCP LTD 154.20 (153.40) 29001
KNR CONSTRUC 315.50 (307.90) 26692
LANCO INDUS 441.50 (428.80) 133716
LANCO INFRAT 1.95 (1.86) 2712460
LAURUS LABS 543.50 (554.55) 12420
LOKESH MACH 77.35 (76.95) 65766
MADHUCON PRO 39.05 (37.85) 227607
MIC ELECTRON 9.26 (9.35) 96951
MOLD-TEK.TEC 74.55 (76) 1296
MOLDTK PLA 324 (332.95) 6753
NAGARJAGRICH 61.50 (64.10) 130088
NATCO PHARMA 990.90 (984.95) 31217
NAVA BH VENT 172.15 (173.70) 99812
NCC 138.10 (140.05) 570774
NCL IND 275.70 (270.45) 9506
NETTLINX 89.75 (86.30) 26641
NEULAND LAB 836 (844.25) 5196
NIHAR INFO 14.26 (14.40) 1970
PANYAM CEMEN 66.75 (66.90) 30365
PENNER IND 71.70 (74.70) 236276
PIONEER DIST 219.20 (207.15) 20849
PITTI LAMIN 100.25 (101.60) 18719
POKARNA 262.55 (269.70) 28019
PREMIER EXPL 489.35 (494.55) 3327
PRISM CEMENT 136.35 (134.80) 140812
PRUDENTL PHA 5.93 (5.98) 343013
RAIN INDUSTR 449.85 (459.15) 600255
SAGAR CEM 1094.05 (1080.50) 6008
SAMKRG PIST 359.35 (350.95) 17546
SATVAH. ISPA 36.20 (36.90) 81403
SMS PHARMA 103.70 (106.65) 13169
SREE RAYAL A 86.40 (83.75) 676534
SRINIVASA SH 99.90 (97.95) 24377
STEEL EXCHAN 41.70 (41.80) 120428
SUJANA METAL 1.76 (1.74) 117050
SUJANA TOWER 5.48 (5.55) 19390
SURYALAKSH.C 104.65 (104.65) 9783
SUVEN PHARMA 212.20 (213.95) 49708
TAJ GVK HOTE 182.65 (181.85) 3101
TANLA 43.95 (46.15) 722139
TERA SOFTWAR 71.40 (73.25) 10543
VICEROY HOTE 20.40 (20.65) 162532
VIJAY TEXTIL 48.10 (44.70) 32967
VIMTA LABS 170.10 (170.40) 7603
VISAKA IND 753.90 (771.25) 11616
VIVIMED LABS 106.05 (106.30) 123965
YBRANT DIGIT 8.44 (7.65) 4616067
ZENTECH 150.10 (147.05) 97372

బజాజ్ డిస్కవర్ రెండు కొత్త రూపాల్లో



ధర రూ.50,496- 56,314

డిస్కవర్ శ్రేణిలో రెండు కొత్త బైకులను బజాజ్ ఆటో తీసుకొచ్చింది. కొత్త డిస్కవర్ 110 ధర రూ.50,496గా, డిస్కవర్ 125 మోడల్ ధర రూ.56,314 (ఎక్స్- షోరూమ్ మహారాష్ట్ర)గా కంపెనీ నిర్ణయించింది. కొత్త మోడళ్ల ద్వారా ప్రీమియం ఎగ్జిక్యూటివ్ విభాగంలో స్థానం బలోపేతంపై కంపెనీ దృష్టి పెట్టింది. డిస్కవర్ 110 మోడల్‌లో 115.5 సీసీ ఇంజిన్‌ను అమర్చగా, డిస్కవర్ 125ను 124.5 సీసీ ఇంజిన్‌తో రూపొందించారు. డిస్కవర్ 125 డ్రమ్ వెర్షన్ ధర రూ.53,491గా, డిస్క్ వెర్షన్ ధర రూ.56,314గా ఉన్నాయి.

ఈనాడు బిజినెస్

శామ్‌సంగ్ గెలాక్సీ ఏ8 ప్లస్



ధర రూ.32,990

శామ్‌సంగ్ ఇండియా సరికొత్త స్మార్ట్‌ఫోన్ గెలాక్సీ ఏ8 ప్లస్‌ను విపణిలోకి విడుదల చేసింది.ధర రూ.32,990. నలుపు, పసిడి రంగుల్లో లభించనుంది. 6 అంగుళాల సూపర్ అమోల్డ్ తాకే తెర, ఆండ్రాయిడ్ 7.1.1 నౌగాట్, 16 మెగాపిక్సెల్ వెనుక కెమేరా, 16 మెగాపిక్సెల్, 8 మెగాపిక్సెల్ ముందు కెమేరాలు, 6జీబీ ర్యామ్, 64జీబీ అంతర్గత నిల్వ సామర్థ్యం (256 జీబీ వరకు విస్తరించుకోవచ్చు) లాంటి ప్రత్యేకతలు ఏ8 ప్లస్‌లో ఉన్నాయి.



హ్యుందాయ్ వెర్నా సరికొత్త సవారీ

ధర రూ.7.79 లక్షలు

హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ మధ్య శ్రేణి ప్రీమియం సెడాన్ వెర్నా మోడల్‌లో రెండు కొత్త వేరియంట్లను విపణిలోకి ప్రవేశపెట్టింది. అవి వెర్నా ఈ, వెర్నా ఈఎక్స్. 1.4 లీటర్ కప్పా డ్యూయల్ వీటీవీటీ పెట్రోల్ ఇంజిన్‌తో లభించనున్న వీటి ధరలు రూ.7.79- 9.09 లక్షలు (ఎక్స్- షోరూమ్ దిల్లీ). కొత్త మోడళ్లు లీటరుకి 19.1 కి.మీ. మైలేజ్ ఇస్తుందని కంపెనీ తెలిపింది.

నెట్ వేగం

చెప్పేది బారెడు.. వచ్చేది మూరెడు

కన్జ్యూమర్ వాయిస్ అధ్యయనం



దిల్లీ: దేశంలో ఇంటర్నెట్ సేవలు అందించే సంస్థలు ప్రకటిస్తున్న వేగానికి, వినియోగదారులకు లభిస్తున్న సేవలకు మధ్య భారీ అంతరం ఉందని, ప్రపంచంలో ఇంటర్నెట్ వేగం అతి తక్కువగా ఉన్న దేశాల్లో మనది ఒకటని ఒక అధ్యయనం పేర్కొంది. వినియోగదారుల హక్కుల కోసం స్వచ్ఛందంగా కార్యకలాపాలు నిర్వహించే విద్యావేత్తలు, వృత్తినిపుణులు, సేవకులతో కూడిన 'కన్జ్యూమర్ వాయిస్' ఈ నివేదికను రూపొందించింది. సేవలు నాసిరకంగా ఉన్నా, సుమారుగా అందుతున్నా, మెరుగ్గా ఉన్న వాటిని కూడా గుర్తించలేని పరిస్థితి నెలకొందని విశ్లేషించింది. ఇంటర్నెట్ సేవలు పొందే అవకాశం కల్పించడంతోనే 'డిజిటల్ భారత్' సాకారం కాదని, నాణ్యమైన నెట్ సేవలు అందినపుడు మాత్రమే ఆ ప్రణాళికను సాకారం చేసుకునే వీలుంటుందని తెలిపింది. దీనిని దృష్టిలో ఉంచుకుని, ఇంటర్నెట్ సేవాసంస్థలన్నీ సమయానుకూలంగా సరైన చర్యలు తీసుకోవడం ద్వారా నాణ్యమైన సేవలు అందించాలని, అప్పుడే అందరికీ ఉపయోగం ఉంటుందని వివరించింది. వైర్‌లెస్ ఇంటర్నెట్ వేగంపైనా 4 టెలికాం సర్కిళ్ల పరిధిలోని 8 రాష్ట్రాల్లో అధ్యయనం చేశామని, ఇందులోనూ టెలికాం కంపెనీల ప్రకటనలకు, వాస్తవ సేవలకు భారీ తేడా ఉందని నివేదిక తెలిపింది. 3జీ, 4జీ సేవలు అందిస్తున్న మొబైల్ సంస్థలు తమ ఇంటర్నెట్ వేగంపై చేస్తున్న ప్రకటనలతో పోలిస్తే, వినియోగదారులకు లభిస్తున్న వేగం బాగా తక్కువ ఉంటోందని తేల్చి చెప్పింది.

హైదరాబాద్

కార్యాలయ స్థలాలకు భలే గిరాకీ

- 2017 ద్వితీయార్ధంలో 33.4 లక్షల చ.అ లీజు
- భారీగా తగ్గిన కొత్త అపార్ట్‌మెంట్ల ప్రకటన
- 3 శాతం పెరిగిన గృహాల ధరలు
- నైట్ ఫ్రాంక్ నివేదిక

ఈనాడు - హైదరాబాద్



హైదరాబాద్‌లో కార్యాలయ స్థలానికి గిరాకీ పెరుగుతోంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా 2017 ద్వితీయార్ధంలో 33.4 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని లీజుకు తీసుకున్నారని స్థిరాస్తిపై జులై-డిసెంబరు, 2017 కాలానికి విడుదల చేసిన నివేదికలో నైట్ ఫ్రాంక్ తెలిపింది. హైదరాబాద్‌తోపాటు బెంగళూరు, చెన్నై సహా మొత్తం ఏడు నగరాల్లో నివాస గృహాలు, కార్యాలయ స్థలానికి ఉన్న గిరాకీ, కొత్త ప్రాజెక్టులు మొదలైన వాటిపై అధ్యయనం చేసి నివేదికను విడుదల చేసింది. 2016, ద్వితీయార్ధంతో పోలిస్తే లీజుకు తీసుకున్న కార్యాలయ స్థలం హైదరాబాద్‌లో 5 శాతం పెరిగినట్లు పేర్కొంది. మొత్తం ఏడాదిని పరిగణనలోకి తీసుకుంటే.. 2016తో పోలిస్తే 2017లో 4 శాతం తగ్గింది. 2016లో అత్యధికంగా కార్యాలయ స్థలాన్ని లీజుకు తీసుకోవడంతోపాటు 2017లో నాణ్యమైన స్థలం లభ్యం కాకపోవడం మొత్తం ఏడాదికి తగ్గడానికి కారణమని నివేదిక వివరించింది. గత ఏడాది ద్వితీయార్ధంతో పోలిస్తే 2017 ఇదే కాలంలో అందుబాటులోకి వచ్చిన నాణ్యమైన కొత్త కార్యాలయ స్థలం 48 శాతం మేరకు తగ్గి 12.5 లక్షల చదరపు అడుగులకు పరిమితమైందని నైట్ ఫ్రాంక్ ప్రతినిధి శ్యామ్ ఆర్ధర్ తెలిపారు. 2016తో పోలిస్తే 2017లో కొత్తగా అందుబాటులోకి వచ్చిన స్థలం 46 శాతం తగ్గింది. స్థలం అవసరమైన వారు పెరుగుతున్నందున ఖాళీగా ఉన్న స్థలం తగ్గిపోవడం హైదరాబాద్‌కు పెద్ద సవాలు కానుంది. మాదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, నానక్‌రామ్ గూడ ప్రాంతాల్లో వేకెన్సీ స్థాయి 2-4 శాతానికి పడిపోయిందని నైట్ ఫ్రాంక్ పేర్కొంది. కార్యాలయ స్థలానికి గిరాకీ పెరగడం, ఖాళీ స్థలం తగ్గిపోవడంతో హైదరాబాద్ కార్యాలయ మార్కెట్‌లో చదరపు అడుగు స్థలం వెయిటెడ్ యావరేజీ అద్దె 2017, ప్రథమార్ధంలో 9 శాతం పెరిగి రూ.51 చేరింది.

ప్రకటించింది 940 అపార్ట్‌మెంట్లే

గృహ రంగంలో కొత్తగా ప్రకటించిన అపార్ట్‌మెంట్ ప్రాజెక్టులు గణనీయంగా తగ్గాయి. 2017, ద్వితీయార్ధంలో కేవలం 940 అపార్ట్‌మెంట్ ప్రాజెక్టులను మాత్రమే డెవలపర్లు ప్రకటించారు. ఏడాది క్రితం ఇదే కాలంతో పోలిస్తే ఈ సంఖ్య 84 శాతం తక్కువ. ఈ అపార్ట్‌మెంట్ ప్రాజెక్టులను ప్రారంభించింది కూడా చిన్న డెవలపర్లు మాత్రమేనని అధ్యయనంలో వెల్లడైంది. 2011 ప్రథమార్ధంలో హైదరాబాద్‌లో 12,168 అపార్ట్‌మెంట్ ప్రాజెక్టులను ప్రకటించారు. 2016తో పోలిస్తే 2017లో హైదరాబాద్‌లో ప్రకటించిన కొత్త అపార్ట్‌మెంట్లు 70 శాతం తగ్గి 11,600 యూనిట్ల నుంచి 3,511 యూనిట్లకు పరిమితమయ్యాయి. దీనికి ప్రధాన కారణం రేరా చట్టం అమలు ప్రక్రియలో జాప్యం జరగడమేనని నివేదిక వివరించింది. అపార్ట్‌మెంట్లలోని గృహాల విక్రయాలు 2017, ద్వితీయార్ధానికి 13 శాతం తగ్గి 6,342 యూనిట్లకు చేరాయి. 2016లో 15,500 గృహాలను విక్రయించగా.. 2017లో 14,243 గృహాలు మాత్రమే విక్రయం అయ్యాయి. 8 శాతం తగ్గాయి. వస్తు, సేవల పన్నుపై స్పష్టత, వెంటనే చేరడానికి సిద్ధంగా ఉన్న గృహాలు అందుబాటులో లేకపోవడం తదితర కారణాలు అమ్మకాలు తగ్గడానికి కారణమని నైట్ ఫ్రాంక్ పేర్కొంది. ఇతర నగరాల్లో ధరలు తగ్గితే.. కొత్త ప్రాజెక్టులు లేకపోవడం వల్ల 2017, చివరి త్రైమాసికం నాటికి హైదరాబాద్‌లో గృహాల ధరలు 3 శాతం పెరిగాయి. 2017లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.5 శాతం పెరిగింది. దీంతో పోలిస్తే హైదరాబాద్‌లో గృహాల ధర పెరుగుదల తక్కువగానే ఉందని నివేదిక పేర్కొంది. విక్రయానికి ఉన్న గృహాలు (ఇన్వెంటరీ) 38 శాతం తగ్గి 17,356 గృహాలకు చేరింది.

దేశ వ్యాప్తంగా..

దేశ వ్యాప్తంగా ఏడు నగరాల్లో నిర్వహించిన అధ్యయనంలో కొత్త అపార్టుమెంట్ల ప్రకటన 2017లో 78 శాతం తగ్గింది. గృహాల విక్రయాలు ఏడేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. 2016తో పోలిస్తే 2017లో 7 శాతం తగ్గాయి. గరిష్ఠంగా ఉన్న 2011తో పోలిస్తే 38 శాతం క్షీణించాయి. అహ్మదాబాద్, హైదరాబాద్ మినహాయిస్తే మిగిలిన నగరాల్లో గృహాల ధరలు తగ్గాయి. తగ్గుదల 5 శాతం వరకూ ఉంది. అందుబాటులోకి వచ్చిన కొత్త కార్యాలయ స్థలం 2017లో 7 శాతం పెరిగింది.

బినామీ లావాదావీలకు

దూరంగా ఉండండి

- కొత్త చట్టం కింద కఠిన చర్యలు
- ప్రజలకు ఐటీ విభాగం హెచ్చరిక



దిల్లీ: బినామీ లావాదేవీలకు దూరంగా ఉండాలని ఆదాయ పన్ను (ఐటీ) విభాగం ప్రజలను హెచ్చరించింది. నిబంధనల అతిక్రమణ జరిగితే కొత్త చట్టం కింద క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి; ఏడేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష విధించడానికి అవకాశం ఉందని తెలిపింది. జాతీయ పత్రికల్లో ఆ మేరకు ఆ విభాగం ప్రకటనలు జారీ చేసింది. 'నల్ల ధనంపై చేస్తున్న పోరాటానికి ప్రజలు సహాయం చేయాలని.. నల్లధనం అనేది మానవత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న నేరమ'ని అందులో పేర్కొంది. 'బినామీదారు (ఎవరి పేరు మీద ఆస్తులు ఉన్నాయో వారు), ప్రయోజనాలు పొందే వ్యక్తి (వాస్తవంగా ఆ ఆస్తులను కూడబెట్టుకున్న వారు)తో పాటు లావాదేవీలలో సంబంధం ఉన్న వారికి ఏడేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష విధించొచ్చు. అదే సమయంలో బినామీ ఆస్తి మార్కెట్ విలువపై 25 శాతం వరకు అపరాధ రుసుము విధించొచ్చ'ని తెలిపింది. నవంబరు 1, 2016 నుంచి అక్టోబరు 2017 మధ్య ఐటీ విభాగం 517 నోటీసులు జారీ చేయడం ద్వారా 541 అటాచ్‌మెంట్‌లు చేసి మొత్తం రూ. 1833 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది. నవంబరు 1, 2016 నుంచి ఈ విభాగం కొత్త బినామీ లావాదేవీలు (ప్రొహిబిషన్) సవరణ చట్టం, 2016 కింద చర్యలు మొదలు పెట్టిన సంగతి తెలిసిందే. తప్పుడు సమాచారాన్ని వెల్లడించే వ్యక్తులపై ఈ చట్టం కింద అయిదేళ్ల కారాగార శిక్ష విధించడానికి బినామీ ఆస్తిలో 10 శాతం వరకు అపరాధ రుసుమును విధించడానికి అవకాశం ఉందని ఆ ప్రకటనలో ఐటీ విభాగం స్పష్టం చేసింది. బినామీ ఆస్తిని జప్తు చేయడంతో పాటు.. ప్రభుత్వం స్వాధీనం చేసుకునే అవకాశం కూడా ఉందని వివరించింది.

మారుతీ, హోండా కార్ల ధరల పెంపు

దిల్లీ: కార్ల ధరలను పెంచినట్లు మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ), హోండా కార్స్ ఇండియా ప్రకటించాయి. తయారీ ఖర్చులు పెరిగాయని, అందులో కొంతభాగాన్ని కొనుగోలుదార్లకు బదలాయించినట్లు తెలిపాయి.

మారుతీ సుజుకీ: వివిధ మోడళ్ల ధరలను రూ.1,700-17,000 వరకు పెంచినట్లు ప్రకటించింది. ఈనెల 10 నుంచి కొత్త ధరలు అమల్లోకి వచ్చాయని తెలిపింది.

హోండా కార్స్: ఎకార్డ్ హైబ్రిడ్ మినహా ఇతర మోడళ్ల ధరలను రూ. 6,000-32,000 వరకు పెంచామని, ఈనెల 8 నుంచి అవి అమల్లోకి వచ్చాయని తెలిపింది.

వసతి, భోజన సదుపాయ సేవలకు 5% జీఎస్‌టీ

దిల్లీ: విద్యార్థులు, సిబ్బందికి కల్పించే వసతి, భోజన సదుపాయ సేవలకు (హాస్టల్ మెస్, క్యాంటీన్లు) 5 శాతం జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వసతి సదుపాయాలను విద్యాసంస్థలు కల్పించాయా లేదా బయటి కాంట్రాక్టర్లు ఏర్పాటు చేశారా అనే దానితో సంబంధం లేకుండా జీఎస్‌టీ వర్తిసుందని పేర్కొంది. కళాశాల హాస్టల్ మెస్ సేవలకు ఎంత మేర జీఎస్‌టీ చెల్లించాలనే విషయంపై అడిగిన ప్రశ్నకు కేంద్ర ఎక్సైజ్, కస్టమ్స్ బోర్డు (సీబీఈసీ) పైవిధంగా స్పష్టతను ఇచ్చింది. 'మెస్ లేదా క్యాంటీన్‌లో భోజనం లేదా పానీయాల సరఫరాపై 5 శాతం జీఎస్‌టీ చెల్లించాలి. దీనికి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ వర్తించద'ని తెలిపింది.

పీడబ్ల్యూసీపై రెండేళ్ల నిషేధం

సత్యం కేసులో సెబీ ఆదేశాలు

దిల్లీ: సత్యం కంప్యూటర్ సర్వీసెస్ కుంభకోణం కేసులో ప్రైస్ వాటర్‌హౌస్ కూపర్స్ (పీడబ్ల్యూసీ)కి పాత్ర ఉందని తేలినందున, ఈ గ్రూప్ సంస్థలేవీ రెండేళ్ల పాటు నమోదిత సంస్థలకు ఆడిట్ నివేదికలు ఇవ్వకుండా నిషేధిస్తూ, మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆదేశాలు జారీ చేసింది. అప్పట్లో సత్యం కంప్యూటర్ ఖాతాలు పరిశీలించిన పీడబ్ల్యూసీతో పాటు దాని ఇద్దరు భాగస్వాములు రూ.13 కోట్లు అక్రమంగా లబ్ధిపొందినందున, ఆ మొత్తాన్ని వసూలు చేయాలని ఆదేశించింది. సత్యం కంప్యూటర్ సర్వీసెస్ కుంభకోణం వెలుగుచూసిన 9 ఏళ్ల తరవాత, ఆడిట్ సంస్థపై సెబీ ఆదేశాలు జారీ అయ్యాయి. అంతర్జాతీయంగా ప్రఖ్యాతి గాంచిన 4 ఆడిట్ సంస్థల్లో ఒకటైన పీడబ్ల్యూసీపై, సెబీ కఠిన చర్యలు తీసుకోవడం గమనార్హం. పీడబ్ల్యూసీ బ్రాండ్‌పై దేశీయంగా ఛార్టర్డ్ అకౌంటెంట్ సేవలందిస్తున్న సంస్థలు ప్రత్యక్షంగా/పరోక్షంగా అయినా నమోదిత సంస్థలు, సెబీ వద్ద నమోదైన మధ్యవర్తిత్వ సంస్థలకు రెండేళ్ల పాటు ఆడిట్ నివేదికలు అందించే వీలు లేదని సెబీ తన 108 పత్రాల ఆదేశాల్లో పేర్కొంది. పీడబ్ల్యూ నెట్‌వర్క్ కింద ఉన్న సంస్థలకు 2017-18 ఆడిట్ వ్యవహారాలు అప్పగిస్తే, వాటిపై మాత్రం ఈ ప్రభావం ఉండదని తెలిపింది.

భాగస్వాములపై మూడేళ్ల నిషేధం: పీడబ్ల్యూ బెంగళూరుతో పాటు, దాని పాత భాగస్వాములైన ఎస్.గోపాలకృష్ణన్, శ్రీనివాస్ తాళ్లూరిలు అక్రమంగా పొందిన రూ.13,09,01,664ను 12 శాతం వడ్డీతో కలిసి 45 రోజుల్లోగా సంయుక్తంగా చెల్లించాలి. ఇందుకు 2009 జనవరి 7 నుంచి చెల్లింపు తేదీని పరిగణనలోకి తీసుకుంటారు. గోపాలకృష్ణన్, తాళ్లూరిలు ఆడిట్ నివేదికలు ఇవ్వకుండా మూడేళ్ల పాటు నిషేధం విధించింది.

ఉద్యోగాలు.. రైతు ఆదాయం రెట్టింపు

- తయారీ.. ఎగుమతులకు ప్రోత్సాహం
- ఇవే లక్ష్యాలుగా ఆర్థిక వేత్తలతో ప్రధాని సమావేశం



దిల్లీ: ఉద్యోగాల కల్పన, రైతులకు ఆదాయం రెట్టింపు చేయడం, తయారీ రంగంతో పాటు ఎగుమతులకు ప్రోత్సాహకాలు ఏ విధంగా ఇవ్వాలనే అంశంపై ఆర్థిక వేత్తలతో ప్రధాని నరేంద్ర మోదీ చర్చలు జరిపారు. 2018-19 బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న పార్లమెంటులో ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో, కీలకాంశాలపై ప్రధాని మోదీ నిపుణుల అభిప్రాయాలు స్వీకరిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ సమావేశం జరిగింది. ఆయా రంగాల్లో నిపుణులతో పాటు ఆర్థికవేత్తలు మొత్తం 40 మంది ఈ సమావేశానికి హాజరై, పలు సూచనలు చేశారని నీతిఆయోగ్ వైస్ ఛైర్మన్ రాజీవ్‌కుమార్ తెలిపారు. నేషనల్ మెడికల్ కమిషన్ బిల్లుకు సమావేశం ఏకగ్రీవ ఆమోదం తెలిపిందన్నారు. ఉద్యోగాల కల్పనపైనే ప్రభుత్వం అధిక దృష్టి సారించాలని, ఇందుకు ఆర్థిక వృద్ధి కీలకమని ఒక నిపుణుడు సూచించారన్నారు. విద్యావంతుల్లో 20 శాతం మందికి ఉద్యోగాలు లభించడం లేదని మరొకరు సమావేశ దృష్టికి తెచ్చారు. ఉద్యోగాల కల్పనకు ఏం చేయాలనే అంశంపై నివేదికను నీతి ఆయోగ్ అతిత్వరలో వెల్లడిస్తామన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కూడా పాల్గొన్నారు. స్థూల ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయం, గ్రామీణ ఉపాధి, ఉపాధి కల్పన, ఆరోగ్య సంరక్షణ, విద్య, తయారీ, ఎగుమతులు, పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, నెట్ అనుసంధానం వంటి అంశాలు చర్చకు వచ్చాయి. రైతు ఆదాయం రెట్టింపు కావాలంటే దిగుబడులు పెరగాలని, అదే జరిగితే ధరలు పడిపోయి ఫలితం ఉండటం లేదని గుర్తించారు.

ఉల్లంఘిస్తే తీహార్ జైలుకే

- కొనుగోలుదార్లకు ఇళ్లు అందడం ముఖ్యం
- జేపీ ఇన్‌ఫ్రాకు సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ



దేశంలో కొనసాగిస్తున్న గృహనిర్మాణ ప్రాజెక్టులపై పూర్తి వివరాలు సమర్పించాలని స్థిరాస్తి సంస్థ జైప్రకాశ్ అసోసియేట్ లిమిటెడ్ (జేఏఎల్)ను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ సంస్థ జేపీ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ (జేఐఎల్)కు హోల్డింగ్ సంస్థ అన్నది తెలిసిందే. ఈ ప్రాజెక్టుల్లో ఫ్లాట్ల కొనుగోలుకు డబ్బులు చెల్లించిన వారికి ఇళ్లు అయినా దక్కాలి లేదా వారికి నిధులు వాపసు అందాలని కోర్టు పేర్కొంది. దివాలా స్మృతి కింద జేఏఎల్‌పై జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) వద్ద చర్యలు ఆరంభించేందుకు, అనుమతి కోరుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) చేసిన దరఖాస్తుపై తదుపరి దశలో విచారిస్తామని బెంచ్ తెలిపింది. దీనిపై అత్యవసరంగా విచారించబోమని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలో, న్యాయమూర్తులు జస్టిస్ ఏఎం ఖాన్వికర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సభ్యులుగా ఉన్న బెంచ్ స్పష్టం చేసింది. జేఏఎల్ ప్రాజెక్టుల్లో ఇళ్లు కొనుగోలు చేసిన వారి ఫిర్యాదులు స్వీకరించేందుకు పోర్టల్‌ను ప్రారంభించాలని అమికస్ క్యూరీగా నియమితులైన న్యాయవాది పవన్‌శ్రీ అగర్వాల్‌కు సూచించింది. వృద్ధులమైన తమ వయస్సును దృష్టిలో పెట్టుకుని, కేసు రోజు వారీ విచారణకు ప్రత్యక్షంగా హాజరు కాకుండా మినహాయింపు ఇవ్వాలన్న ఎనిమిదిమంది జేఏఎల్ స్వతంత్ర డైరెక్టర్ల దరఖాస్తును సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ దాఖలు చేయగా, దాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లు వివరించింది. అయితే కోర్టు అనుమతి లేకుండా వారు దేశం విడిచి వెళ్లకూడదని, తమ వ్యక్తిగత ఆస్తులను కూడా మూడో పార్టీ పరం చేయకూడదని స్పష్టం చేసింది. డైరెక్టర్లు తమ వ్యక్తిగత ఆస్తులను పరుల పరం చేయరాదంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలను పునరుద్ఘాటించింది.

నిధులు డిపాజిట్ చేయండి

ప్రాజెక్టుల్లో ఇళ్లు కొనుగోలు చేసుకున్న వారి ప్రయోజనాలను పరిరక్షించడం ముఖ్యమని, అందువల్ల కోర్టు గతంలో సూచించిన మేరకు నిధులను డిపాజిట్ చేయాలని జేఏఎల్‌ను ఆదేశించింది. జేఐఎల్, జేఏఎల్ ఆస్తుల విక్రయం, సంస్థల విలీనం, విభజించడం కూడా కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని స్పష్టం చేసింది. అటువంటివి జరిగితే తీహార్ జైలుకు పంపక తప్పదని హెచ్చరించింది. జేఏఎల్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి, న్యాయవాది అనుపమ్ లాల్ దాస్ తమ వాదన వినిపిస్తూ, మొత్తం కొనుగోలుదార్లలో 8 శాతం మంది మాత్రమే నిధులు వాపసు కోరారని తెలిపారు. గతంలో కోర్టు రిజిస్ట్రీ వద్ద రూ.425 కోట్లు జమ చేసినట్లు గుర్తు చేస్తూ, సుప్రీంకోర్టు సూచించిన విధంగా, ఈనెల 25లోగా రూ125 కోట్లను జేఏఎల్ డిపాజిట్ చేస్తుందని స్పష్టం చేశారు.

✦ జేఏఎల్‌ను రూ.2000 కోట్లు జమ చేయాలని సుప్రీంకోర్టు గతంలో ఆదేశించింది. అనంతరం విడతలుగా ఈ మొత్తాన్ని జమ చేసేందుకు అంగీకరించింది. ఇందులో భాగంగా ఈనెల 25 లోపు రూ.550 కోట్లు అందించాల్సి ఉంది.

బ్యాంకుల్లో ఉచిత సేవలు కొనసాగుతాయ్

ఊహాగానాలు సరికాదు: ఐబీఏ

దిల్లీ: బ్యాంకులు ఉచితంగా అందిస్తున్న సేవలపై ఎటువంటి నిషేధం లేదని, ప్రస్తుత సేవలు కొనసాగుతాయని ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) తెలిపింది. ఈనెల 20 నుంచి బ్యాంకుల్లో ఉచిత సేవలు నిలిచి పోతున్నాయని సామాజిక మాధ్యమాలతో పాటు కొన్ని ప్రసార మాధ్యమాల్లో తప్పుగా ప్రచారం అవుతున్న ఈ స్పష్టత నిస్తున్నట్లు వివరించింది. అవన్నీ ఊహాగానాలే అని, నమ్మవద్దని కోరింది. ఆర్‌బీఐ నుంచి కొత్త నిబంధనలు ఏమీ రాలేదని, బ్యాంకులు కూడా ఉచిత సేవల తొలగింపు దిశగా ఏమీ ఆలోచించడం లేదని స్పష్టం చేసింది. సేవా ఛార్జీల సవరణ అనేది నిరంతరం జరిగే ప్రక్రియే అని, నిర్వాహక-వాణిజ్య ఖర్చుల ప్రకారం అది జరుగుతుందని పేర్కొంది.

2018-19లో భారత వృద్ధి 7.3%

- తదుపరి రెండేళ్లలో 7.5 శాతం
- వరల్డ్ బ్యాంక్ నివేదిక

వాషింగ్టన్: రాబోయే పదేళ్లలో వృద్ధిపరంగా ఇతర వర్ధమాన దేశాలకు మించి భారత్ రాణిస్తుందని వరల్డ్ బ్యాంక్ అంచనా వేసింది. ప్రభుత్వం ఎన్నో కీలక సంస్కరణలను చేపడుతున్నందున, భారత్‌కు ఆ సత్తా ఉందని భావిస్తున్నామని అభిప్రాయపడింది. ప్రపంచ దేశాల వృద్ధి అంచనాలతో కూడిన నివేదికను వరల్డ్ బ్యాంక్ విడుదల చేసింది. ఇందులో వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2018-19) భారత్ 7.3 శాతం వృద్ధి రేటును నమోదు చేసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే తదుపరి రెండు ఆర్థిక సంవత్సరాల్లో 7.5 శాతం వృద్ధి రేటును సాధించొచ్చని పేర్కొంది. పెద్ద నోట్ల రద్దు, వస్తు, సేవల పన్ను అమలు లాంటివి అవరోధాలు సృష్టించినప్పటికీ, 2017-18లో భారత్ 6.7 శాతం వృద్ధిని నమోదు చేస్తుందని అంచనా వేసింది. 'స్వల్పకాల గణాంకాలను మేం పరిగణనలోకి తీసుకోవడం లేదు. భారత్‌ను ఎంతో గొప్పగా ఊహించుకుంటున్నాం. అందులో వృద్ధి సామర్థ్యపరంగా పటిష్ఠ స్థితిలో ఉన్న భారత్ మాకు కనిపిస్తోంద'ని వరల్డ్ బ్యాంక్, డైరెక్టరు (డెవలప్‌మెంట్ ప్రాస్పెక్ట్స్ గ్రూపు) అయ్హాన్ కోస్ తెలిపారు.


ఒక్క గుళికలో వారానికి సరిపడా ఔషధాలు

★ హెచ్‌ఐవీ బాధితుల కోసం అభివృద్ధి చేసిన శాస్త్రవేత్తలు

బోస్టన్: హెచ్‌ఐవీ సోకిన వ్యక్తులకు మరింత మెరుగైన చికిత్సనందించే దిశగా పరిశోధకులు ముందంజ వేశారు. ప్రతిరోజూ ఔషధాలు మింగాల్సిన ఆవశ్యకత తప్పేలా సరికొత్త ఔషధ గుళికను అభివృద్ధి చేశారు. వారంరోజులపాటు హెచ్‌ఐవీ చికిత్సకు అవసరమైన మూడు రకాల ఔషధాలు ఈ గుళికలో ఉంటాయి. దీన్ని ఒక్కసారి తీసుకుంటే.. వారంరోజులు ఇతర మాత్రలను వేసుకోవాల్సిన అవసరముండదు. ప్రతిరోజూ తగిన మోతాదులో ఔషధాలను విడుదల చేస్తూ ఇది చక్కగా ఉపకరిస్తుంది. నక్షత్ర ఆకృతిలోని ఈ గుళికను అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరిశోధకులు అభివృద్ధి చేశారు. హెచ్‌ఐవీ చికిత్సలో క్రమంతప్పకుండా ఔషధాలు స్వీకరించడం అత్యంత ఆవశ్యకమని వారు తెలిపారు. కాబట్టి వారానికొకసారి మాత్రమే తీసుకోవాల్సిన ఈ గుళిక హెచ్‌ఐవీ బాధితులకు వరంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. హెచ్‌ఐవీ సోకే ముప్పు ఎక్కువగా ఉన్న వ్యక్తుల్లో నివారణ మార్గంగానూ ఇది దోహదపడుతున్నట్లు గుర్తించామన్నారు.

సుదూర నక్షత్ర వ్యవస్థల్లో గ్రహాలన్నీ ఒకే తరహాలో

★ పరిమాణం, పరిభ్రమణ వేగం సమానంగా ఉన్నట్లు గుర్తించిన శాస్త్రవేత్తలు



టొరంటో: సౌర కుటుంబం వెలుపలి సుదూర గ్రహాలకు సంబంధించి శాస్త్రవేత్తలు తాజాగా ఓ ఆసక్తికర విషయాన్ని గుర్తించారు. ఒకే నక్షత్రం చుట్టూ తిరుగుతున్న గ్రహాల పరిమాణం, పరిభ్రమణ వేగం దాదాపు సమానంగా ఉంటున్నట్లు తేల్చారు. బఠాని మొక్కల్లో ఒకే తొడుగులో గింజలు క్రమపద్ధతిలో అమరి ఉన్న తరహాలో ఆయా నక్షత్ర వ్యవస్థల్లో గ్రహాలు కనిపిస్తున్నట్లు గుర్తించారు. 1,305 నక్షత్రాల చుట్టూ పరిభ్రమిస్తున్న 2,025 గ్రహాలను తాజా పరిశోధనలో భాగంగా శాస్త్రవేత్తలు పరిశీలించారు. వాటి వర్ణపటాలను విశ్లేషించారు. ఆయా నక్షత్రాలతోపాటు వాటి చుట్టూ తిరుగుతున్న గ్రహాల పరిమాణాలను లెక్కించారు. అత్యధిక నక్షత్ర వ్యవస్థల్లో పక్కపక్కనున్న గ్రహాల పరిమాణం, పరిభ్రమణ వేగం దాదాపు సమానంగా ఉన్నట్లు గుర్తించారు. సౌరవ్యవస్థలోని గ్రహాల మధ్య పరిమాణం, పరిభ్రమణ వేగాల్లో భారీ తేడాలున్న సంగతిని గుర్తుచేశారు. అన్ని నక్షత్ర వ్యవస్థలు ఒకే తరహాలో ఆవిర్భవించలేదనే సంగతిని ఈ అధ్యయన ఫలితాలతో గ్రహించవచ్చునని పేర్కొన్నారు.

ఊబకాయానికి మిరియాలతో కళ్లెం

★ శ్రీవెంకటేశ్వర వర్సిటీ పరిశోధనలో వెల్లడి



దిల్లీ: ఊబకాయానికి మిరియాలతో కళ్లెం వేయొచ్చని తాజా పరిశోధనలో తేలింది. తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వర్సిటీ నిపుణులు దీన్ని చేపట్టారు. మిరియాలలోని పైపెరోనల్ సమ్మేళనాలపై వారు ప్రధానంగా దృష్టిసారించారు. వీటిని కొవ్వు అధికంగాల ఆహారంలో కలిపి ఆరు వారాలపాటు ఎలుకలకు అందించారు. దీంతో మిగతావాటితో పోలిస్తే వీటి బరువు బాగా తగ్గిందని, రక్తంలో గ్లూకోజ్ స్థాయిలూ నియంత్రణలోకి వచ్చాయని, ఎముకలు సైతం గట్టిపడ్డాయని వెలుగులోకి వచ్చింది. కిలో శరీర బరువుకు 40 మి.గ్రా. పరిమాణంలో పైపెరోనల్‌ను ఎలుకలకు ఇచ్చినపుడు ఫలితాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తాయని పరిశోధకులు తెలిపారు. కొవ్వు అధికంగాల ఆహారం చూపించే దుష్ప్రభావాలను ఇవి పక్కాగా తగ్గిస్తాయని వివరించారు. జన్యుపరమైన ఊబకాయ ముప్పులను తగ్గించడంలోనూ ఈ పైపెరోనల్ ప్రముఖ పాత్ర పోషించే అవకాశముందని పేర్కొన్నారు. ద జర్నల్ ఆఫ్ న్యూట్రిషన్ అండ్ మెటబాలిజంలో ఈ అధ్యయన ఫలితాలు ప్రచురితమయ్యాయి.

సిగరెట్ ఒక్కటైనా చాలు

★ 61 శాతం మందిని పొగరాయుళ్లుగా మార్చేస్తోంది ఇదే



లండన్: సిగరెట్ ఒక్కటైనా చేసే చేటు తక్కువేమీకాదని తాజా అధ్యయనంలో తేలింది. సరదాగా ఒకసారి దీన్ని తాగుతామని భావించినవారిలో 61 శాతం మంది పొగరాయుళ్లుగా మారుతున్నారని వెలుగులోకి వచ్చింది. లండన్‌లోని క్వీన్‌మేరీ వర్సిటీ నిపుణులు ఈ పరిశోధన చేపట్టారు. బ్రిటన్, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లకు చెందిన 2,15,000 మంది సమాచారాన్ని వారు విశ్లేషించారు. 'ఓ వ్యసనానికి బానిస కావడంలో "తొలి సరదా"లు ప్రముఖ పాత్రపోషిస్తాయి. సిగరెట్ విషయంలో ఈ ముప్పు విపరీతంగా ఉంటోంది. ప్రతి ఐదుగురిలో ముగ్గురు ఇలానే పొగకు బానిసలు అవుతున్నారు. దీంతో అసలు సిగరెట్ జోలికి వెళ్లకుండాచూస్తే మంచి ప్రయోజనాలుంటాయి'అని పరిశోధనకు నేతృత్వం వహించిన పీటర్ హెజెక్ తెలిపారు. గత 20ఏళ్లలో కొత్తగా పొగరాయుళ్లుగా మారుతున్నవారి సంఖ్య తగ్గడానికి.. ఒక్కసారి కూడా సిగరెట్ జోలికి వెళ్లకపోవడమే ప్రధాన కారణమని వివరించారు.

గస్తీ పెరిగినా.. చోరీలకు అదుపులేదు

- ఏటా పెరుగుతున్న దొంగతనాలు
- రాబడుతున్నది సగం మాత్రమే
- పోలీసుశాఖ ఇటీవల విడుదల చేసిన గణాంకాల్లో వెల్లడి



రాష్ట్రంలో సగటున గంటకు చోరీ అవుతున్న సొత్తు రూ.లక్షన్నర. అంటే రోజుకు రూ.36 లక్షలు, నెలకు రూ.10 కోట్లకు పైమాటే. పోలీసులు ఓ వైపు ఆధునికీకరణ పేరుతో పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటున్నా, వ్యవస్థీకృత ముఠాల హడావుడి తగ్గినా బందిపోటు దొంగతనాలు, దోపిడీలకు అడ్డుకట్ట పడటంలేదు. రాష్ట్రంలో దొంగతనాలు పెరిగిపోవడమే ఇందుకు నిదర్శనం.

ఈనాడు, హైదరాబాద్

తెలంగాణ పోలీసుశాఖ ఇటీవల విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2017 మొదటి 11 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా వివిధ దొంగతనాల్లో రూ.112,76,62,716 సొత్తు చోరీ అయింది. దీని ప్రకారం ప్రతి గంటకు ప్రజలు రూ.1.42 లక్షల సొత్తు పోగొట్టుకుంటున్నారు. ఇది ఆందోళనకరమైన విషయమే. వాస్తవానికి మిగతా నేరాలతో పోల్చితే దొంగతనాలు తగ్గాలి. తెలంగాణ ఏర్పడిన అనంతరం పోలీసుశాఖ ఆధునికీకరణకు ఎన్నో చర్యలు చేపట్టింది. ముఖ్యంగా వాహనాల సంఖ్య పెరగడంతో రాత్రిపగలూ గస్తీ ముమ్మరమైంది. దాంతోపాటు డయల్ 100(కంట్రోల్‌రూం)ను ఆధునికీకరించడంతో ఆపదలో ఉన్నవారు ఫోన్ చేసిన నిమిషాల వ్యవధిలోనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుంటున్నారు. గతంతో పోల్చితే క్షేత్రస్థాయిలో పోలీసుల పనితీరు మెరుగైనా చోరీలు పెరగడం గమనార్హం. ఉదాహరణకు 2016లో నవంబరు వరకూ 50 బందిపోటు దొంగతనాలు, 594 దోపిడీలు జరగ్గా 2017లో ఇదేకాలంలో 55 బందిపోట్లు, 735 దోపిడీలు నమోదయ్యాయి. దొంగతనాలు 4234 నుంచి 4367కు, సాధారణ చోరీలు 10954 నుంచి 11121కు పెరిగాయి. వీటి కారణంగానే చోరీ సొత్తు విలువ పెరిగింది. దోపిడీలు, దొంగతనాలకు పేరుగాంచిన స్టువర్టుపురం, తెలగపాముల, పార్ధీ వంటి ముఠాల ప్రభావం రాష్ట్రంలో బాగా తగ్గింది. వీటిలో కొన్ని ముఠాలయితే దాదాపు అంతరించిపోయాయి. అయినప్పటికీ కేవలం డబ్బు కొల్లగొట్టేందుకే జరుగుతున్న చోరీలు పెరుగుతున్నాయి. గొలుసు దొంగతనాలు (చెయిన్ స్నాచింగ్) గతేడాదితో పోల్చుకుంటే తగ్గడం కాస్త ఊరట కలిగించే విషయం.

దక్కేది సగమే!

దొంగతనాల్లో పోగొట్టుకుంటున్న సొత్తు విలువ పెరుగుతుండగా పోలీసులు తిరిగి రాబడుతున్నది(రికవరీ) అందులో సగం కూడా ఉండటంలేదు. 2017లో దొంగతనాల ద్వారా పోగొట్టుకున్న సొత్తులో 49.04 శాతం అంటే రూ.50,99,29,899 మాత్రమే రికవరీ చేయగలిగారు. 2016లో రికవరీ 54.72శాతం ఉండటం గమనార్హం. ఈ లెక్కన ప్రజలు పోగొట్టుకుంటున్న సొత్తులో తిరిగి రాబట్టేది తగ్గుతోంది. అనేక సంస్కరణలు చేపడుతున్న పోలీసుశాఖ దొంగతనాలు అరికట్టేందుకు కూడా పటిష్ఠ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

కొత్తగా చోరీలకు పాల్పడేవారే ఎక్కువ

దొంగతనాలకు పాల్పడే వ్యవస్థీకృత ముఠాలు అంతరించిపోతున్నా ఎలాంటి నేర చరిత్రలేని వారు కొత్తగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. దొంగతనాలు పెరగడానికి ఇదే ప్రధాన కారణం. ఇటీవల హైదరాబాద్‌లో పలు సంఘటనల్లో పోలీసులు పట్టుకున్న దొంగలతో ఈ విషయం వెల్లడైంది. హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ చదువుతున్న ఆరుగురు విద్యార్థులు ముఠాగా ఏర్పడి పోలీసులమంటూ బెదిరిస్తూ పెద్దఎత్తున డబ్బు వసూలు చేయగా పోలీసులు వీరిని అరెస్టు చేశారు. సైకాలజీలో పీజీ చేస్తూ రద్దీగా ఉన్న బస్సుల్లో జేబు దొంగతనాలకు పాల్పడుతున్న అర్చన అనే విద్యార్థినిని ఎస్సార్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఇవి కొన్ని ఉదాహరణలే.



బ్యాంకులకు లాభం.. మహిళలకు రిక్త హస్తం

- వడ్డీ మొత్తాలను జమచేయని సర్కారు
- ఇప్పటికి బకాయిలు రూ.1,237 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: స్వయం సహాయక సంఘాల్లోని మహిళల నుంచి అధిక వడ్డీలను వసూలు చేసి బ్యాంకులు, రాష్ట్ర స్త్రీనిధి సంస్థ లాభాలను ఆర్జిస్తుండగా.. మహిళలకు ఆయా వడ్డీ మొత్తాలను మాత్రం ప్రభుత్వం తిరిగి చెల్లించడంలేదు. తెలంగాణలో ప్రస్తుతానికి ఇటువంటి బకాయిలు అన్నీ కలిపి రూ.1,237 కోట్ల మేర పేరుకుపోయి ఉన్నాయి. స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు బ్యాంకుల నుంచి తీసుకొన్న రుణాలను వడ్డీతో సహా సకాలంలో చెల్లిస్తే తర్వాత వారి ఖతాల్లో ఆయా వడ్డీ మొత్తాలను రాష్ట్ర ప్రభుత్వం తిరిగి జమచేయాల్సి ఉంటుంది. అప్పుడు అది వడ్డీలేని రుణాల పథకం కిందకు వస్తుంది. రాష్ట్రంలో గత మూడేళ్లుగా ఈ వడ్డీలేని రుణాల పథకం సజావుగా అమలుకావటంలేదు. ఆర్థిక శాఖ అప్పుడప్పుడు నామమాత్రంగా మాత్రమే వడ్డీ మొత్తాలకు నిధులను విడుదల చేస్తోంది. ప్రస్తుత 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.7 వేల కోట్ల మేర రుణాలను ఇవ్వాలనేది బ్యాంకుల లక్ష్యం. మహిళలు గత మూడేళ్ల వ్యవధిలో బ్యాంకులకు చెల్లించిన వడ్డీల్లో రూ.937 కోట్లను ప్రభుత్వం ఇప్పుడు వారికి తిరిగి చెల్లించాల్సి ఉంది.

ఖాతాలో జమ శూన్యం

మహిళలు కట్టిన వడ్డీల ద్వారా స్త్రీనిధి సంస్థ లాభాలను ఆర్జిస్తుండగా.. సంస్థ నుంచి రుణాలను తీసుకొని తిరిగి కట్టివేసిన మహిళలకు ప్రభుత్వం రూ.300 కోట్ల మేర తిరిగి ఇవ్వాల్సి ఉంది. గ్రామీణ మహిళలు సూక్ష్మ రుణ సంస్థల బారిన పడనివ్వకుండా చూడటం లక్ష్యంగా పనిచేస్తున్న స్త్రీనిధి సంస్థ.. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు రుణాలను ఇచ్చి వారి నుంచి 13 శాతం మేర వడ్డీని రాబడుతోంది. ఇలా వసూలు చేసిన వడ్డీ మొత్తాల నుంచే ఆ సంస్థ ఏటా లాభాలను ఆర్జిస్తోంది. 2016-17లో సంస్థకు అన్ని ఖర్చులు పోను రూ.50 కోట్లమేర లాభం వచ్చింది.

అభయ హస్తం పింఛను అంది సరిగ్గా ఏడాది

రాష్ట్రంలో ఆసరా పింఛన్ల పథకానికి అనర్హులై అభయ హస్తం పింఛను పథకంలో కొనసాగుతున్న స్వయం సహాయక సంఘాల్లోని 96 వేల మంది మహిళలకు సరిగ్గా ఏడాది కాలంగా పింఛన్లు అందటంలేదు. నెలకు రూ.500 చొప్పున వీరికి ప్రభుత్వం ఇప్పటికి రూ.45 కోట్లను చెలించాల్సి ఉంది. అభయ హస్తం పథకంలో మార్పులు తెస్తున్నందునే పింఛన్లను నిలుపుదల చేసినట్లు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు నెలల తరబడి చెబుతూనే ఉన్నారు. పథకంలో ఉన్నవారు మృతి చెందినప్పుడు ఇచ్చేపరిహార మొత్తాలను పెంచబోతున్నట్లు వారు పేర్కొంటున్నారు.

నాబార్డు నుంచి రూ.16వేల కోట్లు ఇప్పించండి

అరుణ్‌జైట్లీకి చంద్రబాబు లేఖ

ఈనాడు, దిల్లీ: ప్రత్యేక ప్యాకేజీలో చెప్పినట్లుగా ఆంధ్రప్రదేశ్‌కు అందించే ఆర్థిక సాయాన్ని విదేశీ ఆర్థిక సంస్థల నుంచి కాకుండా నాబార్డు నుంచి గ్రాంట్ రూపంలో అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీని కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన లేఖ రాశారు. ప్రత్యేక ప్యాకేజీ ప్రకటన ప్రకారం కేంద్ర ప్రాయోజిత పథకాల కింద 2015-20 సంవత్సరాలకు ఆంధ్రప్రదేశ్‌కు రూ.16,447 కోట్లు రావాల్సి ఉందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఈ ప్రాజెక్టులకు ఆమోదం పొందడంలో జరిగే జాప్యం దృష్ట్యా వచ్చే రెండేళ్లలో ఈ మొత్తం వాడుకోవడం సాధ్యంకాదు కాబట్టి నాబార్డు నుంచి ఇప్పించాలని విజ్ఞప్తిచేశారు. అప్పుడే ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కొత్త రాష్ట్రానికి కొంత వెసులుబాటు దొరుకుతుందని పేర్కొన్నారు.

17న దిల్లీకి చంద్రబాబు

ఈనాడు అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 17న దిల్లీ వెళ్లనున్నారు. అదే రోజు ప్రధాని మోదీతో ఆయన సమావేశమయ్యే అవకాశమున్నట్లు అధికార వర్గాల సమాచారం. రాజధాని అమరావతిపై అంతర్జాతీయ మీడియా ప్రతినిధులతో ఆ రోజున రాష్ట్ర ప్రభుత్వం దిల్లీలో 'డెస్టినేషన్ అమరావతి' పేరుతో ఒక సదస్సు నిర్వహిస్తోంది. దానికి చంద్రబాబు హాజరవనున్నారు. ఈ నెల 12 లేదా 13న రాష్ట్రమంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నారు. ఈ నెల 18, 19 తేదీల్లో కలెక్టర్ల సదస్సు జరుగుతుంది. ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం పక్కనే 'ప్రజలే ముందు' పేరుతో కొత్తగా నిర్మించిన గ్రీవెన్స్ హాల్‌లో కలెక్టర్ల సదస్సు నిర్వహించనున్నారు.

నకిలీ ఏజెంట్లపై చట్టపరమైన చర్య: సుష్మాస్వరాజ్

దిల్లీ: విదేశీ ఉద్యోగాల పేరుతో ప్రజలకు కుచ్చుటోపీ పెట్టే నకిలీ ఏజెంట్లపై చట్టపరమైన చర్యలు చేపట్టాల్సిందిగా విదేశాంగమంత్రి సుష్మాస్వరాజ్ బుధవారం రాష్ట్రాలను కోరారు. రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రవాస భారతీయ వ్యవహారాలు చూసే మంత్రులతో ఆమె సమావేశమైనారు. మంత్రులతో పాటూ కొందరు సీనియర్ అధికారులూ ఈ సమావేశానికి హాజరైనారు. అమాయక ప్రజలను విదేశాల్లో ఉపాధి పేరుతో మోసపూరిత విధానాల్లో పంపేసి...ఆ తర్వాత వారి కష్టాల సంగతే పట్టించుకోకుండా ...వదిలేసే ఏజెంట్ల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని సుష్మాస్వరాజ్ నొక్కి చెప్పారు.

బ్రాహ్మణుల రచనల ముద్రణకు 'కావ్యహిత'

ఈనాడు, హైదరాబాద్: బ్రాహ్మణుల రచనల ముద్రణకు 'కావ్యహిత' కింద రూ.50 వేలు అందిస్తామని తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు తెలిపింది. అభ్యర్థులు నివాస, ఆదాయ, కుల ధ్రువపత్రాలతో కూడిన దరఖాస్తులను, రెండు రచనల ప్రతులను ఫిబ్రవరి 10లోగా బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ కార్యాలయం, బొగ్గులకుంట, తిలక్‌రోడ్డుకు పంపించాలని సూచించింది.

రహదారులకు మెరుగులు

- 620 కిలోమీటర్ల మేర విస్తరణ ప్రణాళిక
- 680 కిలోమీటర్ల రోడ్ల నిర్వహణ
- రూ. 3,230 కోట్ల అంచనా వ్యయం
- అంతర్జాతీయ బ్యాంకుల నుంచి రుణాలకు కసరత్తు
- తెలంగాణ ప్రభుత్వ వ్యూహం

ఈనాడు, హైదరాబాద్: దీర్ఘకాలిక ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని రహదారుల విస్తరణ, నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. తొలిదశలో 1,300 కిలోమీటర్లను ఎంపిక చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది. ప్రస్తుత రహదారుల విస్తీర్ణాన్ని పెంచటంతో పాటు కొన్ని మార్గాలను కనీసం అయిదేళ్లపాటు నిర్వహించేందుకు కసరత్తు చేస్తోంది. ఆయా పనులకు రూ.3,230 కోట్లు అవసరమని అధికారులు లెక్కలు రూపొందించారు. ఇంత పెద్ద మొత్తాన్ని ప్రభుత్వం కేటాయించటం కష్టం కావటంతో ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ(జైకా) తదితర సంస్థల్లో ఏదో ఒక దాని నుంచి రుణం తీసుకోవాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. తెలంగాణ ఏర్పడిన తరవాత రహదారుల అభివృద్ధికి అంతర్జాతీయ సంస్థల నుంచి ఎలాంటి రుణాన్ని పొందలేదు. తెలంగాణ రహదారుల అభివృద్ధి సంస్థ (టీఎస్ఆర్డీసీ) ద్వారా రోడ్ల కోసం బ్యాంకుల కన్సార్టియం ద్వారా రుణం తీసుకున్నప్పటికీ ఆ మొత్తాన్ని బిల్లుల చెల్లింపులకు వినియోగించారు.

నాలుగు నుంచి ఆరు వరుసలకు 400 కిలోమీటర్ల రహదారి విస్తరణ

తొలిదశలో ఎంపిక చేసిన 1,300 కిలోమీటర్లలో 620 కిలోమీటర్లలోని రెండు వరుసల రహదారిని నాలుగు వరుసలకు, నాలుగు వరుసలుగా ఉన్న మార్గాలను ఆరు వరుసలకు విస్తరించాలని నిర్ణయించారు. ఇందులో 400 కిలోమీటర్లను నాలుగు వరుసల నుంచి ఆరు వరుసలకు విస్తరించాలని ప్రతిపాదించారు. ఇందుకు రూ.2,225 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. మరో 220 కిలోమీటర్ల రహదారులను రెండు వరుసల నుంచి నాలుగు వరుసలకు విస్తరించాలన్నది ప్రణాళిక. ఇందుకు రూ.375 కోట్లు వ్యయమవుతుందని అంచనాగా ఉంది. విస్తరణకు ప్రాథమికంగా కొన్ని మార్గాలను ఎంపిక చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసిన తరవాతే తుది నిర్ణయం తీసుకోవాలని అధికారులు యోచిస్తున్నారు. విస్తరణ పనులు సుమారు రెండు నుంచి మూడు సంవత్సరాల వరకు పట్టే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. 680 కిలోమీటర్ల మేర రహదారి నిర్వహణకు రూ.630 వ్యయమవుతుందని, ఈ బాధ్యతను అయిదేళ్లపాటు గుత్తేదారులకే అప్పగిస్తామని అధికారులు చెబుతున్నారు. రానున్న ఒకటి రెండు నెలల్లో ఆయా మార్గాలకు సంబంధించిన నివేదికలను తయారు చేసి ప్రణాళికలను రూపొందించనున్నారు. ఆ తరువాత రుణాల కోసం ఏయే అంతర్జాతీయ సంస్థలను సంప్రదించాలన్న అంశాన్ని అధికారులు పరిశీలించనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయంతో ఓ కారిడార్ అభివృద్ధి పనులు చేపట్టారు. రాష్ట్ర విభజనతో ఆ మార్గాన్ని రెండు రాష్ట్రాలకు విభజించారు. ఈ మార్గాన్ని పూర్తి చేసేందుకు ఇప్పటికే పలు దఫాలు గడువు పొడిగించినప్పటికీ పనులు కొలిక్కి రాలేదు. రాష్ట్ర స్థితిగతులపై ప్రపంచబ్యాంకుకు ఇప్పటికే అవగాహన ఉన్న నేపథ్యంలో రుణం తీసుకోవటం సులువని అధికారుల అంచనా వేస్తుండగా, గతంతో మంజూరు చేసిన ప్రాజెక్టే పూర్తికాలేదు. ఈదశలో మరో ప్రతిపాదన పంపితే స్పందన ఎలా ఉంటుందన్న అనుమానాలూ లేకపోలేదు. పెద్ద మొత్తంలో రుణాలిచ్చేందుకు అంతర్జాతీయ సంస్థలు ఎప్పుడూ ఆసక్తి చూపుతాయని ఉన్నతాధికారి ఒకరు 'ఈనాడు'తో చెప్పారు.

'నాలా' తేలేలా లేదు?

ఏపీ చట్ట సవరణ బిల్లుపై మళ్లీ అభ్యంతరాలు లేవనెత్తిన గవర్నర్

ఈనాడు అమరావతి: 'నాలా' బిల్లు తేలేలా కనిపించడం లేదు. ఇప్పటికే ఆర్డినెన్సును ఒకసారి తిప్పి పంపిన గవర్నరు నరసింహన్ తాజాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దానిపై ఆమోదించిన చట్ట సవరణ బిల్లునూ వెనక్కి పంపినట్లు తెలిసింది. గతంలో ఆర్డినెన్సు రూపంలో తెచ్చినప్పుడు లేవనెత్తిన అభ్యంతరాలనే గవర్నరు మరోమారు వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల ముగిసిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ శీతాకాల సమావేశాల్లో ఏపీ వ్యవసాయ భూమి (సాగేతర అవసరాలకు భూమి మళ్లింపు- నాలా) చట్టానికి సవరణలు చేస్తూ బిల్లును ఆమోదించారు. దానిని ఆమోదం కోసం గవర్నరుకు పంపించారు. పరిశీలించిన ఆయన మరోసారి అభ్యంతరాలను పేర్కొంటూ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు సమాచారం. ఆర్డినెన్స్ దశలో లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేసేలా సవరణ బిల్లులో ఎలాంటి మార్పులు చేయకపోవడాన్ని ఆయన ప్రస్తావించారు. గతంలో రాసిన అభ్యంతరాల లేఖను ఉటంకిస్తూ మరోసారి రాష్ట్రానికి లేఖ పంపించారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శులకు ఈ వివరాలు వెళ్లాయి. దీనిపై గవర్నరుకు ప్రత్యుత్తరమివ్వాలా? నేరుగా కలిసి వివరణ ఇవ్వాలా? అనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది.

ఏపీకి కొత్త గవర్నర్ అవసరం: ఎంపీ కంభంపాటి

ఈనాడు, విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగి నాలుగేళ్లవుతున్నా గవర్నర్‌ను నియమించకపోవడంపై రాష్ట్ర భాజపా అధ్యక్షుడు, విశాఖ ఎంపీ కంభంపాటి హరిబాబు, భాజపా ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. ఏపీకి ప్రత్యేక గవర్నర్ ఉంటే సమస్యల పరిష్కారానికి వీలుంటుందని.. ఈ విషయంలో కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు. దీనిపై విశాఖలో బుధవారం వేర్వేరుగా విలేకర్లతో మాట్లాడారు.



నూలుతో ఎంపీ కవిత చిత్తరువు

రంగులు, బ్రష్‌లు వాడకుండా కేవలం నూలు దారం, వస్త్రంతో రూపొందించిన ఎంపీ కవిత చిత్రపటం ఇది. నూలు చిత్రకారులు కాంబ్లేకర్ జ్ఞానేశ్వర్ దీనిని రూపొందించారు. ఈ చిత్రాన్ని బుధవారం ఎంపీ కవితకు బహుకరించారు.

–న్యూస్‌టుడే, గన్‌ఫౌండ్రి

15న సంక్రాంతి సెలవు: కేంద్రం వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: సంక్రాంతి సందర్భంగా ఈ నెల 15న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని తమ ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినంగా ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులిచ్చింది. గతంలో 15వ తేదీని ఐచ్ఛిక సెలవుదినంగా ప్రకటించింది. దీనిని పూర్తిస్థాయి సెలవుదినంగా మారుస్తూ తాజాగా ఆదేశాలిచ్చింది. దీనికి బదులుగా సెప్టెంబరు 3న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు పనిదినంగా మార్చినట్లు పేర్కొంది.

కేంద్రీయ విద్యాలయాల్లో ప్రార్థనపై స్పందన తెలపండి: సుప్రీంకోర్టు

దిల్లీ: మతపరమైన విశ్వాసాలతో సంబంధం లేకుండా కేంద్రీయ విద్యాలయాల్లో అందరూ హిందూ మతం ఆధారిత ప్రార్థనను ప్రతీ ఉదయం ఆలపించాల్సి రావడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ప్రభుత్వం స్పందన తెలపాలని సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. మధ్యప్రదేశ్‌కు చెందిన వినాయక్ షా అనే వ్యక్తి ఈ ప్రార్థనను తప్పుపడుతూ దీనిలో దైవం, మతం గురించి అత్యంత ప్రాధాన్యం ఉండడం వల్ల శాస్త్రీయ జిజ్ఞాసను విద్యార్థులు అభివృద్ధి చేసుకోవడంలో అడ్డంకులు ఎదురవుతాయని చెప్పారు. నాస్తికులు, అల్పసంఖ్యాక వర్గాలవారి పిల్లలపై ఇలాంటి ప్రార్థనను బలవంతంగా రుద్దడం తగదన్నారు.

కలబురిగి హత్యపై సిట్ దర్యాప్తునకు వినతి: కన్నడ హేతువాది, హంపి విశ్వవిద్యాలయం మాజీ ఉప కులపతి కలబురిగిని హత్య చేసిన ఉదంతంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) చేత దర్యాప్తు చేయించాలని కోరుతూ ఆయన భార్య ఉమాదేవి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2015లో హత్యకు గురైన తన జీవిత భాగస్వామి విషయంలో ఇంతవరకు తగిన ఆధారాలను సేకరించలేకపోయారని ఆమె తెలిపారు. దీనిపై సీబీఐ, ఎన్‌ఐఏలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు స్పందన తెలపాలని న్యాయస్థానం ఆదేశించింది.

విలేకరిపై నమోదైన కేసులో ఉడాయ్‌ని నివేదిక కోరిన ప్రెస్‌కౌన్సిల్

దిల్లీ: ఆధార్ కార్డుల సమాచారాన్ని కేవలం రూ.500 ఖర్చుతో ఎవరైనా రాబట్టుకోవచ్చని బయటపెట్టిన ఆంగ్ల పత్రిక విలేకరిపై నమోదు చేసిన కేసుకు సంబంధించి తమకు నివేదిక సమర్పించాలని 'భారత విశిష్ఠ గుర్తింపు సంఖ్య ప్రాధికార సంస్థ' (ఉడాయ్)ని భారత ప్రెస్ కౌన్సిల్ (పీసీఐ) కోరింది. ఛైర్మన్ చంద్రమౌళి కుమార్ ప్రసాద్ ఆదేశాల మేరకు ఉడాయ్‌కు నోటీసు జారీ చేసి, వాస్తవాలతో కూడిన సమగ్ర నివేదికను అడిగినట్లు పీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. పాత్రికేయురాలిపై కేసు పెట్టడం ఆందోళనకరమని పేర్కొంది.



చిత్రంలోని ఈ అవిభక్త కవలలు గాజాలో గత అక్టోబరులో జన్మించారు. సౌదీ అరేబియాలోని రియాద్‌లో కింగ్ అబ్దుల్లా ఆస్పత్రి వైద్యులు మంగళవారం వారిని వేరు చేశారు

భాజపాను శాసించేది ఆర్‌ఎస్‌ఎస్సే: సురవరం

- ముగిసిన సీపీఐ జాతీయ సమితి సమావేశాలు

ఈనాడు, అమరావతి: దేశం కోసం పోరాడి జైలుకు వెళ్లిన కమ్యూనిస్టులపైనే దేశ ద్రోహులనే ముద్ర వేసేందుకు అసలైన దేశ ద్రోహులు ప్రయత్నిస్తున్నారని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఈ దేశంలో దళితులపై దాడులతోసహా సామాన్యులు, అన్ని వర్గాలకు వ్యతిరేకంగా పని చేస్తున్న భాజపా నేతలే దేశ ద్రోహులని పేర్కొన్నారు. విజయవాడలో మూడు రోజులపాటు జరిగిన సీపీఐ జాతీయ సమితి సమావేశాల ముగింపు సందర్భంగా బుధవారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్ నుంచి స్వాతంత్ర్యం కోసం ఒక్కరూ పోరాటం చేయలేదని, 1970కు ముందు వారి కార్యాలయాలపై జాతీయ పతాకాలనే ఎగుర వేయలేదని తెలిపారు. నాగ్‌పూర్ నుంచి ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ రిమోట్ నియంత్రణతో దేశ రాజకీయాలు, శాసనాలను నిర్దేస్తున్నారని విమర్శించారు. గోసంరక్షణ పేరుతో 30 మందిని హత్య చేశారని, ఈ కేసుల్లో నిందితులుగా ఉన్న ఒక్కరిపైనా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఆదేశాలకూ విలువ లేదని, భగవత్ ప్రకటనకే విలువుందని విమర్శించారు. భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఎమ్మెల్యేగా పోటీ చేసే సమయంలో సమర్పించిన ఆస్తులు రాజ్యసభ సభ్యుడిగా నామినేషన్ వేసే సమయానికి 300 శాతం పెరిగాయని తెలిపారు. వ్యవసాయం సంక్షోభంలో ఉందని, రైతుల నుంచి పంటల బీమాకు వసూలు చేస్తున్న ప్రీమియంలో కనీసం 10శాతం కూడా తిరిగి చెల్లించడం లేదని ధ్వజమెత్తారు. మతోన్మాద భాజపాను గద్దె దించేందుకు కమ్యూనిస్టులు, భాజపా వ్యతిరేక శక్తులు, దళితులు, మైనారిటీలు, మేధావులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారిపై కమ్యూనిస్టులు పోరాటాలు చేశారని, ఇప్పుడు భాజపా నుంచి దేశాన్ని రక్షించేందుకు పోరాడాల్సిన సమయం వచ్చిందని సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా పేర్కొన్నారు.



దసరాకు కొత్త కలెక్టరేట్లు.. కష్టమే!

- 14 జిల్లాల్లో పునాదుల్లోనే నిర్మాణాలు
- మరో 11 జిల్లాల్లో పూర్తికాని స్థలసేకరణ

ఈనాడు, హైదరాబాద్: పునాదుల్లో కొన్ని.. స్థలాల వేటలో మరికొన్ని.. కొత్త జిల్లాల కలెక్టరేట్ల నిర్మాణం గురించి రెండు ముక్కల్లో చెప్పాలంటే ఇదీ పరిస్థితి. తెలంగాణలో జిల్లాల సంఖ్యను పది నుంచి 31కి పెంచిన నేపథ్యంలో అన్ని జిల్లాల్లోనూ ప్రభుత్వ కార్యాలయాలను ఒకే ప్రాంగణంలో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఐదు జిల్లాల్లో సమీకృత కలెక్టరేట్లు ఉండడంతో వాటిని కొనసాగిస్తోంది. మిగిలిన 26 జిల్లాల్లో సమీకృత కలెక్టరేట్ల నిర్మాణానికి దసరా రోజున శంకుస్థాపనలు నిర్వహించింది. 2018లో దసరా నాటికి వాటిని సిద్ధం చేయాలని గుత్తేదారులను ఆదేశించింది. పలు జిల్లాల్లో స్థలాలే ఇంకా గుర్తించలేదు. ఈ నేపథ్యంలో గడువులోగా అన్నింటినీ సిద్ధం చేయటం సాధ్యం కాదని అధికారులు అంచనా వేస్తున్నారు. 15 జిల్లాల్లో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఆసిఫాబాద్, పెద్దపల్లి, జగిత్యాల, జనగామ, వనపర్తి, నిజామాబాద్, సిద్దిపేట, మేడ్చల్, శంషాబాద్, వికారాబాద్, భువనగిరి- యాదాద్రి జిల్లాల్లో పనులు పునాదుల దశ దాటి పిల్లర్ల వరకు వచ్చాయి. వరంగల్ అర్బన్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, కామారెడ్డి జిల్లాల్లో ఇంకా పునాదుల దశ దాటలేదు. మరో 11 జిల్లాల్లో ఈ మాత్రం పురోగతి కూడా లేదు. నిర్మల్, మంచిర్యాల, కొత్తగూడెం, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్ గ్రామీణం, మహబూబాబాద్, జోగులాంబ గద్వాల, మెదక్, సూర్యాపేట జిల్లాల్లో భూముల వ్యవహారం కొలిక్కిరాలేదు. ఫిబ్రవరి నెలాఖరుకల్లా ఆయా జిల్లాల్లో స్థలాలు ఎంపిక చేసి రహదారులు- భవనాల శాఖకు అందజేయాలని రెవెన్యూ అధికారులకు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ పరిస్థితుల్లో వచ్చే దసరా నాటికి అన్ని కలెక్టరేట్ల నిర్మాణం పూర్తికాకపోవచ్చని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఆరేడు మాత్రం సిద్ధమవుతాయని, 2019 జనవరికల్లా అన్ని కలెక్టరేట్ల నిర్మాణం పూర్తి చేసేందుకు అవకాశం ఉందని అధికారి ఒకరు 'ఈనాడు'కు చెప్పారు.

ఛాంపియన్స్

అందరికీ అంగీకారమే.. బీసీసీఐకి తప్పు!

ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను చేర్చడంపై తీవ్ర ఒత్తిడి


దిల్లీ: ఒలింపిక్స్‌లో చిన్నా చితకా ఆటలెన్నో ఉన్నాయి. కానీ 20కి పైగా దేశాల్లో ఆడే.. భారత్, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా లాంటి మంచి ఆదరణ ఉన్న క్రికెట్ ఈ క్రీడా సంబరంలో లేకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయమే. ఐతే ఒలింపిక్స్‌లో క్రికెట్ ఎప్పుడూ లేదనేమీ కాదు. 1900 ఒలింపిక్స్‌లోనే ఈ ఆటకు చోటుంది. కానీ తర్వాత ఈ ఆటను తప్పించారు. మళ్లీ క్రికెట్‌ను ఆ మెగా టోర్నీలో చేర్చే ప్రయత్నాలు గట్టిగా జరగలేదు. ఐతే కొన్నేళ్లుగా ఈ దిశగా ఐసీసీ ప్రయత్నం చేస్తున్నా.. అన్ని బోర్డులూ కలిసి రావట్లేదు. ఇప్పుడు ఐసీసీలోని మిగతా సభ్యదేశాలన్నీ సానుకూలంగా ఉన్నా.. ఒక్క బీసీసీఐ అడ్డం పడటంతో ఈ ప్రతిపాదన ముందుకు వెళ్లలేకపోతోంది. ఈ విషయమై ఐసీసీ, మిగతా బోర్డులు అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఐసీసీ సభ్య దేశాలన్నీ కలిసి వస్తే క్రికెట్‌ను ఒలింపిక్స్‌లో చేర్చడానికి అభ్యంతరాలేమీ లేవంటూ అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం (ఐఓసీ) కూడా స్పష్టం చేయడం విశేషం. దీనిపై తాజాగా ఎంసీసీ క్రికెట్ కమిటీ సమావేశంలో చర్చ జరిగింది. అనంతరం కమిటీ ఛైర్మన్, ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైక్ గ్యాటింగ్ స్పందించాడు. "ఇది తీవ్ర అసహనం కలిగించే విషయం. ఒలింపిక్స్‌లోకి క్రికెట్ చేర్చే విషయమై బీసీసీఐ కలిసి రావాలని వేడుకుంటున్నాం" అని గ్యాటింగ్ అన్నాడు. అయితే క్రికెట్‌ను ఒలింపిక్స్‌లో చేర్చడానికి అంగీకరిస్తే.. తాము స్వతంత్ర ప్రతిపత్తి కోల్పోతామని, ఐఓసీ పరిధిలోకి రావాల్సి ఉంటుందని, దాని వల్ల ఇబ్బందులు తలెత్తుతాయనే కారణంతో బీసీసీఐ ఈ ప్రతిపాదనను ముందు నుంచి వ్యతిరేకిస్తోంది.

చరిత్ర సృష్టించిన ఆంచల్ ఠాకూర్

స్కీయింగ్‌లో భారత్‌కు తొలి అంతర్జాతీయ పతకం



టర్కీ: హిమాచల్ ప్రదేశ్ అమ్మాయి ఆంచల్ ఠాకూర్ చరిత్ర సృష్టించింది. స్కీయింగ్‌లో దేశానికి తొలి అంతర్జాతీయ పతకం అందించింది. టర్కీలో అంతర్జాతీయ స్కీ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆల్పైన్ ఎజ్డర్ 3200 కప్‌లో స్లాలోమ్ రేస్ విభాగంలో ఆంచల్ కాంస్య పతకం గెలిచి సత్తా చాటింది. "నెలల పాటు సాగిన శిక్షణ ఇప్పుడు ఫలితాలను అందించింది. రేస్ బాగా ఆరంభించి మంచి ఆధిక్యం సాధించా. దానివల్లే మూడో స్థానంలో నిలిచి పతకం గెలుచుకున్నా" అని ఆంచల్ తెలిపింది. తన తండ్రి దగ్గర ఆటలో ఓనమాలు నేర్చుకున్న ఆంచల్ ప్రస్తుతం మాజీ ఒలింపియన్ హీరా లాల్ దగ్గర శిక్షణ పొందుతోంది. "చరిత్ర సృష్టించిన నిన్ను చూసి దేశం పారవశ్యం పొందుతోంది" అని ప్రధాని నరేంద్ర మోదీ ఆంచల్‌ను అభినందించారు. క్రీడల మంత్రి రాజ్యవర్ధన్‌సింగ్ రాఠోడ్ కూడా ట్విటర్ ద్వారా ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా అంచల్ తండ్రి రోషన్ మాట్లాడుతూ.."పోటీ అయ్యాక ఆంచల్ నాకు వాట్సాప్ ద్వారా వీడియో కాల్ చేసి పతకాన్ని చూపించింది. ఎఫ్ఐఎస్ ఈవెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులందరికీ ఇచ్చే ప్రోత్సాహక బహుమతి అనుకున్నా. కానీ, తాను కాంస్య పతకం గెలిచినట్లు చెప్పింది చాలా ఆనందంగా ఉంది" అని తెలిపాడు.



సమిత్ (150)

ఆకట్టుకున్న చిన్న 'వాల్'

బెంగళూరు: భారత క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రావిడ్ పెద్ద కొడుకు సమిత్ క్రికెట్ ప్రపంచం దృష్టిని ఆకర్షించాడు. కర్ణాటక అండర్-14 పాఠశాలల క్రికెట్ టోర్నమెంట్లో సమిత్ 150 పరుగులు చేశాడు. సమిత్‌తో పాటు మాజీ స్పిన్నర్ సునీల్ జోషి కుమారుడు ఆర్యన్ (154) కూడా చెలరేగడంతో వారి జట్టు మాల్యా అదితి ఇంటర్నేషనల్ స్కూల్ 50 ఓవర్లలో 500 పరుగుల భారీ స్కోరు సాధించింది. బదులుగా వివేకానంద పాఠశాల కేవలం 88 పరుగులకే ఆలౌటైంది. దీంతో సమిత్ జట్టు 412 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది.



పఠాన్‌పై ప్రేమెందుకో?

ముంబయి: ఏ క్రీడలోనైనా డోపింగ్‌కు పాల్పడిన వాళ్లను కఠినంగా శిక్షించాలి. బీసీసీఐ మాత్రం ఇందుకు అతీతం అన్నట్లు వ్యవహరిస్తోంది. ఆల్‌రౌండర్ యూసుఫ్ పఠాన్ విషయంలో అనుసరించిన వైఖరే ఇందుకు నిదర్శనం. డోప్ పరీక్షల్లో పఠాన్ స్పష్టంగా దొరికినా అతడిపై నిషేధం వెనుక తేదీలతో విధించడానికి కారణమేంటో బోర్డుకే తెలియాలి. బీసీసీఐ మెతక వైఖరితో వ్యవహరించినా.. పఠాన్ విషయాన్ని అంతర్జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) తీవ్రంగానే తీసుకున్నట్లుంది. అందుకే పఠాన్ కథ ముగిసినట్లు కాదని ప్రకటించింది. అతడిపై కేసు ఇంకా తమ పరిశీలనలో ఉందని ప్రకటించింది. దీంతో పఠాన్ వివరణను బీసీసీఐ నమ్మినా.. తాము మాత్రం నమ్మమన్న సంకేతాలను వాడా పంపింది. ప్రిస్క్రిప్షన్‌లో రాసిన మందు బదులు వేరే మందును ఇచ్చారని. . అందువల్లే డోపింగ్ పరీక్షల్లో తాను దొరికిపోయానని పఠాన్ ఇచ్చిన వివరణను బీసీసీఐ అంగీకరించిన సంగతి తెలిసిందే. అందుకే వెనుక తేదీలతో ఐదు నెలల నిషేధం విధిస్తూ.. ఈ నెల 14తో శిక్ష ముగియనున్నట్లు ప్రకటించింది. ఇలా వెనుక తేదీలతో నిషేధం విధించడం వల్ల ఐపీఎల్ వేలానికి పఠాన్ అందుబాటులో ఉండేలా వీలు కల్పించింది. అందుకే వాడా. . పఠాన్ కేసు ముగియలేదని ప్రకటించింది. వాడా నిబంధనల ప్రకారం తొలి సారి డోపింగ్ పరీక్షల్లో విఫలమైతే నాలుగేళ్ల నిషేధం విధించే అవకాశం ఉంది.

ఐర్లాండ్ పర్యటనకు టీమ్‌ఇండియా

దిల్లీ: భారత జట్టు ఐర్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. రెండు టీ20 మ్యాచ్‌ల సిరీస్ ఆడేందుకు టీమ్‌ఇండియా ఐర్లాండ్‌కు వెళ్లనుందని బీసీసీఐ బుధవారం తెలిపింది. 2007 తర్వాత ఐర్లాండ్‌కు వెళ్లడం ఇదే తొలి సారి. పర్యటనలో భాగంగా జులై 27, 29 తేదీల్లో డబ్లిన్ వేదికగా టీమ్‌ఇండియా రెండు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. ఇంగ్లాండ్‌తో పూర్తిస్థాయి సిరీస్ (5టెస్టులు, 3 వన్డేలు, 3 టీ20)కు ముందు టీమ్‌ఇండియా ఐర్లాండ్‌లో పర్యటించనుంది.

విరాట్.. అటా ఇటా?

టీమ్ ఇండియా సెలక్షన్ డైలమా



రహానె

కేప్‌టౌన్

దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు ఆరంభమయ్యే కొన్ని నిమిషాల ముందు భారత తుది జట్టు చూసిన చాలామందిలో ఆశ్చర్యం! అందులో రహానె పేరు లేదు. ప్రస్తుత టెస్టు జట్టులో కోహ్లి సహా మిగతా బ్యాట్స్‌మెన్ అందరి కంటే విదేశాల్లో మెరుగైన రికార్డున్న ఆటగాడు రహానె. సాంకేతికంగా అతను బలమైన బ్యాట్స్‌మన్ అనడంలో సందేహాల్లేవు. బౌన్సీ పిచ్‌లపై ఫాస్ట్‌బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న రికార్డు అతడికుంది. రోహిత్ స్వదేశంలో ఎంత గొప్ప ఫామ్ కనబరిచినా.. విదేశాల్లో, ముఖ్యంగా టెస్టుల్లో అతడి సత్తాపై ఎప్పుడూ సందేహాలే. ఐతే విరాట్ మాత్రం ఇటీవలి లంక సిరీస్‌లో సూపర్ ఫామ్ ఆధారంగా రోహిత్‌కు తుది జట్టులో చోటిచ్చాడు. మరోవైపు బౌన్సీ వికెట్లపై ధావన్‌ది కూడా ఎప్పుడూ తడబాటే. కేఎల్ రాహుల్ మెరుగైన ప్రత్యామ్నాయం అన్న అభిప్రాయాలున్నప్పటికీ ఫామ్‌ను బట్టి ధావన్ వైపే మొగ్గు చూపాడు కోహ్లి. దీంతో ఇప్పుడు విరాట్, జట్టు యాజమాన్యంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ సైతం రోహిత్, ధావన్‌ల ఎంపికను తప్పుబట్టాడు. స్వదేశీ ఫామ్ ఆధారంగా ఆటగాళ్లను ఎలా ఎంపిక చేస్తారన్నాడు? ఐతే అదే సమయంలో రెండో టెస్టుకు రోహిత్, ధావన్‌లిద్దరినీ తప్పిస్తారా అనే విషయంలో దాదా సందేహాలు వ్యక్తం చేశాడు. దీంతో సెంచూరియన్ టెస్టుకు తుది జట్టు కూర్పు ఎలా ఉంటుందనే విషయంలో ఉత్కంఠ మొదలైంది. బయట వినిపిస్తున్న మెజారిటీ అభిప్రాయాన్ని బట్టో, విమర్శలకు జడిసో.. లేక సొంత విచక్షణతోనో ధావన్, రోహిత్‌లిద్దరినీ తప్పించి రాహుల్, రహానెలను ఆడిస్తాడా..? ఎవరో డిమాండ్ చేస్తే మార్పులు చేయడమేంటనో.. ధావన్, రోహిత్‌లకు ఇంకో అవకాశం ఇచ్చి చూద్దామనో.. వాళ్లను కొనసాగిస్తాడా అన్నది చర్చనీయాంశమైంది. ప్రధానంగా రహానెను ఆడించకపోవడాన్నే అందరూ తప్పుబడుతున్న నేపథ్యంలో రోహిత్, ధావన్‌ల్లో ఒకరిని తప్పించి అతడిని ఆడించొచ్చన్న అభిప్రాయమూ వ్యక్తమవుతోంది. ఇంకోవైపు గత ఏడాది స్వదేశంలో ఫ్లాట్ వికెట్ల మీదే నిలకడగా రాణించిన ఉమేశ్ యాదవ్‌ను పక్కన పెట్టడం కూడా చర్చనీయాంశమవుతోంది. సఫారీ వికెట్లపై ఇషాంత్ శర్మ ప్రమాదకరంగా మారగలడని, అతడినీ ఆడించాలన్న సలహాలూ వినిపిస్తున్నాయి. ఐతే తొలి టెస్టులో ఉన్న పేసర్లు బాగానే రాణించారు. ఈ నేపథ్యంలో పేస్ విభాగంలో మార్పులుంటాయని కచ్చితంగా చెప్పలేం. ఏదేమైనా రెండో టెస్టులో భారత జట్టు ఎలా ఆడుతుందనే దాని కంటే ముందు తుది జట్టు ఎలా ఉంటుంది.. మార్పులు చేర్పులు ఏం జరుగుతాయనే విషయంలోనే పెద్ద చర్చ నడుస్తోందిప్పుడు.

ఆ ముగ్గురినీ కోహ్లి, శాస్త్రి ఆపారా?

ముంబయి: ఆందోళనే నిజమైంది. దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌ను భారత జట్టు ఓటమితో ఆరంభించింది. ఐతే మునుపటితో పోలిస్తే మ్యాచ్ పోటాపోటీగా సాగింది. భారత్‌కూ విజయావకాశాలు వచ్చింది. అది బౌలర్ల పుణ్యమే. వాళ్లు అంచనాల్ని మించి రాణించారు. కానీ బ్యాట్స్‌మెన్ చేతులెత్తేశారు. లోయరార్డర్ బ్యాట్స్‌మెన్ చూపిన పోరాట పటిమను కూడా వాళ్లు చూపలేదు. దక్షిణాఫ్రికా పిచ్‌లకు బ్యాట్స్‌మెన్ అలవాటు పడకపోవడమే దీనికి కారణమన్న అభిప్రాయం వినిపించింది. ఏ విదేశీ పర్యటన అయినా కొన్ని వారాల ముందే అక్కడికి చేరుకోవడం.. వార్మప్ మ్యాచ్‌లు ఆడి పరిస్థితులకు అలవాటు పడటం మామూలే. కానీ దక్షిణాఫ్రికా పర్యటనకు ముందు అలా జరగలేదు. కారణం.. ఈ సిరీస్ ఆరంభానికి పది రోజుల ముందు కూడా భారత్ లంకతో టీ20లు ఆడుతోంది. ఐతే లంకతో టీ20లు ఆడుతున్న వాళ్లు ఇక్కడే ఉన్నా.. కనీసం ఆ జట్టులో లేని టెస్టు స్పెషలిస్టులనైనా ముందే దక్షిణాఫ్రికాకు పంపిద్దామని బీసీసీఐలోని కొందరు అభిప్రాయపడ్డారట. మురళీ విజయ్, చెతేశ్వర్ పుజారా, అజింక్య రహానె లాంటి వాళ్లను ముందే దక్షిణాఫ్రికాకు పంపి, అక్కడ సాధన చేయిస్తే మంచిదన్న ప్రతిపాదన ఒకటి వచ్చిందట. ఇందుకోసం అదనపు ఖర్చు అయినా పర్వాలేదని కూడా చెప్పారట. కానీ కెప్టెన్ కోహ్లి, కోచ్ రవిశాస్త్రి ఈ ప్రతిపాదనను తిరస్కరించినట్లు సమాచారం. దీంతో అందరూ కలిసి ఒకేసారి డిసెంబరు 28నే బయల్దేరాల్సి వచ్చినట్లు తెలిసింది. బీసీసీఐ ప్రతిపాదన ప్రకారం విజయ్, పుజారా, రహానె లాంటి వాళ్లు ముందే దక్షిణాఫ్రికాకు వచ్చి సాధన చేస్తే మెరుగైన ఫలితాలుండేవేమో!

పుంజుకునే అవకాశాలు 30 శాతమే

దిల్లీ: దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో ఓటమి చవిచూసిన భారత్.. ఇక ఈ సిరీస్‌లో పుంజుకోవడం కష్టమేనని మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ అన్నాడు. రెండో టెస్టుకు రహానె జట్టులో ఉండాలని వీరూ అభిప్రాయపడ్డాడు. "ప్రస్తుతానికి భారత్ పుంజుకునే అవకాశాలు 30 శాతం మాత్రమే కనిపిస్తున్నాయి. ఇకపై పరిస్థితులు చాలా కఠినంగా ఉంటాయి. సెంచూరియన్‌లోని పిచ్, ఇతర పరిస్థితుల్ని బట్టి అశ్విన్‌ను ఆడించాలా వద్దా అన్నది జట్టు యాజమాన్యం చూసుకోవాలి. అదనపు బ్యాట్స్‌మన్‌గా రహానెను ఆడించొచ్చు. నలుగురు స్పెషలిస్టు పేసర్లుండాలి. భారత్ గెలవాలంటే విరాట్, రోహిత్ కీలక పాత్ర పోషించాలి. ఆఫ్ స్టంప్ ఆవల పడే బంతుల్ని ముట్టుకోకపోవడం మంచిది. సాధ్యమైనంత వరకు షాట్లు నేరుగా ఆడే ప్రయత్నం చేయాలి. షార్ట్ పిచ్ బంతుల్ని కొట్టడం కన్నా.. వాటితో దెబ్బలు తినడం మంచిది. ఐతే సానుకూల దృక్పథంతో ఆడుతూ ఓవర్‌కు కనీసం మూడు పరుగులకు తక్కువ కాకుండా కొట్టడం అవసరం' ' అని సెహ్వాగ్ చెప్పాడు.





పాండ్యకు ఆ సత్తా ఉంది: క్లూసెనర్

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో పరాజయం పాలైన టీమ్‌ఇండియా గురించి మాట్లాడుకోవాల్సిన ఒకే విషయం పాండ్య ఇన్నింగ్స్. తొలి ఇన్నింగ్స్‌లో జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు క్రీజులోకి వచ్చి దక్షిణాఫ్రికా పేసర్లను సమర్థంగా ఎదుర్కొన్న పాండ్య 93 పరుగులు చేశాడు. అతని బ్యాటింగ్ ప్రతిభపై మాజీ ఆటగాళ్లు ప్రశంసలు కురిపిస్తున్న సంగతి తెలిసిందే. దక్షిణాఫ్రికా మాజీ ఆల్‌రౌండర్, జింబాబ్వే బ్యాటింగ్ కోచ్ లాన్స్ క్లూసెనర్ సైతం హార్దిక్ పాండ్య ఆటతీరుకు ముగ్ధుడయ్యాడు. అతడిపై ప్రశంసలు కురిపించాడు. "తొలి ఇన్నింగ్స్‌లో పాండ్య బ్యాటింగ్ సాగిన తీరు అద్భుతం. చాలా గొప్పగా ఆడాడు. ఒత్తిడిని తట్టుకుని పరుగులు చేసి తిరిగి దక్షిణాఫ్రికాను ఒత్తిడిలోకి నెట్టడం అంటే మామూలు విషయం కాదు. భారత జట్టులో అతను గొప్ప ఆల్‌రౌండర్ అయ్యే అవకాశం ఉంది. తన బౌలింగ్‌కు మరింత పేస్ చేరిస్తే నిఖార్సైన ఆల్‌రౌండర్ అయ్యే అవకాశం ఉంది. కొన్ని మ్యాచ్‌ల్లో విఫలం అయినా అతణ్ని ప్రోత్సహించాలి. అతను ముంబయి ఇండియన్స్‌కు ఆడినా.. టీమ్‌ఇండియా తరఫున ఆడినా అతని చుట్టూ మంచి జట్టు ఉంది. ప్రోత్సాహకరమైన వాతావరణం ఉంది. అతని ప్రతిభను మరింత సానబెట్టాల్సిన బాధ్యత జట్లపై ఉంది" అని క్లూసెనర్ తెలిపాడు.

సెమీస్‌లో దిల్లీ డాషర్స్!

• నార్త్ ఈస్టర్న్ వారియర్స్ చిత్తు • పీబీఎల్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: పీబీఎల్ సీజన్-3లో దిల్లీ డాషర్స్ దాదాపుగా సెమీఫైనల్ బెర్తు ఖరారు చేసుకుంది. బుధవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో దిల్లీ డాషర్స్ 4-1 తేడాతో నార్త్ ఈస్టర్న్ వారియర్స్‌ను చిత్తు చేసింది. దీంతో దిల్లీ మొత్తం 15 పాయింట్లతో పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి చేరుకుంది. నార్త్ ఈస్టర్న్‌తో పోరులో తొలి మ్యాచ్ ఓడినా.. తర్వాతి మూడు మ్యాచ్‌ల్లో గెలిచి దిల్లీ విజేతగా నిలిచింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-ఇవనోవ్ జోడీ వరుస సెట్లలో 13-15, 11-15తో లీ-చ్యూ జోడి చేతిలో పరాజయం పాలైంది. దీంతో దిల్లీ 0-1తో వెనుకబడింది. తర్వాత పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో దిల్లీ ఆటగాడు విన్సెంట్ 15-13, 10-15, 15-12తో అజయ్ జయరాంపై విజయం సాధించాడు. రెండో పురుషుల సింగిల్స్‌ను నార్త్ ఈస్టర్న్ ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకుంది. ఈ మ్యాచ్‌లో దిల్లీ ఆటగాడు టివాన్ హవాయ్ 15-10, 8-15, 15-11తో వాంగ్‌జూపై నెగ్గాడు. దీంతో దిల్లీ 2-0తో ఆధిక్యం సాధించింది. మహిళల సింగిల్స్ మ్యాచ్‌ను దిల్లీ ట్రంప్‌గా ఎంచుకోగా ఆ జట్టు క్రీడాకారిణి సంగ్ హ్యూన్ 13-15, 15-11, 15-13తో లీపై గెలవడంతో 4-0 ఆధిక్యంతో దిల్లీ విజయం ఖరారు చేసుకుంది. చివరిదైన పురుషుల డబుల్స్ మ్యాచ్‌లో ఇవనోవ్-ఇవాన్ జోడీ 15-9, 10-15, 9-15తో చియోల్-జంగ్ (నార్త్ ఈస్టర్న్) చేతిలో ఓడిపోయింది. వారియర్స్ 12 పాయింట్లతో ఆరో స్థానంతో లీగ్‌ను ముగించడం ద్వారా సెమీస్‌కు దూరమైంది. గురువారం హైదరాబాద్ హంటర్స్.. బెంగాల్ బ్లాస్టర్స్‌తో తలపడనుంది.



అశ్విని పొన్నప్ప

యుకి, రామ్‌కుమార్ ముందంజ

• ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వాలిఫయర్స్

మెల్‌బోర్న్: భారత టెన్నిస్ టాప్ సింగిల్స్ ఆటగాళ్లు యుకిబాంబ్రి, రామ్‌కుమార్ రామ్‌నాథన్ ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వాలిఫయర్స్‌లో ముందంజ వేశారు. బుధవారం జరిగిన క్వాలిఫయర్స్ తొలిరౌండ్లో 15వ సీడ్ యుకి 1-6, 6-3, 6-4 తేడాతో బ్రాడ్లీ చూనర్(కెనడా)పై విజయం సాధించాడు. తర్వాతి మ్యాచ్‌లో కార్లోస్ టాబెర్నర్ (స్పెయిన్)తో యుకి తలపడనున్నాడు. మరో మ్యాచ్‌లో రామ్‌కుమార్ 6-7(8), 7-6(3), 6-2తో బ్రాడ్లీ క్లాన్ (అమెరికా)పై గెలుపొందాడు. రెండో రౌండ్లో గ్లెబ్ సఖరోవ్ (ఫ్రాన్స్)తో రామ్‌కుమార్ పోటీపడనున్నాడు. భారత ఆటగాళ్లు సుమిత్ నాగల్, ప్రజ్నేష్ పోరాటం తొలిరౌండ్లోనే ముగిసింది.

359 పరుగుల లక్ష్యం.. ఉఫ్!

• అంధుల ప్రపంచకప్‌లో భారత్ చేతిలో లంక చిత్తు

దుబాయ్: అంధుల క్రికెట్ ప్రపంచకప్‌లో భారత్ తొలి విజయం నమోదు చేసింది. బుధవారం లీగ్ మ్యాచ్‌లో భారత్.. శ్రీలంకపై 6 వికెట్ల తేడాతో నెగ్గింది. మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక 40 ఓవర్లలో 8 వికెట్లకు 358 పరుగుల భారీ స్కోరు సాధించింది. సురంగ సంపత్ (68), కేపీ సిల్వా (64) రాణించారు. సునీల్ రమేష్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం భారత్ 32 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి అలవోకగా లక్ష్యాన్ని ఛేదించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దీపక్ 179 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ప్రకాష్ జయరామయ్య (76) కూడా రాణించాడు. భారత్ శుక్రవారం తన తర్వాతి మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను ఢీకొనబోతోంది.

జకోవిచ్ విజయానందం

• కొయాంగ్ క్లాసిక్ టెన్నిస్ టోర్నీ



మెల్‌బోర్న్: మోచేతి గాయంతో ఆరు నెలల పాటు ఆటకు దూరంగా ఉన్నా సెర్బియా టెన్నిస్ స్టార్ నొవాక్ జకోవిచ్ విజయంతో ఈ ఏడాదిని ఆరంభించాడు. కొయాంగ్ క్లాసిక్ టెన్నిస్ టోర్నీలో 14వ ర్యాంకర్ జకోవిచ్ 6-1, 6-4 తేడాతో అయిదో ర్యాంకర్ డొమినిక్ థీం(ఆస్ట్రియా)పై విజయం సాధించాడు. మ్యాచ్ అనంతరం నొవాక్ మాట్లాడుతూ.."మ్యాచ్ గెలిచినందుకు ఆనందంగా ఉంది. ఎప్పుడెప్పుడు కోర్టులో అడుగుపెడతానా అని ఇన్ని రోజులు ఎదురుచూశా. ఈరోజు గొప్ప ప్రత్యర్థితో తలపడి గెలిచా. గాయం నుంచి కోలుకొని ఇలాంటి ప్రదర్శన చేయడం ఆత్మవిశ్వాసాన్ని పెంచేదే. ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు సిద్ధంగా ఉన్నా" అని చెప్పాడు.

టీమ్‌ఇండియా కెప్టెన్‌గా మిథాలీ

• దక్షిణాఫ్రికా పర్యటనకు జట్టు ఎంపిక

దిల్లీ: వచ్చే నెల 5నుంచి దక్షిణాఫ్రికాలో పర్యటించబోయే భారత మహిళల క్రికెట్ జట్టును బీసీసీఐ బుధవారం ప్రకటించింది. 16 మంది సభ్యులతో వన్డే జట్టును ఎంపిక చేశారు. కెప్టెన్‌గా మిథాలీ రాజ్ జట్టును నడిపించనుంది. ముంబయికి చెందిన పాఠశాల విద్యార్థిని 17ఏళ్ల జెమిమా రోడ్రిగ్స్‌కు జట్టులో తొలిసారిగా సీనియర్ జట్టులో స్థానం దొరికింది. మూడు వన్డేల సిరీస్ తర్వాత భారత జట్టు దక్షిణాఫ్రికాతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది. టీ20 సిరీస్ జట్టును త్వరలోనే ప్రకటిస్తారు.

భారత మహిళల వన్డే జట్టు: మిథాలీరాజ్ (కెప్టెన్), హర్మన్‌ప్రీత్ కౌర్ (వైస్ కెప్టెన్), సుష్మ వర్మ (వికెట్ కీపర్), ఏక్తాబిష్త్, స్మృతి మందన, పూనం యాదవ్, పూనం రావత్, రాజేశ్వరి గైక్వాడ్, జెమిమా రోడ్రిగ్స్, జూలన్ గోస్వామి, దీప్తి శర్మ, శిఖా పాండే, మోనా మేశ్రం, పూజా వస్త్రాకర్, వేదా కృష్ణమూర్తి, తనియా భాటియా (వికెట్ కీపర్).



నిరంతర విద్యుత్తుపై రేవంత్‌ది దుష్ప్రచారం

చర్చకు రావాలన్న బాల్క సుమన్, పల్లా, భానుప్రసాద్

ఈనాడు, హైదరాబాద్: "వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్తుపై రేవంత్‌రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారు. దీనిపై బహిరంగ చర్చకు రావాలి. మేం ముగ్గురం వస్తాం. నువ్వు ఉత్తమ్, జానారెడ్డి, షబ్బీర్‌అలీలను తీసుకొని రా! నువ్వు చెప్పిన లెక్కలు నిజమయితే మేం ముక్కు నేలకు రాస్తాం. తప్పని తేలితే నువ్వు ముక్కు నేలకు రాసి క్షమాపణలు చెప్పాలి" అని తెరాస ఎంపీ బాల్క సుమన్, ప్రభుత్వవిప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌లు రేవంత్‌రెడ్డికి సవాల్ చేశారు. బుధవారం తెరాస శాసనసభాపక్ష కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి రాకతో కాంగ్రెస్ కార్యాలయం గోబెల్స్ భవన్‌గా మారిందన్నారు. విద్యుత్తు రంగాన్ని ముంచిన ఘనత కాంగ్రెస్‌దేనంటూ విద్యుత్తు కొరత, కోతలతో కాంగ్రెస్ పాలనలో ప్రజలు, పారిశ్రామికవేత్తలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. తెలంగాణ వచ్చాక ఈ సమస్యలన్నీ పరిష్కారమై, రాష్ట్రంలో విద్యుత్తు వెలుగులను విరజిమ్ముతోందని చెప్పారు. ఓటుకు నోటు కేసులో జైలుకు వెళ్లిన రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ తరపున అవాకులు, చెవాకులు మాట్లాడుతున్నారన్నారు.

ఎక్కడికి రావాలో చెప్పండి: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: విద్యుత్తు రంగంపై బహిరంగ చర్చకు రావాలన్న తెరాస ఎంపీ బాల్క సుమన్ సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ నెల 12న మధ్యాహ్నం 2 గంటలకు తాము చర్చకు సిద్ధమని.. ఎక్కడికి రావాలో చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ పక్షాన తనతోపాటు ఎమ్మెల్యే సంపత్‌కుమార్, టీపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్‌లు వస్తామన్నారు. అక్రమ వ్యాపారాలు, చీకటి విద్యుత్తు ఒప్పందాలు, అబద్ధపు ప్రచారాలన్నింటినీ బయటపెడ్తామన్నారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో మాట్లాడుతూ.. తెరాస ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జరిగిన విద్యుత్తు ఒప్పందాలు, కొనుగోళ్లు, చెల్లింపులపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాలకు కేంద్రం రూ.2.20లకు విద్యుత్తు సరఫరా చేస్తామని చెప్పినా.. అధిక ధరలకు ప్రైవేటు కంపెనీల నుంచి కొనుగోలు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు.

సంపత్‌లాంటి వారిని తెరాసలో చేర్చుకోం: గువ్వల బాలరాజు

ఈనాడు, హైదరాబాద్: కాంగ్రెస్ ఎమ్మెల్యే సంపత్‌లాంటి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ తెరాసలో చేర్చుకునేది లేదని ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తెలిపారు. రాష్ట్రంలో యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టుల నిర్మాణం చేయిస్తూ అందరి ప్రశంసలు పొందుతున్న మంత్రి హరీశ్‌రావుపై విమర్శించే అర్హత సంపత్‌కు లేదన్నారు.

ఒంటేరును వెంటనే విడుదల చేయాలి

తెదేపా తెలంగాణ అధ్యక్షుడు రమణ డిమాండ్

ఈనాడు, హైదరాబాద్: తెలుగుదేశం రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు ఒంటేరు ప్రతాప్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ ఆరోపించారు. ఒంటేరును తక్షణమే విడుదల చేయాలని లేకుంటే శుక్రవారం ముఖ్యమంత్రి నివాసమైన ప్రగతిభవన్ ఎదుట పార్టీ శ్రేణులన్నీ ధర్నా చేస్తాయని హెచ్చరించారు. పొలిట్‌బ్యూరో సభ్యులు మోత్కుపల్లి నర్సింహులు, రావుల చంద్రశేఖరరెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి తదితరులతో కలసి బుధవారం ఆయన ఎన్టీఆర్ భవన్‌లో మాట్లాడారు. గత ఎన్నికల్లో కేసీఆర్‌పై గజ్వేల్‌లో పోటీ చేసిన ప్రతాప్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టి తుద ముట్టించాలని సీఎం చూస్తున్నారని ఆరోపించారు. ఒంటేరు అరెస్టుపై చర్చించడానికి సమయం కోరుతున్నా గవర్నర్ అవకాశం ఇవ్వడం లేదన్నారు. అనంతరం తెలుగు విద్యార్థి సమాఖ్య నూతన సంవత్సర కాలమానినిని ఆవిష్కరించారు.

సాగు చేసే వారికే పెట్టుబడి ఇవ్వాలి: జీవన్‌రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: కౌలు రైతులు, పట్టాదారులు అనే భేదం లేకుండా ఎవరు భూమి సాగుచేస్తే వారికే పెట్టుబడి పథకం కింద ఎకరాకు 4వేలు అందించాలని కాంగ్రెస్ శాసనసభాపక్ష ఉపనేత జీవన్‌రెడ్డి ప్రభుత్వానికి సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోలేకపోవడంతోపాటు బోనస్ ప్రకటించలేదన్నారు. కనీసం రబీలోనైనా బోనస్ కల్పించాలన్నారు.


రైతులను ఆదుకోండి: వీహెచ్

ఈనాడు, దిల్లీ: తెలంగాణలో విద్యుత్తు లైన్లు, టవర్ల వల్ల ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకోవాలని కేంద్ర విద్యుత్తు శాఖ మంత్రి ఆర్.కె.సింగ్‌కు ఏఐసీసీ కార్యదర్శి వి.హన్మంతరావు విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు బుధవారం కేంద్రమంత్రికి ఆయన లేఖ రాశారు. హైటెన్షన్ విద్యుత్తు లైన్లు, టవర్ల ఏర్పాటు సందర్భంగా రైతులకు ఇవ్వాల్సిన పరిహారం పూర్తిస్థాయిలో అందలేదని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

మిద్దెపైనే గంజాయి సాగు

పోలీసుల అదుపులో హఫీజ్‌పేటవాసి • పరారీలో మరొకరు

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: ఇంటి మిద్దెపైనే గంజాయి సాగు చేసి అమ్మకాలు సాగిస్తూ పోలీసులకు చిక్కాడో వ్యక్తి. శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ ప్రాంతంలోని ఓల్డ్ హఫీజ్‌పేటకు చెందిన వ్యాపారి కె.జ్ఞానేశ్వర్‌గౌడ్(33).. తన ఇంటి మూడో అంతస్తుపై ఇసుక పోసి అందులో గంజాయి మొక్కలు పెంచుతూ, అదే ఇంట్లో అద్దెకుంటున్న ఒడిశాకు చెందిన బసంత్‌తో కలిసి అమ్మకాలు సాగిస్తున్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారు.



మిద్దె పైన పెంచుతున్న గంజాయి మొక్క. అంతరచిత్రంలో జ్ఞానేశ్వర్‌గౌడ్

మంద కృష్ణకు బెయిల్ నిరాకరణ

సాక్ష్యాధారాలు మార్చే అవకాశం ఉందన్న సిటీ కోర్టు

హైదరాబాద్, కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ బెయిల్ పిటిషన్‌ను బుధవారం సికింద్రాబాద్ సిటీ కోర్టు తిరస్కరించింది. ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలతో అరెస్టయిన వారికి బెయిల్ ఇవ్వరాదని ఉన్నత న్యాయస్థానం మార్గదర్శకాల్లో ఉన్నాయని పేర్కొంది. సాక్ష్యాధారాలు మార్చే అవకాశాలు ఉండడంతో బెయిల్ ఇవ్వలేమని తేల్చిచెప్పింది.

పాక్షికంగా గడ్డకట్టిన దాల్ సరస్సు

శ్రీనగర్‌లో -6.3 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు పడిపోయిన ఉష్ణోగ్రత



దిల్లీ: ఉత్తరాదిని గడ్డకట్టే చలి వణికిస్తోంది. శ్రీనగర్‌లోని ప్రముఖ దాల్ సరస్సు కొన్ని చోట్ల గడ్డకట్టింది. నగరంలో ఉష్ణోగ్రత మంగళవారం రాత్రి మైనస్ 6.3 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు పడిపోయింది. ఇక్కడ -6 అంతకన్నా తక్కువకు ఉష్ణోగ్రతలు పడిపోవడం వరుసగా ఇది నాలుగోరాత్రి. కార్గిల్ పట్టణంలో -23, లేహ్ పట్టణంలో -17.4 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఇసుకాసురులకు విద్యార్థి బలి

- గుట్టుచప్పుడు కాకుండా అంత్యక్రియలు
- మఫ్టీలో వెళ్లి పర్యవేక్షించిన పోలీసులు

మద్దూరు, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రభుత్వపరంగా ఎన్ని చర్యలు చేపట్టినా క్షేత్రస్థాయి సిబ్బంది ఆ ప్రయత్నాలకు గండి కొడుతూనే ఉన్నారు. ఈక్రమంలో కొందరి ప్రాణాలు పోతున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా మద్దూరు మండలంలో ఓ ఐటీఐ విద్యార్థి ఇసుక ట్రాక్టరు నడపడానికి వెళ్లి అక్కడ జరిగిన ప్రమాదంలో ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఇటువంటి సందర్భాల్లో వ్యాపారులు బాధితుల ప్రాణాలకు ఖరీదు కట్టి కేసులు లేకుండా చేసుకొంటున్నారు. దోరేపల్లి పంచాయితీ లొట్టివోనితండాకు చెందిన శ్రీనునాయక్ (22) అనే ఐటీఐ విద్యార్థి ఇసుక వ్యాపారికి బంధువు. కళాశాలకు ఆదివారం సెలవు కావటంతో ఇంటికి వచ్చిన శ్రీనునాయక్‌ను శనివారం రాత్రి ఇసుక వ్యాపారి ఇసుక తరలించే ట్రాక్టర్‌కు డ్రైవరుగా పంపించాడు. పెద్దపసులోది గ్రామ సమీపంలో అదుపు తప్పి ట్రాక్టరు బోల్తాపడడంతో శ్రీనినాయక్ అక్కడికక్కడే మరణించాడు. అదేరోజు రాత్రి బుల్డోజరుతో ట్రాక్టరును పైకి తీసి శవాన్ని తండాకు తరలించారు. శ్రీనునాయక్ మృతదేహాన్ని రాత్రికి రాత్రి దహనం చేశారు. ఈ విషయం తెలిసి మద్దూరుకు చెందిన కొందరు పోలీసులు మఫ్టీలో హాజరై ఆ కార్యక్రమాన్ని బయటకు పొక్కకుండా పూర్తి చేయించినట్లు తెలిసింది. శ్రీనునాయక్ కుటుంబసభ్యులకు ఇసుక వ్యాపారి రూ.4 లక్షలు ఇచ్చేందుకు అంగీకారం కుదుర్చుకున్నట్టు సమాచారం. దీనిపై దౌల్తాబాద్ ఏఎస్ఐ కె.శంకర్‌నాయక్‌ను వివరణ కోరాగా అక్కడ ప్రమాదం జరిగినట్లు ఎలాంటి ఆనవాళ్లు లేవన్నారు. ఎవరూ ఫిర్యాదు కూడా చేయలేదన్నారు. ఏడాది కిందట ఇదే ఇసుక వ్యాపారి ట్రాక్టరు కింద పడి గచ్చుకత్వా వాగులో ఓ బాలుడు మరణించాడు. మద్దూరు మండలంలోని లింగాల్‌చేడ్, పెద్దాపూర్ వాగుల నుంచి రాత్రిళ్లు వికారాబాద్, హైదరాబాద్ జిల్లాలకు ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. కొందరు ఇందుకోసం ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసుకొని పోలీసు అధికారులతో కుమ్మక్కై రాత్రివేళల్లో ఇసుక రవాణా చేస్తున్నారు. హైదరాబాదుకు చెందిన లారీలు పెద్దాపూర్ వాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా ఇటీవల పోలీసులు పట్టుకున్నారు. చివరకు నామమాత్రపు అపరాధ రుసుంతో వదిలేశారు.




మృతుడు శ్రీనునాయక్ (పాత చిత్రం) శనివారం రాత్రి ప్రమాదానికి గురైన ఇసుక ట్రాక్టరు

నగరంలో మోజో బిస్ట్రో బార్ సహాయ యజమాని

- తప్పించుకు తిరుగుతున్న ముంబయి అగ్నిప్రమాద కారకుడు
- తాత ఇంటికొచ్చి.. పోలీసులు వచ్చేలోపే పరార్
- ముంబయి పోలీసుల వేట

ఈనాడు, హైదరాబాద్: న్యూస్‌టుడే, జూబ్లీహిల్స్: భద్రతా లోపాలున్నా..బార్ నడుపుతూ గత నెల 27న అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో 14 మంది మృతికి కారణమైన ముంబయిలోని మోజో బిస్ట్రో బార్ సహాయ యజమాని యుగ్ తులి ముంబయి పోలీసులకు చుక్కలుచూపుతున్నాడు. నాలుగురోజులుగా ఇక్కడే వివిధ ప్రాంతాల్లో చక్కర్లు కొడుతూ..పోలీసులు గుర్తించే లోపే అక్కణ్నుంచి పరారవుతూ వారి సహనాన్ని పరీక్షిస్తున్నాడు. ముంబయిలోని కమలామిల్స్ ప్రాంగణంలోని సదరు బార్‌లో యుగ్‌తులి సహాయ యజమాని. అగ్నిప్రమాదం అనంతరం దర్యాప్తు ప్రారంభించిన ముంబయి పోలీసులు అతని పేరును ఎఫ్.ఐ.ఆర్.లో అదనంగా జత చేశారు. అప్పట్నుంచి పరారీలో ఉన్న అతను ఈ నెల 6న భార్య ప్రీతినాతో కలిసి ముంబయి నుంచి సొంత కారులో హైదరాబాద్ వచ్చాడు. బంజారాహిల్స్ రోడ్ నెం-2లోని తాత ఇంటికి చేరాడు. అతడి కదలికలపై నిఘా ఉంచిన ముంబయి పోలీసులు ఈ నెల 8న ఓ ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లను ఇక్కడికి పంపారు. జూబ్లీహిల్స్ పోలీసుల సహకారంతో అతను బసచేసిన ఇంటికి వెళ్లారు. ఈ విషయాన్ని పసిగట్టిన నిందితుడు... వారి కళ్లుగప్పి భార్యతో సహ అక్కణ్నుంచి అదృశ్యమయ్యాడు. శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లినట్టు తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లేలోపే.. అక్కణ్నుంచీ తప్పించుకున్నాడు. విమానాశ్రయంలోని సీసీ ఫుటేజీ ఆధారంగా ఈ విషయాన్ని నిర్ధారించుకున్న పోలీసులు..అప్పట్నుంచి అతని కోసం నగరంలో గాలింపు ముమ్మరం చేశారు. 'అప్పట్నుంచి నిందితుడు వేర్వేరు కార్లలో భార్యతోపాటు సికింద్రాబాద్, బాహ్యవలయ రహదారుల్లోని పలు ప్రాంతాల్లో సంచరిస్తున్నట్టు గుర్తించాం. తాజాగా బుధవారం బంజారాహిల్స్‌లోని ఓ షాపింగ్ మాల్ వద్ద కనిపించి..వెనువెంటనే మాయమయ్యాడు. తమ కన్నా వేగంగా ఆలోచిస్తూ వ్యూహాలు మారుస్తున్నాడు. అతివేగంతో కారు నడుపుతూ నగరంలో సంచరిస్తున్నాడు. ఈ నెల 6న రాజేంద్రనగర్ పోలీస్‌ఠాణా పరిధిలో చెన్నమ్మ హోటల్ కూడలి వద్ద అతి మితిమీరిన వేగంతో వెళ్తూ సీసీ కెమెరాకు చిక్కాడు. ట్రాఫిక్ పోలీసులు అతడి వాహనానికి రూ.1,435 జరిమానా విధించి..అతని చిరునామాకు ఈ-చలాన్ పంపించారు.' అని ముంబయి పోలీసు ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.



శంషాబాద్ విమానాశ్రయం నుంచి బయటికి వస్తూ సీసీ టీవీకి చిక్కిన యుగ్‌తులి

అరెస్టు చేశారంటూ పుకార్లు

ఇదిలా ఉంటే..బుధవారం యుగ్ తులిని మాదాపూర్ పరిసర ప్రాంతాల్లో అరెస్టు చేశారన్న ప్రచారం జరగగా. . సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య దాన్ని ఖండించారు. పోలీసులు వేటాడుతుండడంతో నిందితుడు భార్యతో సహ అమృత్‌సర్‌కు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

బాలికలకు వరం

ఈనాడు, హైదరాబాద్: ఇంజినీరింగ్ విద్యలోనూ బాలికల శాతాన్ని పెంచాలని, వారిని ప్రోత్సహించాలని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం జాతీయ సాంకేతిక సంస్థ (ఎన్ఐటీ)ల్లోనూ వారికి ప్రత్యేక సీట్లు కేటాయించనుంది. ఐఐటీల్లో సూపర్ న్యూమరీ కింద ప్రత్యేక సీట్లు ఇవ్వాలని, దాన్ని 2018-19 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని ఏడాది క్రితమే ఐఐటీ కౌన్సిల్ నిర్ణయించింది. తాజాగా అదేమాదిరిగా ఎన్ఐటీల్లోనూ వచ్చే నూతన విద్యాసంవత్సరం నుంచి బాలికలకు ప్రత్యేక సీట్లు కేటాయించనున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 23 ఐఐటీల్లో సుమారు 11 వేల బీటెక్ సీట్లుంటే అందులో బాలికలు 8 శాతమే ఉంటున్నారు. ఇంజినీరింగ్‌లో బాలికలు ఎక్కువగా ప్రవేశిస్తే జాతికి ప్రయోజనమని కేంద్రం భావిస్తోంది. అందుకే కేంద్ర మానవ వనరుల శాఖ సూచనల మేరకు 20 శాతం వరకు తీసుకురావాలని జాయింట్ అడ్మిషన్ బోర్డు-ఐఐటీ ఏడాది క్రితమే నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న బాలుర సీట్లు తగ్గించకుండానే బాలికలకు సీట్లను క్రమేణా పెంచుతారు. 2018-19 విద్యా సంవత్సరానికి ప్రస్తుతం ఉన్న 8 శాతం నుంచి 12 శాతానికి, 2019-20కి 17 శాతం, 2020-21కి 20 శాతం వరకు బాలికలు ఉండేలా చర్యలు తీసుకుంటారు.

ఎన్ఐటీల్లో ప్రస్తుతం 14 శాతమే: ఎన్ఐటీల్లోనూ అమ్మాయిల పరిస్థితి ఆశాజనకంగా లేదు. దేశంలోని 31 ఎన్ఐటీల్లో 17,061 సీట్లున్నాయి. వాటిల్లో 2016లో 22 శాతం బాలికలకు సీట్లు లభించగా 2017లో అది 14 శాతానికి పడిపోయింది. అందువల్ల వాటిల్లో బాలికలకు సీట్లు పెంచాలని, సూపర్ న్యూమరీ సీట్లు సృష్టించాలని కేంద్రం నిర్ణయించింది. దీన్ని కేంద్ర మానవ వనరుల శాఖ అధికార వర్గాలు ధ్రువీకరించాయి. ఎన్ఐటీలకూ సమాచారం అందిందని వరంగల్ ఎన్ఐటీ సంచాలకుడు ఆచార్య ఎన్‌వీ రమణారావు తెలిపారు.

అమ్మాయిలకు అనుకూలం: ఒకేసారి ఐఐటీలు, ఎన్ఐటీల్లో బాలికలకు సీట్లు పెరుగుతుండటంతో ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతూ జేఈఈ మెయిన్, అడ్వాన్సుడ్‌లకు సన్నద్ధమన్న బాలికలకు వరంలా మారనుంది. ఐఐటీల్లో 4 శాతం అంటే 440 సీట్లు వారికి అందుబాటులోకి వస్తాయి. ఇక ఎన్ఐటీల్లోనూ ఇదే తరహాలో 680 సీట్లు అదనంగా వస్తాయి.

18న ఎన్టీఆర్ అమరజ్యోతి ర్యాలీ

అమీర్‌పేట, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఈనెల 18న హైదరాబాద్‌లో '22వ ఎన్టీఆర్ అమరజ్యోతి ర్యాలీ'ని నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, తెదేపా తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీపతి సతీష్ తెలిపారు. మంగళవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ర్యాలీ ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. బుధవారం బేగంపేటలో సతీష్ ఈ వివరాలను వెల్లడించారు. 18వ తేదీ ఉదయం 9 గంటలకు బేగంపేట, రసూల్‌పురా చౌరస్తాలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద చంద్రబాబునాయుడు ర్యాలీని ప్రారంభిస్తారనీ, వివిధ ప్రాంతాలగుండా సాగి, ఎన్టీఆర్ ఘాట్‌కు చేరుతుందన్నారు. తెతెదేపా అధ్యక్షులు ఎల్.రమణ, ఏపీ మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణతోపాటు పార్టీ శ్రేణులు, ఎన్టీఆర్ అభిమాన సంఘాల ప్రతినిధులు హాజరవుతారన్నారు.



ర్యాలీ ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న చంద్రబాబు

కోలుకుంటున్న చిరుత

ఈనాడు, హైదరాబాద్: నిజామాబాద్ జిల్లా సిర్నాపల్లి అటవీ ప్రాంతంలో మంగళవారం గాయపడ్డ చిరుతపులి కోలుకుంటోందని అటవీ శాఖ తెలిపింది. హైదరాబాద్ జూపార్కులో చిరుతకు వైద్యం అందిస్తున్నారు. తోక తెగడంతో పాటు కాలికి గాయమైంది. లేచి నిలబడేందుకు ఇబ్బంది పడుతుండటంతో ఎక్స్‌రే తీసి పరిశీలిస్తామని అటవీశాఖ వర్గాలు తెలిపాయి.



మంటల్లో కాలిపోతున్న మహాలక్ష్మినాయుడు (సీసీ టీవీ ఫుటేజీ), మునస మహాలక్ష్మినాయుడు (పాతచిత్రం)

కాలిపోతుంటే కళ్లప్పగించారు

- పట్టపగలు.. నడిరోడ్డుపై ఆత్మహత్యాయత్నం
- చొక్కా విప్పి మంటలార్పాడు జూనియర్ కళాశాల విద్యార్థి

పెందుర్తి, న్యూస్‌టుడే: పట్టపగలు నడిరోడ్డుపై పెట్రోల్ పోసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతన్ని కాపాడేందుకు పెద్దలెవరూ ముందుకు రాకపోగా..జూనియర్ కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థి తన చొక్కా విప్పి మంటలార్పాడు. ఈ ఘటన విశాఖ జిల్లా పెందుర్తి పోలీసుస్టేషన్ కూడలి వద్ద బుధవారం ఉదయం 9.50 గంటలకు చోటుచేసుకుంది. ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తిని పెందుర్తి పాత ఊరుకు చెందిన మహాలక్ష్మినాయుడు(45)గా గుర్తించారు. భార్య హత్య కేసులో జైలుకు వెళ్లి ఇటీవల బెయిలుపై బయటకు వచ్చాడు. అయితే అతని ఇద్దరు పిల్లలు తమకు తండ్రి నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలంటూ నాలుగు రోజులుగా పెందుర్తి పోలీసు స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్నారు. ఈ క్రమంలో మనస్థాపానికి గురైన మహాలక్ష్మినాయుడు పెట్రోలు క్యానుతో పెందుర్తి పోలీస్ స్టేషన్ కూడలి వద్దకు చేరుకున్నాడు. హఠాత్తుగా పెట్రోలును ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. మంటలు చెలరేగడంతో రోడ్డుపై గిలగిలా కొట్టుకున్నాడు. మళ్లీ లేచి పక్కనే ఉన్న దుకాణాల వైపు పరుగులు తీశాడు. ఏమి జరుగుతుందో అర్థం కాక వాహనచోదకులు ఎక్కడికక్కడే నిలిచిపోయి కళ్లప్పగించి చూశారే తప్ప.. అతన్ని కాపాడేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఇంతలో పెందుర్తి జూనియర్ కళాశాల విద్యార్థి ఎం.రాకేష్ తన చొక్కాను విప్పేసి అతనికి కప్పి మంటలను ఆర్పాడు. అప్పటికే 70శాతం కాలిన గాయాలయ్యాయి. పోలీసులు క్షతగాత్రుడ్ని 108 అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు.

వ్యవసాయ కళాశాల విద్యార్థి ఆచూకీ లభ్యం

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: ఈ నెల 8వ తేదీ నుంచి కనిపించకుండా పోయిన రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థి రాహుల్‌నాయక్‌ను బుధవారం హైదరాబాద్ కూకట్‌పల్లి ప్రాంతంలోని అతని మిత్రుడి ఇంట్లో పోలీసులు గుర్తించి ఠాణాకు తీసుకువచ్చారు. రాహుల్‌నాయక్ అదృశ్యమయ్యే ముందు అధ్యాపకుల కారణంగానే తాను వెళ్లిపోతున్నానని లేఖరాసి పెట్టి వెళ్లడంతో కలకలం రేగిన విషయం తెలిసిందే. ఈ విషయంపై వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ జెల్లా సత్యనారాయణ స్పందిస్తూ... 2015లో బీఎస్సీ వ్యవసాయంలో చేరిన రాహుల్‌నాయక్ మొదటి సంవత్సరంలో 15 సబ్జెక్టులకు 11 సబ్జెక్టుల్లో అనుత్తీర్ణుడయ్యాడని వివరించారు. ద్వితీయ సంవత్సరంలో ర్యాగింగ్‌కు పాల్పడి వసతిగృహం నుంచి సస్పెండైనట్లు తెలిపారు. దీంతో వసతిగృహంలో ఉండకుండా బయట ఉంటూ తరగతులకు హాజరవుతున్నాడన్నారు. సక్రమంగా చదవకపోవడంతో తృతీయ ఏడాదిలో ప్రవేశానికి అనర్హుడయ్యాడన్నారు. ఇప్పటికీ మొదటి సంవత్సరం సబ్జెక్టులు మిగిలి ఉన్నాయన్నారు. దీంతో మనస్తాపానికి గురై లేఖరాసి వెళ్లిఉంటాడని, అతని వ్యవహారంలో కళాశాల అధ్యాపకులకు ఎలాంటి సంబంధమూ లేదని ఆయన వివరించారు.

పెరుగుతున్న వరి నాట్లు.. వ్యవసాయశాఖ తాజా నివేదిక

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత యాసంగిలో వరి నాట్లు క్రమంగా పుంజుకుంటున్నాయని, సాధారణ విస్తీర్ణంలో ఇప్పటి వరకు 31 శాతం సాగయినట్లు వ్యవసాయశాఖ బుధవారం విడుదల చేసిన తాజా నివేదికలో తెలిపింది. ఈ సీజన్‌లో సాధారణ విస్తీర్ణం 6.15 లక్షల హెక్టార్లకు గాను 1.90 లక్షల హెక్టార్లలో నాట్లు వేశారు. గత రెండేళ్లలో ఇదే సమయానికి సాగయినదాన్నికన్నా ఇది 30 శాతం వరకు అధికం. మొత్తంమ్మీద ఆహార ధాన్యాల పంటల సాగు 4.05 లక్షల హెక్టార్లకు చేరింది. వరి ప్రధాన పంట కావడం వల్ల అది పెరిగితేనే ఆహార ధాన్యాల సాగు విస్తీర్ణం అధికమవుతుంది. అన్ని పంటల విస్తీర్ణం సీజన్ సాధారణంలో 46 శాతానికి చేరింది. ఈ నెలారంభం నుంచి 24 గంటల విద్యుత్తు సరఫరా కారణంగా బోర్ల కింద వరి నాట్లు అధికంగా వేస్తున్నారు. గత నవంబరు నుంచి వర్షాలు పూర్తిగా తగ్గడం వల్ల లోటు పెరుగుతోంది. చలి అధికంగా ఉన్న ప్రాంతాల్లో వరినాట్లు నత్తనడకన సాగుతున్నాయి. జిల్లాలవారీగా చూస్తే సాధారణ విస్తీర్ణంలో నిర్మల్‌లో 110, నాగర్‌కర్నూలులో 97, కామారెడ్డిలో 75 శాతం విస్తీర్ణంలో విత్తనాలు, నాట్లు వేశారు. మిగతా చోట్ల చాలా తక్కువగా ఉంది.

వీడియోలు అధీకృత సాక్ష్యంగా మారతాయో లేదో పరిశీలిస్తాం!

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

దిల్లీ: నేరదృశ్యం వీడియోలు చట్టప్రకారం ఆమోదయోగ్యమైన సాక్ష్యాలు అవుతాయా అనే అంశాన్ని పరిశీలించడానికి సిద్ధంగా ఉన్నట్లు సుప్రీంకోర్టు బుధవారం స్పష్టం చేసింది. నేరఘటనా స్థలం వీడియోలు ఏ విధంగా ఎలక్ట్రానిక్ రికార్డుగా ...చట్టం ముందు ఆమోదయోగ్యమైన సాక్ష్యంగా మారుతాయి అన్న అంశాన్ని కూడా పరిశీలించాల్సి ఉందని జస్టిస్.యు.యు. లలిత్, జస్టిస్. ఆదర్శ్ కుమార్ గోయెల్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. భారత ఎవిడెన్స్ చట్టంలోని 65(బి)సెక్షను కింద సర్టిఫికేట్ అవసరం లేకుండానే ఇలాంటి ఎలక్ట్రానిక్ రికార్డులు ఆమోదయోగ్యమైన సాక్ష్యాలు అవుతాయా! అన్నది పరిశీలించాల్సి ఉందని పేర్కొంది. వాస్తవానికి ఈ సెక్షను కింద ఎలక్ట్రానిక్ రికార్డులను బాధ్యతాయుతమైన సంబంధిత హోదాలో ఉన్న అధికారి మాత్రమే ధృవీకరించాల్సి ఉంది. అయితే, ఇప్పుడు అలాంటి సర్టిఫికేట్‌లు ఏమీ లేకుండా ఎలక్ట్రానిక్ రికార్డునే సాక్ష్యంగా పరిగణించవచ్చా అనే అంశాన్ని పరిశీలించడానికి సుప్రీంకోర్టు సంసిద్ధత వ్యక్తం చేసింది. అయితే, ప్రాసిక్యూషన్‌కు ఎలాంటి అవరోధం కాకుండా చూడాలన్నది తమ అభిమతమని తెలిపింది.

అదృశ్యమైన విమానం ఆచూకీ కనిపెట్టేందుకు రూ.494 కోట్లు

కౌలాలంపూర్: అదృశ్యమైన ఎంహెచ్-370 విమానం ఆచూకీ కోసం మలేసియా ప్రభుత్వం మళ్లీ ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందుకు అమెరికాకు చెందిన ఓషన్ ఇన్ఫినిటీ సంస్థకు 70 మిలియన్ డాలర్లు (రూ.494 కోట్లు) చెల్లించేందుకు సిద్ధపడింది. ఆ సంస్థ 90 రోజుల్లోగా దక్షిణ హిందూ మహాసముద్రంలో దాదాపు 25 వేల చ.కి.మీ. మేర అన్వేషించాల్సి ఉంటుంది. 2014లో కౌలాలంపూర్ నుంచి బీజింగ్‌కు 239 మంది ప్రయాణికులు వెళ్తున్న ఈ విమానం కనిపించకుండా పోయింది.

నవీన్ జిందాల్‌పై ముడుపుల అభియోగాలూ నమోదుచేశాం

బొగ్గు కుంభకోణం కేసులో కోర్టుకు తెలిపిన సీబీఐ

దిల్లీ: బొగ్గు కుంభకోణం కేసులో కాంగ్రెస్ నాయకుడు, పారిశ్రామిక వేత్త నవీన్ జిందాల్ సహా ఇతర నిందితులపై ముడుపులు ఇచ్చిపుచ్చుకున్నట్లూ అభియోగాలు మోపామని ప్రత్యేక న్యాయస్థానానికి కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) బుధవారం తెలిపింది. ఝార్ఖండ్‌లోని అమర్‌కొండ ముర్గదంగల్ బొగ్గు గనుల కేటాయింపుల్లో అవకతవకలపై ఈ కేసు నమోదైన సంగతితెలిసిందే. సీబీఐ ఆరోపణలపై వచ్చే నెల 16లోగా స్పందించాలని నిందితులందరికీ న్యాయమూర్తి చివరి అవకాశమిచ్చారు.

ఆమె విదేశాలకు వెళ్తే.. రాకపోవచ్చు

వీవీఐపీ హెలికాప్టర్ల కేసులో నిందితురాలికి అనుమతి ఇవ్వొద్దంటూ కోర్టుకు ఈడీ సూచన

దిల్లీ: వీవీఐపీ హెలికాప్టర్ల కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న దుబాయ్‌కి చెందిన రెండు సంస్థల మహిళా డైరెక్టర్ శివానీ సక్సేనా విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వొద్దని ప్రత్యేక న్యాయస్థానాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం కోరింది. అనుమతి లభిస్తే.. ఆమె మళ్లీ భారత్‌కు తిరిగి రాకపోవచ్చని తెలిపింది. ఈ విషయంపై గురువారం నిర్ణయం తీసుకుంటామని ప్రత్యేక న్యాయమూర్తి అరవింద్ కుమార్ తెలిపారు.

యూకేలో భారత సంతతి వ్యాపారి హత్య

లండన్: నిబంధనలను సక్రమంగా పాటించిన పాపానికి.. యూకేలో భారత సంతతి దుకాణదారుడొకరు కొందరు టీనేజర్ల చేతిలో బలైపోయారు. ఉత్తర లండన్‌లోని మిల్‌హిల్ ప్రాంతంలో దుకాణం నిర్వహిస్తున్న విజయ్ పటేల్(49) వద్దకు గత శనివారం రాత్రి వచ్చిన టీనేజర్లు సిగరెట్ పేపర్ కావాలని అడిగారు. చట్టాలను గౌరవించే విజయ్ ఆ వయసు వారికి విక్రయించనని చెప్పడంతో వారంతా అతనిపై తీవ్రంగా దాడిచేశారు. తలకు తీవ్రంగా గాయాలైన అతన్ని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు.

అడ్డొస్తాడనే.. హతమార్చింది

రాజన్న ఆలయ పరిసరాల్లో.. గొంతు కోసి భర్తను చంపిన భార్య అరెస్టు

వేములవాడ, న్యూస్‌టుడే: వివాహేతర సంబంధానికి అడ్డు తొలగించుకోవాలనే ఆలోచనతోనే నర్సవ్వ భర్తను హతమార్చిందని వేములవాడ డీఎస్పీ చంద్రశేఖర్ తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయ పరిసరాల్లో ఆదివారం జరిగిన హత్య పూర్వాపరాలను బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. 'సిద్దిపేట జిల్లా నంగనూర్ మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన బండి బాలయ్య(37) గల్ఫ్‌లో కార్మికుడిగా పని చేస్తుండగా..భార్య నర్సవ్వ గృహిణి. ఆమెకు అదే గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డితో వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయమై గ్రామంలో ప్రచారం జరగడంతో గతంలో పలుమార్లు భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. ఈ పరిణామాలతో విసిగిపోయిన బాలయ్య ఇటీవలే గల్ఫ్ నుంచి వచ్చేశాడు. ఇకపై అక్కడికి వెళ్లకూడదని నిర్ణయించుకుని, అదే విషయం భార్యకూ చెప్పాడు. అలా జరిగితే వివాహేతర సంబంధం కొనసాగించడం కష్టమని భావించిన ఆమె.. పథకం ప్రకారం భర్తను ఆదివారం రాజన్న దర్శనానికి తీసుకువచ్చింది. అర్ధరాత్రి మద్యం తాగి నిద్రిస్తుండగా.. వెంట తెచ్చుకున్న కత్తితో మెడ కోసి చంపింది.' అని వెల్లడించారు. బుధవారం నిందితురాలిని అరెస్టు చేశామన్నారు. తండ్రి చనిపోవడం, తల్లి జైలుకు వెళ్లడంతో వారి ఇద్దరు కుమార్తెలు అనాథలయ్యారన్నారు.



నర్సవ్వ

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications. a division of Ushodaya Enterprises Private Limited and Printed at Eenadu Press, Plot No. 95 & 96. Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Medchal District- 500 037, Telangana. Published at Eenadu Corporate Office, Ramoji filmcity, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist. 501512, Telangana State, Phone : 040 - 22232223, RNI No. 27656/75. Regd No. HSE/1009/2018-20, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00.